


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 306

సోమవారం 27-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జయహో..

బంగారు బాలయ్య



అందాల ముఖ వర్చస్సు.. ఐదు దశాబ్దాల వెండితెర తేజస్సు
ఆహార్య ఆంగిక అభినయ వాచికా యశస్సు.. అహరహం నటనే తన తపస్సు
కళా, రాజకీయ, ప్రజాసేవలలో తిరుగులేని ధనుస్సు
మానవత్వం మూర్తీభవించిన బంగారు మనస్సు

పద్మభూషణం

...ఆ భరతమాత తీకందించిన యశో ఆశీస్సు !
దిన దిన ప్రవర్ధమానమవుతూ.. అంబరాన్ని తాకాలి మీ శిరస్సు

తెలుగు ప్రజలకు, కళాభిమానులకు, బాలయ్య అభిమానులకు

ఇవే మా అభినందన సుమాలు

తాతమ్మ కల నెరవేర్చే బాలకృష్ణుడిగా మొదలై, డిస్కో కింగై, మంగమ్మగారి మనవడై, ముద్దుల మావయ్యై, నారీ నారీ నడుమ మురారై, ఆదిత్యుడై, సమరసింహారెడ్డి, నరసింహనాయుడై, సింహాగా, లక్ష్మీనరసింహగా, తారకరాముడిగా, భగవంత్ కేసరై, పైసా వసూల్ చేసే దాకూ మహరాజై; భైరవద్వీప విజయుడై; అనార్కలి ప్రియుడు సలీమై, వేములవాడ భీమకవై, బ్రహ్మంగారి సిద్ధయ్యై, శ్రీకృష్ణదేవరాయలై, గౌతమీపుత్ర శాతకర్ణై; అభిమన్యుడై, నారదుడై, హరిశ్చంద్రుడై, దుష్యంతుడై, అర్జునుడై, శ్రీకృష్ణుడై, శ్రీరాముడై, శ్రీమన్నారాయణుడై.. ఐదు దశాబ్దాలుగా సాంఘిక, జానపద, చారిత్రక, పౌరాణిక శతాధిక పాత్రలకు ప్రాణం పోసిన నవరస నటసింహం నందమూరి బాలకృష్ణ గారికి భారత ప్రభుత్వం సగౌరవంగా ప్రకటించిన 'పద్మ భూషణ్' అనిర్వచనీయ భూషణం. నటుడిగా, ప్రజాప్రతినిధిగా, బసవతారకం ఆస్పత్రి ద్వారా ప్రజా సేవకుడిగా ఆయన సేవలకు అందిన గొప్ప గౌరవం ఈ పురస్కారం.

మా బాలయ్యబాబుకు ఇవే మా అభినందన సుమ మాలలు.



వనమా నవీన్ కుమార్
Managing Director



వనమా సుధాకర్
Director

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
సోమవారం ॥ 27-1-2025

సన్నిధి

పర్వం



తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. మల్లికార్జున స్వామి ఆయన సతీమణులు లింగ బలిజల ఆడబిడ్డ అయిన బలిజ మేడలమ్మ, యాదవుల ఆడబిడ్డ అయిన గొల్లకేతమ్మలు నిత్యం పూజలందుకుంటున్నారు. ప్రతీ యేడాది మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. రెండు పద్ధతుల్లో స్వామి వారికి కళ్యాణం నిర్వహిస్తారు. మార్గశిర మాసం చివరి ఆదివారం వీరశైవ ఆగమ పద్ధతి ప్రకారం స్వామి వారి కళ్యాణం, మహాశివరాత్రి సందర్భంగా యాదవ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నారు. జనవరి 19 నుంచి మార్చి 24వ తేదీ వరకు తెలుగురాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలి రానున్నారు. పది ఆదివారాలు జాతర వారాలుగా నిర్వహిస్తారు. ఇదే విధంగా తెలంగాణలో ఐనవోలు, ఓదెలలో సైతం ఇదే విధంగా పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకోవడం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ.

పట్నాల మల్లన్నకు పదివేల దణ్ణాలు



కొమురవెల్లి మల్లన్నకు ప్రకృతి సిద్దమైన ఐదు రంగులను ఉపయోగించి పట్నం వేస్తారు. ఇందుకోసం పసుపు, కుంకుమ, గులాబీరంగు (బుక్క గులాల్), ఆకుపచ్చ పొడి (తంగేడు, చిక్కుడు ఆకులను ఎండబెట్టి పొడి చేస్తారు) తెల్ల పిండి (బియ్యం పిండి)ని వాడుతారు. పట్నాలు వేసేందుకు పసుపు, కుంకుమ, భక్తులు బస చేసిన ప్రాంతాల్లో వేసేది చిలక పట్నం. ఆలయం లోని గంగిరేణి చెట్టు వద్ద వేసేది నజర్ పట్నం. ఆలయం లోపల వేసేది ముఖ మండప పట్నం. మల్లన్నకు ప్రతి ఏడాది లేదా రెండు లేదా మూడేండ్లకు ఒకసారి పట్నాలు వేసి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా కొమురవెల్లిలోని తోట బావి దగ్గర పెద్ద పట్నం వేస్తారు. ఈ పెద్ద పట్నం 41 వరుసలతో దాదాపు 50 గజాల్లో వేస్తారు. జానపద రూపాల్లో ఒగ్గు పూజారులు కథను చెబుతూ పట్నం వేస్తారు. పట్నంలోకి మల్లికార్జునుడిని ఆహ్వానించి కల్యాణం చేసి తమ కోరికలను విన్నవించుకుంటారు. నుదుటిన బండారి పెట్టి కంకణాలు కట్టి ఒగ్గు పూజా కతువు నిర్వహిస్తారు. అలాగే స్వామివారి చరిత్రను సైతం వివరిస్తుంటారు. కొందరు ఇంటి వద్ద సైతం మల్లన్న పట్నాలు వేసి ఓ పండుగ లాగ బంధువులను పిలిచి చేస్తారు.

పట్నంలో ఒకే కొమ్ము ఉన్న శూలం



పెద్ద పట్నం వేసే ముందు ఒగ్గు పూజారులు తమ ఆచారం ప్రకారం గర్భాలయంలోని మూల విరాట్‌కు పట్టువస్త్రాలను సమర్పిస్తారు. స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకు వెళ్లి, కోనేట్లో స్నానం ఆచరింపజేస్తారు. పట్నం వేసే ప్రదేశంలో సుంకు పట్టిన తర్వాత, గొంగళిలో బియ్యం పోసి మైలపోలు తీస్తారు. స్వామి వారు ధరించే ఒకటే కొమ్ము ఉన్న శూలం (ఒరగొమ్ము), ఢమరుకాన్ని నెలకొల్పుతారు. పసుపు, కుంకుమ, తెల్ల పిండి, సునేరు, పచ్చ రంగులను ప్రమథ గణాలుగా సమ్మిళితం చేసి, నిమ్మకాయతో చిత్ర కన్ను నెలకొల్పి శివలింగాన్ని చిత్రిస్తారు. రకరకాల డిజైన్లతో సర్వాంగ సుందరంగా పట్నాన్ని తీర్చిదిద్దుతారు.

పట్నం దాటడం....

ఆ తర్వాత ఉత్సవ విగ్రహాలను తీసుకొని పట్నం పై పెట్టి పూజారులు పూజలు నిర్వహిస్తారు. తర్వాత.. శివసత్తులు పట్నం దాటుతారు.. ఈ వేడుకను చూసేందుకు, పట్నం ముగ్గుపొడిని సేకరించుకొనేందుకు భక్తులు పోటీ పడతారు. ఈ ముగ్గును పొలాల్లో చల్లితే పంటలు బాగా పండుతాయని నమ్ముతారు. పట్నాల మొక్కుల తర్వాత భక్తులు అగ్ని గుండాల కార్యక్రమంలో నిప్పుల మీద నడుస్తారు. అనంతరం స్వామివారిని దర్శించుకుంటారు.

– గజవెల్లి షణ్ముఖ రాజు
సాక్షి, సిద్దిపేట

జీవన తత్త్వం

కోరిక కాదు ఓపిక కావాలి

ఒకప్పుడు ఋషులు, మునీశ్వరులు, సాధువులు, మహర్షులు సంవత్సరాల తరబడి సృష్టికర్త దర్శనభాగ్యం కోసం యోగముద్రలో, ధ్యానంలో ఉండేవారు. సృష్టికర్త దర్శనమిచ్చేంతవరకు వారి కార్యదీక్ష భగ్నం చేసుకునే వారు కాదు. వారి పూర్వజన్మ సుకృతమో, కర్మఫలమో ఫలించి ఆ భగవంతుడి దర్శనంతోనే వారి జన్మ ధన్యమై పోయేది.

రాను రాను మనిషికి ఆలోచనలు ఎక్కువై పోయాయి. కోరికలు తోడయ్యాయి. దైవపూజలు చేస్తూనే కోర్కెలు దేవుడి ముందు ఏకరువు పెడుతున్నారు. దేవుడికి సేవ చేయాలి కానీ కోరికలు కోరడం సరికాదు. మనిషి తలరాతను రాసింది ఆయనే కదా!

కోరికలు తీరుతాయా అంటే ఖచ్చితంగా చెప్పలేము. ఎందుకంటే మనిషి భూత, భవిష్యత్, వర్తమానాలన్నింటినీ ఆ సృష్టికర్త ఆ మనిషి నొసటనే ముందుగానే రాస్తాడు. మంచి అయినా, చెడు అయినా జరిగిపోతూనే వుంటాయి. బ్రహ్మ రాతను మార్చటం అసాధ్యం. ఏది జరగాలనుందో అదే జరుగుతుంది. అలాంటి పాప, పుణ్యాలన్నీ కూడా గత జన్మలోని కర్మల ఫలితాలుగానే భావించాలి. ఫలానా పని జరిగితే నీకు కొబ్బరికాయలు కొడతాను, అన్నదానాలు, వస్త్రదానాలు, నిలువుదోపిడీ ఇస్తామని మొక్కుకుంటారు. మనం మానవమాత్రులం కాబట్టి ఇలాంటి ఆలోచనలు, కోర్కెలు ఉండటం సహజం.

ద్వాపరయుగంలో శ్రీ కృష్ణుడు సాందీప మహర్షి గురువు దగ్గర అన్ని విద్యలూ నేర్చుకుంటాడు. శ్రీ కృష్ణుడు సాందీప మహర్షిని గురుదక్షిణగా ఏం కావాలో కోరుకోమంటాడు. సాందీప మహర్షి భార్యతో చర్చించి చనిపోయిన తమ కుమారుని తిరిగి ఇవ్వాలని కోరతాడు. కోరిన వెంటనే శ్రీ కృష్ణ పరమాత్ముడు వారి కోరికను నెరవేరుస్తాడు. అంతటి గొప్ప మహర్షి కూడా భగవంతుడు వరం కోరుకొమ్మంటే ఏమీ పాలుపోక తన కొడుకునిస్తే చాలని అంటాడు. అంతటి మేధావికన్నా మామూలు మనుషులం మనం ఆ భగవంతుడు ప్రత్యక్షమైతే ఎలాంటి కోరికలు కోరే అవకాశం లేదు. కాబట్టి దైవసేవ చేయడం మానవ జన్మ ఎత్తిన పుణ్యమే. ఇక పాపపుణ్యాలన్నీ పూర్వజన్మ కర్మల ఫలితాలుగానే భావిస్తే అంతా శుభమే..




భక్తుడు పురోగతి సాధించినప్పుడు నీటి రుచిలో దేవుడిని అనుభవిస్తాడు. విత్తనాన్ని తినాలని చీమలు చూస్తాయ్. మొలకలను తినాలని పక్షులు చూస్తాయ్. మొక్కని తినాలని పశువులు చూస్తాయ్. అన్నిటినీ తప్పించుకుని ఆ విత్తనం వృక్షమైనపుడు చీమలు, పక్షులు, పశువులు ఆ చెట్టుకిందకే నీడ కోసం వస్తాయ్. జీవితం కూడా అంతే! వచ్చేవరకు వేచివుండాల్సిందే. దానికి కావాల్సింది ఓపిక మాత్రమే...

– తరిగొప్పుల వివెల్లెన్ మూర్తి.

ఆత్మ బోధనం

నీలోనే దివ్యత్రివేణి



మహా కుంభమేళా ఒక ప్రత్యేకమైన శక్తివంతమైన సమారంభం. ఎందరో సాధువులు, బాబాలు, అవధూతలు, సిద్ధులు, యోగులు, వైష్ణవులు, శాక్తులు, ఇలా హైందవ ధర్మంలో ఉన్న అనేక ఆచారాలకు సంబంధించిన ఎందరో మహిమాన్వితులు మహాకుంభ మేళాకు తరలి వెళతారు. ప్రపంచ నలుమూలల నుండి లక్షలాదిగా భక్తులు ఆ దివ్య మహోత్సవ సందర్శనార్థం ప్రయాగ చేరుకుంటారు. నదులకు సహజ సిద్ధంగా దివ్యశక్తిని ఆకర్షించే గుణం ఉంటుంది. ఈ కారణంగానే ఎన్నో దివ్య క్షేత్రాలు, ధామాలు పుణ్యనదుల పరీవాహక ప్రాంతాల్లో కొలువుదీరి ఉంటాయి. ఈ సంవత్సరం మహా కుంభమేళ ప్రయాగలో జరుగుతుంది.

భూమాతను ఆసురీ శక్తుల ప్రభావం నుండి కాపాడేందుకు, దివ్యశక్తిని పెంచేందుకు ఎందరో యోగులు, సిద్ధులు, గురువులు ప్రత్యక్ష, పరోక్ష రూపాలతో కృషి చేస్తుంటారు. మహా కుంభమేళా సమయంలో ఎందరో సాధువులు, మహా యోగులు నదీ గర్భంలోకి తమ తపోశక్తులను కూడా ప్రవహింపచేసి, అక్కడికి వచ్చిన అనేక మంది భక్తులను అనుగ్రహిస్తారు. నదిలోని దివ్య శక్తి, విశ్వంలో గ్రహాల అమరిక వల్ల ఉత్పన్నమయ్యే విశ్వశక్తి, మహాయోగుల తపోశక్తి వెరసి, దివ్య ప్రకంపనలు భూ గ్రహమంతా విస్తరిస్తాయి. అక్కడికి చేరుకున్న వ్యక్తులకే కాకుండా, ఈ దివ్య ప్రకంపనలు సామూహిక చైతన్యానికి కూడా ప్రయోజనాన్ని చేకూరుస్తాయి.

యోగవిద్యలో చెప్పిన ఇడా, పింగళ, సుషుమ్న నాడులకు, ప్రయాగ రాజ్ లోని త్రివేణి సంగమం వద్ద గంగా, యమున, సరస్వతీ నదుల కలయికకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. త్రివేణి సంగమం వద్ద మూడు పుణ్యనదులు కలిసి ఒక పవిత్ర తీర్థంగా మారినట్లే, మానవుడిలో ఇడా, పింగళ సుషుమ్న నాడులు భృకుటీ మధ్య భాగంలో సంగమిస్తాయి. అందుకే బొట్టు పెట్టుకునే ప్రదేశాన్ని జ్ఞాన త్రివేణిగా అభివర్ణిస్తారు. ఈ మూడు నాడులు ఏకీకృతం అయినప్పుడు చైతన్య జాగృతి కలుగుతుంది. అందుకే భృకుటీ మధ్యంలో గంధం, కుంకుమ, పసుపు లేదా భస్మాన్ని బొట్టుగా ధరిస్తారు. భ్రూ మధ్యంలో మూడు నాడుల కలయిక అన్నది యోగంలో చెప్పే అమృతత్వ స్థితిని ప్రదానం చేసేందుకు మార్గం అవుతుంది.

ఈ సంవత్సరం సంక్రాంతి నుండి శివ రాత్రి వరకు దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ పవిత్ర సమయంలో ఆధ్యాత్మిక చింతనతో పాటుగా మనసును క్లేశ రహితంగా మార్చుకోవడం వల్ల దివ్య శక్తిని ఎక్కడ ఉన్నా పొందవచ్చు. త్రివేణి సంగమ స్థలికి చేరుకోలేని వారు, ఇంటి వద్దే 45 రోజుల పాటు ధ్యాన సాధన చేయడం ద్వారా కూడా అమృతతత్వాన్ని సిద్ధింపచేసుకోవచ్చు.



– మాతా ఆనందమయి
ఆధ్యాత్మిక గురువు

సాక్షి సినిమా

మాస్ ఎంటర్‌టైనర్



● రవితేజ

రవితేజ హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల 'మాస్ జాతర'లో రెండోసారి జోడీగా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే.. జనవరి 26న రవితేజ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'మాస్ జాతర' నుంచి ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ''రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనంలాంటి మాస్ ఎంటర్‌టైనర్‌గా 'మాస్ జాతర' రూపొందుతోంది. ప్రేక్షకులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా ఈ గ్లింప్స్‌ను మలిచారు భాను భోగవరపు. భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం.. రవితేజ ఎనర్జీకి ఏమాత్రం తగ్గకుండా ఉండటంతో పాటు గ్లింప్స్‌కు ప్రధాన బలంగా ఉంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు చెబుతాం'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమేరా: విధు అయ్యన్న, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె.వర్మ.

బ్రిటీష్ పాలన నేపథ్యంతో...



● విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్). మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. కాగా ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమా సెట్ వర్క్‌ని ప్రారంభించారు మేకర్స్. ''బ్రిటీష్ పాలనా కాలం నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న చిత్రం 'వీడీ 14'. ఇప్పటి వరకూ ఎవరూ తెరకెక్కించని కథాంశంతో ఒక పవర్‌ఫుల్ మూవీగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని రాహుల్ సంకృత్యాన్ పేర్కొన్నారు. ''19వ శతాబ్దం నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి అయింది. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది.

జన నాయకుడు

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రానికి 'జన నాయగన్' అనే టైటిల్ ఖరారు చేశారు. హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విజయ్ కెరీర్‌లో 69వ మూవీ. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''విజయ్ చివరి చిత్రంగా 'జన నాయగన్' రాబోతోంది. ఈ టైటిల్‌కి అర్థం జన నాయకుడు, పీపుల్స్ లీడర్, ప్రజా నాయకుడు అని తెలిసిందే. ఇన్నేళ్లలో విజయ్ చేసిన సేవా కార్యక్రమాలు, సినీ పరిశ్రమలో సాధించిన విజయాలకు చిహ్నంగా ఈ టైటిల్ ఉంటుంది. ఈ మూవీ విజయ్‌కి ఫేర్‌వెల్‌గా ఉండబోతోంది. ఆయన ఫ్యాన్స్ ఈ సినిమాను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.



● విజయ్

దేంట్లో ఓడినా లైఫ్‌లో గెలవడమే ముఖ్యం



● వరలక్ష్మి, విశాల్, అంజలి

'మిస్ అయి బావిలో పడ్డాడనుకున్నాను.. వీడు ఇద్దరు మిస్‌లతో పైకొచ్చాడు' అంటూ నటుడు సంతానం చెప్పే డైలాగ్‌తో 'మదగజరాజా' మూవీ ట్రైలర్ ఆరంభమైంది. విశాల్ హీరోగా, వరలక్ష్మీ శరత్ కుమార్, అంజలి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మదగజరాజా'. సుందర్ .సి దర్శకత్వంలో జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తమిళంలో విడుదలైంది. రూ. 50 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టిన ఈ సినిమా సత్య కృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 31న తెలుగులో విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ని హీరో వెంకటేశ్ లాంచ్ చేశారు. 'లైఫ్‌లో దేంట్లో గెలిచామన్నది ముఖ్యం కాదు.. దేంట్లో ఓడినా లైఫ్‌లో గెలవడమే ముఖ్యం', 'నా ఫ్రెండ్స్ జోలికొస్తే ఏమవుతుందో తెలిసేలా చేస్తాను', 'ఇప్పుడూ చెబుతున్నాను.. కయ్యానికైనా సిద్ధం.. కాంప్రమైజ్‌కైనా సిద్ధం' అంటూ విశాల్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''కామెడీ, యాక్షన్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'మదగజరాజా'. సుందర్‌గారు మరోసారి తన మార్క్ ఎంటర్‌టైనర్ అందించారు. తెలుగులోనూ మా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర బృందం పేర్కొంది.

కూతుర్ని ఎలా చూసుకోవాలో తెలుసుండాలి!

కన్నడ హీరో ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ .హెచ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ ఇతర పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 26న కన్నడతో పాటు తెలుగులోనూ విడుదల కానుంది. తెలుగు విడుదల హక్కులను కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. ఈ మూవీ తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాన్న అని పిలిపించుకుంటే సరిపోదు... కూతుర్ని ఎలా చూసుకోవాలో కూడా తెలుసుండాలి', 'నువ్వు పుట్టిన తిధి, వారం, నక్షత్రాలను బట్టి చూస్తే నీ గ్రహాలకి దోషం ఏర్పడినట్టుంది' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''రాక్షస' ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమాకి కూడా ఆదరణ దక్కుతుందనే నమ్మకం ఉంది'' అని చెప్పారు.



● ప్రజ్వల్ దేవరాజ్

తక్కువ బడ్జెట్లో మంచి చిత్రాలు తీయాలి

– కోమటిరెడ్డి వెంకటరెడ్డి



● కషికా కపూర్, శ్రీహర్ష, కోమటిరెడ్డి వెంకట రెడ్డి

''ఎక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీసి, ఆ తర్వాత టికెట్ రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని అడగడం కంటే.. తక్కువ బడ్జెట్‌లోనే మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం మంచిది. అలా తక్కువ బడ్జెట్‌లో మంచి కంటెంట్‌తో వస్తున్న 'ఎల్.వై.ఎఫ్' వంటి చిత్రాలను ప్రోత్సహించడంలో నేను ముందుంటాను'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. శ్రీహర్ష, కషికా కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఎల్.వై.ఎఫ్' (లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వం వహిస్తున్నారు. మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్లపై కిశోర్ రాటి, మహేష్ రాటి, ఎ. రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని కోమటిరెడ్డి వెంకట రెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ఎక్కువ బడ్జెట్లో కాకుండా మంచి కంటెంట్‌తో తక్కువ బడ్జెట్‌తో తీసే సినిమాలు బాగుంటాయి. ఇలాంటి చిత్రాలే మంచి విజయాన్ని సాధిస్తున్నాయి. 'ఎల్.వై.ఎఫ్' కూడా అదే విధంగా విజయం సాధించాలి'' అన్నారు. ఎస్పీ చరణ్, ప్రవీణ్, భద్రం, నవాబ్ షా, 'షకలక' శంకర్, రవిబాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమేరా: శ్యామ్ కె. నాయుడు, సంగీతం: మణిశర్మ.

సమాజమే నీ సేవకు సలాం

వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'కానిస్టేబుల్'. ఆర్యన్ సుభాన్ ఎస్కే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ద్వారా మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. జాగృతి మూవీ మేకర్స్‌పై బలగం జగదీష్ నిర్మించారు. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'కానిస్టేబుల్..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చేతులమీదుగా విడుదల చేశారు. 'కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా సమాజమే నీ సేవకు సలాం అంటుందన్న... కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా ఎగిరే జెండా నిన్నే చూసి మురిసిపోతుందన్నా....' అంటూ ఈ పాట సాగుతుంది. శ్రీనివాస్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ– ''మా కానిస్టేబుల్స్ అంటే నాకు చాలా ఇష్టం. వాళ్ల మీద వచ్చిన ఈ పాటని నేను ఆవిష్కరించినందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రతి పోలీస్ ఈ సాంగ్ వింటారు'' అన్నారు. ''కానిస్టేబుల్..' పాటని సీవీ ఆనంద్‌గారు విడుదల చేయడం మా సినిమాకు గర్వకారణం'' అని వరుణ్ సందేశ్ చెప్పారు. ''కానిస్టేబుల్ కావడం నా చిన్ననాటి కల. అది నెరవేరకపోవడంతో ఈ సినిమా నిర్మించాను'' అని బలగం జగదీష్ తెలిపారు. ''ఈ సినిమాలో సందర్భానుసారంగా వచ్చే టైటిల్ సాంగ్ అందర్నీ స్పందింపజేస్తుంది'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్కే.



● సీవీ ఆనంద్, వరుణ్ సందేశ్

ఆర్మీ నేపథ్యంలో...

భరత్ చౌదరి, ప్రియాంక నాంది జంటగా జె. మోహన్‌కాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిషన్ 007'. మహంకాళీ పిక్చర్స్ పతాకంపై మహంకాళీ నాగ మహేశ్ నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్‌లో మోహన్‌కాంత్ మాట్లాడుతూ–''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'మిషన్ 007'. మా నిర్మాత నాగమహేశ్‌గారికి ఇది తొలి సినిమా. బడ్జెట్ చెప్పిన దానికన్నా ఎక్కువ అయినా ఎక్కడా రాజీ పడలేదు.. అందరికీ నచ్చే మూవీ ఇది'' అన్నారు. నాగమహేశ్ మాట్లాడుతూ– ''యూనిట్ మొత్తం తమ సొంత సినిమాలా భావించి పనిచేశారు. మా చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురి చేస్తుంది. మాకు అన్ని విధాలా సహకరించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు'' అని చెప్పారు. ''మోహన్‌గారు కథ చెప్పినప్పుడు ఆర్మీ నేపథ్యం అనగానే భయం వేసింది. కానీ, ఆయన నమ్మకం చూసి ధైర్యంగా నటించాను'' అన్నారు భరత్ చౌదరి. ''వాణిజ్య అంశాలతో పాటు దేశభక్తి కూడా ఉండటం మా సినిమాకు గర్వకారణం. నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు ప్రియాంక నాంది.



● ప్రియాంక, భరత్ చౌదరి


'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 306

సోమవారం 27-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సెమీస్‌లో భారత్

అండర్‌–19 మహిళల టి20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్‌పై విజయం -12లో



స్వల్పకాల పెట్టుబడికి దారేది?

బ్యాంక్‌ ఎఫ్‌డీలు అన్నింటికంటే మెరుగు.. స్వీప్‌ ఇన్‌ ఎఫ్‌డీ మంచి మార్గం -13లో



ఢిల్లీ, కర్తవ్య పథ్

రిపబ్లిక్‌ డే పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన బ్రహ్మోస్‌ మిస్సైల్‌ సిస్టమ్‌ ప్రదర్శన

గర్వించేలా గణతంత్రం

జెండావందనం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబవో సుబియాంటో 6లో





హైదరాబాద్, పరేడ్‌గ్రౌండ్స్

వ్యవసాయానికే ప్రాధాన్యం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు.. మహిళలు తెలంగాణ అభివృద్ధిలో గుండెకాయ
- తెలంగాణ గీతం అద్భుతంగా ఉంది
- పరేడ్‌ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ
- హాజరైన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు

2లో

భద్రతా బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ

న్యూస్‌రీల్

29న షార్‌ నుంచి వందో ప్రయోగం



దేశీయంగా రూపుదిద్దుకున్న క్రయోజెనిక్‌ జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్‌15 రాకెట్‌ ఎన్‌వీఎస్‌–02ను తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని షార్‌ డైరెక్టర్‌ రాజరాజన్‌ చెప్పారు. శ్రీహరి కోటలోని షార్‌ నుంచి ఇది 100వ మిషన్‌ కానుందన్నారు.

- వివరాలు 6లో ▶

బడా బాబులకు రుణ మాఫీ బీజేపీ మోడల్‌



కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లలో 400–500 మంది సన్నిహితులు, బడా పారిశ్రామికవేత్తలకు రూ.10 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆప్‌ జాతీయ కన్వీనర్‌ కేజ్రీవాల్‌ ఆరోపించారు. కేవలం ఇద్దరు స్నేహితులకే రూ.50 వేల కోట్లు మాఫీ చేశారన్నారు.

- వివరాలు 6లో ▶

పెళ్లికి నిరాకరించడం ఆత్మహత్యకు పురిగొల్పినట్లు కాదు



వివాహానికి ఆమోదం తెలపకపోవడాన్ని ఆత్మహత్యకు పురిగొల్పినట్లుగా భావించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఐపీసీలోని సెక్షన్‌–306 ప్రకారం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లుగా భావించలేమని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేసింది. పిటిషనర్‌ కుమారుడు, అతడి ప్రియురాలికి మధ్య ఉన్న విభేదాలే ఆధారంగానే ఈ ఆరోపణలు చేసినట్లు తెలిపింది.

- వివరాలు 6లో ▶

ఉత్తరాఖండ్‌లో నేటి నుంచే

ఉమ్మడి పౌరస్మృతి..

సీఎం పుష్కర్‌సింగ్‌ ధామీ ప్రకటన

- వివరాలు 6లో ▶

మార్చిలోగా అర్హులందరికీ

నాలుగు పథకాలు అమలు చేస్తాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఆదివారం నారాయణపేట జిల్లా చంద్రవంచ గ్రామంలో రైతు భరోసా లబ్ధిదారులకు చెక్కు ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా
- 26వ తేదీ రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయి
- రైతుకు కాంగ్రెస్‌కు మధ్య బలమైన అనుబంధముంది
- ఇందిరమ్మ ఇళ్లు అంటేనే వైఎస్సార్‌ గుర్తొస్తారన్న ముఖ్యమంత్రి
- ఒక్క కొడంగల్‌లోనే 20 వేల వరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ
- నారాయణపేట జిల్లా చంద్రవంచ సభలో ప్రసంగం
- రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ప్రారంభం.. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, చెక్కులు పంపిణీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌: 'రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ మార్చి 31లోగా నాలుగు పథకాలను అందజేస్తాం. అప్పటివరకు కార్యక్రమాలు కొనసాగుతాయి. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున జనవరి 26 అర్ధరాత్రి నుంచే టకీటకీమని రైతుల ఖాతాల్లో పడతాయి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 'భూమికి విత్తనానికి మధ్య ఎలాంటి బంధముందో, రైతుకు కాంగ్రెస్‌కు మధ్య అలాంటి బలమైన అనుబంధముంది. 2004లో వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఎల్బీ స్టేడియం వేదికగా రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్‌ ప్రకటించారు. రూ.1,200 కోట్ల విద్యుత్‌ బకాయిలను ఒక్క కలం పోటుతో రద్దు చేశారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌..సోనియాగాంధీ నేతృత్వంలో రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసి చూపారు. ఇదే వారసత్వాన్ని కొనసాగిస్తూ గత ఆగస్టు 15 నుంచి 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం..'అని సీఎం పేర్కొన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా కోస్గి మండలం

మిగతా 3వ పేజీలో ▶

నాలుగు పథకాలకు ఏటా రూ. 45 వేల కోట్లు

- బీఆర్‌ఎస్‌ గత పదేళ్లలో చేసి ఉంటే.. మాకు పని ఉండేదే కాదు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

3లో



రాష్ట్రాలపై కేంద్రం దండయాత్ర

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

- వర్సిటీలపై రాష్ట్రాల అధికారాలను లాక్కోవడానికి కుట్రలు చేస్తోంది

- వివరాలు 2లో ▶

సాగు యోగ్యం కాని భూములు

2.10 లక్షల ఎకరాలు

- సర్వేలో తేల్చిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులు
- 600 గ్రామీణ మండలాల్లోని 10,277 గ్రామాల్లో సర్వే
- ఎన్ని ఎకరాలకు రైతు భరోసా వర్తింపజేస్తారనే అంశంపై నేడో, రేపో ప్రకటన!
- 28,287 ఎకరాల సాగు యోగ్యం కాని భూములతో రంగారెడ్డి టాప్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ఆదివారం నుంచి ప్రారంభమైన 'రైతు భరోసా' పథకం కింద ఎన్ని లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించాలనే విషయంలో ప్రభుత్వానికో స్పష్టత వచ్చింది. రైతుల వద్ద ఉన్న పట్టా భూముల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల లెక్క తేలింది. రాష్ట్రంలోని 10,277 గ్రామాల్లో 2,10,864 ఎకరాల విస్తీర్ణంలోని భూములు సాగు యోగ్యమైనవి కావని గుర్తించారు. అంటే ఇవి 'రైతు భరోసా'కు అర్హత లేనివని నిర్ధారించారన్నమాట. అయితే గ్రామసభల్లో వచ్చిన విజ్ఞప్తుల మేరకు వీటిలో 5 నుంచి 10 శాతం వరకు భూములను వ్యవసాయానికి యోగ్యమైనవిగా నిర్ధారించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకటి రెండురోజుల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ యోగ్యం కాని భూముల లెక్కను నిర్ధారించుకుని, ఎన్ని ఎకరాలకు రైతు భరోసా వర్తింపజేస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయనుంది.

తర్జన భర్జనల అనంతరం తెరపైకి 'యోగ్యత'

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయంలో రైతుబంధు (ప్రస్తుతం రైతు భరోసా) పథకం కింద గుట్టలు, కొండలు, రోడ్లు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు, క్వారీలకు కూడా పెట్టుబడి సాయం అందించారని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి



తుమ్మల నాగేశ్వర్‌ రావు తదితరులు పలుమార్లు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే రైతుభరోసా ఎవరికి వర్తింప జేయాలనే విషయమై సిఫారసు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఓ కేబినెట్‌ సబ్‌కమిటీని నియమించారు. ఈ మేరకు చర్చోప చర్చలు, కూడికలు, తీసివేతలు జరిపిన మంత్రులు.. తొలుత సాగులో ఉన్న భూములకే పెట్టుబడి సాయం అందజేయాలని, ఎకరాకు ఒక సీజన్‌కు రూ. 6,000 చొప్పున అందించాలంటూ ప్రాథమిక నివేదిక ఇచ్చారు. ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో

మిగతా 5వ పేజీలో ▶

వడివడిగా 'భూభారతి'

- కొత్త చట్టం అమలుకు రెవెన్యూ శాఖ కసరత్తు.. మార్గదర్శకాల రూపకల్పనలో ఉన్నతాధికారులు
- ఫిబ్రవరి మూడో వారానికల్లా పూర్తికానున్న ప్రక్రియ.. మార్చిలో చట్టం అమల్లోకి వచ్చే అవకాశం..



సాక్షి, హైదరాబాద్‌

రాష్ట్రంలో భూభారతి చట్టం అమలు దిశగా రెవెన్యూ శాఖ వడివడిగా కసరత్తు చేస్తోంది. ఈ నెలలోనే గవర్నర్‌ ఆమోదం పొందిన ఈ చట్టం అమలులో భాగంగా అవసరమైన మార్గదర్శకాల రూపకల్పనలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. చట్టంలోని సెక్షన్లు, సబ్‌ సెక్షన్లవారీగా మార్గదర్శకాలను రూపొందించే పనిలోపడ్డారు. ఇందుకోసం త్వరలోనే భాగస్వామ్య పక్షాలతో వర్క్‌షాప్‌ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ వర్క్‌షాప్‌లో మార్గదర్శకాలు ఎలా ఉండాలనే విషయమై స్పష్టత రానుంది. మార్గదర్శకాల రూపకల్పన వచ్చే నెల మూడో వారానికల్లా పూర్తయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ కసరత్తు పూర్తయ్యాక వాటిని మళ్లీ క్షుణ్ణంగా పరిశీలించి ఈ చట్టం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందన్న దానిపై ప్రభుత్వం ప్రకటన చేయనుంది. అయితే వచ్చే నెలలో భూభారతి చట్టం అమల్లోకి వస్తుందని రెవెన్యూ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చట్టం అమల్లోకి వచ్చే వరకు ప్రస్తుతం అమల్లో ఉన్న ధరణి పోర్టల్‌ ద్వారానే

మిగతా 3వ పేజీలో ▶



అతివేగం.. మద్యం మత్తు

నలుగురి ప్రాణాలు బలిగొన్న లారీ డ్రైవర్‌

- వరంగల్‌ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు ఆటోలను ఢీకొట్టిన లారీ
- లారీలోని ఐరన్‌ రాడ్లు పడి భోపాల్‌ వాసుల మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు

-5లో

పెట్‌లకు డబ్బులు కాస్తాయి!

2లో

'డబ్బులేమైంది.. కుక్కను కొడితే రాల్తాయి..'అంటుంటారు. ఈ బడాయి మాటలకేం గానీ.. మీ కుక్కను ముద్దు చేసి, ముస్తాబు చేసి, ఆ మురిపాల ముచ్చట్లను సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేస్తే మాత్రం నికరంగా నాలుగు రాళ్లయితే మీ బ్యాంక్‌ అకౌంట్‌లోకి వచ్చి పడతాయి.



అమ్మగారూ.. ఇల్లు ఊడ్చేశా.. అంట్లు తోమేశా!

14లో



ఇప్పటివరకు మనం హోటళ్లు, మాల్స్‌ వద్ద ఆతిథ్య సేవల్లో నిమగ్నమైన రోబోలను లేదా పరిశ్రమలు, వైద్య రంగంలో సేవలు అందించే రోబోలను మాత్రమే చూశాం.కానీ త్వరలోనే మనతో మాటకలుపుతూ మన ఆదేశాలకు అనుగుణంగా పనులు చేసిపెట్టగల కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత రోబోలు అందుబాటులోకి రానున్నాయి.



ఆన్‌లైన్‌లోనే యాజమాన్య కోటా భర్తీ!

బీ, సీ కేటగిరీ ఫీజులపై తర్జన భర్జన


- త్వరలో ప్రభుత్వానికి మండలి నివేదిక
- ఈ ప్రతిపాదనకు ప్రైవేటు కాలేజీలు ససేమిరా..
- కోరిన ఫీజు తీసుకునే వెసులుబాటుపై ఒత్తిడి
- మరో వారంలో కాలేజీల తనిఖీలకు కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్‌: ఇంజనీరింగ్‌ సీట్ల భర్తీపై ఈసారి కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్‌ విధానంలో భర్తీ చేయాలని భావిస్తోంది. దీనిపై త్వరలో కార్యాచరణ వెలువడనుంది. ఇప్పటికే ఈ విధానంపై ఉన్నత విద్యా మండలి నివేదిక రూపొందించింది. దీనిని త్వరలో ప్రభుత్వానికి అందించనుంది. బీ, సీ కేటగిరీ సీట్ల ఫీజును నిర్ణయించే అధికారం ఫీజులు, నియంత్రణ కమిటీకి అప్పగించాలని నివేదికలో పేర్కొంది. సీ కేటగిరీ ఫీజుల విషయంలో పెద్దగా అభ్యంతరాలు లేకున్నా, బీ కేటగిరీ సీట్ల ఫీజుల విషయంలోనే తర్జన భర్జన కొనసాగుతోంది. మరోవైపు ఈ తరహా నియంత్రణపై ప్రైవేటు కాలేజీలు విముఖంగా ఉన్నాయి. తమ ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఎఫ్‌ఆర్‌సీ, ప్రభుత్వాన్ని కోరాయి.

నియంత్రణ ఎలా?

రాష్ట్రంలో దాదాపు 1.32 లక్షల ఇంజనీరింగ్‌ సీట్లున్నాయి. ఇందులో 70 శాతం కన్వీనర్‌ కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతంలో 15 శాతం బీ కేటగిరీ కింద, 15 శాతం సీ కేటగిరీ కింద భర్తీ చేస్తారు. ఇప్పటివరకు బీ, సీ కేటగిరీ సీట్ల భర్తీ అధికారం కాలేజీలకే ఉంది. బీ కేటగిరీ సీట్లను జేఈఈ, ఈఏపీసెట్, ఇంటర్‌ మార్కుల మెరిట్‌ ఆధారంగానే భర్తీ చేయాలి. ఎఫ్‌ఆర్‌సీ నిర్ణయించిన

మిగతా 3వ పేజీలో ▶



ఆన్‌లైన్‌ విధానమే మంచిది

యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో చేపడితేనే సమస్యలు రాకుండా ఉంటాయి. దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తయింది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ముందుకెళ్తాం.
–ప్రొ. బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌



ఈసారైనా నమో భారత్‌ వచ్చేనా?

3లో

నమో భారత్‌ ర్యాపిడ్‌ ట్రైన్‌.. సమీప నగరాలను, పట్టణాలను చుట్టేసే ఇంటర్‌ సిటీ రైలు. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నమో భారత్‌ ర్యాపిడ్‌ రైళ్ల కోసం హైదరాబాద్‌ ఎదురు చూస్తోంది.



పెట్‌లకు డబ్బులు కాస్తాయి!

పెట్ అకౌంట్ ఓపెన్ చేయగానే 'డబ్బే డబ్బు'.. 'వద్దంటే డబ్బు'అనేంతగా వెంటనే ఏమీ వచ్చిపడదు కానీ, అంతకన్నా ఎక్కువగానే ఒక 'పెట్ ఇన్‌ఫ్లుయెన్సర్'గా కొన్నాళ్లకు మీకు గుర్తింపు వస్తుంది. ఆ గుర్తింపు మీకు ఒక్కో పోస్టుకు రూ. 5,000 నుంచి రు.15,000 వరకు పెట్ కేర్ బ్రాండ్స్ నుంచి వచ్చేలా చేస్తుంది. మీ పెట్ ఎంత పాపులర్ అయితే మీకంత పేమెంట్. అబ్బా.. మూగజీవులతో ఏం చెప్పిస్తాం, ఏం మెప్పిస్తాం అనుకోకండి. మీలో కంటెంట్ ఉంటే చాలు.. వాటికి మాటలు వచ్చేసినట్లే. మరి మాలో క్రియేటివిటీ ఉండొద్దా అంటారా? ఆ సంగతి మీ పెట్స్‌కి వదిలి పెట్టండి. అవి ఇచ్చే క్యూట్ ఫీలింగ్స్‌తో మీలోంచి ఒక్క క్రియేటివిటీ ఏంటి.. మొత్తం కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్, కెమెరా, స్టార్ట్, యాక్షన్ అన్నీ తన్నుకొచ్చేస్తాయి.

కంటెంట్‌ని బట్టి పేమెంట్



నువ్వెక్కడికి!?
పెట్ ఇన్‌ఫ్లుయెన్సర్ 'ఆస్కార్' (మధ్యలో)

సాక్షి, హైదరాబాద్: 'డబ్బులేముంది.. కుక్కను కొడితే రాల్తాయి..'అంటుంటారు. ఈ బడాయి మాటలకేం గానీ.. మీ కుక్కను ముద్దు చేసి, ముస్తాబు చేసి, ఆ మురిపాల ముచ్చట్లను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే మాత్రం నికరంగా నాలుగు రాళ్లయితే మీ బ్యాంక్ అకౌంట్‌లోకి వచ్చి పడతాయి. పోనీ మీకు గ్రామసింహం లేదా? మరేం ఫర్వాలేదు.. మీ పిల్లి మాతల్లి వయ్యారాలను, కళ్లు మూసుకుని ఆ మార్జాల మహారాణి వేసే దొంగ వేషాలను రీల్స్‌గా, షార్ట్స్‌గా షూట్ చేసి పోస్ట్ చేసినా మీకొచ్చేది వస్తుంది. ముందు మీ పెట్ (పెంపుడు జంతువు) నలుగురి కళ్లలో పడుతుంది. వెనకే ఫాలోవర్స్ వెంటపడతారు. వాళ్లను చూసి ప్రొడక్ట్ ప్రమోటర్స్ మిమ్మల్ని ఫాలో అయిపోతారు.

వెయ్యికి పైగా అకౌంట్లు

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ టెక్ ప్లాట్‌ఫామ్ 'కోరజ్'డేటా ప్రకారం సోషల్ మీడియాలో ప్రస్తుతం ఇండియాకు చెందినవి 1,200 వరకు యాక్టివ్ పెట్ ఇన్‌ఫ్లుయెన్సర్ అకౌంట్లు ఉన్నాయి. వెయ్యికి పైగా ఫాలోవర్స్, 12,000కు పైగా లైకులు, ఒక పోస్టుకు సగటున 1,30,000 వ్యూస్ ఉండే ఈ అకౌంట్లు.. 100 కోట్ల డాలర్ల విలువైన భారతీయ పెట్ కేర్ మార్కెట్‌లో ఇప్పుడు ఒక భాగం. వీటిలో 'ఆస్కార్'అనే అకౌంట్ పేరు కలిగిన ఐదేళ్ల వయసున్న గోల్డెన్ రిట్రీవర్ జాతి శునకానికి ఇన్‌స్టాగామ్ హ్యాండిల్‌లో 2,49,000 మంది ఫాలోవర్‌లు ఉన్నారు.

రీల్‌కు రూ.15,000 వరకు!

ఇండియాలోనే ఓరియో, నిక్కి, మిల్లీ, డూడిల్, పాపిన్స్, సింబా, నిఫ్టి, జోయ్ అనేవి మంచి పేరున్న పెట్ అకౌంట్లు. 'కారాబెల్'అనే క్యాట్ (పిల్లి) ఇన్‌ఫ్లుయెన్సర్‌కు ఇన్‌స్టాగామ్‌లో 15,400 మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఈ పర్షియన్ జాతి పిల్లి ఫ్యాషన్‌లో హొయలు ఒలికిస్తూ, అందంలో అధునాతనాన్ని చిలికేస్తూ, ఆరోగ్యానికి టిప్స్‌ని అందిస్తూ ఉంటుంది. 'నల', 'మీను'అనే క్యాట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లకు కూడా మంచి గుర్తింపు ఉంది. 15,000–50,000 మధ్య ఫాలోవర్స్ ఉన్న ఏ పెట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌కైనా ఒక రీల్‌కు, షార్ట్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుంది. డబ్బే కాదు, ఉచితంగా పెట్ కేర్ ప్రొడక్టులు కూడా లభిస్తాయి. పెట్ కేర్ బ్రాండ్స్ తమ ప్రమోషన్ కోసం పోస్ట్‌కి ఇంత అని చెల్లిస్తాయి.



పెట్ ఇన్‌ఫ్లుయెన్సర్ అవ్వాలంటే..!

పెట్ ఇన్‌ఫ్లుయెన్సర్ కావాలంటే మొదట మీ పెట్‌కు (కుక్క, పిల్లి, ఇతర పెంపుడు జంతువులు ఏవైనా) కెమెరాను అలవాటు చేయండి. ఆ తర్వాత మీరనుకున్న థీమ్‌ను బట్టి పెట్‌కు అవసరమైన హంగుల్ని, ఆర్భాటాలను తగిలించండి. నిద్ర లేచినప్పుడు, ఆవలిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, స్నానం చేయిస్తున్నప్పుడు, దుస్తులు తొడిగాక, జర్నీలో మీతో పాటు ఉన్నప్పుడు.. ఇలా ప్రతి సందర్భంలోనూ వాటి ఫీలింగ్స్‌ని కెమెరాలోకి లాగేసుకోండి. కాప్షన్ పెట్టి నెట్‌లోకి వదిలేయండి. అందులో ఏదైనా సామాజిక సందేశం అంతర్లీనంగా ఉంటే మరీ మంచిది. ఫాలోవర్స్ పెరుగుతారు. స్పాన్సరర్‌లు వచ్చేస్తారు. పెట్ మూడ్ బాగోలేనప్పుడు మాత్రం షూట్ పెట్టుకోకండి.



వీకెండ్‌కి రెడీ!
క్యాట్ ఇన్‌ఫ్లుయెన్సర్ 'మీను'

క్లుప్తంగా...

రాజ్యాంగాన్ని బలపరుద్దామని ప్రతిజ్ఞ చేద్దాం

రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: తెలుగు ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'రిపబ్లిక్ డే వేడుకలు భిన్నత్వంలో ఏకత్వ బలాన్ని చాటి చెబుతాయి. ఈ వేడుకలు సాంస్కృతిక వైవిధ్యానికి అద్దం పడతాయి. ఈ సందర్భంగా భారతదేశ గొప్పతనాన్ని తెలియజేసే రాజ్యాంగాన్ని బలపరుద్దామని ప్రతిజ్ఞ చేద్దాం' అంటూ ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

నేడు ఇండోర్‌కు సీఎం, డిప్యూటీ సీఎం

అంబేడ్కర్ స్వగ్రామంలో సంవిధాన్ బచావో ర్యాలీకి హాజరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు సోమవారం మధ్యప్రదేశ్ వెళ్లనున్నారు. ఇండోర్‌కు సమీపంలోని అంబేడ్కర్ స్వగ్రామం మహూ కంటోన్మెంట్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు వెళ్లనున్నారు.

మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసే కుట్ర

గాంధీభవన్‌లో జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో వీహెచ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి.. మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలనే కుట్ర జరుగుతోందని టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. అందుకే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపర్చారన్నారు. దేశంలో కాషాయఎజెండాను అమలు చేయాలనేది బీజేపీ లక్ష్యమని, ఈ ప్రమాదం నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెట్టొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. కాగా, ఈ సందర్భంగా గాంధీభవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో వందలాది మంది సేవాదళ్ కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకలు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మధుసూదనాచారి, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర వేడుకలను ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జాతీయ జెండాను ఎగురవేశారు.

వ్యవసాయానికే ప్రాధాన్యం

అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు

- మహిళలు తెలంగాణ అభివృద్ధిలో గుండెకాయ
- తెలంగాణ గీతం అద్భుతంగా ఉంది
- పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- హాజరైన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు





పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. కార్యక్రమంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఏడాది కాలంలోనే రైతాంగానికి అండగా నిలిచే ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు, రక్షణ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగిస్తూ ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. వ్యవసాయం, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగాలు, విద్య తదితర రంగాల్లో ప్రభుత్వం చేసిన, చేస్తున్న పనులను వివరించారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటున్నట్టు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ఉండేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కింద రాష్ట్రంలోని 25.34 లక్షల మందికి రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. సన్నరకం ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్ రూ. 500 చొప్పున రూ.1206.44 కోట్లు బోనస్ కింద అందించినట్టు చెప్పారు. 2024 వానాకాలం సీజన్‌లో దేశంలోనే అత్యధికంగా 1.59 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసినట్టు తెలిపారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరం రైతుల సేవలో ప్రభుత్వం ఉంటుందన్నారు. రైతు వేదికలను మరింత అభివృద్ధి చేసి, రైతునేస్తం కార్యక్రమాన్ని 532 గ్రామీణ మండలాల్లో అమలు చేస్తున్నట్టు వివరించారు. రైతుబీమా పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు రూ.1433 కోట్ల బీమా చెల్లించినట్టు చెప్పారు. కృష్ణా జలాల ట్రిబ్యునల్–2 ముందు ప్రభుత్వం తన వాదనను బలంగా వినిపించడంతో కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో విజయం సాధించినట్టు చెప్పారు. దావోస్ ఒప్పందాల్లో 1.70 లక్షల కోట్ల పెట్టుబడులకు అవగాహన కుదిరిందని, ఐటీ, పునరుత్పాదక శక్తి, ఫార్మా కంపెనీల ద్వారా 49,500 ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు.

మహిళా సాధికారత కోసం

తెలంగాణ అభివృద్ధి ఎజెండాలో మహిళలు గుండె వంటి వారని గవర్నర్ పేర్కొన్నారు. ఉచితబస్సు సౌకర్యం ద్వారా 133.91 కోట్లసార్లు ప్రయాణించిన మహిళలకు రూ.4,501 కోట్లు ప్రభుత్వం ఆదా చేసిందన్నారు. 50 లక్షల పేద కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ అందించామని, రాయితీ గ్యాస్ సిలిండర్ల ద్వారా 43 లక్షల కుటుంబాలకు రూ.433.2 కోట్లు సబ్సిడీ అందించినట్టు చెప్పారు. ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా కోటిమంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మార్చి కోటీశ్వరులను చేయాలని సంకల్పించినట్టు చెప్పారు. స్త్రీనిధి పథకం ద్వారా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేస్తున్నామని, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తాం

తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గవర్నర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రజాప్రభుత్వం బాగుందని, తెలంగాణ గీతం అద్భుతంగా ఉందని కొనియాడారు. తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి తెలంగాణ తల్లి విగ్రహం ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులను స్మరించుకున్నారు. జయజయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించామని, తెలంగాణ ఉద్యమకారులను గౌరవించుకున్నామని తెలిపారు. యువత సాధికారత కోసం యంగ్‌ఇండియా స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా సివిల్ సర్వీస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే ఔత్సాహికులకు లక్ష రూపాయల ఆర్థిక సహకారాన్ని కూడా అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే 55 వేల యువతీయువకులకు ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పారు. క్రీడలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, క్రీడాకారుల కోసం యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. విద్య, ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, గురుకులాల్లో సమగ్ర విద్యాబోధనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

రాష్ట్రాలపై కేంద్రం దండయాత్ర

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

- వర్సిటీలపై రాష్ట్రాల అధికారాలను లాక్కోవడానికి కుట్రలు చేస్తోంది
- ఇది రాజ్యాంగంపై, రాష్ట్రాలపై సాంస్కృతిక దాడే.. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రధానిని కోరుతున్నా
- లేకుంటే నిరసనలకు వెనకాడం
- అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- పలు భవనాలకు శంకుస్థాపన



విశ్వవిద్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రి పొన్నం తదితరులు

బంజారాహిల్స్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై దండయాత్ర చేయాలని చూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. విశ్వవిద్యాలయాలపై రాష్ట్రాలకున్న అధికారాలను లాక్కొని ఆధిపత్యం చెలాయించాలని కుట్రలు చేస్తోందని... వర్సిటీల వైస్ చాన్స్‌లర్ల (వీసీ) నియామకాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ద్వారా చేపట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఇందుకోసం యూజీసీ మార్గదర్శకాలను మార్చే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఆవరణలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజిటల్ రిసోర్స్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎసెన్షియల్ స్టాఫ్ క్వార్టర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సీఎస్ శాంతికుమారి, వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ కేంద్రం తీరును తీవ్రంగా తప్పుబట్టారు. యూనివర్సిటీలపై ఆధిపత్యం కేంద్రం చేతుల్లోకి వెళితే కొందరి విషప్రచారానికి యూనివర్సిటీలు వేదికలు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రతిపాదిత నిర్ణయాన్ని రాజ్యాంగంపై, రాష్ట్రాలపై సాంస్కృతిక దాడిగా అభివర్ణించారు.

రాష్ట్రాల హక్కులను గుంజుకుంటే ఎలా?

'వర్సిటీలపై రాష్ట్రాల హక్కును కేంద్రం ఎలా తీసుకుంటుంది? ఇలాంటి విధానాలతో రాజ్యాంగం మనుగడ సాగిస్తుందా? అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోనే అధికార విభజన ఉంది. కేంద్రం ఒక్కొక్కటిగా రాష్ట్రాల హక్కులను గుంజుకుంటే ఎలా? కేంద్రం తీరు ఇలాగే ఉంటే రాష్ట్రాలన్నీ నామమాత్రం అవుతాయి. ఇలాంటి చర్యలు అనవసర వివాదాలకు దారితీస్తాయి. యూజీసీ నిబంధనల మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. అలా చేయకపోతే అవసరమైతే నిరసనలకు కూడా వెనుకాడం. దీనిపై ఇతర రాష్ట్రాల సీఎంలతో కలిసి యూజీసీ నిబంధనలపై పోరాడతాం. దేశంలో మళ్లీ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలనే చర్చ జరగడం దురదృష్టకరం 'అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

విద్యా వ్యవస్థను గాడిన పెడతాం..

నాటి ప్రధాని పీవీ నరసింహారావు సామాజిక బాధ్యతగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లారని సీఎం రేవంత్ చెప్పారు. ఈ విశ్వవిద్యాలయం ఉన్నది కేవలం సర్టిఫికెట్ల జారీ కోసమే కాదని.. సమాజంలో సమస్యలకు ఇక్కడి నుంచే పరిష్కారం మొదలుకావాలని పేర్కొన్నారు. విద్యాహక్కును దూరం చేసే హక్కు పాలకులకు ఎవరూ ఇవ్వలేదన్నారు. నిర్లక్ష్యానికి గురవుతున్న విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

వందేళ్లలో తొలిసారి ఓయూకు దళిత వీసీని నియమించాం

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని వీసీలను నియమించాలని సీఎం రేవంత్ చెప్పారు. వందేళ్ల తర్వాత ఉస్మానియా యూనివర్సిటీకి దళిత సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్తను వీసీగా నియమించామన్నారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని వీసీలను ఆదేశించామన్నారు. తెలంగాణ సమాజానికి చికిత్స అందించాల్సిన బాధ్యత ప్రొఫెసర్లపై ఉందన్నారు. పదేళ్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తే అమలుచేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. యూనివర్సిటీలను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన మంచిది కాదని, రాష్ట్రంలో యూనివర్సిటీల పునఃనిర్మాణం జరగాలన్నారు. ప్రొఫెసర్ల వయో పరిమితికి 65కు పెంచే ఆలోచన ఉందని సీఎం చెప్పారు. అంబేడ్కర్ వర్సిటీలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామన్నారు.

2034 వరకు ప్రభుత్వం మాదే..

మరో పదేళ్ల వరకు తమ ప్రభుత్వమే కొనసాగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉందని, 2014 నుంచి 2024 వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని.. ఆయా పార్టీలకు పదేళ్లపాటు ప్రజలు అధికారం ఇచ్చారని.. తమకు కూడా 2034 వరకు ప్రజలు అందిస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు.

పద్మ అవార్డుల్లో అన్యాయంపై ప్రధానికి లేఖ రాస్తా..

పద్మ అవార్డుల విషయంలో కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు లాంటి ప్రముఖులను గుర్తించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రం సిఫారసు చేసిన వారికి పురస్కారాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఏపీకి ఐదు అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులు ఇచ్చినా బాగుండేదన్నారు. ఈ అన్యాయంపై త్వరలోనే ప్రధానికి లేఖ రాస్తానని చెప్పారు.

అసెంబ్లీ, మండలిలో గణతంత్ర వేడుకలు



అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర వేడుకలను శాసనమండలి, శాసనసభ ఆవరణలలో ఘనంగా నిర్వహించారు. శాసనమండలి ప్రాంగణంలో ఆదివారం ఉదయం జాతీయ పతాకాన్ని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు బొగరపు దయానంద్, నర్సిరెడ్డి, వాణీదేవి, ఏవీఎస్ రెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. శాసన సభ ఆవరణలో జాతీయ జెండాను తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు.

కాంగ్రెస్ రాజ్యాంగాన్ని అవమానిస్తోంది

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం



రిపబ్లిక్ డే వేడుకలో చింతల, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేయడమే కాకుండా అనేక రకాలుగా రాజ్యాంగాన్ని అవమానిస్తోందని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతారే తప్ప, కనీసం దాన్ని చదివిన పాపానపోలేదని విమర్శించారు. గతంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసిన కాంగ్రెస్ పార్టీకి బీజేపీని విమర్శించే నైతిక హక్కులేదన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ ఆధ్వర్యంలో 'సంవిధాన్ గౌరవ్ అభియాన్'ను ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. హమారా సంవిధాన్.. హమారా స్వాభిమాన్ అనే ఆలోచనతో ప్రతి భారతీయుడు, ప్రతి బీజేపీ కార్యకర్త ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రాజ్యాంగం పుస్తకం పట్టుకుని ఊరేగుతూ రాహుల్ గాంధీ మాట్లాడే మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటుందని ఎద్దేవా చేశారు.

తెలంగాణ అస్తిత్వానికి ప్రశ్నార్థకంగా పద్మ అవార్డులు

డిప్యూటీ సీఎం భట్టి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, అస్తిత్వం, ఆత్మగౌరవానికి ప్రశ్నార్థకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఏర్పాటు, తెలంగాణ సమాజం, ప్రజల కలల కోసం జీవితాలను త్యాగం చేసిన ఐదుగురి పేర్లను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా సిఫారసు చేసినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా యుద్ధనౌక గద్దర్, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లను రాష్ట్రం సిఫారసు చేస్తే.. ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్రం సూచించిన వారిలో ఒక్కరికి కూడా అవార్డు ఇవ్వకపోవడం, ఏపీ ప్రభుత్వం సూచించిన వారికి ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు.

ప్రజాభవన్‌లో పతాకావిష్కరణ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాభవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

క్షమాపణ చెప్పి వివాదానికి స్వస్తి పలకాలి

- ఉనికి కోసమే బండి సంజయ్ రాజకీయ ప్రకటనలు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిర్మించనున్న ఇళ్ల గురించి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణలు చెప్పి వివాదానికి స్వస్తి పలకాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కోరారు. దేశంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇల్లు కనిపిస్తుందని, ఇందిరమ్మ ఇచ్చిన ఇంటి జాగా ఉంటుందని గుర్తు చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇందిరాగాంధీ నిజాం కాలేజీకి వస్తున్నారంటే మూడు రోజుల నుంచే జనం ఎదురుచూసే వారని చెప్పారు. సంజయ్‌కు ఇందిరమ్మ చరిత్ర తెలియదని వ్యాఖ్యానించారు. తాము ఎప్పుడూ అద్వానీ, వాజ్‌పేయి గురించి తప్పుగా మాట్లాడలేదని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీకి బలం లేదని, పొరపాటున ఆ పార్టీకి ఎనిమిది ఎంపీ సీట్లు వచ్చాయని, ఇక ఎప్పుడూ అంతకంటే ఎక్కువ సీట్లు రావని జగ్గారెడ్డి చెప్పారు. ఉనికి కోసం రాజకీయ ప్రకటనలు చేయడం మానుకోవాలని బండి సంజయ్‌కు హితవు పలికారు.

బండి సంజయ్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్ల కేటాయింపులు రద్దు చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పడం దారుణమని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న వారు మాత్రం కేంద్ర ప్రభుత్వ పథకాలకు బీజేపీ నేతల పేర్లు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ నేతలు ఫెడరల్ వ్యవస్థను ఏమాత్రం గౌరవించడం లేదని, కేంద్రమంత్రి బండి సంజయ్ తన ప్రకటనను వెనక్కి తీసుకోకపోతే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను తెలంగాణ ప్రభుత్వం గౌరవించినప్పుడు, తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర మంత్రులు గౌరవించాలని గుర్తు చేశారు. ఇప్పటికైనా బండి సంజయ్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకునేలా ప్రధాని, కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకోవాలని మల్లు రవి డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి: కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వబోమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ప్రకటన ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు రాష్ట్రాల హక్కులు హరించేలా ఉన్నాయన్నారు. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో రాజ్యాంగ పరిరక్షణపై నిర్వహించిన సదస్సులో కవిత కీలకోపన్యాసం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరుగుతున్నారని, తెలంగాణలో హననమవుతున్న రాజ్యాంగ స్ఫూర్తిపై ఆయన ఎందుకు మాట్లాడడం లేదని కవిత ప్రశ్నించారు. కాగా, సదస్సులో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ, హక్కులను కాపాడటం, పరిపాలనలో పారదర్శకత వంటి 19 తీర్మానాలను ఆమోదించారు. ఈ తీర్మానాలతో పాటు కవిత రాసిన లేఖను త్వరలో విద్యార్థులు రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు గడ్కరీతో మాట్లాడండి

బీజేపీ నేతలకు ఎంపీ చామల సవాల్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చకపోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిటే కారణమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేతలకు దమ్ముంటే అలైన్‌మెంట్ మార్చేందుకు వారి ప్రభుత్వంలోని కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీగా అలైన్‌మెంట్ మార్పునకు తాము అనుకూలమేనని, బీజేపీ నేతలు ఢిల్లీకి వచ్చి గడ్కరీని ఒప్పించాలన్నారు. ఆదివారం నల్లగొండకు వచ్చిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్నదే వారి పార్టీ అయినప్పుడు, రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్ర మంత్రిని ఒప్పించకుండా, క్షేత్రస్థాయికి వచ్చి డ్రామాలు ఆడటం ఎందుకని చామల ప్రశ్నించారు. వారికి సత్తా ఉంటే కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను మార్పు చేయించాలని డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్ మార్చడానికి వీలు లేకుండా చేసిందే బీజేపీ ప్రభుత్వమేనని చెప్పారు. బీఆర్ఎస్ ట్రాప్‌లో బీజేపీ నేతలు పడ్డారని, బీఆర్ఎస్ స్క్రిప్టునే అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీలో 3వ తేదీ నుంచి తాను అందుబాటులో ఉంటానని, అన్నీ తెలిసిన లక్ష్మణ్ వంటి బీజేపీ నేతలు ఢిల్లీకి వచ్చి గడ్కరీతో మాట్లాడాలని చామల సూచించారు.

ఈసారైనా నమో భారత్ రైలొచ్చేనా?



- దక్షిణ మధ్య రైల్వేలో నడపాలని రెండేళ్ల క్రితమే ప్రతిపాదన
- 100- 250 కిలోమీటర్ల పరిధిలో తిరిగే నమోభారత్ రైళ్లు
- హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రాలకు నడపాలని వినతులు
- 2024-25 బడ్జెట్‌లో వస్తాయని ఆశించినా ఇవ్వని కేంద్రం
- వచ్చే బడ్జెట్‌లో అయినా ఇస్తారని ఆశలు
- నమో భారత్ వస్తే పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరట

సాక్షి, హైదరాబాద్: నమో భారత్ ర్యాపిడ్ ట్రైన్.. సమీప నగరాలను, పట్టణాలను చుట్టేసే ఇంటర్ సిటీ రైలు. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నమో భారత్ ర్యాపిడ్ రైళ్ల కోసం హైదరాబాద్ ఎదురుచూస్తోంది. గుజరాత్‌తో పాటు పలు రాష్ట్రాల్లో అందుబాటులోకి వచ్చిన ఈ రైళ్లను, హైదరాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వే పరిధిలోనూ అందుబాటులోకి తేవాలన్న ప్రతిపాదన రెండేళ్ల నుంచే ఉంది. వందేభారత్ తరహాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రైళ్లు, గంటకు గరిష్టంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. వీటిని మొదట వందే మెట్రో రైళ్లుగా పిలిచారు. అనంతరం నమో భారత్ ర్యాపిడ్ రైళ్లుగా పేరు మార్చారు. అహ్మదాబాద్–భుజ్ స్టేషన్ల మధ్య మొట్టమొదటి నమో భారత్ రైలు పట్టాలెక్కింది. గత సంవత్సరమే ఇవి మనకు అందుబాటులోకి వస్తాయని భావించినా వీలు కాలేదు. వచ్చే బడ్జెట్‌లో అయినా మనకు వీటిని కేటాయిస్తారని ప్రజలు ఆశపడుతున్నారు.

నమో భారత్ ర్యాపిడ్ రైళ్లను కనిష్టంగా 100 నుంచి గరిష్టంగా 250 కిలోమీటర్ల దూరం వరకు నడపాలని ప్రతిపాదించారు. హైదరాబాద్ నుంచి వరంగల్, భద్రాచలం, కర్నూల్, మహబూబ్‌నగర్, గజ్వేల్, వికారాబాద్, తాండూర్‌తోపాటు ప్రస్తుతం ఇంటర్ సిటీ రైళ్లు నడుస్తున్న సికింద్రాబాద్–విజయవాడ మధ్య కూడా ఈ రైళ్లను నడపాలనే ప్రతిపాదన ఉంది. గతంలో జరిగిన పార్లమెంట్ సభ్యుల సమావేశంలోనూ ఇంటర్ సిటీ రైళ్లుగా వీటిని ప్రవేశపెట్టాలని పలువురు ఎంపీలు కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్ నుంచి వివిధ జిల్లా కేంద్రాలకు, ముఖ్య పట్టణాలకు వీటిని నడపడం వల్ల ప్రజలు తక్కువ చార్జీలతో రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. కాజీపేట – సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య ఇంటర్ సిటీ లేదా మెము ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టాలని 12 సంవత్సరాల క్రితం ప్రతిపాదించినా ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం నమో భారత్‌ను ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌గా నడపాలనే డిమాండ్ ఉంది. సామాన్య, మధ్య తరగతివారికి ఉపయోగపడే తక్కువ దూరం నడిచే పుష్‌పుల్ మెము, ఇంటర్ సిటీ, నమో భారత్ ర్యాపిడ్, వందే సాధారణ్ (అమృత్ భారత్) ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. సికింద్రాబాద్–మనోహరాబాద్–కొత్తపల్లి రూట్లో రైల్వే సదుపాయం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి కొమురవెల్లికి వెళ్లే భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రస్తుతం ఎంఎంటీఎస్ వంటి లోకల్ రైళ్లు నడుస్తున్నట్లుగానే వందే మెట్రోలు రాకపోకలు సాగిస్తాయి. ఒక బోగీలో 100 మంది కూర్చొనే సదుపాయం ఉంటుంది. వీటిలో కనీసం 200 మంది నిలబడి ప్రయాణం చేయవచ్చు. ఆటోమెటిక్ డోర్ లాకింగ్ వ్యవస్థ ఉంటుంది. ప్రమాదాలను నివారించే కవచ్ సాంకేతికతతో వీటిని అనుసంధానం చేశారు. ప్రతి బోగీలో సీసీటీవీ నిఘా ఉంటుంది. ప్రయాణికులకు పూర్తి భద్రత లభిస్తుంది.

మార్చిలోగా అర్హులందరికీ..

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రవంచ గ్రామంలో రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల పథకాలను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.



చంద్రవంచలో జరిగిన సభకు హాజరైన ప్రజలు

మా కొడంగల్ బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు కావద్దా?

'కాంగ్రెస్ పాలనలో 2004–2014 వరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించాం. ఇందిరమ్మ ఇళ్లు అంటేనే వైఎస్సార్ గుర్తొస్తారు. రాష్ట్రవ్యాప్తంగా కొడంగల్ నియోజకవర్గంలోనే అత్యధికంగా 36 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే కేసీఆర్‌కు కడుపుమండి సీబీ సీఐడీ విచారణ చేయించారు. కేసీఆర్ చెప్పిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఏ ఊరిలోనైనా వచ్చాయా? పదేళ్ల కేసీఆర్ పాలనలో ఊరికో కోడి, ఇంటికో ఈక కూడా ఇవ్వలేదు. మేం రానున్న నాలుగేళ్లలో ఒక్క కొడంగల్ నియోజకవర్గంలోనే 15 నుంచి 20 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తాం. కొడంగల్‌లో పరిశ్రమలు పెడతామంటే కేసీఆర్ మనుషులు అడ్డుపడుతున్నారు. అధికారులపై దాడులు చేయించి చంపాలని చూస్తారా? మా కొడంగల్ బిడ్డలు ఎప్పటికీ బస్టాండుల్లో లుంగీలు కట్టుకుని ఖాళీగా ఉండాలా? డాక్టర్లు, ఇంజనీర్లు కావద్దా?..' అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

ప్రజాపాలనలో ఎవరైనా ప్రజల వద్దకే వస్తారు

'ప్రతి ఆరునెలలకు ఒకసారి గ్రామాలకు అధికారులు రావడం ఎప్పుడైనా చూశారా? కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో ఎప్పుడైనా గ్రామాలకు వచ్చారా? కానీ మా హయాంలో ఇప్పటివరకు మూడుసార్లు అధికారులు ప్రజల దగ్గరకు వచ్చారు. గతంలో ఫాంహౌస్, గడీలకే పరిమితమైన పాలనను మేం ప్రజల మధ్యకు తెచ్చాం. ప్రజాపాలనలో ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి అయినా సరే..ప్రజల వద్దకే వస్తారు..' అని రేవంత్ పేర్కొన్నారు.

ప్రతిపక్ష నేతగా బాధ్యత లేకపోతే పదవి ఎందుకు?

'గత 13 నెలల్లో ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఒక్కసారైనా శాసనసభకు వచ్చాడా? సర్పంచ్ కొన్నిరోజులు లేకపోతేనే ఊరు విడవమని అంటరు. అలాంటిది ఆయన్ను ఏమనాలి? ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యత లేదా? అలాంటప్పుడు ఆ పదవి ఎందుకు? అధికారం ఉంటే కొల్లగొడతారు కానీ ప్రతిపక్ష బాధ్యత వద్దు. కేసీఆర్ మేధావినని, 80 వేల పుస్తకాలు చదివానని చెప్తడు. కొడుకేమో అమెరికాలో చదువుకున్నా అంటడు. కానీ ప్రజలకు రేషన్‌కార్డులివ్వాలన్న జ్ఞానం లేదు. పదేళ్లలో ఒక్కరికీ రేషన్‌కార్డు ఇవ్వలేదు. ప్రాజెక్టులు పూర్తిచేయలేదు..'అని సీఎం విమర్శించారు.

మీలా దోచుకోవడంలో పోటీపడం

'కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు తిరుపతిరెడ్డి అన్న ఎప్పుడూ అండగా ఉంటడు. పదవి ఉన్నా లేకపోయినా ఏ ఇంట్లో ఇబ్బంది ఉన్నా చూసుకుంటడు. ఆయనకు ఏ పదవి ఉన్నదని కేటీఆర్ అంటున్నడు. మీ ఇంట్లో అందరూ పదవులు తీసుకున్నరు. మేం ఏ పదవీ తీసుకోకుండా ప్రజలకు సేవ చేస్తే తప్పు పడుతున్నరు. పదవులు తీసుకొని కుటుంబమంతా దోచుకోవడం తప్పా?.. ఏ పదవులూ తీసుకోకుండా సేవ చేయడం తప్పా?. మీలా దోచుకోవడంలో పోటీపడం. మీకు మాకు తేడా ఉంది. మాది దోచుకునే కుటుంబం కాదు..' అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

12,861 గ్రామసభలు, 3,487 వార్డు సభలు: సీఎస్

బడుగు, బలహీన వర్గాల కోసం ఒకే రోజున నాలుగు పథకాలను ప్రారంభించడం సంతోషకరమని సీఎస్ శాంతికుమారి అన్నారు. రాష్ట్రంలో 12,861 గ్రామసభలు, 3,487 వార్డు సభలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ కార్యదర్శి మాణిక్యరాజ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా మీ ఆశీర్వాదంతోనే..!

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం
- అన్ని వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం
- రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభల్లో సీఎం రేవంత్ వీడియో సందేశం



సాక్షి, హైదరాబాద్: నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయగలుగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రేవంత్ అన్నగా ప్రజలు ఆశీర్వదించడంతో ఏర్పడ్డ ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశం ఇచ్చారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలోని ఓ గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేయడంతో పాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభల్లో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ గ్రామ సభల్లో తొలుత సీఎం వీడియో సందేశం ప్రదర్శించారు.

మీ ఆశీర్వాదంతోనే సీఎంగా 13 నెలలు పూర్తిచేశా..

'మీ ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 13 నెలలు పూర్తి చేశా. రాష్ట్ర ప్రజలకిచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. రైతు భరోసా, నిరుద్యోగ సమస్య పరిష్కారం, వరికి బోనస్ లాంటి వాటితో పాటు మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తూ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. దళిత, గిరిజన ఆదివాసీలు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలు, నిరుపేదలు.. ఇలా అన్ని వర్గాలను ఆదుకోవాలన్న లక్ష్యంతో ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది..' అని సీఎం చెప్పారు.

ఆన్‌లైన్‌లోనే యాజమాన్య కోటా భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

ఫీజులే తీసుకోవాలి. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. కానీ చాలా కాలేజీలు బీ కేటగిరీ సీట్ల భర్తీలో నిబంధనలు పాటించడం లేదు. అధిక ఫీజు చెల్లించినవారికే సీట్లు ఇస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. రాష్ట్రంలో 58 శాతం సీట్లు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లోనే ఉండటంతో, ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఒక్కో సీటుకు రూ.6 నుంచి రూ.18 లక్షల వరకు అనధికారికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీన్ని నియంత్రించాలని ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి నేతృత్వంలో కమిటీ వేసింది. ఆన్‌లైన్ విధానంలో ఈ సీట్ల భర్తీని చేపట్టాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఆ కమిటీ నిర్ణయించింది. సీ కేటగిరీ సీట్లను ప్రవాస భారతీయుల పిల్లలకు ఇస్తారు. ఈ కేటగిరీలో విద్యార్థులు లేకపోతే కాలేజీలు ఇష్టానుసారం అమ్ముకుంటున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ రెండు కేటగిరీలపై నియంత్రణ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కాలేజీల తనిఖీలకు రంగం సిద్ధం

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ప్రక్రియ వచ్చే వారం మొదలవ్వబోతోంది. వివిధ బ్రాంచీలకు తగ్గట్టు మౌలిక వసతులు ఉన్నాయా? అధ్యాపకులు ఏమేర ఉన్నారనే అంశాలను పరిశీలిస్తారు. ఇవన్నీ సక్రమంగా ఉంటేనే ఈసారి అఫిలియేషన్ ఇస్తామని విశ్వవిద్యాలయాల వీసీలు చెబుతున్నారు. ముఖ్యంగా సీఎస్‌సీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సుల విషయంలో ప్రత్యేకంగా తనిఖీలు చేయాలని నిర్ణయించారు. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో ముగ్గురు నిపుణుల చొప్పున ఒక్కో తనిఖీ కమిటీ వేసి కాలేజీల్లో వసతులు పరిశీలించనున్నారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలు వచ్చేలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు.

నాలుగు పథకాలకు ఏటా రూ.45 వేల కోట్లు



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నగోపతిలో జిల్లా స్వరూపకు రైతు భరోసా మంజూరు పత్రం అందజేసి ఆశీర్వదిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- బీఆర్ఎస్ గత పదేళ్లలో చేసి ఉంటే.. మాకు పని ఉండేదే కాదు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతుభరోసా పథకాలకు ఏటా రూ.45 వేల కోట్లు వెచ్చిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖర్చుకు వెరవకుండా సంక్షేమ పథకాల అమలులో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నగోపతిలో ఆదివారం ఆయన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. ఇటీవల గ్రామసభల్లో లక్షలాది దరఖాస్తులు అందగా, వాటిని క్రోడీకరించి ప్రతీ నిరుపేదకు లబ్ధి జరగాలనే లక్ష్యంగా రాష్ట్రంలోని 66 మండలాల్లో ఒక్కో గ్రామంలో లాంఛనంగా పథకాలు ప్రారంభించామని తెలిపారు. దీనిపై బురదజల్లే యత్నం చేస్తూ 'ఎక్స్'లో పోస్టులు పెట్టిన మాజీమంత్రి కేటీఆర్ సంక్షేమ పథకాల ప్రవాహంలో కొట్టుకుపోవడం ఖాయమని చెప్పారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే.. ఇప్పుడు త మకు పని ఉండేది కాదని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతీ నిరుపేదకు గూడు కల్పించే వరకు పథకం కొనసాగుతుందని, రాబోయే ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు ఇస్తామని భట్టి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఆల్ ఇండియా హార్టికల్చర్ మేళా

150 స్టాళ్ల ఏర్పాటు, 5 రోజులపాటు నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తులతో కూడిన 16వ గ్రాండ్ నర్సరీ మేళా ఈనెల 30న హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ మేరకు గ్రాండ్ నర్సరీ మేళా బ్రోచర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఉద్యానవన శాఖ సంచాలకుడు యాస్మిన్ బాషా ఆవిష్కరించారు. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అఖిల భారత ఉద్యానవన మేళా జరగనుందని.. మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ తెలిపారు. మేళాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా ప్రారంభిస్తారు. టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్ వంటి కొత్త పద్ధతులను మేళాలో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మేళాలో ప్రదర్శనలు ఉంటాయి. ఏపీ, కోల్‌కతా, ఢిల్లీ, హరియాణా, ముంబై, బెంగళూరు, పుణె, షిర్డీ, కడియం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మెడిసినల్, కిచెన్, అవుట్ డోర్, బల్బ్స్, సీడ్స్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్‌ను ప్రదర్శిస్తామని ఖలీద్ అహ్మద్ వివరించారు.

వడివడిగా 'భూభారతి'

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ భూముల క్రయవిక్రయ లావాదేవీలు జరుగుతాయని ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి.

మాతో చర్చించి నిర్ణయం తీసుకోండి: వీఆర్వోల జేఏసీ

గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా గతంలో గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో)గా పనిచేసిన తమను షరతుల్లేకుండా మళ్లీ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకోవాలని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గతంలో పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని పరీక్షలు పెట్టకుండా సర్వీస్‌కు భద్రత కల్పిస్తూ నియమించాలని జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్‌రావు, అదనపు సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేశ్, వైస్‌చైర్మన్లు చింతల మురళి, ప్రతిభలు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. హైకోర్టులో ఉన్న కేసులను పరిష్కరించకుండా, తమతో చర్చలు జరపకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తగదని వారు ప్రభుత్వానికి సూచించారు.

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలకు అదనంగా ఇళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హసన్‌పర్తి: ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో అదనంగా ఇళ్లు మంజూరు చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా స్పందించారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో ఆదివారం నాలుగు సంక్షేమ పథకాలను మంత్రి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలోనే సంక్షేమ పథకాలు తెరపైకి తీసుకొచ్చిందని, కాంగ్రెస్ సర్కారు అలా కాకుండా ఎన్నికలు ఉన్నా.. లేకున్నా పథకాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. జాబితాలో పేర్లు లేవని ఆందోళనకు గురికావొద్దని, ఇళ్లు, రేషన్‌కార్డులు అర్హులందరికీ వస్తాయని, బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతుబంధు పేరిట పింకీలు(గులాబీ పార్టీ నాయకులు) ప్రభుత్వ నిధులు స్వాహా చేశారని, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములకు రైతుబంధు తీసుకున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, 'కుడా'చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ రామకృష్ణారావు, కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా నోడల్ ఆఫీసర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీ ఇంట్లోంచి ఇస్తున్నావా..?

- బండి సంజయ్‌పై పొన్నం ప్రభాకర్ ఫైర్
- కాంగ్రెస్ సంక్షేమం కేటీఆర్‌కు జీర్ణం కావడం లేదు: పొన్నం



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్లకు నిధులు ఇవ్వబోమన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. ఇందిరమ్మ ఇళ్లకు బండి సంజయ్ ఇంట్లోంచి డబ్బులిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ గురించి అవహేళనగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. ఇందిరమ్మ పేరు పెడితే ఎలా డబ్బులివ్వరో తామూ చూస్తామని చెప్పారు. ఇందిరమ్మను వాజ్‌పేయి కాళీమాతతో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. దీన్‌దయాళ్ అంత్యోదయ, దీన్‌దయాళ్ గృహజ్యోతి లాంటి పథకాల పేర్లు ఎలా పెట్టారని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా ఉపయోగం లేదని ఒక్క రూపాయి కూడా తేలేదన్నారు. మాజీమంత్రి కేటీఆర్ అసహనం పరాకాష్టకు చేరిందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా తాము సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని, కానీ కేటీఆర్‌కు కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలు జీర్ణం కావడం లేదని, అందుకే ఈనో ప్యాకెట్లు పంపిస్తున్నామని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల అమలు గురించి ఏ ఊరికి వెళ్లాలో కేటీఆరే నిర్ణయించుకోవాలని, ఒక్క అర్హుడికైనా అన్యాయం జరిగిందో లేదో తేలుద్దామని పొన్నం సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ఒకే రోజు ప్రారంభించిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన సంబురాల్లో ఫిషర్‌మెన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, సలీం, లింగంయాదవ్ పాల్గొన్నారు.

అప్పుడు అందరికీ అన్నీ... ఇప్పుడు కొందరికే కొన్ని

భట్టి గారూ.. ఒక గ్రామానికే హామీలిచ్చారా?: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలప్పుడు ప్రతి ఇంటా అబద్ధపు హామీలతో ఊదరగొట్టి 'వన్ ఇయర్'తరువాత 'వన్ విలేజ్'అనడం ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రతిపక్షంగా ఇంకో నాలుగేళ్లు ఓపిక పట్టడానికి తాము సిద్ధం కానీ, ఏడాది కాంగ్రెస్ పాలన చూసిన తరువాత ఆగడానికి ప్రజలు మాత్రం సిద్ధంగా లేరని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఉద్దేశించి ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రజలకు అమలు చేస్తానన్న నాలుగు సంక్షేమ పథకాలను మండలానికి ఒక గ్రామానికే పరిమితం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పథకాలు రాని గ్రామాల్లో సోమవారం నుంచి రణరంగమే ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ మేనిఫెస్టో, ఆరు గ్యారంటీలు మండలానికి ఒక గ్రామంలోనే ఇచ్చారా అని ఎద్దేవా చేశారు.

సత్యనారాయణ మృతి విచారకరం

మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ మృతి పట్ల కేటీఆర్ తన సంతాపాన్ని ప్రకటించారు. సీనియర్ జర్నలిస్టుగా, ఉద్యమకారునిగా తెలంగాణ ఉద్యమంలో సత్యనారాయణ చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కురుమూర్తి ఆలయానికి తడిబట్టలతో వస్తా..

- నువ్వూ వస్తావా?: సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్
- పాలమూరు ప్రాజెక్టులు, సాగునీరుపై సీఎం చెప్పేవి అబద్ధాలని ధ్వజం



గజ్వేల్: 'పాలమూరు ప్రాజెక్టులను బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని.. సాగు నీరు ఇవ్వలేదని అబద్ధాలు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ సమీపంలో ఉన్న కురుమూర్తి ఆలయానికి వచ్చి ఈ విషయాన్ని చెప్పగలరా? నేను తడి బట్టలతో వస్తా.. రావడానికి నీవు సిద్ధమా?'అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గం అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్టులను తమ ప్రభుత్వ హయాంలో రూ.4వేల కోట్లతో పూర్తి చేసి 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాను మోసం చేసింది కాంగ్రెస్, టీడీపీలేనని ఆయన ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీని వంద శాతం పూర్తి చేశామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మొత్తంగా రూ.31 వేల కోట్లు ఇవ్వాల్సింది, కేవలం రూ.21 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 26 జనవరి రోజున రాష్ట్రంలోని పేదలందరికీ పూర్తిస్థాయిలో ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా అందిస్తామని చెప్పి.. కొన్ని గ్రామాల్లో అతికొద్ది మందికి మాత్రమే అందించారని విమర్శించారు. 'నా తమ్ముడు చాలా గొప్పోడు అని చెబుతున్నవ్, కలెక్టర్‌తో నీ తమ్ముడు సెల్యూట్ కొట్టించుకోవడం సమంజసమేనా?'అని నిలదీశారు. ఈ సభలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకం

మంద కృష్ణ మాదిగ



కాచిగూడ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణను మొదట తెలంగాణలోనే అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు అమలు చేయలేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. తెలంగాణ ఎరుకల ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మంద కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7వ తేదీన ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్న 'లక్ష డప్పులు –వెయ్యి గొంతుకలు'కార్యక్రమానికి తెలంగాణ ఎరుకల ఆదివాసీ సంఘం మద్దతు ప్రకటించింది. అనంతరం మంద కృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు వ్యతిరేకమని, మాల సామాజికవర్గం పార్టీలో బలంగా ఉండటంతో వారు అడ్డుపడుతున్నారని ఆయన అన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి వర్గీకరణే మార్గమని, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరిగితే ఎస్టీలకు కూడా వర్గీకరణ సులభతరం అవుతుందన్నారు. కాగా, ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మంద కృష్ణను బీజేపీ నేతలు, కంటోన్మెంట్ నేత వంశ తిలక్ నేతృత్వంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.



ఉత్సాహవంతులకే ఈ ప్రపంచం చెందుతుంది.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 27 జనవరి 2025

ఇంగితం సంగతేంటి?

ఇంగితజ్ఞానం ఇంగితజ్ఞానమే, చదువులు చదువులే! చదువు పరమావధి జ్ఞానమే అయినా, చదువుకున్న వారందరూ జ్ఞానులు కాలేరు. అత్యంత దురదృష్టకరమైన విషయమేమిటంటే, చదువుకున్న వారిలో కొందరు కనీసం ఇంగితజ్ఞానులు కూడా కాలేరు. విపరీతంగా చదువుకుని, బహు పట్టభద్రులై, పాఠాలు బోధించే స్థాయిలో ఉన్నా, ఇలాంటివారు ఎప్పటికప్పుడు తమ ఇంగితజ్ఞాన రాహిత్యాన్ని బయటపెట్టుకుంటూ జనాలను విభ్రాంతికి గురిచేస్తుంటారు. 'విద్యలేనివాడు వింత పశువు' అంటూ నిరక్షరాస్యులను ఎద్దేవా చేసే పెద్దలు – అతి విద్యావంతులైన ఇంగితజ్ఞాన రహితులను ఏమంటారో!

'చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా/ చదువు నిరర్థకమ్ము గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్/ బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం/ పొదవెడు నుప్పు లేక రుచి బుట్టగ నేర్చునటయ్య భాస్కరా!' అని శతకకారుడు వాపోయాడు. రసజ్ఞత లేని చదువును ఉప్పులేని కూరతో పోల్చాడు. బహుశా, ఎంత చదువు చదువుకున్నా, కాస్తంతైనా ఇంగితజ్ఞానం లేనివారు ఆయనకు తారసపడి ఉండరు. అలాంటి అతి చదువరులే తారసపడితే ఆయన ఇంకెంతలా వాపోయేవాడో!

ఈ రోజుల్లో చదువుకున్న వాళ్లలో రసజ్ఞత సంగతి దేవుడెరుగు, ఇంగితజ్ఞానం కూడా కొరవడుతోందంటే, మన చదువులు ఎలా అఘోరిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. అసలు మన చదువులు ఇలా ఎందుకు అఘోరిస్తున్నాయో, అందుకు గల కారణాలను అన్వేషించే వాళ్లు బహు అరుదు. 'చాలామందికి, పిల్లల్ని చదువంటే బెదరగొట్టడం చాతనయినంత బాగా వాళ్లకి చదువు మీద ఇష్టం కలిగించడం చాతకాదు' అంటారు కొడవటిగంటి కుటుంబరావు. 'చదువు' నవలలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయం ఇది. బెదరగొట్టి మరీ పిల్లలకు చదువు చెప్పే బడిపంతుళ్ల ధోరణి కూడా చదువుకున్న వాళ్లలో ఇంగితజ్ఞాన లోపానికి ఒక కీలక కారణం. బెదరగొట్టి పిల్లలకు చదువు చెప్పే దండోపాయ నిపుణులు పురాణకాలం నుంచే ఉన్నారు. ప్రహ్లాదుడికి చదువు చెప్పిన చండామార్కుల వారసత్వాన్ని కొందరు నేటికీ కొనసాగిస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో చండామార్కుల వారసులకే గిరాకీ ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి గురువులు పిల్లల బుర్రల్లోకి పాఠాలనైతే ఎక్కించగలరేమో గాని, చిటికెడు ఇంగితజ్ఞానాన్ని మాత్రం అలవరచలేరు.

'ఇంగితజ్ఞానం మరీ అంత సర్వసాధారణమైనది కాదు' అంటాడు ఫ్రెంచ్ తత్త్వవేత్త వోల్టేర్. ఇంగితజ్ఞానాన్ని ఇంగ్లిష్‌లో 'కామన్‌సెన్స్' అంటారు. అలాగని, ఇది మనుషులందరికీ ఉండే లక్షణమని అనుకుంటే పొరపాటే! 'మనుషులందరిలోనూ ఇంగితజ్ఞానం ఉందనే నమ్మకంతో కొన్నిసార్లు మనం ప్రమాదంలో పడుతుంటాం' అన్నాడు ఐరిష్ సంగీతకారుడు హోజీర్.

ఒకప్పుడు సమాజంలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండేవారు. ఇప్పుడు అక్షరాస్యులు బాగా పెరిగారు. అక్షరాస్యత పెరిగితే, జనాల్లో బుద్ధి జ్ఞానాలు, తెలివితేటలు పెరగడం సర్వసహజ పరిణామమనేది ఒక అమాయకపు అంచనా. సమాజంలో అక్షరాస్యత పెరిగింది, నిజమే! తత్ఫలితంగా మూర్ఖత్వం తగ్గిందనుకుంటే పొరపాటే! 'చదవేస్తే ఉన్న మతి పోయింద'నే నానుడి ఉంది. ఇప్పటి చదువులను చూస్తే, పరిస్థితి అలాగే ఉందనిపిస్తుంది. ఈ చదువులతో కొందరిలో ఇంగితజ్ఞానం లోపిస్తుంటే, ఇంకొందరిలో చావుతెలివి పెచ్చుమీరుతోంది. బొటాబొటి చదువుల సైబర్ నేరగాళ్ల చేతిలో ఉన్నత విద్యావంతులు సైతం బోల్తాపడుతున్న ఉదంతాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఒకవైపు శాస్త్రవేత్తలు కృత్రిమ మేధతో కుస్తీలు పడుతున్న రోజులు వచ్చిపడ్డాయి గాని, మనుషుల్లో ఇంగితాన్ని పెంచే చదువులే కరవవుతున్నాయి. 'నడవడికను చక్కబరచడానికి ఉత్త పాఠ్య పుస్తకాల చదువు చాలదు' అని గాంధీజీ చెప్పిన మాటలను నేటి కార్పొరేట్ విద్యావ్యవస్థ పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. గాంధీజీ 'హింద్ స్వరాజ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'పాఠ్యపుస్తకాల విద్య మానవుల నైతికోన్నతికి ఇంచుకైనా సహకరించదని; చదువు వేరు, సద్గుణం వేరని స్వానుభవంతో తెలుసుకున్నాను' అన్నారు. ఆయన దేశానికి స్వాతంత్య్రం రాకముందు చెప్పిన మాటలివి. ఇప్పటికీ మన చదువులు పూర్తిస్థాయిలో చక్కబడకపోవడం విచారకరం.

చదువులు చెప్పడానికి ఎన్నో బడులు ఉన్నాయి, కళాశాలలు ఉన్నాయి, విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ప్రత్యేక నైపుణ్యాలకు సంబంధించిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నాయి. పుట్టల నుంచి చీమలు పుట్టుకొచ్చినట్లు వీటి నుంచి ఏటా పట్టభద్రులు పుట్టుకొస్తున్నారు. వాళ్లలో చాలామంది సమాజంలో మేధావులుగా చలామణీ అవుతున్నారు. అంతమాత్రాన, వాళ్లంతా ఇంగితజ్ఞాన సంపన్నులనుకోవడానికి ఆస్కారం లేదు. 'మీ డిగ్రీ ఒక కాగితం ముక్క మాత్రమే. మీ చదువేమిటో మీ ప్రవర్తనలోను, ఆలోచనా ధోరణిలోను, సౌశీల్యంలోను ప్రతిఫలిస్తుంది' అన్నాడు అమెరికా మూడో అధ్యక్షుడు థామస్ జెఫర్‌సన్. ప్రవర్తనను, ఆలోచనా ధోరణిని మార్చలేని డిగ్రీలు ఉత్త కాగితం ముక్కలు మాత్రమే! 'కొన్ని ఆలోచనలు చాలా మూర్ఖంగా ఉంటాయి. వాటిని మేధావులు మాత్రమే నమ్ముతారు' అని ఇంగ్లిష్ రచయిత జార్జ్ ఆర్వెల్ అన్నాడు. గోమూత్రపానంతో జ్వరాలు తగ్గుతాయని ఇటీవల ఐఐటీ–మద్రాసు డైరెక్టర్ మహాశయుడు సెలవిచ్చారు. ఆయనను బహుశా మేధావులే నమ్ముతారు కాబోలు!

ఆత్మీయతను పంచిన బర్మా హౌజ్!

కామెంట్



కరణ్ థాపర్

దేశ రాజకీయాలను అనుసరించేవాళ్లకు న్యూఢిల్లీలోని '24, అక్బర్ రోడ్' అనగానే అది కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం అని గుర్తొస్తుంది. అయితే దాదాపు ఐదు దశాబ్దాల పాటు అక్కడ కార్యకలాపాలు నెరిపిన అనంతరం ఆ పార్టీ అక్కడినుంచి కొత్త చిరునామాకు మారడంతో ఇది వార్తల్లో నిలిచింది. కానీ దానికంటే ముందు ఆ చిరునామాను 'బర్మా హౌజ్' అనేవారని చాలామందికి తెలియదు. అప్పుడు అది భారత్‌లో బర్మా (మయన్మార్) రాయబారి ఇల్లుగా ఉండేది. ఆమె భర్త సాక్షాత్తూ బర్మా జాతిపిత; ఆమె కూతురు తర్వాత్తర్వాత ఆ దేశ గొప్ప నాయకురాలిగా ఎదిగిన ఆంగ్ సాన్ సూ కీ. అందుకే ఆ ఇంట్లో బర్మా వాతావరణం, వాళ్ల ఆత్మీయతలు వెల్లివిరిసేవి.

న్యూఢిల్లీలోని '24, అక్బర్ రోడ్' చిరునామా గురించి మీకు తెలుసా? సుమారుగా యాభై ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఇక్కడే ఉండేది. ఈ మధ్యే మారిపోయిందనుకోండి! అంతకంటే ముందు దీని పేరు 'బర్మా హౌజ్'. బర్మా (తర్వాత మయన్మార్‌గా పేరు మారింది) దేశపు రాయబారి నివాస స్థానం అది. '24, అక్బర్ రోడ్' కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం కాక మునుపు ఈ ఇంట్లో 'డా ఖిన్ కీ' ఉండేవారు. ఆమె బర్మా స్వాతంత్య్ర సమర యోధుడు ఆంగ్ సాన్ (బర్మా జాతిపితగా పిలుస్తారు) పత్ని. భర్త హత్యకు గురైన తరువాత ఆ దేశపు మంత్రిగానూ ఆమె పనిచేశారు. 1960లో ఇండియాకు బర్మా రాయబారిగా నియమితులయ్యారు. ఢిల్లీకి వచ్చి, ఏడేళ్ల పాటు '24, అక్బర్ రోడ్'లో నివసించారు.

డా ఖిన్ కీ నా తల్లిదండ్రులకు స్నేహితురాలైతే... ఆమె కూతురు ఆంగ్ సాన్ సూ కీ (మయన్మార్ ప్రతిపక్ష నేత; నోబెల్ శాంతి బహుమతి గ్రహీత) మా అక్క కిరణ్‌కు ఫ్రెండ్. లేడీ శ్రీరామ్ కాలేజీలో ఆంగ్ సాన్ సూ కీ, కిరణ్ కలిసి చదువుకున్నారు. 1964లో మా అమ్మ, నాన్న ఇద్దరూ ఉద్యోగ రీత్యా కాబూల్(అఫ్గానిస్తాన్ రాజధాని)కి వెళ్లాల్సి వచ్చినప్పుడు, తన చివరి ఏడాది చదువు ఇంకా మిగిలి ఉండటంతో కిరణ్ ఆరు నెలల పాటు '24, అక్బర్ రోడ్'లో ఉండింది.

డా ఖిన్ కీ పెద్ద పొడగరి ఏమీ కాదు. పైగా కొంచెం లావుగా ఉండేది. బర్మీస్ మహిళల్లో అధికుల మాదిరి లుంగీ కట్టుకునేది. వెంట్రుకలన్నీ పూలతో అలంకరించిన బన్‌లో ఒద్దికగా ఇమిడిపోయేవి. ఆమె ముఖంలో ఒక రకమైన దయ వ్యక్తమయ్యేది. ఎల్లప్పుడూ చిరునవ్వుతో కళకళలాడే మోము. మృదుభాషి!

మొదటిసారి ఆమెను కలిసినప్పుడు నాకు ఆరేళ్లు ఉంటాయేమో! కొడుకు దగ్గర లేని కారణంగా ఆమె నన్ను తల్లిలా చూసుకునేది. డైనింగ్ రూమ్‌లో బోలెడంత 'ఖో సూయి' (చికెన్ నూడుల్స్) తినడం ఇప్పటికీ గుర్తుంది. అయితే నా ఫేవరెట్ మాత్రం 'బ్లాక్ రైస్ పుడ్డింగ్'. బర్మీస్ ఇళ్లల్లో దీన్ని బాగా చేస్తారు. మిగతావాళ్ల మాటేమో కానీ నాకు మాత్రం చాలా ఇష్టమీ వంటకం. పిసరంత వదలకుండా తినే వాడినేమో... మిగిలిన వాళ్లు రుచి చూసేందుకు కూడా ఉండేది కాదనుకుంటా! అప్పట్లో చాలా బొద్దుగా ఉండేవాడిని. అందుకే సూ కీ నన్ను 'రోలీ – పోలీ' అని ఆటపట్టిస్తూండేది.

చాలామంది దౌత్యవేత్తల మాదిరిగానే బర్మా రాయబారికి మెర్సిడెస్ కారు ఉండేది. వాళ్ల డ్రైవర్ పేరు 'విల్సన్'. వారాంతాల్లో కుతుబ్ మీనార్ దాటుకుని అవతల ఉండే బౌద్ధారామాలకు ఆమె వెళ్లేది. అక్కడి భిక్షువులకు ఆహారం అందించేది. చాలాసార్లు నేనూ ఆమెతో వెళ్లేవాడిని. ఎప్పుడు మళ్లీ '24, అక్బర్ రోడ్'కు వస్తామా అని ఎదురుచూసేవాడిని. ఎందుకంటే... తిరిగి వచ్చిన తరువాతే భోజనాల వడ్డన జరిగేది.





ఆంగ్ సాన్, డా ఖిన్ కీ



ఆంగ్ సాన్ సూ కీ

ఆంగ్ సాన్ సూ కీ సుమారు ఏడేళ్లు భారత్‌లో ఉంది. ముందు జీసస్ అండ్ మేరీ కాన్వెంట్‌లో, ఆ తరువాత లేడీ శ్రీరామ్ కాలేజీలో చదివింది. యుక్త వయసులో ఉండగానే రాజకీయాల్లో చేరాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఎప్పటికైనా ఉన్నత స్థానానికి చేరుకోగలనన్న నమ్మకం కూడా తనలో ఉండేది. సుమారు 18 ఏళ్ల వయసు ఉండేదేమో అప్పుడు. ఒకరోజు కిరణ్ పెన్సిల్ డ్రాయింగ్ గీసింది. దాని కింద, 'కిరణ్ థాపర్ ఎప్పుడు కావాలంటే అప్పుడు బర్మా రావొచ్చు'అని రాసింది.

దశాబ్దాల తరువాత నేను 'డా ఖిన్ కీ'ని లండన్‌లో కలిశాను. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో కూతురు ఆంగ్ సాన్ సూ కీతో కలిసి నివసిస్తూండేది. అప్పుడామె వయస్సు ఎనభైల్లో ఉంది. నేను ముప్పైలలో ఉన్నాను. నన్ను చూడగానే... అనారోగ్యం, తన వయసు ఏదీ గుర్తు రాలేదు. బోసినవ్వుతో భళ్లున నవ్వుతూ, 'వీడు సన్నబడ్డాడు' అంది. కళ్లు మిలమిలా మెరుస్తున్నాయి. నవ్వుతో ముఖమంతా నిండిపోయింది. ''ఇంత సన్నబడతాడని అనుకోనే లేదు'' అంది. ''ఖో–సూయి అంటే ఇప్పటికీ బాగా ఇష్టమట. వచ్చినప్పుడల్లా కావాలని అడుగుతూంటాడు'' అని చెప్పింది ఆంగ్ సాన్ సూ కీ. ఆక్స్‌ఫర్డ్‌లో ఉండగా సూ కీ ఎప్పుడూ బ్లాక్ రైస్ పుడ్డింగ్ చేసేది కాదు. అందుకేనేమో... నాకు అది ఎలా ఉంటుందో లీలగా గుర్తుంది కానీ, రుచి ఎలా ఉంటుందన్నది మాత్రం గుర్తు లేకుండా పోయింది. కొబ్బరి తురుముతో కప్పిన నల్ల బియ్యంతో చేసే తీపి పదార్థం అది.

నేను మళ్లీ 2015లో రంగూన్‌లో ఆంగ్ సాన్ సూ కీని కలిశాను. '24, అక్బర్ రోడ్' నాటి ఆప్యాయత ఏమాత్రం తగ్గలేదని చూడగానే అర్థమైంది. ''నా మరో ఇంటికి స్వాగతం. 24, అక్బర్ రోడ్ గురించి నీకు తెలుసు కదా... ఇది అమ్మ మరో ఇల్లు'' అంది. ఢిల్లీ ఇంట్లో ఓ భారీ పియానో ఉండేది. సూ కీ పియానో వాయించేది కూడా!

గత వారం '24, అక్బర్ రోడ్'కు సంబంధించి పత్రికలు బోలెడన్ని వార్తలు రాశాయి. అప్పుడే నాకూ గుర్తుకొచ్చింది... ఆ ఇంటి గురించి నాకు ముందే తెలుసు అని! రాజకీయ పార్టీ కేంద్రం కాక మునుపు ఆ ఇంటి పొడవాటి నడవాలో ప్రేమ, ఆప్యాయతలు అల్లుకునిపోయి ఉండేవి. అది లూట్యెన్స్ ఢిల్లీలో భాగమని అస్సలు అనిపించేది కాదు. అది 'డా ఖిన్ కీ' ఇల్లు అన్నది మాత్రమే నాకు లెక్క. ఎప్పుడైనా వెళ్లగలిగే... ప్రేమ ఆప్యాయతలు అందుకోగల ఇల్లు!

డా ఖిన్ కీ, ఆంగ్ సాన్ సూ కీ భారత్‌లో గడిపిన రోజులు చాలా ప్రత్యేకమని చెప్పాలి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోనూ సూ కీ తరచూ ఆ రోజులను గుర్తు చేసుకునేది. దీన్ని బట్టే వాళ్లు '24, అక్బర్ రోడ్'లో చాలా సంతోషంగా ఉండేవారు అనిపించేది. ఆ భవనం గోడలిప్పుడు మాట్లాడగలిగితే ఆ రోజుల ఊసులు ఇంకెన్ని చెప్పేవో... ప్చ్!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

ఎప్పటి కాలం?



అమెరికాకు స్వర్ణ యుగం తిరిగి రావాలని నేనూ కోరుకుంటాను. కానీ ట్రంప్ బృందం ఈ మాట అంటున్నప్పుడు మరింత నిర్దిష్టంగా ఉండాలని ఆశిస్తాను. ఏది ఆ స్వర్ణయుగం కాలం? 1950లా? పౌర హక్కుల ఉద్యమానికి ముందా? పౌర యుద్ధానికి ముందా?

– గ్యారీ కాస్పరోవ్, చదరంగ దిగ్గజం

అయినా హీరో!



నేతాజీ జపాన్ ఫాసిజం, జర్మనీ నాజిజంతో జట్టు కట్టాడని ఒక విదేశీ మేధావి విమర్శ. నేతాజీని కమ్యూనిస్టులు, లౌకికవాదులు, హిందుత్వవాదులు సహా అందరూ హీరోగా పరిగణిస్తారు. చర్చిల్ ఇండియాకు సంబంధించి హిట్లర్ లాంటివాడే (బెంగాల్ క్షామానికి కారకుడు). అయినా ఆ చరిత్రను విస్మరించి, నాజీల మీద చర్చిల్ విజయాన్ని బ్రిటన్ ఉత్సవం జరుపుకొంటుంది. అలాగే హిట్లర్‌తో సంబంధం ఉన్నప్పటికీ నేతాజీని భారతీయులు ఆరాధిస్తారు.

– హార్దిక్ రాజ్‌గోర్, సినిమా రచయిత

నిజమైన తేడా



కృత్రిమ సూర్యుడి (అణు రియాక్టర్) మీద చైనా ప్రయోగాలు చేస్తుంటే, భారత్ కుంభమేళా నిర్వహిస్తోందనడం తప్పుడు పోలిక. అవినీతిపరులను ఆ దేశం శిక్షిస్తుంటే, మనం పదోన్నతులు కల్పిస్తున్నాం. ఇదే అసలైన తేడా. మిగిలినదంతా రాజకీయ అభినయం.

– అమిత్ శాండీలియా, కాలమిస్ట్

ఆశల్లేవు!



ఈసారి కేంద్ర బడ్జెట్ నుంచి అతి తక్కువ అంచనాలు ఉన్నాయి. ఇంత తక్కువ అంచనాలు ఉండటం ఇంతకు ముందు ఎప్పుడూ నేను చూడలేదు.

– చందర్ భాటియా, ఇన్వెస్టర్

అసలైన సంతోషం



మానసిక ఆరోగ్యం అంటే ఎల్లవేళలా సంతోషంగా ఉండటం కాదు. మీ పరిసరాలకు తగిన ఉద్వేగాలను అనుభవించడం!

– ఆడమ్ గ్రాంట్, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

ఇన్ బాక్స్

అన్నంత పనీ చేస్తూ...

అమెరికా అధ్యక్ష బాధ్యత స్వీకరిస్తూ తొలినాడే ట్రంప్ 26 కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. ఇవి సమాఖ్య ప్రభుత్వ నిర్వహణకు అధ్యక్షుని ఆదేశాలు. రాజ్యాంగంలోని 2వ అధికరణ అధ్యక్షునికి ఈ అధికారమిచ్చింది. ఈ ఆదేశాలకు చట్టసభ (కాంగ్రెస్) ఆమోదం అక్కర్లేదు. వీటికి అవసరమైన



నిధుల కోతలు వంటి చర్యల ద్వారా కాంగ్రెస్ వీటిని అడ్డుకోవచ్చు. రాజ్యాంగ విరుద్ధాలని తేలితే రద్దు చేయవచ్చు. నిజానికి ఈ ఆదేశాల్లో అత్యధికం రాజ్యాంగ విరుద్ధమైనవీ, అధికార దుర్వినియోగానికి దారితీసేవే.

రాజ్యాంగ 14వ సవరణ సెక్షన్ 1 అమెరికాలో పుట్టిన వారందరికీ పౌరసత్వ హక్కునిచ్చింది. కోర్టు ఈ ట్రంప్ ఆదేశాన్ని తిరస్కరించవచ్చు. దేశ భద్రత సాకుతో అమెరికా–మెక్సికో సరిహద్దుల్లోకి సైన్యాన్ని పంపడానికి, సైనిక నిధుల మళ్లింపునకు, 2017లో ఈ సరిహద్దుల్లో మొదలుపెట్టిన గోడ నిర్మాణాన్ని పూర్తిచేయడానికి దక్షిణ సరిహద్దుల్లో జాతీయ అత్యవసరస్థితి విధించే ఆదేశం జారీచేశారు ట్రంప్. ఈ ఆదేశం అధ్యక్షునికి నిరంకుశ అధికారాలను కట్టబెట్టే రాజ్యాంగ విరుద్ధ చర్య. అలాగే జాతీయ ఇంధన అత్యవసర స్థితిని ప్రకటించడం... సౌర, వాయు ఇంధన పథకాలను ఆపే ఎత్తుగడ. దక్షిణ అమెరికా మత్తుపదార్థాల వ్యాపార వేదికలపై ఉగ్రవాద సంస్థలుగా ముద్రవేయడం ద్వారా మెక్సికోలో చొరబాటుకు వీలు చేసుకుంటున్నారు ట్రంప్. పనామా కాలువపై తిరిగి ఆధిపత్యం నెలకొల్పుకుంటామనడమూ ఉద్రిక్తతలు పెంచే నిర్ణయమే!

ట్రంప్ 2020 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిన తర్వాత తన అనుచరులను కేపిటల్ హిల్‌పై దాడికి పురమాయించడం, దాడిలో పాల్గొన్న వారికి శిక్షలు పడటం తెలిసిందే. ఈ నేరంపై శిక్ష అనుభవిస్తున్న 1,500 మందితోపాటు 700 మంది ఇతర నేరస్థులకు ట్రంప్ క్షమాభిక్ష పెట్టారు. ఇది అనైతికం. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' నుండి, 'ప్యారిస్ పర్యావరణ కాలుష్య నియంత్రణ ఒప్పందం' నుండి అమెరికా వైదొలగుతున్నట్లు ప్రకటించడం ఆయన బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. అంతర్జాతీయ మెక్సికో గల్ఫ్‌ను 'అమెరికా గల్ఫ్'గా మార్చారు. అంతర్జాతీయ జలాశయాల పేర్లను అమెరికా చట్టాలు మార్చలేవు. 'తొలిరోజే నియంతనవుతా'నని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించిన ట్రంప్ అన్నంత పనీ చేశారు. ఇప్పుడు శ్రామిక, పౌరహక్కుల, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ట్రంప్ వ్యతిరేక సమ్మెకూ; దాదాపు 200 సంస్థలు న్యాయపోరాటానికి సిద్ధమయ్యాయి.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

నిబద్ధతను గుర్తించడమూ నిబద్ధతే!

సందర్భం



జిల్లా గోవర్ధన్

రాష్ట్రపతి పదవిని అలంకరించిన ఆర్. వెంకట్రామన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్‌లు ఆ స్థితికి చేరడానికి ఎంతటి అర్హులో చెప్పే అరుదైన సంఘటన ఇది. 1983లో అబ్దుల్ కలామ్ డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)లో డైరెక్టర్‌గా విధులు నిర్వహించే రోజుల్లో రక్షణ మంత్రిగా ఆర్. వెంకట్రామన్ ఉన్నారు. దేశ సంరక్షణ కోసం స్వదేశీ రీసెర్చ్ ద్వారా క్షిపణులు, ఉపగ్రహాల నిర్మాణం చేపట్టాలని భారత ప్రభుత్వం 'మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కమిటీ'ని నియమించింది. ఇందులో కలామ్ అధ్యక్షునిగా, ఐదుగురు అనుభవజ్ఞులైన సైంటిస్టులు సభ్యులుగా ఉన్నారు. త్రివిధ దళాలకు ఉపయోగపడే క్షిపణులు, ఉపగ్రహాల నిర్మాణానికి కావలసిన బడ్జెట్ వివరాల నమూనా (బ్లూ ప్రింట్) తయారు చేసే బాధ్యత ఈ కమిటీకి అప్పజెప్పింది రక్షణ శాఖ. పలు చర్చలు, తర్జన భర్జనలు జరిపిన అనంతరం, కమిటీ పది సంవత్సరాల కాలవ్యవధి, రూ. 390 కోట్ల బడ్జెట్‌తో ఒక డ్రాఫ్ట్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసింది.

రక్షణ మంత్రి, త్రివిధ దళాల ముఖ్య అధికారుల సమావేశంలో కలామ్ తమ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను వివరించారు. మంత్రి దశల వారీగా కాకుండా 'సమీకృత క్షిపణి అభివృద్ధి కార్యక్రమం' (ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ ప్రోగాం)ను అతి తక్కువ సమయంలో తయారు చేసే పద్ధతిలో ప్లాన్ తీసుకురావలసిందిగా కోరారు. అది విని సైంటిస్టులు దీనికి కొంత వ్యవధి కావాలని కోరారు. 'లేదు, లేదు; రేపు సాయంత్రం కేబినెట్ కమిటీ మీటింగు జరగబోతోంది, అందులో మీ ప్రాజెక్టు రిపోర్టు ఉంచాల్సి ఉంటుంది' అని, మరుసటి రోజు ఉదయం తనను కలవాల్సిందిగా కోరారు వెంకట్రామన్. కలామ్, కమిటీ సభ్యులూ ఆఫీసు చేరుకుని ఆలస్యం చేయకుండా ఆ పనిలో రాత్రంతా తల మునకలయ్యారు. ఎప్పుడు తెల్లవారిందో తెలీనేలేదు. మొత్తానికి మంత్రి కోరి నట్టుగానే రిపోర్టు తయారు చేశారు.



ఆర్. వెంకట్రామన్




డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్

ఉదయం ఇంటికెళ్ళి బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ దగ్గర కూర్చున్నాక గుర్తుకొచ్చింది కలామ్ గారికి, ఆరోజు జుమ్మేరాత్; ఆయన అన్న కూతురు జమీలాది 'నిఖా' అన్న సంగతి! అదీ ఢిల్లీలో కాదు, దక్షిణాది రామేశ్వరంలో! వృత్తి ఒత్తిడి రీత్యా కుటుంబ బాధ్యతలు విస్మరించడం ఎంతవరకు సబబు? ఇది ఆయన మనసును కలచి వేసింది. కాని ఇవ్వాళ, ఆమె పెళ్లికి తను హాజరు కాలేని నిస్సహాయ పరిస్థితి! బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసుకుని, తన టీమ్‌తో సౌత్ బ్లాక్ చేరుకుని, రాత్రి సవరించిన ప్రాజెక్టు రిపోర్టును మంత్రి వెంకట్రామన్‌కి చూపించారు డాక్టర్ కలామ్. దాన్ని సావధానంగా వీక్షించి తను సూచించిన విధంగానే తయారవటంతో హర్షం వ్యక్తం చేస్తూ ఆయన, 'ఇలాంటి క్లిష్టమైన జాబ్ మీతోనే సాధ్యపడుతుంది అనే నమ్మకంతోనే మిమ్మల్ని డీఆర్‌డీఓ డైరెక్టర్‌గా నియమించాం కలామ్‌జీ', అని నవ్వుతూ ఆయన భుజం తట్టి, ఇక వెళ్దాం అన్నట్టు కుర్చీలో నుండి లేచి నిలుచున్నారు వెంకట్రామన్. తోటి సభ్యులు ఛాంబర్ నుండి వెళ్ళే ముందు డా॥ అరుణాచలం (టీం సభ్యుడు) మంత్రి గారితో, 'ఇవ్వాళ సాయంత్రం రామేశ్వరంలో కలామ్ అన్నగారి అమ్మాయి పెళ్ళి' అనటంతో, కలామ్ వైపు ఆశ్చర్యంగా నఖశిఖ పర్యంతం చూశారు మినిస్టర్. కాసేపటికి తేరుకుని, తన పర్సనల్ సెక్రటరీని పిలిచి అర్జంటు సూచనలు కొన్ని చేశారు. ఢిల్లీ విమానాశ్రయం నుండి మద్రాసుకు ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ మరో గంటలో వెళ్లనుంది. కావలసిన బ్యాగేజ్‌తో రామేశ్వరం చేరుకోవటానికి వెంటనే ఎయిర్‌పోర్ట్ చేరుకోవలసిందిగా కలామ్‌కు చెప్పారు మంత్రి పీఏ. ఈసారి ఆశ్చర్యంలో మునగటం డా॥ కలామ్ వంతైంది.

విమానం మద్రాసు రన్ వేపై దిగినవెంటనే ప్రక్కనే ఆయన కోసం వేచి ఉన్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ ఆయన్ని తీసుకుని మదురైకి బయలుదేరింది. అక్కడ ఎయిర్‌ఫోర్స్ కమాండెంటు తన వాహనంలో ఆయన్ని రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. మదురై నుండి రామేశ్వరం బయల్దేరే ట్రెయిన్‌ను కలామ్ వచ్చే వరకు ఆపాలని, ఉదయమే రాష్ట్రపతి కార్యాలయం నుండి మదురై రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్‌కు సూచనలు అందాయి. అంతే... కలామ్ రావటంతో ఆయనను రిసీవ్ చేసుకుని ట్రెయిన్‌లో కూర్చో బెట్టారు రైల్వే ఉన్నత అధికారులు. 175 కి.మీ. దూరం రామేశ్వరం. ఆ ట్రెయిన్ మూడు గంటల్లో గమ్యం చేరటంతో జమీలా పెళ్ళి ముహూర్తానికి చేరుకున్నారు కలామ్ సాబ్. అనుకోని ఆయన రాకతో ఆ కుటుంబంలో సంతోషం రెండింతలైంది. ఉదయం ఢిల్లీ ఎయిర్‌పోర్టు చేరుకునే ముందు, తన సహచరుడు డా॥ అరుణాచలం 'గత ఆరు నెలలుగా మీరు చేసిన కష్టానికి ప్రతిఫలం ఇది' అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి కలామ్‌కు. ఎంత నిజం! తన వృత్తి పట్ల చూపిన నిబద్ధతకు రక్షణమంత్రి బహుశా ఇది తనకు ఇచ్చిన బహుమతి కాబోలు అనుకున్నారు కలామ్ సర్. తర్వాత కాలంలో వీరిద్దరూ రాష్ట్రపతి పీఠం అధిరోహించటం గమనార్హం! (డా॥ అబ్దుల్ కలామ్ ఆత్మ కథ 'వింగ్స్ ఆఫ్ ఫైర్' ఆధారంగా)

వ్యాసకర్త మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబై । 98190 96949
(నేడు మాజీ రాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ వర్ధంతి)

మౌనాస్వాదన



ఒక వృద్ధుడినీ, రోగినీ, శవాన్నీ చూసిన పిదప సిద్ధార్థ గౌతమునిలో చింతన మొదలైందని చరిత్ర చెబుతుంది. అలాగే చైనా తావో మతానికి చెందిన లావోట్జు కూడా ఏకాంతంగా, మౌనంగా కూర్చొన్న సమయంలో తన ముందు ఒక ఎండుటాకు రాలటాన్ని చూశాడు. వెంటనే ఆయనలో చింతన మొదలైంది. 'ఈ ఆకులాగే ఏదో ఒక రోజు నేనూ నిర్జీవిగా రాలిపోవాల్సిందేగా! ఆ రోజు ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలుసు? కాబట్టి వృథాగా సమయాన్ని గడపరాదు. ఈ చావు, పుట్టుకల రహస్యమేమిటో తెలుసుకోవాల్సిందే' అనుకొని వెంటనే అన్వేషణ ప్రారంభించాడు (ద వైట్ లోటస్–ఓషో).

ఎప్పుడూ మౌనంగా, నిశితంగా ప్రకృతిని పరిశీలిస్తూ సంచరించే వాడు. ప్రకృతిలోని అందాలు అనిర్వచనీయ ఆనందాన్నిచ్చేవి. లావోట్జు క్రమం తప్పక ఉదయపు నడకకు వెళ్ళేవాడు. ఒకసారి ఒక వ్యక్తి తనను కూడా ఆయనతోపాటు నడవడానికి అనుమతి అడిగాడు. అందుకాయన 'నిరభ్యంతరంగా నాతో పాటు మీరూ రావచ్చు, కానీ ఒక్క మాట కూడా మాట్లాడకుండా నడక సాగించాలి. అట్లయితేనే మీరు నా వెంట రావచ్చు' అన్నాడు. రోజూ ఆ వ్యక్తి లావోట్జుతో కలిసి గంటల తరబడి నడిచి వచ్చేవాడు. మరో రోజు అతని మిత్రుడొకడు వారి వెంట వెళ్ళాడు. ఒక్క మాట కూడా మాట్లాడకూడదన్న విషయం అతనికి తెలీదు. ఉదయపు ప్రకృతి సౌందర్యాన్ని చూస్తున్న అతను ఆనందాన్ని అణచుకోలేక 'ఎంత బాగుందో!' అన్నాడు. దీంతో తటాలున అక్కడే ఆగిపోయాడు లావోట్జు. 'అయిపోయింది, నీ మిత్రుడు చాలా ఎక్కువగా మాట్లాడుతున్నాడు, మీరిద్దరూ వెళ్ళిపోవచ్చు' అన్నాడు.

ప్రత్యక్షంగా, నేరుగా ప్రకృతి అందాన్ని చూసి తనివి తీరా ఆనందాన్ని అనుభవిస్తున్న, వినిపించని ప్రకృతి గానాన్ని వీనుల విందుగా గ్రహిస్తున్న లావోట్జుకు అతని మాటలు కర్కశంగా, ములుకుల్లా అనిపించాయి. ఏకాంతంగా, మౌనంగా నడిచినందు వల్ల కేవలం భౌతిక లాభమే చేకూరదు, మనసూ ఉల్లాసభరితం అవుతుంది. అది క్రమంగా ధ్యానక్రియగా మారి ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడుతుంది. అందువల్లే చాలా క్షేత్రాల్లో గిరి ప్రదక్షిణలు చేయటం ప్రారంభమయింది. తిరువణ్ణామలైలో రమణ మహర్షి ఎన్నో ఏండ్లు గిరి ప్రదక్షిణ చేశారు, ఇతరులనూ ప్రోత్సహించారు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.7.46 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మూల ఉ.8.20 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.6.41 నుండి 8.21 వరకు, తదుపరి సా.6.12 నుండి 7.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.38 నుండి 1.26 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.41 వరకు, **అమృతఘడియలు:** తె.4.01 నుండి 5.41 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.49.

రేపే నాగోబా మహాజాతర

పడియోర్ మర్రిచెట్టు వద్ద గుడారాలలో మెస్రం వంశీయుల బస

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా వంశీయులు
- కితల వారీగా సామూహికంగా వంటలు
- అర్ధరాత్రి మొదలైన తూమ్ పూజలు


తూమ్ పూజలు నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 28న మహాపూజతో సంబరం మొదలు కానుంది. ఇప్పటికే పవిత్ర గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో పడియోర్ జన్మ స్థలమైన మర్రిచెట్టు వద్ద గుడారాలు వేసుకుని బస చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చారు. రెండు రోజులుగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. రాత్రి వేళలో ప్రదాన్ కితకు చెందిన వారు కిక్రి వాయిస్తూ నాగోబా, 22 కితల వంశీయుల చరిత్ర చెబుతున్నారు. ఆదివారం ఉదయం మహిళలు కితల వారీగా జొన్న గట్కా, సంప్రదాయ పిండి వంటలు చేసి ఆచారం ప్రకారం నైవేద్యాలు సమర్పించారు. 22 కితల్లో మరణించిన పెద్దల పేరుతో రాత్రి తూమ్ (కర్మకాండ) పూజలు చేపట్టినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. మరణించిన వారు ఈ పూజలతో నాగోబా సన్నిధికి చేరినట్లు భావిస్తామని పేర్కొన్నారు.

పూజల్లో జొన్నగట్కా ప్రత్యేకం


జొన్న గట్కాతో ఉండలు తయారు చేస్తున్న మహిళలు

పూజల్లో భాగంగా సమర్పించే నైవేద్యంలో జొన్న గట్కాకు ప్రత్యేక స్థానం ఉంది. పూజల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఇంటి నుంచి తీసుకువచ్చిన జొన్న పిండితో గట్కా, ఇతర పిండి పదార్థాలు తయారు చేస్తారు. నైవేద్యంగా సమర్పించిన తర్వాత కితల వారీగా పంపిణీ చేసి భోజనం చేస్తారు.

ఆలయానికి చేరిన కుండలు



నాగోబా మహా పూజ, సంప్రదాయ పూజలకు అవసరమయ్యే సిరికొండలోని గుగ్గిల స్వామి తయారు చేసిన ఏడు రకాల కుండలు ఆదివారం సాయంత్రం ఆలయానికి చేరాయి. మొత్తం 350 మట్టి పాత్రల్లో పెద్ద బాణాలు, సాధారణ కుండలు, మూతలు, కడుముంతలు, దీపాంతలు ఉన్నాయి. వీటిని ఆలయంలో భద్రపరిచారు.

తూమ్ పూజలతో దేవుడి సన్నిధికి..


మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి

ఆదివాసీల్లో మరణించిన పెద్దలకు కుటుంబ సభ్యులు తమ కుల దేవతల వద్దకు వెళ్లి తూమ్ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. దీంతో మరణించిన వారు దేవుడి సన్నిధికి చేరినట్లుగా భావిస్తారు. ఈ పూజల అనంతరమే వంశంలోని తమ కితకు చెందిన కోడళ్ల బేటింగ్ (దేవుడి పరిచయం)తో పాటు ఇతర పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.

నాగోబా జాతరకు దృశ్య రూపం

ఎనిమిదేళ్ల పాటు పరిశోధన చేసిన యంగ్ డైరెక్టర్ జెన్నిఫర్ ఆల్ఫాన్స్

సాక్షి, హైదరాబాద్: ఎంతో ప్రాచీనమైన నాగోబా జాతర గురించి మనకు తెలిసింది ఎంత? అంటూ వాటికి సమాధానాలు వెతికే ప్రయత్నంలో ఆదిలాబాద్ బాట పట్టారు యంగ్ డైరెక్టర్ జెన్నిఫర్ ఆల్ఫాన్స్. ఎనిమిదేళ్ల పరిశోధన తర్వాత 'నాగోబా జాతర' పేరుతో ఒక డాక్యుమెంటరీ ఫిల్మ్ తీశారు. తాను తెలుసుకున్న విషయాలు, చిత్రీకరించిన ఫొటోలతో అందమైన పుస్తకాన్ని కూడా ప్రచురించారామె. నాగోబా జాతరలోని ప్రతి ఘట్టాన్ని అందంగా చిత్రించారు. ఇందుకు తన పరిశోధనే కారణమంటారామె. 'సినిమా చిత్రీకరణ ఒక్కటే నాకు తెలిసిన కళ. నా దృష్టికొచ్చిన గొప్ప విషయాన్ని నాకు చేతనైన మాధ్యమంలో ఒక రూపం కల్పించానని చెప్పడానికి గర్వంగా ఉంది' అన్నారు జెన్నిఫర్. 'గుస్సాడీ' పుస్తకం ఆమెజాన్‌లో ఉంది. ఈ పుస్తకాలు అమ్మగా వచ్చిన డబ్బును ఆమె తీసుకోలేదు. నేరుగా ఆదివాసీల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన నిధికి చేరుతోంది. 'నాగోబా జాతర' రచన మార్కెట్‌లో విడుదల కావాల్సి ఉంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల పరిధిలోని కేస్లాపూర్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నాగోబా జాతర జరగనుంది.

జెన్నిఫర్ హైదరాబాదీ

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన జెన్నిఫర్ ఆల్ఫాన్స్ షార్ట్ ఫిల్మ్ మేకర్. ఆమె తీసిన 'కచరా' ఫిల్మ్‌కు మూడు నంది అవార్డులు వచ్చాయి. 'స్ట్రేంజర్' సినిమా కేన్స్‌లో స్క్రీన్ అయ్యింది. దానికి 20కి పైగా అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. కమర్షియల్ అడ్వర్‌టైజ్‌మెంట్‌లు చేస్తారు. ఆ డబ్బుతో ఆదివాసీల జీవనం, కళలపై రీసెర్చ్ చేస్తున్నారు.



ఇవి మన సంస్కృతి మూలాలు



హైదరాబాద్‌లోని శిల్పారామంలో గుస్సాడీ నృత్యం చూసినప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది. మూలాలను వెతుక్కుంటూ ఆదిలాబాద్ అడవులకెళ్లాను. గుస్సాడీ మీద ఒక డాక్యుమెంటరీ, పుస్తకం తెచ్చాను. 2014 నుంచి ఇప్పటివరకు రెండు డాక్యుమెంటరీలు, రచనలు వచ్చాయి. మూడవది ఆదివాసీ దేవత జంగుబాయి డాక్యుమెంటరీ చిత్రీకరణ దశలో ఉంది. నా పుస్తకాలను చూసిన మన తెలుగువారు చాలామంది ఆఫ్రికాలో షూట్ చేశారా అని అడిగారు. మన మూల సంస్కృతి అడవి దాటి బయటకు రాకపోతే ఇక ప్రపంచానికి ఏమి చెబుతాం? ప్రపంచదేశాలకు తెలియచేయడానికి ఇంగ్లిష్ వాయిస్ ఓవర్ ఇచ్చాను. డాక్యుమెంటరీ మన తెలుగుదనాన్ని కోల్పోకూడదని ఆదివాసీల మాటలను అలాగే ఉంచాను. – జెన్నిఫర్ ఆల్ఫాన్స్, ఫిల్మ్ డైరెక్టర్

జేఎన్‌టీయూహెచ్ వీసీ నియామకంపై సెర్చ్ కమిటీ భేటీ నేడు

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకంపై సోమవారం సెర్చ్ కమిటీ భేటీ కానుంది. మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీ వీసీ పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేసి, ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. ఈ జాబితాను ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుంది. వీలైనంత త్వరగా వీసీ నియామకం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది చివరలో వీసీల నియామకం చేపట్టారు. జేఎన్‌టీయూహెచ్ విషయంలోనూ సెర్చ్ కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. అయితే, ఇందులో ప్రభుత్వానికి సానుకూలంగా లేని, అవినీతి ఆరోపణలున్న వ్యక్తుల పేర్లు ఉండటంతో, ప్రభుత్వం ఈ నియామక ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా మళ్లీ సెర్చ్ కమిటీ భేటీతో వీసీ నియామకం ఒక కొలిక్కి వస్తుందని అందరూ ఆశిస్తున్నారు.

సాగు యోగ్యం కాని భూములు 2.10 లక్షల ఎకరాలు

▶ మొదటి పేజీ తరువాయి

సాగైన భూములకే రైతుభరోసా అమలు చేస్తే వ్యతిరేకత వస్తుందని భావించిన సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రివర్గ సమావేశంలో చర్చించిన అనంతరం వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అమలు చేస్తామని ప్రకటించారు. సాగులో లేని భూముల వివరాలను క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులకు పంపించి సర్వే చేయాలని ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు చేయడంతో పాటు కాలేజీలు, కోళ్ల ఫారాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భూములు, గుట్టలు, కొండలు, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల ఫ్రీజింగ్ (రైతు పట్టా పాస్ పుస్తకాల్లో సాగు యోగ్యం కాని భూములుగా నిర్ధారించడం)కు కూడా ఆదేశాలిచ్చారు. ఈ మేరకు రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఫీల్డ్ సర్వే చేశారు.

కోటిన్నర ఎకరాలకు రైతుభరోసా?

రాష్ట్రంలోని 600 గ్రామీణ మండలాల్లోని 10,622 గ్రామాలకుగాను వ్యవసాయ యోగ్యం కాని భూములు ఉన్న 10,277 గ్రామాల్లో సర్వే నిర్వహించిన అధికారులు.. వాటిలో 2,10,864 ఎకరాలు వ్యవసాయ యోగ్యత లేని భూములని తేల్చారు. గతసారి 'రైతుబంధు' పథకం కింద 1.52 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించినట్లు రికార్డులను బట్టి తెలుస్తోంది. 2023 జూన్ 26న పదకొండో విడత రైతుబంధు పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి జమ ప్రారంభం కాగా, ఆ సీజన్‌లో రూ.7,624 కోట్లను 68.99 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి జమచేశారు. ఈ లెక్కన 2 లక్షల పైచిలుకు ఎకరాలను వ్యవసాయ యోగ్యం కాని భూములుగా నిర్ణయిస్తే కోటిన్నర ఎకరాలకు రైతుభరోసా అందే అవకాశం ఉందని అధికారులంటున్నారు.

హైదరాబాద్ శివార్లలో రియల్ వెంచర్లు, కళాశాలలు!

హైదరాబాద్ చుట్టుపక్కల రియల్ వెంచర్లుగా, కళాశాలలు, కోళ్ల ఫారాలుగా మారిన విషయం తెలిసిందే. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు నిర్వహించిన సర్వేలో.. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ యోగ్యం కాని పట్టా భూములు రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నట్లు తేలింది. ఈ జిల్లాలో 28,287 ఎకరాల సాగు యోగ్యం కాని భూములకు ఇప్పటివరకు 11 విడతల్లో రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత యాదాద్రి జిల్లాలోని 18,190 ఎకరాలను వ్యవసాయ యోగ్యత లేని పట్టా భూములుగా తేల్చారు. ఆ తర్వాత స్థానంలో మేడ్చల్‌జిల్లా (14,444 ఎకరాలు), సంగారెడ్డి జిల్లా (12,174 ఎకరాలు), నల్లగొండ (12,040 ఎకరాలు) ఉన్నాయి. ఆయా జిల్లాల్లో కూడా సాగుయోగ్యం కాని భూములకు రైతుబంధు అందగా, వాటిని ఇప్పుడు ఫ్రీజ్ చేయడంతో వాటికి రైతుభరోసా అందే అవకాశం లేదు.

భద్రాద్రి రామయ్యకు విశ్వరూప సేవ


స్వామివారికి విశ్వరూప సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం స్వామివారికి వైభవంగా విశ్వరూప సేవ నిర్వహించారు. వేడుకలు ముగిసిన తర్వాత వచ్చే బహుళ ద్వాదశి రోజున ఈ సేవ చేయడం ఆనవాయితీ. సంవత్సరకాల పూజల్లో దొర్లే దోషాల నుంచి ప్రాయశ్చిత్తం కోసం శ్రీ సీతారామలక్ష్మణ స్వామి, ఆలయం ప్రాంగణంలోని ఉపాలయాల్లోని 108 మంది అర్చనా మూర్తులను ఒకే చోటికి చేర్చి ఏకకాలంలో సేవలు నిర్వహించటం విశ్వరూప సేవ విశిష్టత. కాగా, ఈ సేవ భద్రాచలంలో మాత్రమే నిర్వహించడం విశేషం.

తెలంగాణ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

హయత్‌నగర్: హయత్‌నగర్ మండలం కుంట్లూరు సమీపంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఆదివారం సాయంత్రం ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం .. నాగర్‌కర్నూల్ జిల్లా కొండనాగుల అంబగిరికి చెందిన ఉడుతనూరి శివశంకర్ కూతురు సౌమ్య (17) గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ (బైపీసీ) సెకండియర్ చదువుతోంది. ఆదివారం సాయంత్రం తోటి విద్యార్థులు అందరూ భోజనాలకు వెళ్లగా సౌమ్య గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన తోటి విద్యార్థులు వార్డెన్‌కు సమాచారం ఇవ్వడంతో బాలికను వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సౌమ్య మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు.

మహిళకు మోసం!

ఎన్నికల హామీలపై తెప్ప తగలేసిన సీఎం చంద్రబాబు

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక సాక్షిగా మరోసారి వెల్లడి

- 8 రాష్ట్రాల్లో ఇప్పటికే మొదలైన ఎన్నికల హామీల అమలు
- దాదాపు రూ.లక్షన్నర కోట్లను కేటాయించిన ఆయా రాష్ట్రాలు
- ఏపీలో 19–59 ఏళ్ల మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 ఇస్తామన్న ఎన్నికల హామీని నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు కాలయాపన
- ఆడబిడ్డ నిధి.. తల్లికి వందనం ఊసే పట్టని బాబు.. ఆగిపోయిన చేయూత, సున్నా వడ్డీ..



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అతివేగం.. మద్యం మత్తు

నలుగురి ప్రాణాలు బలిగొన్న లారీ డ్రైవర్

- వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు ఆటోలను ఢీకొట్టిన లారీ డ్రైవర్
- లారీలోని ఐరన్ రాడ్లు పడి భోపాల్‌వాసుల మృతి
- మరో ఐదుగురికి తీవ్రగాయాలు


ఘటనాస్థలి నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

సాక్షి, వరంగల్: మద్యంమత్తులో 18 టైర్లున్న లారీని అతివేగంగా నడిపి ఓ డ్రైవర్ నలుగురి ప్రాణం తీశాడు. మృతులు మధ్యప్రదేశ్ భోపాల్‌లోని గరీబ్ నగర్‌కు చెందిన నువురు సంతోష్‌చౌహాన్ (45), కూతుళ్లు కిరణ్‌చౌహాన్ (18), పూజాచౌహాన్ (20), కొడుకు ఖన్నాచౌహాన్ (7)గా గుర్తించారు. తీవ్రగాయాలైన సంతోష్ భార్య చామాబాయి, మరో కుమారుడు ముఖేష్ చౌహాన్ లతోపాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్ర రాజులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే...భోపాల్‌కు చెందిన సంతోష్ కుటుంబం జీవనోపాధి కోసం ఐదురోజుల క్రితం మామునూరుకు వచ్చి డేరా వేసుకొని కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తోంది. సంతోష్ అన్న కొడుకైన సుమీర్ కుటుంబం కూడా అక్కడే ఉంటోంది. ఈ క్రమంలోనే లోహిత గ్రామంలో ఈ వ్యాపారానికి మంచి గిరాకీ ఉందని తెలుసుకున్న సంతోష్ కుటుంబం ఆదివారం ఉదయం 11.00 గంటల సమయంలో ఓ ఆటో కిరాయికి మాట్లాడుకొని బయలుదేరింది. కొంతదూరం వచ్చాక ఉన్న మామునూరు బెటాలియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోసుకున్నాక వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపైకి వచ్చింది. ఇదే సమయంలో భారీ నిర్మాణాలకు ఉపయోగించే ఐరన్ రాడ్లలోడ్‌లతో వస్తున్న 18 టైర్లున్న లారీ మరో లారీని ఢీకొనబోయి తప్పించుకుంది. ఆ వెంటనే రాపర్తి సాగర్ ఒక్కడే ఉన్న ఆటోను ఢీకొట్టి బ్రేక్ వేయడంతో కుడివైపునకు ట్రక్కు తిరిగింది. దీంతో రహదారి బ్లాక్ కాగా, ఆ ట్రక్కులో ఇనుప స్తంభాలకు ఉన్న తాడు తెగింది. దీంతో స్తంభాలు ఎగిరి ఎడమవైపున ఉన్న ఆటోపై ఒక్కసారిగా పడడంతో అందులోని సంతోష్, పూజ, కిరణ్‌లు గుర్తు పట్టలేని స్థితిలో విగతజీవులుగా మారారు. తీవ్రగాయాలైన మిగిలిన ఐదుగురిని ఆ ఇనుప రాడ్ల మధ్యలోనుంచి తీసి అంబులెన్స్‌లో పోలీసులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఖన్నా మృతి చెందాడు.

అప్పటికే ఒక ఆటోను ఢీకొట్టిన లారీ

అంతకుముందే ఇదే లారీ కక్కిరాలపల్లి నుంచి ఎరువు బస్తాలు తీసుకొస్తున్న ఆటోను ఢీకొట్టడంతో అది బోల్తా పడి డ్రైవింగ్ చేస్తున్న చిర్రా రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటికే అక్కడున్న వారు అందరూ వారిస్తుండడంతో అతి వేగంగా లారీని నడిపిన డ్రైవర్, రాజస్తాన్ వాసి యోగిందర్‌సింగ్ మామునూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చేశాడు. అతడికి బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 రీడింగ్ నమోదైంది. విశాఖపట్నం నుంచి నాగపూర్‌కు ఐరన్ లోడ్‌తో వెళుతున్న లారీని డ్రైవర్ యోగిందర్‌సింగ్ అతిగా మద్యం సేవించి నడపడం వల్లే ఈ రోడ్డు ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనాస్థలిని వరంగల్ కలెక్టర్ సత్య శారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

క్షణాల వ్యవధిలో ఘోరం జరిగింది

వ్యక్తిగత పనిమీద హనుమకొండ నుంచి మామునూరుకు కారులో వెళుతున్నా. బెటాలియన్ రాకముందే ఓ లారీ అతి వేగంతో వస్తుండటాన్ని చూశా. అప్పటికే నా ముందు ఓ లారీ మామునూరు వెళుతోంది. ఎదురుగా వస్తున్న లారీ దారి తప్పి నా ముందు ఉన్న లారీని గుద్దినంత పనిచేసింది. ఆ లారీ డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించి రోడ్డు మొత్తం దిగి చిన్నచిన్న చెట్లు, రాళ్ల మధ్యలో నుంచి వెళ్లడంతో ప్రమాదం తప్పిందనుకున్నా. అప్పటికే ఆ లారీ డ్రైవర్ తన ముందు ఉన్న ఓ ఆటోను ఢీకొట్టి బ్రేక్ వేయడంతో సమారు 50 మీటర్ల ముందుకు వచ్చి కుడివైపునకు తిరగడంతో అందులో ఉన్న ఇనుపరాడ్లు ఎగిరి ప్రయాణికులతో వెళుతున్న ఆటోపై పడడంతో నుజ్జునుజ్జయ్యింది. అందులో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నా కారు కిందకు కూడా ఇనుప రాడ్లు రావడంతో ముందుకు కదల్లేదు. నేను కాస్త జాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రాణాలతో బయటపడ్డా. లేదంటే జరగరాని ఘోరం జరిగి ఉండేది. – జీవన్, ప్రత్యక్షసాక్షి

గర్వించేలా గణతంత్రం

కన్నులపండువగా రిపబ్లిక్ డే వేడుకలు

- సైనిక పాటవం చాటిన అత్యాధునిక క్షిపణులు, యుద్ధ విమానాలు
- ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- సంప్రదాయ గుర్రపు బగ్గీలో విచ్చేసిన రాష్ట్రపతి, సుబియాంటో


కర్తవ్య పథ్ గుండా గుర్రపు బగ్గీలో వస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటోలకు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత సైనిక శక్తిని, ఆయుధ పాటవాన్ని, సాంస్కృతి వైభవాన్ని ప్రదర్శిస్తూ 76వ గణతంత్ర వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అత్యాధునిక క్షిపణులు, యుద్ధ విమానాల ప్రదర్శన, జవాన్ల కవాతు దేశమంతా గర్వంతో ఉప్పొంగేలా సాగాయి. 'సశక్త్ ఔర్ సురక్షిత్' పేరిట తొలిసారి ప్రదర్శించిన త్రివిధ దళాల ఉమ్మడి శకటం ఆకట్టుకుంది. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఆదివారం జరిగిన ఉత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, త్రివిధ దళాధిపతులు, ప్రముఖుల పాల్గొన్నారు. ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో కలిసి రాష్ట్రపతి సంప్రదాయ బగ్గీలో కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు. త్రివిధ దళాల సైనికులు ఆమెకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ ప్రారంభమైంది. మొదట లెఫ్టినెంట్ అహన్‌కుమార్ నేతృత్వంలో 61 కావల్రీ సైనిక బృందం ముందుకు సాగింది. జాట్ రెజిమెంట్, గర్వాల్ రైఫిల్స్, మహర్ రెజిమెంట్, జమ్మూకశ్మీర్ రైఫిల్స్ రెజిమెంట్ వంటి దళాల కవాతు ఆకట్టుకుంది. దేశాభివృద్ధిని, ప్రజల సంక్షేమం, సాధికారతను కళ్లకు కడుతూ పలు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'స్వర్ణిమ్ భారత్: విరాసత్ ఔర్ వికాస్' థీమ్‌తో 31 శకటాలను ప్రదర్శించారు. వైమానిక దళానికి చెందిన 40 యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆహూతులను అలరించాయి.

10 వేల మంది ప్రత్యేక అతిథులు

రిపబ్లిక్ డే పరేడ్‌కు ప్రముఖులు సహా 10 వేల మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. వీరిలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, విపత్తు సహాయక చర్యల సిబ్బంది, ఆశా వర్కర్లు, పారా ఒలింపిక్ అథ్లెట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కృషి సఖీలు, ఉద్యోగ్ సఖీలు తదితరులు ఉన్నారు. పలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, రోడ్డు నిర్మాణ కార్మికులు, పేటెంట్ హోల్డర్లు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులను ఈసారి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరంతా జాతీయ యుద్ధ స్మారకం, పీఎం సంగ్రహాలయ్ తదితర కట్టడాలను సైతం సందర్శించారు.

మోదీ తలపాగా

గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ ఎరుపు, పసుపు రంగు గీతలతో కూడిన తలపాగా 'సఫా'ను ధరించారు. దాంతోపాటు తెల్లరంగు కుర్తా–పైజామా, దానిపై ఊదా రంగు బంద్‌గలా జాకెట్ ధరించారు. మోదీ ప్రతిఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల్లో రంగురంగుల తలపాగాలు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది గణతంత్ర ఉత్సవాల్లో ఆయన బహుళ రంగులతో కూడిన బాంధానీ ప్రింట్ సఫా ధరించారు.

గూగుల్ డూడుల్

76వ గణతంత్ర వేడుకల సందర్భంగా గూగుల్ ఆదివారం తీసుకొచ్చిన ప్రత్యేక డూడుల్ అందరినీ ఆకట్టుకుంది. లద్దాఖీ దుస్తులు ధరించిన మంచు చిరుత, ధోతీ–కుర్తా ధరించిన పులి వంటి జంతువులు ఇందులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ వాయిద్యాలను ఇవి వాయిస్తున్నట్లుగా ఈ డూడుల్‌ను రూపొందించారు. ఇది జంతువుల పరేడ్‌లా ఉందని చెప్పొచ్చు. అంతర్లీనంగా గూగుల్ అనే అక్షరాలు పొందుపర్చారు.

విదేశాల్లోనూ ఉప్పొంగిన దేశభక్తి

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోనూ భారత గణతంత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రవాస భారతీయులతోపాటు స్థానికులు వాటిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారతీయులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. భారతీయ నృత్యాలను ప్రదర్శించారు. నేపాల్, ఆస్ట్రేలియా, సింగపూర్, చైనా, శ్రీలంక, ఇజ్రాయెల్, జపాన్, ఇండొనేసియా, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో రిపబ్లిక్ డే నిర్వహించారు. భారత రాయబార కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాలు ఎగురవేశారు.

నాలో ఇండియన్ డీఎన్‌ఏ

సుబియాంటో సరదా వ్యాఖ్యలు

ఆహ్లాదంగా 'ఎట్ హోమ్'

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి నిలయంలో ఆదివారం రాత్రి 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విందు ఇచ్చారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. విందు ఆసాంతం సరదా సరదాగా సాగింది. తనకు భారతీయ మూలాలున్నాయని ఈ సందర్భంగా సుబియాంటో చెప్పారు. ''కొన్ని వారాల క్రితమే జెనెటిక్ సీక్వెన్సింగ్, డీఎన్‌ఏ పరీక్షలు చేయించుకున్నా. నాలో ఇండియన్ డీఎన్‌ఏ ఉన్నట్లు తేలింది. భారతీయ సంగీతం విన్నప్పుడల్లా నేను డ్యాన్స్ చేస్తానని అందరికీ తెలుసు. నాలోని ఇండియన్ జీన్స్‌లోనే భారతీయ సంగీతం, నృత్యం దాగున్నాయి'' అని సుబియాంటో చెప్పడంతో అతిథులంతా హాయిగా నవ్వేశారు. తమ భాషలో చాలా భాగం సంస్కృతం నుంచే వచ్చిందని సుబియాంటో ఈ సందర్భంగా అన్నారు. తమ దేశంలో పేర్లు చాలావరకు సంస్కృతంలోనే ఉంటాయని చెప్పారు. తమరోజువారీ జీవితాల్లో భారతీయ ప్రాచీన నాగరికత ప్రభావం అధికంగా ఉంటుందని వెల్లడించారు. భారత్, ఇండొనేసియా మధ్య ఎన్నో సారూప్యతలున్నాయని ఆయన గుర్తు చేశారు.

సాయుధ శక్తి


ప్రళయ్ ఆయుధ వ్యవస్థలు

దేశీయంగా అభివృద్ధి చేసిన షార్ట్–రేంజ్ టాక్టికల్ మిస్సైల్ 'ప్రళయ్', టీ–90 భీష్మ యుద్ధ ట్యాంక్, నాగ్ క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిస్సైల్, పినాక మల్టీ–లాంచర్ రాకెట్ సిస్టమ్, అగ్నిబన్ మల్టీ–బ్యారెల్ రాకెట్ లాంచర్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ వంటి వాటిని ప్రదర్శించారు. బజరంగ్ లైట్ స్పెషలిస్టు వాహనం, ఐరావత్ మోర్టర్ సిస్టమ్, నందిఘోష్, త్రిపురాంతక్ వాహనాలు సైతం దర్శనమిచ్చాయి.


ఆకాశ్ రాకెట్ లాంఛర్లు



హైలైట్స్

- రాజ్యాంగానికి 75 ఏళ్లయిన సందర్భంగా వేడుకలు మరింత వైభవంగా జరిగాయి.
- గణతంత్ర వేడుకల్లో ఇండొనేసియా అధ్యక్షుడు పాల్గొనడం ఇది నాలుగోసారి. ఆ దేశ సైనిక బృందం కూడా పాలుపంచుకుంది.
- పరేడ్‌లో పరమ్‌వీర్ చక్ర అవార్డు గ్రహీతలు సుబేదార్ మేజర్ యోగేంద్ర సింగ్ యాదవ్, సుబేదార్ మేజర్ సంజయ్ కుమార్, అశోక చక్ర అవార్డు గ్రహీత లెఫ్టినెంట్ కల్నల్ జస్‌రామ్ సింగ్ పాల్గొన్నారు.


చెత్తను శుభ్రం చేస్తున్న మోదీ

కర్తవ్య పథ్‌పై... మోదీ స్వచ్ఛభారత్

కర్తవ్యపథ్‌పై ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ చేసి చూపించారు. ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలు ఇందుకు వేదికయ్యాయి. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను స్వాగతించేందుకు వెళ్తుండగా దారిలో చెత్త కన్పించింది. దాంతో వేడుకల్లో పాల్గొన్న వేలాదిమంది చూస్తుండగా ఆయన కిందకు వంగి దాన్ని ఏరారు. డస్ట్‌బిన్‌లో పడేయాల్సిందిగా సెక్యూరిటీ సిబ్బందికి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. మోదీ చర్యను నెటిజన్లంతా ప్రశంసిస్తున్నారు.

29న షార్ నుంచి వందో ప్రయోగం

జీఎస్‌ఎల్‌వీ– ఎఫ్15 అనుసంధానం పూర్తి: ఇస్రో

సూళ్లూరుపేట: జీఎస్ఎల్‌వీ– ఎఫ్ 15తో ఎన్‌వీఎస్–02 ఉపగ్రహాన్ని అనుసంధానించడం పూర్తయిందని ఆదివారం షార్ డైరెక్టర్ రాజరాజన్ చెప్పారు. దేశీయంగా రూపుదిద్దుకున్న క్రయోజనిక్ జీఎస్ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ఎన్‌వీఎస్–02ను తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని వివరించారు. శ్రీహరి కోటలోని షార్ నుంచి ఇది 100వ మిషన్ కానుందన్నారు. రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి చేపట్టే ప్రయోగంలో ఎన్‌వీఎస్–02ను జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు ఆదివారం ఆయన మీడియాకు వివరించారు. జీఎస్‌ఎల్‌వీఎల్ ఎఫ్15 రాకెట్ ప్రయోగానికి 27 గంటల ముందు అంటే 28వ తేదీ తెల్లవారు జామున 3.23 గంటలకు కౌంట్‌డౌన్ మొదలయ్యే అవకాశం ఉందన్నారు. 29న ఉదయం 6.23 గంటలకు ప్రయోగం ఉంటుందని చెప్పారు. అయితే, కౌంట్‌డౌన్ సమయాన్ని సోమవారం అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు.

మూడో లాంచ్‌ప్యాడ్‌కు నెలలో శంకుస్థాపన

సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ (షార్)లో మరో ప్రయోగ వేదిక నిర్మాణానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం రూ.3,984 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని రాజరాజన్ గుర్తు చేశారు. ఇందుకు అవసరమైన స్థలం ఎంపిక పూర్తయిందని, నెల రోజుల్లోనే భూమిపూజ ఉంటుందని వివరించారు. దీనికి అనుసంధానంగానే న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్‌ను రూపొందించనున్నామన్నారు. భవిష్యత్తులో దీనిద్వారానే వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించి తిరిగి తీసుకొచ్చే ప్రక్రియను చేపట్టనున్నామని తెలిపారు. కొత్త తరం లాంచింగ్ వెహికల్‌తో 20 నుంచి 25 టన్నుల ఉపగ్రహాలను సైతం కక్ష్యలోకి పంపించొచ్చని చెప్పారు. తమిళనాడులోని కులశేఖర్‌పట్నంలో నిర్మిస్తున్న రాకెట్ ప్రయోగ వేదిక డిసెంబర్ 31 నాటికి పూర్తవుతుందన్నారు.

నైజీరియాలో మళ్లీ పేలిన గ్యాస్ ట్యాంకర్ 18 మంది దుర్మరణం

అబుజా: నైజీరియాలో మరోసారి గ్యాస్ ట్యాంకర్ పేలింది. ఈనుగు రాష్ట్రంలోని ఈనుగు–ఒనిట్షా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. అదుపుతప్పిన గ్యాసోలిన్ ట్యాంకర్ వాహనం మరో 17 వాహనాలను ఢీకొట్టింది. ట్యాంకర్ పేలడంతో మంటలు చెలరేగి 18 మంది చనిపోగా 10 మంది వరకు గాయపడ్డారు. సహాయక సిబ్బంది ముగ్గురిని కాపాడారు. నైజీరియాలో ఆఫ్రికాలోనే అత్యధిక జనాభా ఉంది. ఇక్కడ సరుకు రవాణా సమర్థమైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో రహదారులపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 18వ తేదీన గ్యాసోలిన్ ట్యాంకర్ పేలి మంటలు అంటుకున్న ఘటనలో కనీసం 100 మంది సజీవదహనం కావడం తెలిసిందే.

పాలస్తీనా శరణార్థులను అక్కున చేర్చుకోండి

- అరబ్ దేశాలకు ట్రంప్ హితవు
- ఇజ్రాయెల్‌కు బాంబుల సరఫరా పునఃప్రారంభం



వాషింగ్టన్: ఇజ్రాయెల్ దాడులతో గాజాలో సర్వం కోల్పోయి శరణార్థులుగా మారిన పాలస్తీనా పౌరుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. జోర్డాన్, ఈజిప్టుతోపాటు ఇతర అరబ్ దేశాలు వారికి ఆశ్రయమివ్వాలని సూచించారు. వారి బాగోగులు చూసుకోవాలన్నారు. ఇజ్రాయెల్‌కు 2 వేల పౌండ్ల బరువైన బాంబుల సరఫరాను నిలిపివేస్తూ బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేశానని వెల్లడించారు. వాటిని శనివారమే ఇజ్రాయెల్‌కు అందజేశామని చెప్పారు.

గాజాను శుభ్రం చేయాలి

గాజా పూర్తిగా విధ్వంసానికి గురైన ప్రాంతమని, శిథిలాలను తొలగించి, శుభ్రం చేయాల్సిన అవసరం ఉందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. కనుక ఎక్కువ మంది ప్రజలు బయటకు వెళితే కార్యాచరణ తేలికవుతుందన్నారు. గాజా పౌరులకు మరోచోట ఇళ్లు నిర్మించి ఇస్తే, అక్కడ వారు శాంతియుతంగా జీవనం సాగించగలరన్నారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కార్యాలయం ఇంకా స్పందించలేదు. మరోవైపు హమాస్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్‌కు అమెరికా బాంబులు సరఫరా చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. మిగిలిన బందీలందరినీ విడుదల చేయకపోతే హమాస్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని ఇజ్రాయెల్ ఇప్పటికే హెచ్చరించింది.

అసలు వ్యూహం అదేనా?

పాలస్తీనా శరణార్థులు అరబ్ దేశాలు అనుమతించాలనడం, ఇజ్రాయెల్‌కు అమెరికా బాంబులు సరఫరా చేయడం వెనుక మరో వ్యూహం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. బందీల విడుదల పూర్తయిన తర్వాత గాజా నుంచి పాలస్తీనా పౌరులను బయటకు తరలించి, హమాస్ స్థావరాలను పూర్తిగా నేలమట్టం చేయా లన్నదే అమెరికా, ఇజ్రాయెల్ వ్యూహం కావొచ్చని తెలుస్తోంది. గాజా నుంచి హమాస్ మిలిటెంట్లను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఆ రెండు దేశాలు యోచిస్తున్నాయి.

ఉత్తరాఖండ్‌లో నేటి నుంచే ఉమ్మడి పౌరస్మృతి

సీఎం ధామీ ప్రకటన • తొలి రాష్ట్రంగా రికార్డు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమలు కాబోతోంది. రాష్ట్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి యూసీసీని అమలు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ ప్రకటించారు. స్వతంత్ర భారతదేశంలో యూసీసీని అమల్లోకి తీసుకొచ్చిన మొట్టమొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ రికార్డు సృష్టించబోతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, ఉమ్మడి పౌరస్మృతి అమలుకు సంబంధించిన నిబంధనలను కేబినెట్ ఆమోదించినట్లు వెల్లడంచారు. సమాజంలో ప్రజలందరి మధ్య సమానత్వం కోసం యూసీసీ అవసరమని ఉద్ఘాటించారు. దీంతో అందరికీ సమాన హక్కులు, సమాన బాధ్యతలు లభిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, సామరస్యం, స్వయం సమృద్ధితో కూడిన దేశంగా తీర్చిదిద్దడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహా యజ్ఞం చేస్తున్నారని, ఇందులో తమ వంతు పాత్రగా యూసీసీని అమలు చేయబోతున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల హామీ అమలు

అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామన్న 2022 ఎన్నికల హామీని బీజేపీ నిలుపుకుంటోంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో 2022 మే 27న నిపుణుల కమిటీ ఏర్పాటయ్యింది. 2024 ఫిబ్రవరి 2న ముసాయిదా ప్రతిని ప్రభుత్వానికి సమర్పించింది. ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. నెల తర్వాత రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా మారింది. యూసీసీ చట్టం అమలుపై నియమ నిబంధనలు రూపొందించడానికి ఏర్పాటైన కమిటీ నివేదిక అందజేసింది.

దేశమంతటా యూసీసీ: ధామి

సామరస్యపూర్వకమైన సమాజానికి ఉమ్మడి పౌరస్మృతి బలమైన పునాది అవుతుందని సీఎం ధామీ ఆదివారం పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ప్రజలకు ఇచ్చిన హామీని సోమవారం నుంచే అమలు చేయబోతున్నామని వెల్లడించారు. వివక్షకు తావులేని సామరస్యపూర్వకమైన సమాజాన్ని సృష్టించాలన్నదే బీజేపీ ధ్యేయమని తెలిపారు. ఎన్నో గొప్ప నదులు ఉత్తరాఖండ్‌లో పుట్టాయని, అలాగే యూసీసీ గంగోత్రి కూడా దేశమంతటా ప్రవహించబోతోందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ కూడా ఈ మేరకు హామీ ఇచ్చారన్నారు.

యూసీసీపై ఉత్తరాఖండ్ మోడల్

బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమల్లోకి వస్తుండడంతో మిగతా బీజేపీ పాలిత రాష్ట్రాలూ అదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది. అస్సాం ఇప్పటికే యూసీసీ అమలుపై ఆసక్తి వ్యక్తంచేసింది. వివాహం, విడాకులు, వారసత్వం, సహజీవనం తదితర వ్యవహారాల్లో కులమతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒకే చట్టం వర్తించడమే ఉమ్మడి పౌరస్మృతి. యూసీసీతో బాహుభార్యత్వంపై నిషేధమూ అమల్లోకి వస్తుంది. అన్ని వర్గాల్లోని పురుషులు గానీ, స్త్రీలు గానీ ప్రభుత్వం నిర్దేశించిన వయసు కంటే ముందే పెళ్లి చేసుకోవడం నేరమవుతుంది. అన్ని రకాల పెళ్లిలు, సహజీవనాలను రిజిస్ట్రేషన్ చేయడం తప్పనిసరి. ఆన్‌లైనలో రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పెళ్లి చేసుకోని జంటలకు జన్మించే బిడ్డలకు సైతం యూసీసీతో చట్టబద్ధమైన హక్కులు లభిస్తాయి.

పెళ్లికి నిరాకరించడం ఆత్మహత్యకు పురిగొల్పినట్లు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: వివాహానికి ఆమోదం తెలపక పోవడాన్ని ఆత్మహత్యకు పురిగొల్పినట్లుగా భావించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. తన కుమారుడితో పెళ్లికి నిరాకరించడం వల్లే అతడి ప్రియురాలు ఆత్మహత్యకు పాల్పడిందంటూ ఓ మహిళపై దాఖలైన కేసుపై విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం ఈ మేరకు అభిప్రాయపడింది. ఐపీసీలోని సెక్షన్–306 ప్రకారం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లుగా భావించలేమని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేసింది. పిటిషనర్ కుమారుడు, అతడి ప్రియురాలికి మధ్య ఉన్న విభేదాలే ఆధారంగానే ఈ ఆరోపణలు చేసినట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి చార్జిషీటు, సాక్షుల వాంగ్మూలాలు వంటి నమోదైన ఆధారాలు సరైనవే అని భావించినా, పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని ధర్మాసనం పేర్కొంది. ఆత్మహత్యకు మినహా మరే ప్రత్యామ్నాయం కూడా మృతురాలికి లేకుండా పిటిషనర్ చేశారనే ఆరోపణలు కూడా లేవని స్పష్టం చేసింది. అదేవిధంగా, పిటిషనర్, కుటుంబంతో కలిసి తన కుమారుడితో బంధం తెంచుకోవాలని మృతురాలిపై ఒత్తిడి చేసినట్లు కూడా చూపలేకపోయారని ధర్మాసనం తెలిపింది. ప్రియురాలితో తన కుమారుడి వివాహానికి పిటిషనర్ నిరాకరించినా ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఒత్తిడి చేసినట్లుగా భావించలేమని తెలిపింది. వాస్తవానికి మృతురాలి కుటుంబానికే ఈ పెళ్లి ఇష్టం లేదన్నది నిజమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'నా కుమారుడిని పెళ్లి చేసుకోకుండా నీవు బతకలేవా?' అంటూ పిటిషనర్ చేసిన వ్యాఖ్యలను కూడా ఐపీసీలోని సెక్షన్ 306ను అనుసరించి తీవ్రమైన ఆత్మహత్య నిర్ణయానికి కారణమని చెప్పలేమంది.

బీజేపీ నేతలు నరక వాసులు: ఖర్గే

దేశ స్వాతంత్ర్యం కోసం వాళ్లేమీ చేయలేదు

బెంగళూరు: కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆదివారం బీజేపీ నేతలపై నిప్పులు చెరిగారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు గానీ, సమాజం కోసం, ఆర్థిక వ్యవస్థ బాగుకోసం వీళ్లు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదంటూ ఆయన బీజేపీ నేతలను నరక వాసులుగా అభివర్ణించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన కాంగ్రెస్ దేశ ఐక్యత కోసం కృషి చేస్తోందని చెప్పారు. ధనికులు, పలుకుబడి కలిగిన వారికే లబ్ధి కలుగజేస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను మాత్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

త్రివేణి సంగమం భక్తజనసాగరం

ఆదివారం 1.25 కోట్ల మంది

మహాకుంభ్ నగర్: మౌనీ అమావాస్య దగ్గర పడుతుండటంతో మహాకుంభమేళాలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. శుక్రవారం, శనివారం ఏకంగా 1.25 కోట్లకుపైగా జనాలు త్రివేణి సంగమ స్థలిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం మధ్యాహ్నంనాటికే 1.17 కోట్ల మంది పవిత్రస్నానాలుచేశారని అధికారులు చెప్పారు. జనవరి 29వ తేదీన మౌనీ అమావాస్య రోజు పవిత్ర స్నానాలు ఆచరించేందుకు వస్తున్న భక్తులతో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సమీప రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, జాతీయరహదారులు కిక్కిరిసిపోయాయి. మౌనీఅమావాస్య రోజున 10 కోట్ల మంది పుణ్యస్నానాలు చేయొచ్చని అంచనావేస్తున్నారు. భక్తులు నడిచే వచ్చేందుకు అనువుగా వాహనాలను చాలా దూరంలోనే ఆపేస్తున్నారు. ప్రతిచోటా 'నో వెహికల్' జోన్ ప్రకటించారు. ఎక్కువ మంది భక్తులు పోటెత్తితే ప్రమాదం జరక్కుండా ఉండేందుకు మరో వరస బ్యారికేడ్లను ఏర్పాటుచేస్తున్నారు. అమృత్‌స్నాన్ నేపథ్యంలో స్నానానికి వెళ్లేవాళ్లు, తిరిగొచ్చే వాళ్లకు ఇబ్బంది రాకుండా అదనపు ఏర్పాట్లూ చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్‌ను క్రియాశీలం చేశారు. ఇసకేస్తే రాలనంత జనం పోగుబడే చోట అత్యయక స్పందనా దళాలను రంగంలోకి దింపారు. అనుమానాస్పద వ్యక్తులను గమనించేందుకు నిఘాను పటిష్టం చేశారు. నడిచేందుకు ఉద్దేశించిన ప్రాంతాల్లో ఎవరైనా అక్రమంగా చిన్నపాటి తాత్కాలిక దుకాణాలు తెరిస్తే వెంటనే మూయించేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కుదిరినంత వరకు సమీప పార్కింగ్ ప్రాంతాలకు వాహనాలను అనుమతించి, ఆ తర్వాత దూరంగా ఉన్న ప్రత్యామ్నాయ పార్కింగ్ జోన్లకు వాహనాలను తరలిస్తున్నారు. భక్తులు త్రివేణి సంగమ స్థలిలో గందరగోళ పడకుండా అదనంగా మరో 2,000 మార్గసూచీ బోర్డ్‌లను ఏర్పాటుచేశారు. మహాకుంభమేళా సమస్త సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించే ఏఐ చాట్‌బాట్‌ను స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని అక్కడి యంత్రాంగం భక్తులను ప్రోత్సహిస్తోంది. సరైన మార్గం చూపేందుకు సహాయక సిబ్బంది అనుక్షణం అందుబాటులో ఉంటున్నారు. ఆదివారం సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పుణ్యస్నానంచేశారు. ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ కేబినెట్‌పై విమర్శలు గుప్పించారు. '' కేబినెట్ భేటీ తర్వాత మంత్రులంతా పుణ్యస్నానాలు చేయడంతోపాటు ఒకరిపై మరొకరు నీళ్లు చిమ్ముకుంటూ వాటర్ గేమ్స్ ఆడుతున్నారు. జనం ఇక్కడికొచ్చేది భక్తిశ్రద్ధలతో. మీలా ఆటలాడటానికి కాదు'' అని చురకలంటించారు.



ఆదివారం కుంభమేళాకు పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) పుణ్యస్నానం చేస్తున్న అఖిలేశ్

లెబనాన్‌లో ఇజ్రాయెల్ కాల్పులు 22 మంది మృతి

బీరూట్: లెబనాన్‌లో తిష్ట వేసిన ఇజ్రాయెల్ ఆర్మీ వెనక్కి వెళ్లిపోవాలంటూ ప్రజలు చేపట్టిన నిరసన ఆదివారం హింసాత్మక రూపు దాల్చింది. సరిహద్దులకు సమీపంలోని డజనుకు పైగా గ్రామాల్లో నిరసనకారులపై ఇజ్రాయెల్ సైన్యం జరిపిన కాల్పుల్లో 22 మంది మరణించారు. 124 మంది క్షతగాత్రులయ్యారు. లెబనాన్ ప్రాదేశిక సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే పరిణామాలను ఉపేక్షించబోమని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ చెప్పారు. హెజ్‌బొల్లాతో గత నవంబర్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం 60 రోజుల గడువులోగా ఆక్రమిత భూభాగం నుంచి ఇజ్రాయెల్ వైదొలగాల్సి ఉంది. కానీ అందుకు ఆ దేశం ససేమిరా అంటోంది. దీనిపై ప్రజలు భారీగా నిరసనలకు దిగుతున్నారు.

సూడాన్ ఆస్పత్రిలో మారణకాండ 70 మంది మృత్యువాత

దుబాయ్: ఆఫ్రికా దేశం సూడాన్‌లోని ఎల్ ఫషెర్ నగరంలోని సౌదీ ప్రసూతి వైద్యశాలపై జరిగిన దాడిలో కనీసం 70 మంది చనిపోయారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ ఘెబ్రెయెసుస్ ఆదివారం ఈ విషయం వెల్లడించారు. ప్రభుత్వ బలగాలతో జరుగుతున్న పోరులో భాగంగా ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్ఎస్ఎఫ్) ఉత్తర దార్ఫుర్ ప్రావిన్స్ రాజధాని నగరాన్ని దిగ్బంధించింది. ఎల్ ఫషెర్ నగరంలో ఈ ఒక్క ఆస్పత్రి మాత్రమే పనిచేస్తోంది.

పెద్దలకు రుణమాఫీయే బీజేపీ మోడల్

ఉచిత సంక్షేమ పథకాలు ఆప్ మోడల్:కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లలో 400–500 మంది సన్నిహితులు, బడా పారిశ్రామికవేత్తలకు రూ.10 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఆదివారం ఆరోపించారు. కేవలం ఇద్దరు స్నేహితులకే రూ.50 వేల కోట్లు మాఫీ చేశారన్నారు. సంపన్నులకు రుణాల మాఫీ బీజేపీ మోడల్ కాగా.. ఉచిత, సంక్షేమ పథకాలు అమలు చేయడం ఆప్ మోడల్ అని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దేశాన్ని కాపాడే ఎన్నికలన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు గుజరాత్ పోలీసులను ఎన్నికల సంఘం పంపడంపై కేజ్రీవాల్ విస్మయం వ్యక్తం చేశారు. గుజరాత్ నుంచి ఎనిమిది కంపెనీల రాష్ట్ర రిజర్వు పోలీస్ ఫోర్స్(ఎస్ఆర్‌పీఎఫ్)ను ఢిల్లీ ఎన్నికల కోసం పంపేందుకు ఉద్దేశించిన ఉత్తర్వు కాపీని కేజ్రీవాల్ ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.



కడుపునొప్పితో వస్తే కాటికి పంపేశారు!

కడుపు నొప్పితో వస్తే కాటికి పంపారని మృతుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన ఆదివారం బోయిన్‌పల్లి పరిధిలో చోటుచేసుకుంది. -8లో



స'కలం'.. సంగమం..

హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. ఓ రకంగా ఇది సకలం.. సంగమం అన్నట్లు.. సందర్శకులతో సందడిగా మారింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/17.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రత్యేక పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనతో పాటు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడంలో విశేష కృషి చేసిన హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా అనుదీప్ ప్రత్యేక పురస్కారం, ప్రశంస పత్రం అందుకున్నారు.



గణతంత్రం.. జయహో..

మువ్వన్నెలు మురిశాయి. రిపబ్లిక్ డే వేడుకలు మెరిశాయి. ఆదివారం నగర వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ప్రధానంగా పరేడ్ గ్రౌండ్, అసెంబ్లీ, సచివాలయం, రైల్వే స్టేషన్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో మూడు రంగుల జెండాలు ఘనంగా ఎగిరాయి. జాతీయ గీతాలాపనలు దేశభక్తిని ఇనుమడింపజేశాయి. రాజ్యాంగ స్ఫూర్తిని ద్విగుణీకృతం చేశాయి. సాంస్కృతిక ప్రదర్శనలతో అంతటా సందడి నెలకొంది. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కవాతు అలరించింది. జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.







సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కవాతు.. జాగిలం విన్యాసం

గ్రేటర్‌లో ప్రగతి పరుగులు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: గ్రేటర్ పరిధిలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించే దిశగా కృషి చేస్తామని, మహానగరంలో ప్రగతి పరుగులు పెడుతోందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో వార్డుల వారీగా గ్రామ సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డిలతో కలిసి కమిషనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, బడ్జెట్‌లో బల్దియాకు రూ. 3,065 కోట్లను కేటాయించి అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వం వినూత్న పథకాల రూపకల్పనతో నగర వాసుల ఇబ్బందులను తొలగించేందుకు మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు కమిషనర్ ఇలంబర్తి వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, పంకజ, గీత రాధిక, సుభద్రా దేవి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సీఈలు భాస్కర్ రెడ్డి, కోటేశ్వర రావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.





జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కమిషనర్ ఇలంబర్తి, చిత్రంలో మేయర్ విజయలక్ష్మి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రయత్నిస్తున్నామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం హైదరాబాద్ కలెక్టరేట్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను అగ్రభాగంలో నిలపడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జెండా ఎగురవేస్తున్న అనుదీప్

షాదీకి డుమ్మా కొట్టాడు!

- ఆచూకీ లేని పెళ్లికొడుకు
- ఠాణా మెట్లెక్కిన వధువు

బంజారాహిల్స్: కొద్ది గంటల్లో వివాహం. అతిథులంతా వచ్చేశారు. విందు భోజనానికి రుచికరమైన ఆహార పదార్థాలు సిద్ధంగా ఉంచారు. పరిణయ ఘడియలు సమీపించడంతో నవ వధువును తీసుకువచ్చారు. వరుడి రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఎంతసేపైనా అతని జాడ లేకుండాపోయింది. అర్ధరాత్రి దాటినా ఆచూకీ లేకపోవడంతో ఫోన్ చేశారు. అటునుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వధువు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలు, బంధువులు చెప్పిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఫస్ట్‌లాన్సర్ ఖాజా నగర్‌కు చెందిన చెఫ్‌గా పని చేసే యువకుడికి ఓ యువతితో అయిదేళ్ల క్రితం పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి పలుమార్లు ఆమెను లైంగికంగా వేధించాడు. తనను షాదీ చేసుకోవాలని ఎన్నిసార్లు అడిగినా దాటవేస్తూ వచ్చాడు. చివరకు ఈ నెల 25న పెళ్లికి ఏర్పాట్లు చేసుకొని బంధువులకు శుభలేఖలు కూడా పంచారు. కాగా.. సదరు యువకుడు ఫంక్షన్‌కు రాకపోగా ప్రియురాలు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. మోసపోయానని తెలుసుకొన్న బాధితురాలు ఫిర్యాదు చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలోకి మున్సిపాలిటీలు

సాక్షి, సిటీబ్యూరో: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకమండళ్ల గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో ఆయా పురపాలికలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లాయి. ప్రభుత్వం ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, మీర్‌పేట, పెద్ద అంబర్‌పేట, షాద్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. తుక్కుగూడ, జల్‌పల్లి ఆమనగల్లు మున్సిపాలిటీలకు బి.శ్రీనివాస్ (జేడీఎంఏ)ను ప్రకటించింది. బడంగ్‌పేటకు సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని ప్రత్యేక అధికారిగా నియమించింది. బండ్లగూడ జాగీర్, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీలకు పి.శ్రీధర్‌ను, శంకర్‌పల్లి మున్సిపాలిటీకి వి. సాయినాథ్‌ను, మణికొండ మున్సిపాలిటీకి జె.శ్రీనివాసరావును ప్రత్యేక అధికారులుగా నియమించింది.

ఫండ్స్ ప్లీజ్!

'మురుగు' ప్రాజెక్టుపై రాష్ట్ర సర్కారు ఆశలు

- సీవరేజీ మాస్టర్ ప్లాన్ డీపీఆర్ రెడీ
- కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పణ
- నిధుల రాక కోసం ఎదురుచూపులు

సాక్షి, సిటీబ్యూరో: నలువైపులా విస్తరిస్తున్న మహానగర పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్, మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధులపైనే ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ ప్రక్షాళనలో భాగంగా నదిలో మురుగు నీరు చేరకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. కేంద్రానికి సమగ్ర నివేదికలు సమర్పించింది. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించగా, తాజాగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

పురాతన పైపులైన్..

హైదరాబాద్ నగరంలో ఏళ్లనాటి మురుగు పైపులైన్ వ్యవస్థ కొనసాగుతోంది. శివారుతో పాటు ఓఆర్‌ఆర్ పరిధిలో సైతం సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదు. గతంలో పంచాయతీలుగా ఉన్నప్పుడు వేసిన మురుగు కాల్వలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 9,769 కిలోమీటర్ల మేర మాత్రమే పైపులైన్ నెట్‌వర్క్ విస్తరించి ఉంది. కొత్తగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,656 కి.మీ, ఓఆర్‌ఆర్ పరిధిలో 4,378 కి.మీ విస్తరించాలని ప్రతిపాదనలు ఉన్నా.. ఇవి పెండింగ్‌లోనే మగ్గుతున్నాయి. దీంతో సమగ్ర కార్యాచరణతో మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

రూ.17,212 కోట్లతో సీఎస్‌ఎంపీ..

❖ మహా నగరంతోపాటు శివారులోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగునీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూపొందించిన హైదరాబాద్ 'సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ (సీఎస్‌ఎంపీ)' ప్రాజెక్టు కోసం సుమారు రూ.17,212.69 కోట్ల నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కేంద్రం అమృత్ పథకం 2.0 కింద మాస్టర్ ప్లాన్‌ను చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఆర్థిక చేయూత అందించాలని కేంద్రానికి ప్రతిపాదించింది. నగరంతో పాటు శివారు, ఓఆర్‌ఆర్ వరకు విస్తరించిన స్థానిక సంస్థల (యూఎల్‌బీ) పరిధిలో సుమారు 7,034 కి.మీ పొడవున మురుగునీటి పైపులైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించింది.



❖ మొత్తం మీద ఓఆర్‌ఆర్ యూఎల్‌బీల పరిధిలో పురపాలక సంఘాలను కలుపుకొని సుమారు 4,378 కి.మీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని శివారు, కోర్ సిటీ పరిధిని కలుపుకొని దాదాపు 2,656 కి.మీ పొడవున సీవరేజీ నెట్ వర్క్ పైపులైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా జీహెచ్‌ఎంసీలోని శివారు పరిధిలో మూడు ప్యాకేజీల్లో తొమ్మిది సర్కిళ్లు కలుపుకొని 2,232 కి.మీ, కోర్‌సిటీ పరిధిలోని నాలుగు జోన్లలో 424 కి. మీ పైపులైన్ నెట్‌వర్క్ విస్తరణకు సిద్ధమైంది. ప్యాకేజీ-1 కింద ఉప్పల్, కాప్రా, అల్వాల్, శేరిలింగంపల్లి మల్కాజిగిరి సర్కిళ్లలో.. ప్యాకేజీ-2 కింద రాజేంద్రనగర్, ఎల్బీనగర్ సర్కిళ్లలో, ప్యాకేజీ-3 కింద కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సర్కిళ్లలో పైపులైన్ విస్తరణ చేపట్టాలని ప్రణాళిక రూపొందించింది.

రూ. 10 వేల కోట్లతో మురుగు కట్టడి

❖ మూసీ ప్రక్షాళనలో భాగంగా నదిలో మురుగు నీరు చేరకుండా ఇరువైపులా 55 కి.మీ. (మొత్తం 110 కి.మీ) కాల్వలు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాల ప్రాజెక్టుకు రూపకల్పన చేసి రూ. 10 వేల కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించింది. వాస్తవంగా మహా నగర మురుగు 80 శాతానికిపైగా మూసీలోనే చేరుతోంది. మిగిలిన 20 శాతం స్థానిక చెరువుల్లో కలుస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో మురుగు నీరు మూసీలో చేరకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. కేవలం

❖ మూసీపై మురుగు నీటి శుద్ధి కోసం సుమారు 62 సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు సుమారు రూ. 4వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1650 ఎంఎల్డీలు ఉత్పత్తి అవుతుండగా.. మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. ఇప్పటికే మూడు ప్యాకేజీల్లో 25 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మించి సుమారు 1259.50 ఎంఎల్‌డీల మురుగునీటిని శుద్ధి చేసేందుకు సిద్ధమైంది. ఇటీవల మంజూరైన అమృత్ పథకం కింద 39 ఎస్టీపీలకు టెండర్లను ఆహ్వానించింది. తాజాగా మూసీలో పూర్తిగా శుద్ధి చేసిన జలాలు వదిలే విధంగా మరికొన్ని ఎస్టీపీల నిర్మాణాలకు ప్రతిపాదించింది.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం: గవర్నర్

హుస్సేన్ సాగర్ తీరంలో ఘనంగా భారతమాతకు మహా హారతి

ఖైరతాబాద్: హుస్సేన్‌సాగర్ తీరంలో దేశభక్తి ఉప్పొంగింది. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన భారతమాతకు మహాహారతి కార్యక్రమం వైభవంగా సాగింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమన్నారు. అందరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. భారతమాత భారతదేశానికి ప్రతీక అన్నారు. ప్రతి ఒక్కరూ సమభావన కలిగి ఉండాలన్నారు. సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఆలపించిన 'పుణ్యభూమి నా దేశం నమో నమామి' పాట అందరినీ ఆకట్టుకుంది. మాతృభక్తి, దేశభక్తి ఉన్నవారి జీవితం విరాజిల్లుతుందని అవధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. సంప్రదాయ నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పాయల శంకర్, చంద్రశేఖర్, చింతల రామచంద్రారెడ్డి, బాలలత, డాక్టర్ రమేష్, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

నుమాయిష్‌కు పోటెత్తారు!

నుమాయిష్‌కు సందర్శకులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం, గణతంత్ర వేడుకలు కావడంతో దాదాపు 80 వేల మంది సందర్శకులు వచ్చినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, బుకింగ్ కన్వీనర్ వనం సత్యేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అటవీ, కార్మిక, జైళ్ల శాఖలతో పాటు పలు శాఖల స్టాళ్లలో ప్రభుత్వ పథకాలు, ప్రగతిపై సందర్శకులకు వివరించినట్లు పేర్కొన్నారు. -అబిడ్స్




మూసీ దారి.. వాణిజ్య నగరి!

- జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు అభివృద్ధి
- 21 కి.మీ మార్గంలో కొత్తగా వాణిజ్య నగరి నిర్మాణం
- 2030 నాటికి మూసీ పునరుజ్జీవం పూర్తి చేయాలని లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: కాలుష్య కాసారంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. తొలి దశలో ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న మూసీ నది సుందరీకరణకు అధికారులు నిర్ణయించారు. దీంతో పాటు మూసీ వెంట ఇరువైపులా 21 కి.మీ. మేర కొత్త వాణిజ్య నగరిని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు మూసీ, వాణిజ్య ప్రాంతం అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్‌ను రూపొందించనున్నారు. తొలుత మల్లన్న సాగర్ నుంచి మూసీకి ప్రత్యేకంగా ట్రంక్ పైపులైన్ ద్వారా నీటిని తరలించి.. మూసీని శుద్ధి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో పైపులైన్ టెండర్లను సైతం ఖరారు చేయనున్నట్లు సమాచారం.

ఫేజ్-1లో ఇలా..

ఫేజ్-1లో మూసీ ప్రాజెక్ట్ కోసం రూ.5,863 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో రూ.4,100 కోట్లు ప్రపంచ బ్యాంకు రుణంగా తీసుకోనుండగా.. మిగిలిన రూ.1,763 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఈ ఏడాది బాపుఘాట్ వద్ద 90 శాతం పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



ఫేజ్-2లో నాగోల్ టు బాచారం..

నగరంలో మూసీ ప్రవహించే 55 కి.మీ మార్గాన్ని దశల వారీగా చేపట్టనున్నారు. ఫేజ్- 2లో నాగోల్ నుంచి బాచారం వరకూ మూసీ సుందరీకరణకు నిర్ణయించారు. 2030 నాటికి మూసీ పునరుజ్జీవం మొత్తం పూర్తయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. నాలుగు భాగాలుగా మూసీకి పునరుజ్జీవం కల్పించనున్నారు. తొలుత నదీ జలాల శుద్ధితో పాటు వర్షపునీటి నిర్వహణ, వ్యర్థాలు, వరదల నియంత్రణ వ్యవస్థ, రెండో దశలో ల్యాండ్ స్కేపింగ్ అభివృద్ధి, మూడో దశలో మూసీ పరీవాహక కారిడార్లలో రవాణా హబ్‌ల ఏర్పాటు, చివరగా ఆదాయార్జన కోసం మూసీ చుట్టూ వాణిజ్య, సాంస్కృతిక వనరులను అభివృద్ధి చేయడం.

గ్రీన్ బాండ్ల జారీ..

మూసీ సుందరీకరణకు అయ్యే వ్యయాన్ని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా సమీకరించనున్నారు. పర్యాటకం, ఆతిథ్యం, స్థిరాస్తి రంగాల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) కింద నిధులను సమీకరించనున్నారు. ఆయా నిధులను సమకూర్చే సంస్థలకు గ్రీన్ బాండ్లను జారీ చేయనున్నారు. అలాగే మూసీ చుట్టూ ఉమ్మడి అభివృద్ధి ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు స్పాన్సర్ షిప్‌లు, పర్యాటక ప్రాంతాలతో ఆదాయ వనరులను సృష్టించనున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు అమలుకు చర్యలు చేపట్టిందని ఎమ్మెల్సీ, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలను మండలంలోని సుల్తాన్‌పల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు హామీలను అమలు చేసిందని, మిగిలిన హామీలను అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయనడానికి సుల్తాన్‌పల్లి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: తెలుగు విశ్వ విద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరుతూ ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు దేశ చరిత్రతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో అమరుడిగా నిలిచి పోయారన్నారు. పొట్టి శ్రీరాములు పేరు తొలగిస్తే ఆయన త్యాగాన్ని అవమానించినట్లేనన్నారు. ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగిస్తామని ప్రకటన చేసేవరకు తన దీక్ష కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల రామేశం, తెలుగు భాషా ప్రయుక్త అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆనంద్‌బాబు



బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయం



ఆనంద్‌బాబు

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీని ప్రకటించింది. చైర్మన్‌గా ఆనంద్ బాబు, వైస్ చైర్మన్‌గా డీబీ దేవేందర్‌లతో పాటు మరో 12 మంది సాధారణ సభ్యులు, నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులతో పాటు మొత్తం 18 మందితో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి ఎం. రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ యార్డుగా గుర్తింపు పొందిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్ తరలింపుతో ఏర్పాటైన ఈ మార్కెట్ యార్డు రాష్ట్రంలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ కావడం గమనార్హం. నగరంలోని పలు రైతుబజార్‌లు, మార్కెట్‌యార్డుల నిర్వహణ బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ పరిధిలోకే వస్తుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యుల ఎంపిక ప్రాధాన్యం సంతరించుకుంది. గత ప్రభుత్వ హయాంలో వరుసగా మూడుసార్లు బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తులనే చైర్మన్‌గా నియమించారు. 2023లో స్థానిక నేత, నాటి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అనుచరుడు ఆనంద్ బాబు సతీమణి హారికకు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అయితే కొన్ని నెలల్లోనే హన్మంతరావు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆమెను పదవి నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. కోర్టు ఆదేశాలతో ఆమెకు తాత్కాలిక ఉపశమనం కలిగినప్పటికీ, ప్రభుత్వం మారడంతో పదవిని కోల్పోవాల్సి వచ్చింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఆనంద్ బాబు చైర్మన్‌గా కమిటీ ప్రకటన లాంచనమే అని అందరూ భావించారు. అయితే పార్టీలోని పలువురు నేతలు పోటీపడడంతో జాబితాలో పేర్లు మారుతూ వచ్చాయి. ఎట్టకేలకు చైర్మన్‌గా ఆనంద్‌బాబు, వైఎస్ చైర్మన్‌గా దేవేందర్, సభ్యులుగా అంకాల సాయి శరత్, దోమల సంతోష్ కుమార్, సంతూ జూలియస్, సీ. ఎం. రామన్, బి. కృష్ణారెడ్డి, కాసారం దుర్గేశ్ గౌడ్, సిద్దాపురం ఆకాశ్‌రెడ్డి, అజాజ్ పాషా, నల్లోల రాజేందర్, ఎండీ అస్లామ్ సోఫీ, ఎల్‌పి గౌతమ్, ఎస్. ప్రభాకర్‌లను నియమించారు.

కడుపునొప్పితో వస్తే
కాటికి పంపేశారు!



- వికటించిన హోమియో వైద్యుడి చికిత్స?
- ఆసుపత్రి ఎదుట బాధితుల ఆందోళన
- మంత్రి ఆదేశాలతో ఆలస్యంగా కదిలిన యంత్రాంగం
- ఆసుపత్రిలో తనిఖీలు, కీలక పత్రాలు స్వాధీనం



మధుసూదన్ గౌడ్ (ఫైల్)

కంటోన్మెంట్: కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరితే కాటికి పంపారని, అర్హత, అనుభవం లేని డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తమ బంధువు చనిపోయాడంటూ మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టిన సంఘటన ఆదివారం. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లికి చెందిన మధుసూదన్ గౌడ్ కడుపునొప్పితో బాధపడుతుండటంతో, కుటుంబ సభ్యులు అతడిని శనివారం స్థానిక వీఆర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి సిబ్బంది సూచన మేరకు రాత్రి అక్కడే ఉంచారు. మర్నాడు ఉదయం మధుసూదన్ పరిస్థితి విషమించినట్లు చెప్పడంతో కుటుంబసభ్యులు అతడిని మరో ఆసుపత్రికి తీసుకెళతామని చెప్పారు. అయితే అందుకు నిరాకరించిన ఆసుపత్రి యాజమాన్యం ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10.00 గంటల సమయంలో మధుసూదన్ గౌడ్ మృతి చెందినట్లు చెప్పిన ఆసుపత్రి నిర్వాహకులు, అంబులెన్స్‌లో నేరుగా మృతదేహాన్ని అతడి ఇంటికి తరలించారు. మధుసూదన్‌గౌడ్ మృతిపై అనుమానం వ్యక్తం చేసిన బంధువులు, తిరిగి మృతదేహాన్ని తీసుకువచ్చి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అర్హత, అనుభవం లేని వైద్యుడితో చికిత్స చేయించారని ఆరోపిస్తూ ఆసుపత్రిపై దాడికి యత్నించారు. దీంతో అక్కడికి వచ్చిన స్థానిక నాయకుడు ఆసుపత్రి యాజమాన్యం తరపున బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో మరింత ఆగ్రహానికి లోనైన మృతుడి బంధువులు సదరు నేతపై దాడికి యత్నించారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అతను అక్కడి నుంచి జారుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి ఆదేశాలతో...

మృతుడి బంధువులు ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి సూచించడంతో పోలీసులు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఆదివారం ఉదయం ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం మృతుడి చికిత్సకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అతడికి చికిత్స చేసిన డాక్టర్ అర్హతతో పాటు మందుల వివరాలను సేకరించారు. అనుమతులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు.

మణిదీప్‌కు కమెండేషన్ అవార్డు



సనత్‌నగర్: సామాజిక సేవలకు గుర్తింపుగా రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్ మణిదీప్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా ఆదివారం ఆయన కమెండేషన్ అవార్డును అందుకున్నారు. 2024 వరదలతో ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. ఆ సమయంలో మణిదీప్ వారికి అండగా నిలబడి అవసరమైన వస్తువులను సేకరించి.. పంపిణీ చేశారు. కరోనా సమయంలోనూ పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన చేసిన సేవలకు గాను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

రసూల్‌పురా: తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 19న రాత్రి పలు దుకాణాల షట్టర్లు తెరిచి చోరీలకు పాల్పడిన కేసులో ఓ మైనర్‌తో పాటు మరో ఇద్దరు దొంగలను నార్త్‌జోన్ ప్రత్యేక క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఓ ఆయుధం, షట్టర్ లిఫ్ట్ చేసే ఇనుపరాడ్డు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ పాముల బస్తీకి చెందిన రాజేందర్ సింగ్, బాన్స్‌వాడకు చెందిన బండా సింగ్, మరో మైనర్ (17)తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 19న రాత్రి వీరు కార్ఖాన, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 12 షాపుల షట్టర్ల తాళాలు పగులగొట్టి నగదు చోరీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏసీపీ రమేష్ నేతృత్వంలో తిరుమలగిరి సీఐ నాగరాజుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వంద సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు వాటి ఆధారంగా నిందితులను గుర్తించారు. వారు నిజామాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో ఆదివారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చేతికి గ్లౌజ్..ముఖానికి మాస్క్..

చోరీలు చేసేందుకు నగరానికి వచ్చే వీరు సిటీకి చేరుకోగానే బైక్‌లు చోరీ చేస్తారు. సదరు బైక్‌లపై తిరుగుతూ వ్యాపార సముదాయాల వద్ద రెక్కీ నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న షాపులపై రాత్రి వేళల్లో పంజా విసిరేవారు. వేలి ముద్రలు దొరక్కుండా చేతికి తొడుగులు, ముఖాలకు మాస్కులు ధరించేవారు. పథకం ప్రకారం షట్టర్లు లిఫ్ట్ చేసి చోరీలకు పాల్పడే వీరు పని పూర్తయిన వెంటనే బైక్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లకు చేరుకుని అక్కడి నుంచి నిజామాబాద్‌కు చేరుకునేవారు. తిరుమలగిరి, కార్ఖానా పీఎస్‌ల పరిధిలో చోరీలకు ముందు వీరు గాంధీ హాస్పిటల్ పార్కింగ్‌లో బైక్ దొంగిలించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వీరికి 23 కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు డీసీపీ పేర్కొన్నారు. కేసును ఛేదించిన సీఐ నాగరాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శివరావు, ఎస్ఐ ప్రశాంత్, పీసీలు ప్రశాంత్, మహేందర్, భానుచందర్‌లను డీసీపీ అభినందించారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్

మొయినాబాద్: అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆదివారం ప్రజాపాలన ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తామన్నారు. అర్హులు ఎవరికైనా పథకాలు రాకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వెంటనే అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఐఐ 5కే వాకథాన్



మాదాపూర్: సీఐఐ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా 5కే వాకథాన్‌ను నిర్వహించారు. ఐజీబీసీ కార్యాలయం నుంచి హైటెక్స్ వరకు కొనసాగిన ఈ వాకథాన్‌లో సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ బిల్డింగ్ పితామహుడు స్వర్గీయ ప్రేమ్‌సిజైన్ కు నివాళులర్పించారు. ఐజీబీసీ జాతీయ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వాకింగ్ దైనందిన జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐఐ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. ఆనంద్, ఐజీబీసీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శ్రీనివాస్ మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

84వ సారి రక్తదానం...



సాక్షి, సిటీబ్యూరో: సాధికార ఇన్సూరెన్స్ కన్సల్టింగ్ ఐఎంఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ప్రభాకర్ ఏడునూతల విద్యానగర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరంలో 84వ సారి రక్తదానం చేశారు. ఆయనతో పాటు అతడి కుమారుడు ఏవీఎస్ అభిరామ్ (18) తొలిసారిగా రక్తదానం చేశారు. తండ్రిని అనుసరించి అభిరామ్ కూడా ప్రతి 90 రోజులకు ఒకసారి రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రక్తదాన ప్రచారానికి కృషి చేసినందుకు గాను ప్రభాకర్ 2010, 2011, 2013, 2015లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.

విక్రమ్ సింగ్ మాన్‌కు ప్రశంసాపత్రం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గత ఏడాది జరిగిన ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాలను సమర్థంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసాపత్రం ప్రకటించింది. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం మాన్‌కు శనివారం రాష్ట్రపతి పతకం ప్రకటించిన విషయం విదితమే.

పురాణాలతో యువత ప్రేరణ పొందాలి



మాట్లాడుతున్న దీపక్ ఓఘ్రా

వెంగళరావునగర్ : యువత పురాణాల ద్వారా ప్రేరణ పొందాలని, ప్రతి ఒక్కరూ తమ లోపల దాగి ఉన్న అంతర్గత శక్తిని వినియోగించుకోవాలని ఆర్మేనియా, సూడాన్, పోలాండ్ దేశాల అంబాసిడర్ డాక్టర్ దీపక్ ఓఘ్రా అన్నారు. వెంగళరావునగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దీపక్ ఓఘ్రా మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. ఇప్పటికే ఇండియా అన్ని రంగాల్లో అంతర్జాతీయ నాయకత్వాన్ని ప్రదర్శిస్తుందని, గతంలో మనం కోల్పోయిన సంపదను తిరిగి సాధిస్తున్నామని, ఇది మనకెంతో గర్వకారణమన్నారు. నలందా ప్రధాన నినాదం 'వుయ్ రూల్' స్కూల్ నినాదంలా కాకుండా యువతీ యువకులు గ్లోబల్ నినాదంగా మార్గనిర్దేశం చేయాలన్నారు. అనంతరం ఆయనను నలందా విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు, వైస్ చైర్మన్ సూర్యకాశ్యప్ వర్మ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ మూర్తి దేవరభట్ల, డాక్టర్ రమణ దేవరకొండ, డాక్టర్ రాంబాబు, స్కూల్ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులో సినీహీరో హర్షవర్ధన్ అరెస్ట్



హర్షవర్ధన్, సాంకేత్ శ్రీనివాస్

బంజారాహిల్స్: హిట్ అండ్ రన్ కేసులో సినీ హీరో సాధుల హర్షవర్ధన్‌తో పాటు అతడి స్నేహితుడు మాడే సాంకేత్ శ్రీనివాస్ అలియాస్ తేజను బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సమీపంలో శనివారం తెల్లవారుజామున అతి వేగంగా వచ్చిన కారు ఫుట్‌పాత్ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అక్కడ నిద్రిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..నిజామాబాద్ అర్బన్‌కు చెందిన హర్షవర్ధన్ సినిమా హీరోగా నటిస్తూ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని ఓ అపార్ట్‌మెంట్‌లో తన స్నేహితులు మాడే సాంకేత్ శ్రీనివాస్ అలియాస్ తేజ, వంశీ, రాకేష్‌లతో కలిసి ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగిన రాకేష్ తనను పికప్ చేసుకోవాలని ఫోన్ చేయడంతో హర్షవర్ధన్‌కు చెందిన కారులో బయలుదేరిన తేజ, కార్తీక్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 మీదుగా వేగంగా దూసుకెళ్తూ హిట్ అండ్ రన్‌కు పాల్పడ్డారు. తేజ కారు నడుపుతుండగా, కార్తీక్ పక్కన కూర్చున్నాడు. ఈ ఘటనతో భయాందోళనకు లోనైన తేజ, కార్తీక్‌తో పాటు గదిలో ఉన్న హర్షవర్ధన్, వంశీ తదితరులు కూడా పరారయ్యారు. పక్కా సమాచారంతో పోలీసులు వీరందరినీ అదుపులోకి తీసుకుని విచారించగా మిస్టరీ వీడింది. కారు హర్షవర్ధన్‌ది కాగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తేజ కారు నడిపి ఈ ప్రమాదానికి కారకుడయ్యాడు. ఈ నేపథ్యంలో కారు ఇచ్చిన హర్షవర్ధన్‌తో పాటు నడిపిన తేజపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుల, మతాంతర వివాహాలతో మెరుగైన సమాజం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి



కవాడిగూడ: మెరుగైన సమాజం కోసం కులాంతర, మతాంతర వివాహాలు ఎంతో అవసరమని తెలంగాణ హైకోర్టు జస్టిస్ డాక్టర్ గురజాల రాధారాణి అభిప్రాయపడ్డారు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారి పిల్లలు అత్యంత నైపుణ్యమంతమైన జెనెటిక్స్‌తో సమాజంలో రాణిస్తున్నారని ఆమె గుర్తు చేశారు. కులనిర్మూలన సంఘం 53వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఇందిరాపార్కులో కులాంతర, మతాంతర వివాహితుల మేళాను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ రాధారాణి, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, ప్రజా గాయకురాలు విమలక్క, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేశ్‌లు హాజరయ్యారు. ప్రజా గాయకురాలు విమలక్క మాట్లాడుతూ.. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ.. నేటికీ కులం పేరుతో మతం పేరుతో సమూహాలుగా విడిపోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కుల, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కులనిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎండి వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

మహా హారతిలో అపశ్రుతి

- హుస్సేన్ సాగర్‌లో బాణాసంచా పేల్చే క్రమంలో బోటుకు మంటలు అంటుకుని ప్రమాదం
- ఇద్దరికి గాయాలు, గాంధీ ఆస్పత్రికి తరలింపు





ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఆదివారం రాత్రి నిర్వహించిన భారత మాతకు మహా హారతి కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కార్యక్రమం చివర్లో మహా హారతులు ఇచ్చే సమయంలో హుస్సేన్‌సాగర్‌లో బాణా సంచా కాల్చేందుకు నీటిలో జెట్టి ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసి మెకనైజ్ బోట్ సాయంతో తారా జువ్వలను నీటిమీద నుంచి పైకి వదులుతున్నారు. ఈ క్రమంలో నిప్పురవ్వలు బాణాసంచా ఉంచిన బోట్, ప్లాట్‌ఫాంపై పడటంతో ఒక్కసారిగా బాణసంచా పేలి మంటలు అంటుకున్నాయి. భారీగా మంటలు ఎగిసిపడటంతో మెకనైజ్ బోట్‌తో పాటు జెట్టి ప్లాట్‌ఫాం దగ్ధమయ్యాయి. బోటు ఫైబర్‌తో తయారు చేసినది కావడంతో క్షణాల్లో మంటలు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన బోట్‌లలో ఉన్నవారు డబ్బాలతో నీటిని చల్లి మంటలు ఆర్పివేశారు. మంటలు ఎగసి పడటంతో సాగర్‌పై నల్లటి పొగలు కమ్ముకున్నాయి. బాణాసంచా కాల్చే సమయంలో జెట్టిపై, బోట్‌లో ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో డి.సునీల్ , ప్రణీత్ లకు గాయాలవడంతో గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయమేమీ లేదని వైద్యులు తెలిపారు.

జెక్ కాలనీలో ఫుడ్ ఫెస్ట్..

సనత్‌నగర్ : కాలనీ మహిళలంతా ఏకమై నలభీములను తలదన్నే రీతిలో రుచికరమైన వంటకాలను తయారుచేసి వావ్ అనిపించారు. తలో ఒక వంటకాన్ని తయారుచేసి ప్రదర్శనలో పాల్గొన్నారు. రుచికరమైన వంటకాలను కాలనీవాసులు లొట్టలేసుకుని ఆరగించారు. జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కాలనీ మొదటి వీధిలో నిర్వహించిన ఈ ఫుడ్ ఫెస్టివల్ విశేషంగా ఆకట్టుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలు ప్రదర్శించారు. దాదాపు 170 రకాల వంటకాలతో స్థానికులను ఆకట్టుకున్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందులతో ప్రభా అనంతరెడ్డి, అన్నపూర్ణ, భాగ్యలత, వాణి, అమరావతి, హైమావతి, హరితల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

ప్రత్యేక స్టాల్స్..

వంటకాలను తయారుచేసి తీసుకొచ్చిన వారి కోసం ప్రత్యేక స్టాల్స్ కేటాయించారు. స్టాల్స్ సందర్శించేందుకు వచ్చిన వారితో జెక్ కాలనీ మొదటి రోడ్డుతో పాటు నార్త్‌స్ట్రీట్ కిక్కిరిసింది. ఓ వైపు రుచికరమైన ఆహారం.. మరోవైపు వినసొంపైన సంగీతం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇంకోవైపు గ్రేట్ గాలా తంబోలాతో కాలనీవాసులు ఉత్సాహంగా గడిపారు. భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రక్తదాన శిబిరం



రహమత్‌నగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్బరీ వెల్ఫేర్ సొసైటీ, నిమ్స్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ పురం సైట్–1లో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానా ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు యండి జహంగీర్, యండి సత్తార్, అబ్రార్ అహ్మద్, యండి ఇషాక్, గులాం అలీ, సలావుద్దీన్, నయిమొద్దీన్, ఆరీఫ్, నిమ్స్ వైద్యులు డాక్టర్ రఘునాథ్, డా.నవ్య, కాంగ్రెస్ నాయకులు అశోక్, కాసాల మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేలోగా సామాన్లు మాయం

వెంగళరావునగర్: ఊరెళ్లి వచ్చేలోగా సామాన్లు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కడప ప్రాంతానికి చెందిన వెంకట కిశోర్ నగరంలోని జవహర్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 12న కుటుంబం మొత్తం స్వగ్రామానికి వెళ్లి శనివారం వచ్చి చూడగా ఇంట్లోని విలువైన వస్తువులు కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కిశోర్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్లి వచ్చేలోగా ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పల్నాడు ప్రాంతానికి చెందిన ఎస్.భరత్ స్థానిక మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 25వ తేదీ నైట్ డ్యూటీకి వెళ్లి ఆదివారం ఉదయం వచ్చాడు. అయితే హాస్టల్ ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

వెంగళరావునగర్: వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు మహిళలను మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ పీఎస్ పరిధిలోని జవహర్‌నగర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు జవహర్‌నగర్‌లోని ఓ గృహంపై దాడి చేశారు. ఈ దాడిలో వరలక్ష్మి అనే నిర్వాహకురాలు వివిధ జిల్లాల నుంచి మహిళలు, యువతులను ఇక్కడకు తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తుందని గుర్తించారు. కాగా దాడి సమయంలో వరలక్ష్మితోపాటు ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. అయితే ఈ సమయంలో పురుషులు ఎవరూ ఇంట్లో లేరు. వ్యభిచారం చేయించడానికి వరలక్ష్మికి స్థానికంగా నివాసం ఉండే నరేష్, చౌడేశ్వరి అనే ఇద్దరు సహకరిస్తున్నారు. పోలీసులు నిర్వాహకురాలితో పాటుగా ఇద్దరు మహిళలను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తూ వివాహితకు వేధింపులు

బంజారాహిల్స్: నిత్యం మద్యం, గంజాయి సేవిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఓ మహిళ భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఇందిరానగర్‌లో నివసించే ఆనంద్ (24) సినిమాలలో షూటింగ్‌లు చేస్తుంటాడు. గతేడాది ఓ యువతితో పెళ్లి జరిగింది. అయితే పెళ్లి నాటి నుంచి ఆనంద్ గంజాయి సేవిస్తూ అతడి భార్యను చిత్ర హింసలకు గురిచేస్తున్నాడు. అంతేకాకుండా తన అత్త పద్మ, ఆడపడుచు వరలక్ష్మిలు రూ. 20 లక్షలు అదనపు కట్నం తేవాలంటూ తీవ్రమైన వేధింపులకు పాల్పడుతున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆనంద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూకబ్జాదారులపై కేసు నమోదు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా అందులో ఉన్న ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించిన బస్తీ నేతలు సలీంతో పాటు నషీద్‌పై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. జ్ఞానిజైల్‌సింగ్ నగర్‌లోని ప్రభుత్వ స్థలంలోకి సలీంతో పాటు నషీద్ అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు వెళ్లి అక్రమ నిర్మాణాలు నిలిపివేశారు. అనంతరం షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించవద్దని పలుమార్లు హెచ్చరించినా వీరు వినిపించుకోకుండా నిర్మాణాలు చేపట్టడానికి యత్నిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సలీం, నషీద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సోమాజీగూడలో జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి



నందినగర్‌లో మాజీ కార్పొరేటర్ బీ భారతీనాయక్



కేబీఆర్ పార్కు వద్ద కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



సోమాజీగూడలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి



వెంగళరావునగర్‌లో... హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఫిలింనగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



వివేకానంద హైస్కూల్‌లో..



జనశక్తి పార్టీ కార్యాలయంలో కొమ్మినేని వికాస్

మువ్వన్నెల జెండా ఎగరంగ..
మనసు మురవంగ..

ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు

76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజ్యాంగం రూపకల్పనతోనే ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ లభించాయన్నారు. దేశ పౌరుడిగా అవసరమైన సమయంలో దేశానికి సేవ చేసి రుణం తీర్చుకోవాలన్నారు. – బంజారాహిల్స్



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



గాయత్రీహిల్స్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్



కేబీఆర్ పార్కు వద్ద మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఉదయ్‌నగర్ సరస్వతీ హైస్కూల్‌లో..



ఇందిరానగర్‌లో షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతిగౌడ్



జెండావిష్కరిస్తున్న జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నేత మామిడి నర్సింగరావు



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో నృత్య ప్రదర్శనలు



వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి



బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో



వేడుకల్లో ఆశ్రయ్-ఆకృతి బధిర విద్యార్థుల ప్రదర్శనలు



ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఎన్ రెడ్డి



బోరబండలో బాబాఫసియుద్దీన్



ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో



లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో..



సాయిరాం స్కూల్‌లో...



లోక్‌దళ్ పార్టీ కార్యాలయంలో..



శ్రీసాయిసరస్వతి విద్యానికేతన్‌లో...

రాజ్యాంగంతోనే రిజర్వేషన్ ఫలాలు



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి తదితరులు

రహమత్‌నగర్: రాజ్యాంగం మూలంగానే రిజర్వేషన్ ఫలాలు దేశ ప్రజలకు అందుతున్నాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో స్టడీ ఫర్ దళిత్ సెంటర్(సీడీఎస్)లో ఆదివారం నిర్వహించిన '75 ఏళ్ల భారత రాజ్యాంగ ప్రయాణంలో భారత రాజ్యాంగం, సామాజిక, ఆర్థిక, న్యాయ సాధనలో సమీక్ష' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో పలువురు న్యాయ కోవిదులు, మేధావులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ ఎలాగో, రాజ్యాంగ నిర్మాత కూడా అలాగేనని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగం రచన సమయంలో ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు ఎదురైన వాటిని అధిగమించి రాజ్యాంగాన్ని బాబా సాహేబ్ అంబేడ్కర్ రచించారని చెప్పారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ఘన చరిత్ర గత మన రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి భారత పౌరుడు ముందుకురావాలని కోరారు. సీడీఎస్ లాంటి చైతన్యవంతమైన వ్యవస్థ ఏర్పాటు చేసి రాజ్యాంగ పరిరక్షణ కోసం మల్లేపల్లి లక్ష్మయ్య చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. సీడీఎస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఎస్పీఆర్‌హిల్స్ సీడీఎస్ భవనం అన్ని హంగులతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. సీనియర్ ఎడిటర్ డాక్టర్ రాంచంద్రామూర్తి, తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, హర్యానా రాష్ట్ర అదనపు కార్యదర్శి డాక్టర్ రాజశేఖర్ వుండ్రూ, సీనియర్ న్యాయవాది రాజనిసొరేస్, స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

'స్వప్నాల ప్రేమికుడు' పుస్తకావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్.వేణుగోపాల్ తదితరులు

కాచిగూడ: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాపై యువ కవులు రాసిన కవితా సంకలనం 'స్వప్నాల ప్రేమికుడు' పుస్తకాన్ని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ కవి, విమర్శకులు ఎకె ప్రభాకర్, రచయిత్రి కరుణ తాయమ్మ, జర్నలిస్టు ఎన్.వేణుగోపాల్, రాందేవ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కోసం, గిరిజన ఆదివాసీ ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసి, రాజ్యపు కుట్రలకు బలై, అక్రమ కేసుల్లో పదేళ్లు జైలు శిక్ష అనుభవించి నిరపరాధిగా విడుదలైన సాయిబాబా తన చివరిశ్వాస వరకు కూడా ప్రజల సంక్షేమం కోసమే తపించారని అన్నారు. అటువంటి వ్యక్తి ఆలోచనలను, ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు. యువ కవులు రాసిన ఈ పుస్తకం ఉద్యమాలను, ప్రజా ఉద్యమాల పట్ల బాధ్యతను తెలియజేసే విధంగా ఉందని కొనియాడారు. దొంతం చరణ్ అధ్యక్షతన జరిగిన యువ కవులు మహేష్ వేల్పుల, పేర్ల రాము, లావణ్య, ఉదయ్, హతిరాం, డేవిడ్, శ్రీనిధి, అనూష తదితరులు పాల్గొన్నారు.

వయసు చిన్నది... సాయం పెద్దది

పాకెట్ మనీతో వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలిసికట్టుగా తమలోతాము విరాళాలు సేకరించి వృద్ధాశ్రమానికి సహాయాన్ని అందించారు. యూసుఫ్‌గూడ, వెంకటగిరి శ్రీసాయిరాం స్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించి మొయినాబాద్‌లోని శ్రీసాయివినయ్ ఓల్డేజ్ హోమ్‌లో ఉండే వారికి అవసరమైన నిత్యావసర వస్తువులు అందజేశారు. తమ పాకెట్ మనీతో పాటు విరాళాలను సేకరించి పలు సామాజిక సహాయ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.



ఏర్పాటు చేసిన నిత్యావసరాలతో సాయిరాం స్కూల్ విద్యార్థులు

రోగుల సంక్షేమానికి కష్టపడితే మంచి గుర్తింపు

పలువురికి బెస్ట్ సర్వీస్ అవార్డులు అందజేసిన నిమ్స్ డైరెక్టర్



బెస్ట్ ఎంప్లాయి అవార్డును అందుకుంటున్న సీహెచ్. ఊర్మిళా దేవి

లక్డీకాపూల్: రోగుల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని నిమ్స్ డైరెక్టర్ డా. నగరి బీరప్ప అన్నారు. ఆదివారం నిమ్స్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ మనపై నమ్మకంతో వస్తున్న రోగులకు ఇంకా మెరుగైన వైద్య సేవలను అందించడానికి కృషి చేద్దామన్నారు. తొలుత బెస్ట్ ఎంప్లాయి అవార్డును నర్సింగ్ సూపరింటెండెంట్ సీహెచ్. ఊర్మిళా దేవికి, వార్డు నిర్వహణలో బెస్ట్ అవార్డును కేటీయూకి చెందిన ఎస్. ఆశాలతకు, ఉత్తమ వైద్యురాలిగా అనస్థిషియా ప్రొఫెసర్ ఇందిరా గురజాల, ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా డా. బషీర్ సలీం అస్లాం, సెక్యూరిటీ అధికారిగా కాంత శేఖర్ తదితర టెక్నికల్, నాన్ టెక్నికల్, స్కిల్డ్, అన్ స్కిల్డ్, ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ సత్యనారాయణ, డీన్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, డా. సాయి సతీష్, అడిషనల్ ఎంఎస్‌లు డా. కృష్ణారెడ్డి, డా.ఎన్. లక్ష్మి భాస్కర్, ఏఎంఎస్‌లు, డా. రాకేష్, డా. చరణ్ వైద్యులు డా. సదాశివుడు, స్వర్ణలత, డా. సూచందా, మార్త రమేష్, సత్యగౌడ్, రాజకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

3 నెలలలో రిటైర్మెంట్.. బెస్ట్ అవార్డు

మరో మూడు నెలల్లో రిటైర్డు అయ్యే తనకు రిపబ్లిక్ డే రోజు ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఏఈఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ అవార్డు రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు.



జలమండలి కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతదేశ చిత్రపటం వద్ద జెండా వందనం దృశ్యం



సికింద్రాబాద్‌లోని పవర్ గ్రిడ్ (ఎస్‌ఆర్‌టీఎస్‌-1)లో..



సాక్షి ప్రధాన కార్యాలయంలో జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్లు వైఈపీ రెడ్డి, కేఆర్‌పీ రెడ్డి, సిబ్బంది



హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌లో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

ఘనతంత్రం

హైదరాబాద్ నగరం త్రివర్ణ శోభితమైంది. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఎల్లెడెలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని చాటాలని, ప్రజాస్వామిక విలువలను కాపాడాలని, ప్రజాసేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు.



బుద్ధ భవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్



ఎస్‌బీఐ హెడ్ ఆఫీసులో జెండా ఆవిష్కరించిన చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్



అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంలో మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్



యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ కేంద్ర కార్యాలయంలో ఫౌండర్ రాజేంద్ర పల్నాటి తదితరులు



నగర పోలీసు కమిషనర్ కార్యాలయం గణతంత్ర వేడుకల్లో సంయుక్త పోలీసు కమిషనర్(పరిపాలన) పరిమళ హనా నూతన్



తెలంగాణ పోలీస్ అకాడమీలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సంస్థ డైరెక్టర్ అభిలాష బిస్త్



ఉత్తమ సేవలకు పురస్కారాలు

హైదరాబాద్ జిలా పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు, సేవ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రతినిధులకు పురస్కారాలు లభించాయి. ఆదివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా 283 మంది పురస్కారాలను అందుకున్నారు. – సాక్షి,సిటీబ్యూరో

పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

• మంత్రి పొన్నం ప్రభాకర్

కవాడిగూడ: పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు బీసీలు పోటీ చేసిన ప్రతిచోటా గెలిపించుకొని తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కులో నిర్వహించిన పద్మశాలి రాజకీయ చైతన్య వేదిక సభలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా పద్మశాలీ మహిళలు బోనాలు, బతుకమ్మలతో అతిథులకు స్వాగతం పలికారు. ఇటీవల ముషీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నేతన్నల సమస్యలను పరిష్కరించేందుకు సహకరిస్తానని మంత్రి హామీనిచ్చారు.

కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నేత సంగిశెట్టి జగదీశ్, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎం. నగేష్ ముదిరాజ్, పద్మశాలి సంఘం నేతలు, పద్మశాలీ కులస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



పద్మశాలి రాజకీయ చైతన్య వేదిక సభలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నగరంలో నేడు

◆ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

◆ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి

• ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ డిమాండ్

కాచిగూడ: దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగిస్తున్న ఆదివాసీల హననాన్ని, మావోయిస్టు పార్టీ నేతలను చంపడాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ(సీడీఆర్‌ఓ) ప్రతినిధులు క్రాంతి చైతన్య, ఆశీష్ గుప్తా, తెలంగాణ పౌర హక్కుల సంఘం(సీఎల్‌సీ టీఎస్) నేత ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, జస్వంత్ సింగ్ (ఏపీడీఆర్, పంజాబ్), మోత్లీ (ఏపీడీఆర్, వెస్ట్ బెంగాల్) డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ కార్యనిర్వాహక వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారు వెల్లడించారు. రైతు ఉద్యమాలకు స్పందించి వెంటనే పరిష్కారాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపా చట్టాన్ని, ఎన్‌ఐఏ సంస్థను రద్దు చేయాలన్నారు. దేశంలో ముస్లీం మైనార్టీలు మునుపెన్నడూ లేనంతగా పూర్తి అభద్రతలోకి నెట్టబడ్డారని, వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే పరిస్థితిని పాలకులే కల్పిస్తున్నారని ఆరోపించారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య రాచుకున్న అగ్గిని చల్లార్చడానికి వారి మధ్య ఏర్పడ్డ అపోహలను తొలగించి, సామరస్యాన్ని కాపాడటానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మావోయిస్టులు చట్టం దృష్టిలో నేరస్థులైతే వారితో చట్ట బద్ధంగానే వ్యవహరించాలన్నారు. లక్షలాది సైన్యాన్ని దింపి డ్రోన్లతో నిఘా పెట్టి, ఒకేసారి 15 వేల, 20 వేల బలగాలతో చుట్టుముట్టి, కాల్చి చంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతిచైతన్య, గడ్డం లక్ష్మణ్ తదితరులు

పిల్లలకు ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అలవర్చాలి

తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్



వరల్డ్ వన్ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సోమేశ్ కుమార్

చందానగర్: విజ్ఞాన్ విద్యాసంస్థలు మంచి లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అన్నారు. ఆదివారం కొండాపూర్‌లోని వరల్డ్ వన్ పాఠశాల 11వ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఏ వ్యక్తికైనా తక్షణ ప్రాథమిక అవసరాలు తీర్చాలని నేను అనంతపురం కలెక్టర్‌గా ఉన్నప్పుడు భగవాన్ సత్యసాయి బాబా చెప్పారు. ఆయన మాట శిరోధార్యం, సంక్షేమ పథకాలను ఆ దృష్టితోనే ప్రభుత్వం తరపున చేయించాను'అని అన్నారు. విద్యార్థులకు ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అలవర్చాలని సూచించారు. పిల్లలతో జాగ్రత్తగా వ్యవహరించాలని, అన్ని విషయాలను అర్థమయ్యేలా చెప్పాలన్నారు. సివిల్ సర్వీసెస్‌లో చేరాలంటే ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, దినపత్రిక చదవాలని, చుట్టూ వాతావరణాన్ని అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం

• రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి

మణికొండ: రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేసి ఉత్తమ క్రీడాకారులను తయారు చేయటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో నవజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో అయన మాట్లాడారు. మనదేశంలో జనాభాకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించలేక పోతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విజేత జట్టు కెప్టెన్ సుమన్‌యాదవ్, రన్నరప్ టీం కెప్టెన్ అరుణ్, బెస్ట్ బ్యాట్స్‌మేన్ శ్రావణ్, బెస్ట్ బౌలర్ ప్రదీప్‌లకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, పలువురు కౌన్సిలర్లతో పాటు నవజ్యోతి యువజన సంఘం చైర్మన్ బి.సాయిరెడ్డి, అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రికెటర్లతో జితేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

నేటి నుంచి టీడీసీఏ టోర్నమెంట్

లక్డీకాపూల్: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) ఆధ్వర్యంలో అండర్–17 క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, శాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఈ టోర్నమెంట్‌ను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) చైర్మన్ కె.శివసేనా రెడ్డి ప్రారంభిస్తారన్నారు. దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో నాలుగు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌తో ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లను వెలికితీయనున్నామని, సత్తా చాటిన క్రికెటర్లను మార్చిలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టుతో పోటీపడే టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు, అధికారులకు ఉచిత భోజనం, వసతి, రవాణా సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణలో అడ్వొకేట్లే కీలకం

జస్టిస్ అనిల్ కుమార్ శ్రీవాత్సవ

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగంలోని ప్రతి అక్షరాన్ని పాటించాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని డెబిట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్(డీఆర్‌ఏటీ) చైర్‌పర్సన్ జస్టిస్ అనిల్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ డీఆర్‌టీ ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని విలువల పరిరక్షణ, నిబంధనల అమలులో అడ్వొకేట్‌ల పాత్ర అత్యంత కీలకమన్నారు. యువ లాయర్లు సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌టీ–1, డీఆర్‌టీ–2 ప్రిసైడింగ్ అధికారులు గుమ్మడి గోపిచంద్, రామేశ్వర్ గంగారామ్ కోతే, అసోసియేషన్ ప్రెసిడెంట్ జీకే దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

నాట్యశాస్త్ర పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: భారత శాస్త్రీయ నృత్య విద్యార్థులకు నాట్యశాస్త్ర పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఠాగూర్ జాతీయ స్కాలర్, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత ప్రియాల్ భట్టాచార్య అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో శ్రీసాయి నటరాజ అకాడమి ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు డాక్టర్ రమాదేవి రచించిన నాట్యశాస్త్ర పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించాలనే తపనతో ఈ పుస్తకాన్ని రాశారని, ఇది చాలా అరుదైనదని, దీనిని ప్రతి నాట్య విద్యార్థి అధ్యయనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సిలికాన్ ఆంధ్ర విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డాక్టర్ కూచిబొట్ల ఆనంద్, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత భాగవతుల సేతురాం, సిలికాన్ ఆంధ్ర ప్రొఫెసర్ డాక్టర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రియాల్ భట్టాచార్య, మామిడి హరికృష్ణ తదితరులు

బ్యాంకుల ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

• సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కాచిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారి అనుకూల విధానాలు రూపొందిస్తోందని, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను విధ్వంసం చేసేందుకు పాలకులు చేస్తున్న కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బ్యాంకింగ్ రంగ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్లు చేసే పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. ఆదివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మహాసభలో ఆయన మాట్లాడారు. రాజకీయాలు, ట్రేడ్ యూనియన్లు వేర్వేరు కాదని, రాజకీయాల ఆధారంగానే చట్టాలు వస్తాయని, చట్టాలు మారకుండా హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ సాధ్యం కాదన్నారు. ప్రభుత్వాలు చట్టాల సాక్షిగానే శ్రమ దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. భారతదేశంలో కమ్యూనిస్టులు అధికారంలో లేరని నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మూడో వంతు దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలే పాలిస్తున్నాయని పేర్కొన్నారు. కుల, మతాలను రెచ్చగొట్టి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్, బీఎస్ రాంబాబు, ఉదయ్ కుమార్, పి.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు ఉద్యోగుల మహాసభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

భాగ్యనగరం వేదికగా మూడు రోజుల పాటు జరిగిన హైదరాబాద్‌ లిటరరీ ఫెస్ట్‌ ఆదివారంతో ముగిసింది. ఇందులో అనేక మంది మేధావులు, కవులు, కళాకారులు, ఎన్జీవోలు తమ అభిప్రయాలను తమ తమ కళలు, రచనలు, ప్రసంగాల ద్వారా సందర్శకులతో పంచుకున్నారు. ఓ రకంగా ఇది సకలం.. సంగమం అన్నట్లు.. సందర్శకులతో సందడిగా మారింది. ఈ ప్రదర్శన ఎంతో గొప్ప అనుభూతిని పంచిందని పలువురు సందర్శకులు చెబుతున్నారు. కాగా ఇందులో ప్రముఖులతో పాటు సినీ తారలు కూడా భాగస్వామ్యం కావడం గమనార్హం. -సాక్షి, సిటీబ్యూరో

సకలం.. సంగమం..

- ముగిసిన హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌
- మూడు రోజుల పాటు సకల కళల సంగమంగా సందడి
- కవులు, కళాకారులు, ఎన్జీవోలు, ప్రముఖుల చర్చలు
- గొప్ప అనుభూతిని అందించిందన్న సందర్శకులు





నగరం వేదికగా నిర్వహించిన సాహితీ కళల సంగమం హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌ ముగిసింది. కేవలం కళలు, కవితలకు మాత్రమే కాదు సంగీత వేదికలు, సేవా సంస్థల కార్యక్రమాలు, ఇంకా మరెన్నో విశేషాలకు ఈ ఫెస్ట్‌ చిరునామాగా నిలిచింది. మూడు రోజుల పాటు సందర్శకులకు వైవిధ్యభరిత అనుభూతులు పంచిన ఈ ఈవెంట్‌లో తమతమ కళలు, కార్యక్రమాల ద్వారా పాల్గొన్నవారితో సాక్షి జరిపిన చిరు ముచ్చట..వారి అనుభూతులు వారి మాటల్లోనే..



ప్రముఖులకు చేరువగా..

నేను ఆర్ట్‌ కళాశాల విద్యార్థినిని. మా పేరెంట్స్‌ వ్యవసాయం చేస్తారు. అక్కడ నేను చిన్ననాటి నుంచి చూసిన చాట తదితర వస్తువులు, వ్యవసాయ పరికరాలను ఉపయోగించి కళాత్మక వస్తువును తయారు చేశాను. హెచ్‌ఎల్‌ఎఫ్‌లో ఈ కళను ప్రదర్శించడంలో అనేక మంది ప్రముఖుల ప్రశంసలు లభించడం సంతోషాన్ని ఇచ్చింది.

– అనూఖ్య, పెద్దపల్లి కరీంనగర్‌

రాతి.. విలువ తెలిపేలా..



తెలంగాణలోని రాతి శిలలు చాలా వైవిధ్యమైనవి. 2500 యేళ్ల నాటి అరుదైన, అపురూపమైనవి. వీటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ శిలలను పోగొట్టుకుంటే నీటి వనరులు, పక్షులతో సహా చాలా కోల్పోతాం. వీటిపై నగరవాసులకు అవగాహన లేదు. యేటా జరిగే హెచ్‌ఎల్‌ఎఫ్‌లో క్రమం తప్పకుండా పాల్గొంటాం. ఈ వేదిక ద్వారా యువతకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పద్మిని పటేల్‌, జాయింట్‌ సెక్రెటరీ, సేవ్‌ రాక్స్‌ సంస్థ



బంజారా కళకు గుర్తింపుగా..

మేం బంజారాలం. నేను ఫైన్‌ ఆర్ట్స్‌కి వచ్చాక బంజారా హస్తకళలు నేర్చుకున్నాను. క్రాఫ్ట్‌తో చిత్రం రూపొందించే ఆలోచనతో ఇది చేశాను. దీనిని గమనిస్తే బంజారా క్రాఫ్ట్‌, వస్త్రధారణ విలువ తెలుస్తుంది. కనెక్టింగ్‌ ఫ్యామిలీ.. అనే థీమ్‌తో తల్లిదండ్రులు మన కోసం చేసే త్యాగం ఎలాంటిది? దానిని మనం ఎలా గుర్తించాలి? అనే థీమ్‌తో ఈ కళారూపాన్ని తీర్చిదిద్దాను. బంజారా హస్తకళలను ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేయడం ఆనందంగా ఉంది.

– నవీన్‌నాయక్‌, సంగాగుడి తాండా, మెదక్‌ జిల్లా

సోషల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కోసం..



అభివృద్ధికి చిహ్నంగా ఒక భవనం నిర్మించడం ఎంత ముఖ్యమో.. సోషల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కోసం ఇలాంటి ఈవెంట్స్‌ నిర్వహణ అంతే ముఖ్యం. ఈ ఈవెంట్‌లో నా అబ్స్యూజ్‌ యాంగిల్‌ కార్టూన్‌ బుక్‌ విడుదల చేశా. బ్యూరోక్రసీ, పాలసీ మేకింగ్‌ వంటివాటి మీద నా బుక్‌లో పొందుపరచినవన్నీ ఇక్కడ ప్రదర్శిస్తున్నాను. అంతేకాక అనేకమంది మేధావులు, విద్యార్థుల స్పందన నేరుగా తెలుసుకోగలిగాం.

– బీపీ ఆచార్య, రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి



నేషన్స్‌ రాక్‌ బీట్‌..

శ్రియా గుప్తా అనే కార్పొరేట్‌ ఉద్యోగిని క్రియేటివ్‌ ఆర్ట్‌ హౌస్‌ ప్రారంభించారు. ఇందులో ఉండే మేమంతా వీకెండ్స్‌లో మాత్రమే ఆర్టిస్టులం. మిగిలిన రోజుల్లో కార్పొరేట్‌ ఉద్యోగులం. వారాంతాల్లో రెండు రోజుల పాటు కళాత్మక హృదయాల కోసం పనిచేస్తాం. ఈ నేషన్స్‌ రాక్‌ బీట్స్‌లో వివిడ్‌, ఇండి ఎక్స్‌ప్రెస్‌, రాగా.. తదితర పేర్లతో 7 బ్యాండ్స్‌ ఉన్నాయి. మా ఈవెంట్స్‌లో మ్యూజిక్‌, డ్యాన్స్‌, స్టోరీ టెల్లింగ్‌, పొయెట్రీ, స్టాండప్‌ కామెడీ.. ఉంటాయి. హెచ్‌ఎల్‌ఎఫ్‌లో వచ్చే యంగ్‌ బ్లడ్‌ కోసం ఏర్పాటైందే యంగిస్తాన్‌ నుక్కడ్‌.. హెచ్‌ఎల్‌ఎఫ్‌ ప్రారంభం నుంచీ పెర్ఫార్మ్‌ చేస్తున్నాం.

– రజత్‌, సింగర్‌, గిటారిస్ట్‌





పేదల విద్యకు అండగా..

నిరుపేద విద్యార్థులకు ఖరీదైన విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పడిన ఎన్జీవో మాది. విదేశాల నుంచి తిరిగి వచ్చిన మహిళ శోభ భన్సాలీ దీన్ని ప్రారంభించారు. ప్రైవేట్‌ స్కూల్స్‌లో ఉండే బుక్స్‌, ఇతర విశేషాలను ప్రభుత్వ పాఠశాలలు, కొన్ని చిన్నచిన్న ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పరిచయం చేయడం మా సంస్థ లక్ష్యం. దీనిలో భాగంగా.. స్టోరీ టెల్లింగ్‌ సెషన్‌, వర్క్‌షీట్స్‌, కలరింగ్‌ నిర్వహిస్తాం. మొబైల్‌ లైబ్రరీ ద్వారా పుస్తకాలను అందించడం, ఆంగ్ల భాషా ప్రావీణ్యం పెంపొందించడమే లక్ష్యం. నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 53 పాఠశాలలకు చెందిన చిన్నారులు మా ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. దీని ద్వారా మరింత మందికి చేరువవ్వాలనేదే లక్ష్యం.

– రాజేశ్వరి, పుస్తకారా



నా కళకు పట్టం కట్టింది..

కార్పెంటరీ కుటుంబానికి చెందిన వాడిని. ఉడ్‌ ఆర్టుగా సామాజిక స్థితిగతులు, జీవనశైలి, అలంకరణ, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా చెక్కాను. కళపై ఇష్టంతో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌లో చేరాను. ప్రస్తుతం మాస్టర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ చదువుతున్నాను. గ్రామీణ ఇతివృత్తాలను, జీవనశైలిని విశ్వవ్యాప్తం చేయాలనేదే లక్ష్యం. ఈ ప్రయాణంలో నాన్నే నాకు స్ఫూర్తి.

– సాయి కుమార్‌, లోయపల్లి, రంగారెడ్డి జిల్లా



మూగజీవుల దాహం తీరుస్తాం..

మాది ఏడబ్ల్యూబీపీ (యానిమల్‌ వాటర్‌ బౌల్‌ ప్రాజెక్ట్‌) ఎన్జీవో. లక్ష్మణ్‌ మొల్లేటి అనే హైదరాబాద్‌ వాసి దీనిని స్థాపించారు. జంతువులు, మూగజీవుల దాహార్తి తీర్చేందుకు అవసరమైన వాటర్‌ బౌల్స్‌ ఉచితంగా అందిస్తాం. కుక్కలు, ఆవులు వంటి జంతువులు దాహంతో అలమటిస్తూ ఉండడం మనం గమనిస్తాం. చెన్నై, ముంబయి తదితర నగరాల్లోనూ మా కార్యకలాపాలు నడుస్తున్నాయి. ఈ ఫెస్టివల్‌ ద్వారా మూగజీవుల సమస్యపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఏడబ్ల్యూబీపీ ప్రతినిధి



డిప్రెషన్‌ నుంచి పుట్టిన ప్యాషన్‌..

నా మెటీరియల్‌ శానిటరీ ప్యాడ్‌. ఎంబ్రాయిడరీ అనే మీడియంతో పీరియడ్స్‌ అనే అంశం పైనే ఈ ఆర్ట్‌ వర్క్‌ చేశాను. ఇంట్లో ఆ సమయాన్ని అంటరానిదిలా చూస్తుంటారు. అలాంటి సమయంలో మెనుస్ట్రువల్‌ డిప్రెషన్‌కు ఎంతగా గురవుతాం అనేది నేను వ్యక్తిగతంగా అనుభవించా. అది అందరికీ అర్థం కావాలనే ఉద్దేశ్యంతో అలాంటి బాధ మరెవరికీ రాకూడదనే హెచ్‌ఎల్‌ఎఫ్‌ ద్వారా ప్రచారం ప్రారంభించా.

– సాహితి, జేఎన్‌ఎఫ్‌యూ ఫైన్‌ ఆర్ట్స్‌ విద్యార్థి

కేశ సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి..



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత పరిస్థితుల్లో కేశ సంరక్షణపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ప్రముఖ హెయిర్‌స్టైలిస్ట్‌ హబీబ్‌ అహ్మద్‌ అన్నారు. మియాపూర్‌ లోని బొల్లారం రోడ్డులోని హబీబ్‌ హెయిర్‌ – బ్యూటీ సెలూన్‌ ను ఆదివారం ప్రారంభించిన అనంతరం కేశ సంరక్షణ పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌష్ఠిక ఆహారం, సరైన నిద్ర, తగినంత విశ్రాంతి, మానసిక ఆనందం, శారీరక వ్యాయామం, యోగ, ధ్యానం వంటివి కురుల సంరక్షణకు అవసరమని పేర్కొన్నారు.మిస్‌ యూనివర్స్‌ తెలంగాణ 2024, నిహారిక సూద్‌ మాట్లాడుతూ తగిన జాగ్రత్తలతో సంరక్షిస్తే నడి వయసు లో కూడా కేశాలు పటిష్టం గా వుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అమన్‌ హబీబ్‌, విశాల్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎకో ఫ్రెండ్లీ పార్క్‌ ఎక్స్‌పీరియమ్‌ సిద్ధం..

సాక్షి, సిటీబ్యూరో: చిలుకూరు బాలాజీ టెంపుల్‌ రోడ్డులోని పొద్దుటూరులో నెలకొల్పిన అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ పార్క్‌ ఎక్స్‌పీరియమ్‌ నగరవాసులను కనువిందు చేయడానికి సిద్ధమైంది. బంజారాహిల్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్క్‌ సృష్టికర్త, యూనిక్‌ ట్రీస్‌ సంస్థ ఛైర్మన్‌ రామ్‌దేవ్‌ ఈ విషయాన్ని తెలిపారు. తాను ఆరున్నరేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఎక్స్‌పీరియమ్‌ని అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు 85 దేశాలు తిరిగి, దాదాపు 25వేల జాతుల మొక్కల్ని, చెట్లని, అరుదైన వృక్షజాలాన్ని సేకరించానని తెలిపారు. దాదాపు 150 ఎకరాల్లో రూ.150 కోట్లకు పైగా ఖర్చు చేసి దీనిని రూపుదిద్దామని, వినూత్న తరహా మొక్కలు, చెట్లు, శిలలు, శిల్పాలు, పూల తోటలతో ప్రపంచంలోని ఏ ఉద్యానవనంలోనూ లేని విధంగా దీన్ని తీర్చిదిద్దామన్నారు. అన్ని వయసులవారూ పచ్చదనంలోని అనుభూతిని వినోద, విజ్ఞానాల అనుభూతి పొందాలనేదే తన ఆలోచన అని వెల్లడించారు.



వినసొంపైన రుహానియత్‌

గోల్కొండ : స్థానికంగా ఉన్న తారామతి బారాదరి దేశ విదేశ సంగీత కళారూపాలకు వేదిక అయ్యింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ ఆదివారం నిర్వహించిన బన్యన్‌ ట్రీస్‌ రుహానియత్‌ సంగీత కార్యక్రమం ప్రేక్షకులను కుర్చీలకు కట్టిపడేసింది. చత్తీస్‌ఘఢ్‌కు చెందిన మీనాసాహు బృందం వారి సంగీత ప్రదర్శన అలరించింది. అనంతరం అవదూత్‌ గాంధీ అండ్‌ పార్టీ ప్రదర్శించిన మరాఠ జానపదాలు శ్రోతలను మైమరిపించాయి. కార్యక్రమం అనంతరం ప్రేక్షకులు నిలబడి చప్పట్లతో సంగీత కారులను అభినందించారు. తైవాన్‌ దేశానికి చెందిన చియానింగ్‌ నియాంగ్‌ వారి హెవెన్‌ అర్త్‌ అండ్‌ మ్యాన్‌ కార్యక్రమం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం మదన్‌గోపాల్‌ సింగ్‌, చార్‌యార్‌ సంగీతాన్ని ఆలపిస్తూ దానికి అనుగుణంగా గీతాలు పాడారు. ఈజిప్టుకు చెందిన అలీ హెల్బవే, యుఏకి చెందిన సైఫ్‌ అలీ బృందం నిర్వహించిన అరబిక్‌ గీతాలు వింటూ ప్రేక్షకులు సంగీత సాగరంలో తేలియాడారు. ఇండో అరబిక్‌ ప్రొడక్షన్‌ వారి వెన్‌ హార్ట్‌ కనెక్ట్‌ వినూత్న సంగీతంతో తారామతి ప్రాంగణం మారుమోగింది. చివరగా ఢిల్లీకి చెందిన హుస్సేన్‌ బ్రదర్స్‌ వారి కవ్వాలి రుహానియత్‌ హైలెట్‌గా నిలిచింది.



దేవి పెబ్బిలి.. పంచ్‌లో బెబ్బులి..

జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి



పెరెగ్రైన్‌ ఫాల్కన్‌ కన్నా వేగవంతమైన కిక్‌లకు టెక్నిక్‌ మేళవించి ప్రత్యర్థులను మట్టి కరిపిస్తుంది. చిరుత కంటే వేగంగా పాదాలను కదిలించి ఎదుటివారిని చిత్తు చేస్తుంది. పాల్గొన్న ప్రతిపోటీలోనూ పతకం సాధించి తనకుతానే సాటిగా అంతర్జాతీయ వేదికపై మరోమారు సత్తా చూపించేందుకు సిద్ధమవుతోంది సికింద్రాబాద్‌ చిలకలగూడకు చెందిన కరాటే క్వీన్‌ దేవిహంసిని. ఇప్పటి వరకూ అనేక జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని బంగారు, వెండి మెడల్స్‌తోపాటు పలు అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంది. - చిలకలగూడ



- పాల్గొన్న ప్రతి పోటీలోనూ పతకం
- కటా, కుమిటీ రెండు విభాగాల్లోనూ విశేష ప్రతిభ
- 44 బంగారు, 15 సిల్వర్‌, బ్రాంజ్‌ మెడల్స్‌
- యుఏఈలో జరిగే కరాటే యూత్‌లీగ్‌ పోటీలకు ఎంపిక
- అండర్‌-14లో తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణి



యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌ (యుఏఈ) ఫుజైరాలో 2025 ఫిబ్రవరిలో జరిగే కరాటే-1 యూత్‌లీగ్‌ పోటీలకు అండర్‌-14 కటా విభాగంలో తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణి దేవిహంసిని. వడోర్వై కరాటే డూ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో యుఏఈలో జరిగే యూత్‌లీగ్‌ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌, గుజరాత్‌, మధ్యప్రదేశ్‌, తెలంగాణలకు చెందిన ఎనిమిది మందిని ఎంపిక చేశారు.

చిన్ననాటి నుంచే..

సాధారణ కుటుంబానికి చెందిన పెబ్బిలి దేవిహంసిని (12) సికింద్రాబాద్‌ సెయింట్‌ మేరీ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి కోటేశ్వరరావు ప్రైవేటు ఉద్యోగి, తల్లి అంజలి గృహిణి. తన ఆరో ఏట నుంచే మార్షల్‌ ఆర్ట్స్‌పై చిన్ననాటి నుంచే మక్కువ పెంచుకుంది. మొదట విశాఖపట్నంలోని కింగ్‌ ఆఫ్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ అసోసియేషన్‌లో చేరింది. కరాటే కోచ్‌ సిహాన్‌, సీహెచ్‌ శ్రీనివాసరావు వద్ద ఓనమాలు నేర్చుకుంది. కఠోర శ్రమ, చిత్తశుద్ధి, నేర్చుకోవాలనే తపనతో మెళకువలను ఔపోసన పట్టి బ్లాక్‌బెల్ట్‌ సాధించింది. సినీనటుడు సుమన్‌ నుంచి బ్లాక్‌బెల్ట్‌ అందుకోవడం గర్వంగా ఉందని చెబుతోంది దేవి.

సాధించిన పతకాలు..

జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన దేవి హంసిని పాల్గొన్న ప్రతి పోటీలోనూ బహుమతి సాధించి విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. కటా, కుమిటీ విభాగాల్లో పది గోల్డ్‌, రెండు వెండి, జాతీయ స్థాయిలో 22 బంగారు, ఐదు వెండి, మూడు రజిత పతకాలు కైవసం చేసుకుంది. సౌత్‌ నేషనల్‌ లెవల్‌లో 7 గోల్డ్‌, ఒక్కో సిల్వర్‌, బ్రాంజ్‌, ఆసియన్‌ లెవల్‌లో ఒక్కో సిల్వర్‌, బ్రాంజ్‌, స్టేట్‌ లెవల్‌లో ఐదు బంగారు, ఒక్కో సిల్వర్‌, బ్రాంజ్‌ మెడల్స్‌ సొంతం చేసుకుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

తల్లిదండ్రులు నాగేశ్వరరావు, అంజలి ప్రోత్సాహంతోనే తాను పతకాలు, అవార్డులు సాధించానని దేవిహంసిని చెబుతోంది. మార్షల్‌ ఆర్ట్స్‌ బాలికలు, యువత ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని, యువత కరాటే, కుంగ్‌ఫూ, బాక్సింగ్‌ వంటి క్రీడల్లో ప్రావీణ్యం సాధించి, శారీరక, మానసిక దృఢత్వాన్ని సాధించాలని సూచిస్తోంది.



మువ్వన్నెల జెండా ఎగురవేస్తా..

అంతర్జాతీయ వేదికలపై మువ్వన్నెల జెండా ఎగురవేస్తా. యుఏఈ ఫుజైరాలో కరాటే యూత్‌ లీగ్‌లో విజయం సాధిస్తా. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహం కూడా అవసరం. అందరి సహకారం ఉంటే గెలుపు తథ్యమని దేవిహంసిని ధీమా వ్యక్తం చేస్తోంది.

సెమీస్‌లో భారత్

- ‘సూపర్ సిక్స్’ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- రాణించిన వైష్ణవి, త్రిష


వైష్ణవి


త్రిష

కౌలాలంపూర్: డిఫెండింగ్ చాంపియన్ హోదాకు తగ్గట్టు ఆడుతున్న భారత అమ్మాయిల జట్టు అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన టీమిండియా... ‘సూపర్ సిక్స్’ గ్రూప్–1 తొలి మ్యాచ్‌లోనూ గెలిచింది. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నికీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు కేవలం 64 పరుగులు మాత్రమే చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఎడంచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి శర్మ 4 ఓవర్లలో 15 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్‌ను కట్టడి చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పేస్ బౌలర్ షబ్నమ్, జోషిత, తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష ఒక్కో వికెట్ తీసుకున్నారు. బంగ్లాదేశ్ బ్యాటర్లలో జన్నతుల్ మవువా (20 బంతుల్లో 14), కెప్టెన్ సుమయ అక్తర్ (29 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా బంగ్లాదేశ్ బ్యాటర్లు ఇన్నింగ్స్ మొత్తంలో ఒక్క బౌండరీ మాత్రమే కొట్టడం గమనార్హం. 65 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ఆడుతూ పాడుతూ విజయతీరానికి చేరింది. 7.1 ఓవర్లలో భారత జట్టు 2 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ గొంగడి త్రిష (31 బంతుల్లో 40; 8 ఫోర్లు) దూకుడుగా ఆడింది. త్రిష చేసిన 40 పరుగుల్లో 32 పరుగులు బౌండరీల ద్వారానే రావడం విశేషం. మరో ఓపెనర్ కమలిని (5) తక్కువ స్కోరుకే అవుటైనా... సనికా చాల్కె (5 బంతుల్లో 11 నాటౌట్; 2 ఫోర్లు), నికీ ప్రసాద్ (2 బంతుల్లో 5 నాటౌట్; 1 ఫోర్) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వైష్ణవికి ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. మంగళవారం జరిగే తమ చివరి ‘సూపర్ సిక్స్’ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో భారత్ ఆడుతుంది.

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా కూడా...

మరోవైపు ‘సూపర్ సిక్స్’ గ్రూప్–1 నుంచి ఆస్ట్రేలియా కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇదే గ్రూప్‌లో శ్రీలంక, స్కాట్లాండ్ జట్ల మధ్య ఆదివారమే జరగాల్సిన ‘సూపర్ సిక్స్’ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఆస్ట్రేలియాకు సెమీఫైనల్ బెర్త్ దక్కింది. ప్రస్తుతం ‘సూపర్ సిక్స్’ గ్రూప్–1లో భారత్, ఆస్ట్రేలియా జట్లు ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండగా ... శ్రీలంక మూడు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈనెల 29న ఆస్ట్రేలియాతో జరిగే తమ చివరి ‘సూపర్ సిక్స్’ మ్యాచ్‌లో శ్రీలంక గెలిచినా ఐదు పాయింట్లకే పరిమితం అవుతుంది. ‘సూపర్ సిక్స్’ గ్రూప్–2 నుంచి దక్షిణాఫ్రికా జట్టు కూడా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈరోజు న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిస్తే ఆ జట్టు కూడా సెమీఫైనల్లోకి ప్రవేశిస్తుంది. ఒకవేళ ఇంగ్లండ్ ఓడిపోతే ఈనెల 29న ఐర్లాండ్–నైజీరియా జట్ల మధ్య మ్యాచ్ ఫలితంపై ఇంగ్లండ్ సెమీఫైనల్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. నైజీరియా గెలిస్తే ఆ జట్టు సెమీఫైనల్ చేరుకుంటుంది. నైజీరియా ఓడిపోతే ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టుకు సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది.

విన్నర్ సినెర్...

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నిలబెట్టుకున్న ఇటలీ స్టార్


విన్నర్స్ ట్రోఫీతో యానిక్ సినెర్

ఫైనల్లో జ్వెరెవ్‌పై వరుస సెట్‌లలో విజయం	మూడోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఓడిన జర్మనీ ప్లేయర్	సినెర్ ఖాతాలో రూ. 19 కోట్ల ప్రైజ్‌మనీ

ఒకరేమో ఇప్పటికే ఆడిన రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో విజేతగా నిలువగా... మరొకరు ఆడిన రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఓడిపోయారు. గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఎలా గెలవాలో ఇప్పటికే ఒకరికి అనుభవం ఉండగా... మరొకరికి ఆ అనుభవం లేదు. అయితేనేం ముచ్చటగా మూడో ప్రయత్నంలోనైనా ‘గ్రాండ్’ విజయాన్ని అందుకోవాలని ఒకరు... వరుసగా మూడోసారీ ‘గ్రాండ్’ టైటిల్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో మరొకరు బరిలోకి దిగారు. ఆ ఇద్దరిలో ఒకరు ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ కాగా... మరొకరు ప్రపంచ రెండో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్... ఈ ఆసక్తికర నేపథ్యంలో ఆదివారం ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్ హోరాహోరీగా సాగడం ఖాయమని అందరూ భావించారు. కానీ రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత సినెర్ తన ప్రత్యర్థికి ఆ అవకాశం ఇవ్వలేదు. తొలి పాయింట్ నుంచే పూర్తి ఆధిపత్యం కనబరిచి జ్వెరెవ్ జోరుకు అడ్డుకట్ట వేసిన సినెర్ వరుసగా రెండో ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ టైటిల్ గెల్చుకున్నాడు. మరోవైపు సినెర్ దూకుడుకు ఎలా అడ్డుకట్ట వేయాలో తెలియక జ్వెరెవ్ వరుస సెట్‌లలో చేతులెత్తేసి కెరీర్‌లో మూడోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఓడిపోయి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నాడు. 2020 యూఎస్ ఓపెన్ ఫైనల్లో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) చేతిలో, 2024 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ (స్పెయిన్) చేతిలో జ్వెరెవ్ పరాజయం పాలయ్యాడు.


రన్నరప్ ట్రోఫీతో జ్వెరెవ్

మెల్‌బోర్న్: ఎలాంటి సంచలనం నమోదు కాలేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో కొత్త చాంపియన్ అవతరించలేదు. గత ఏడాది విజేతగా నిలిచిన ఇటలీ ప్లేయర్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ ఈ సంవత్సరం కూడా టైటిల్ నిలబెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సినెర్ 2 గంటల 42 నిమిషాల్లో 6–3, 7–6 (7/4), 6–3తో రెండో సీడ్, ప్రపంచ రెండో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై విజయం సాధించాడు. విజేతగా నిలిచిన సినెర్‌కు 35 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 19 కోట్ల 4 లక్షలు), రన్నరప్ జ్వెరెవ్‌కు 19 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 10 కోట్ల 33 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

గతంలో జ్వెరెవ్‌పై రెండుసార్లు నెగ్గి, నాలుగుసార్లు ఓడిపోయిన సినెర్ గత రికార్డును పట్టించుకోకుండా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగాడు. ఏస్‌తో మొదలుపెట్టిన సినెర్ తొలి గేమ్‌లో జ్వెరెవ్ చేసిన మూడు తప్పిదాలతో ఒకటిన్నర నిమిషంలోనే గేమ్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత ఎనిమిదో గేమ్‌లో జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినెర్ తొమ్మిదో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 46 నిమిషాల్లో సెట్ గెలిచాడు. రెండో సెట్‌లో ఇద్దరూ ప్రతి పాయింట్‌కు హోరాహోరీగా పోటీపడ్డారు. దాంతో ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో స్కోరు 6–6తో సమమైంది. టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో సినెర్ పైచేయి సాధించి 72 నిమిషాల్లో రెండో సెట్‌నూ సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లోని ఆరో గేమ్‌లో జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినెర్, ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 5–2తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఎనిమిదో గేమ్‌ను జ్వెరెవ్ కాపాడుకోగా, తొమ్మిదో గేమ్‌లో సినెర్ తన సర్వీస్‌ను కాపాడుకోవడంతోపాటు బ్యాక్‌హాండ్ విన్నర్ షాట్‌తో విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. మ్యాచ్ మొత్తంలో సినెర్ సర్వీస్‌లో జ్వెరెవ్ ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ సాధించే అవకాశాన్ని దక్కించుకోకపోవడం గమనార్హం.

మ్యాచ్ గణాంకాలు

సినెర్		జ్వెరెవ్
6	ఏస్‌లు	12
2	డబుల్ ఫాల్ట్‌లు	2
32	విన్నర్స్	25
27	అనవసర తప్పిదాలు	45
2/10	బ్రేక్ పాయింట్లు	0/0
10/13	నెట్ పాయింట్లు	14/27
107	మొత్తం పాయింట్లు	83

4 గత 35 ఏళ్లలో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో బ్రేక్ పాయింట్ ఎదుర్కోని నాలుగో ప్లేయర్ సినెర్. గతంలో పీట్ సంప్రాస్ (బోరిస్ బెకర్‌తో 1995 వింబుల్డన్ ఫైనల్), రోజర్ ఫెడరర్ (ఫిలిప్పోసిస్‌తో 2003 వింబుల్డన్ ఫైనల్), రాఫెల్ నాదల్ (కెవిన్ అండర్సన్‌తో 2017 యూఎస్ ఓపెన్ ఫైనల్) ఈ ఘనత సాధించారు.

5 హార్డ్ కోర్టులపై వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ఐదో ప్లేయర్ సినెర్. గతంలో జాన్ మెకన్రో (1979, 1980, 1981 యూఎస్ ఓపెన్), ఇవాన్ లెండిల్ (1985, 1986, 1987 యూఎస్ ఓపెన్), రోజర్ ఫెడరర్ (2005, 2006, 2007 యూఎస్ ఓపెన్), నొవాక్ జొకోవిచ్ (2 సార్లు: 2011 ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్, 2012 ఆస్ట్రేలియన్ ఓపెన్; 2015 ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్; 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్) ఈ ఘనత సాధించారు.

1 అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ఇటలీ ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో నికోలా పీత్రాంజెలి (1959, 1960 ఫ్రెంచ్ ఓపెన్) పేరిట ఉన్న రికార్డును సినెర్ (2024, 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్; 2024 యూఎస్ ఓపెన్) సవరించాడు.

1 జిమ్ కొరియర్ (అమెరికా: 22 ఏళ్ల 5 నెలల 14 రోజులు; 1992–1993) తర్వాత ‘బ్యాక్ టు బ్యాక్’ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్స్ నెగ్గిన పిన్న వయస్కుడిగా సినెర్ (23 ఏళ్ల 5 నెలల 10 రోజులు) గుర్తింపు పొందాడు.

8 కెరీర్‌లో తాము ఆడిన తొలి మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లోనూ విజేతగా నిలిచిన ఎనిమిదో ప్లేయర్ సినెర్. కానర్స్ (అమెరికా), జాన్ బోర్గ్, ఎడ్బర్గ్ (స్వీడన్), కుయెర్టన్ (బ్రెజిల్), ఫెడరర్, వావ్రింకా (స్విట్జర్లాండ్), అల్‌కరాజ్ (స్పెయిన్) ఈ ఘనత సాధించారు.

2019 ఆరేళ్ల తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, రెండో ర్యాంకర్ తలపడ్డారు. ఈసారి నంబర్‌వన్ ర్యాంకర్ వరుస సెట్‌లలో గెలిచాడు. 2019లో నంబర్‌వన్ జొకోవిచ్ రెండో ర్యాంకర్ రాఫెల్ నాదల్‌పై వరుస సెట్‌లలో నెగ్గాడు.

6 కెరీర్‌లో తాము ఆడిన తొలి మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఓడిన ఆరో ప్లేయర్ జ్వెరెవ్. ఈ జాబితాలో అగస్సీ (అమెరికా), ఇవానిసెవిచ్ (క్రొయేషియా), ముర్రే (బ్రిటన్), థీమ్ (ఆస్ట్రియా), రూడ్ (నార్వే) ఉన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్–2025

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్(ఐఎఫ్ఎస్)–2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. సివిల్స్, ఫారెస్ట్ సర్వీస్‌లకు రెండింటికీ ఒకే ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది. మెయిన్స్ మాత్రం వేర్వేరుగా నిర్వహిస్తారు.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 150
» **అర్హత:** ఫారెస్ట్రీ, అగ్రికల్చర్, వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ, ఇంజనీరింగ్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
» **పరీక్ష విధానం:** రాతపరీక్ష రెండు దశల్లో జరుగుతుంది. ప్రిలిమ్స్, మెయిన్స్ (రాత పరీక్ష + ఇంటర్వ్యూ). ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలతో ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కులుంటాయి. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు. మెయిన్ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో తొమ్మిది పేపర్లు ఉంటాయి. ఎస్సే, జనరల్ స్టడీస్, ఆప్షనల్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
» **ఎంపిక విధానం:** మెయిన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2025
» **ఐఎఫ్ఎస్ ప్రిలిమ్స్ పరీక్ష:** 25.05.2024.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://upsc.gov.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబైలో 266 జోన్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ –ప్రమోషన్).. సెంట్రల్ ఆఫీస్ రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ జోన్లలో జోన్ బేస్డ్ ఆఫీసర్–జూనియర్ మేనేజ్‌మెంట్ స్కేల్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **జోన్‌లు:** అహ్మదాబాద్, చెన్నై, గువాహటి, హైదరాబాద్.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ (ఐడీడీ), మెడికల్, ఇంజనీరింగ్, చార్టెడ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్ అభ్యర్థులు కూడా అర్హులు.
» **వయసు:** 30.11.2024 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు వయో సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** నెలకు రూ.48,480 నుంచి 85,920.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 09.02.2025.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** మార్చి 2025.
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐఎన్‌సీవోఐఎస్, హైదరాబాద్‌లో 39 జేఆర్ఎఫ్/రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

హైదరాబాద్ నిజాంపేటలోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఐఎన్‌సీవోఐఎస్)..రీసెర్చ్ అసోసియేట్/జూనియర్ రీసెర్చ్ ఫెలోలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 39.
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్–09, జూనియర్ రీసెర్చ్ ఫెలో–30.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ (సిస్మాలజీ /ఫిజిక్స్/జియోఫిజిక్స్/ఎర్త్ సైన్సెస్, ఓషియానిక్ సైన్సెస్/ మెరైన్ సైన్స్/మెరైన్ బయాలజీ/అట్మాస్ఫియరిక్ సైన్సెస్/క్లైమెట్ సైన్స్ /మెటీరియాలజీ /ఓషనోగ్రఫీ /ఫిజికల్ ఓషనోగ్రఫీ/కెమికల్ ఓషనోగ్రఫీ/ఫిజిక్స్/మ్యాథ్స్/సోషల్ వర్క్/ సోషియాలజీ/జనరల్ స్టడీస్/పబ్లిక్ హెల్త్/డిజాస్టర్ మేనేజ్‌మెంట్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.67,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.02.2025.
» **వెబ్‌సైట్:** http://vacancies.incois.gov.in

‘సెట్’ చేసుకోండిలా

» తెలంగాణలో ‘సెట్స్’ షెడ్యూల్ విడుదల
» ఈఏపీసెట్ మొదలు అన్ని సెట్స్ తేదీలు ఖరారు
» ప్రాక్టీస్, సిలబస్‌పై పట్టుతోనే విజయం

ఇంటర్మీడియెట్ నుంచి ఇంజనీరింగ్ వరకు..ఆయా కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉన్నత విద్య ఎంట్రెన్స్ టెస్టులకు సన్నద్ధమవుతున్నారు. తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, ఎంబీఏ, లా, బీఈడీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ‘సెట్స్’ తేదీలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాజాగా ఖరారు చేసింది. రాష్ట్రంలో ఎక్కువ మంది హాజరయ్యే ఎంట్రెన్స్ టెస్ట్ ఈఏపీసెట్ మొదలు లాసెట్ వరకూ.. అన్ని ప్రవేశ పరీక్షల తేదీలను వెల్లడించింది. ఈ నేపథ్యంలో.. టీజీ సెట్స్ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..


టీజీ సెట్స్

ఆయా సెట్‌ల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ ప్రిపరేషన్ ప్రణాళికలను సమర్థంగా రూపొందించుకునే అవకాశం లభిస్తుంది. విద్యార్థులు అకడమిక్ వార్షిక పరీక్షలతో వీటిని సమన్వయం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించడం ద్వారా మంచి ర్యాంకు సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించిన కామన్ ఎంట్రన్స్ టెస్టుల షెడ్యూల్‌ను గమనిస్తే.. రెండు నెలలపాటు ఈ సెట్స్ కొనసాగనున్నాయి. తొలుత ఏప్రిల్ 29, 30, మే 2, 5 తేదీల్లో ఈఏపీ సెట్‌ను నిర్వహించనున్నారు. చివరగా జూన్ 11 నుంచి 14 వరకు పీఈసెట్ ఉంటుంది.

ఈఏపీ సెట్

- రాష్ట్రంలో బీటెక్, బీఫార్మసీ, అగ్రికల్చరల్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాల్సిన ఎంట్రన్స్.. టీజీ ఈఏపీసెట్. ఈ సెట్‌కు హాజరయ్యేందుకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ అభ్యర్థులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణత; అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఇంటర్మీడియెట్ బైపీసీలో ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఈఏపీ సెట్.. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ స్ట్రీమ్‌లలో వేర్వేరుగా పరీక్ష విధానం ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మొత్తం 160 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. వీటిలో ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, మ్యాథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.
- ఈఏపీసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ పరీక్ష కూడా 160 మార్కులకు ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు చొప్పున ఉంటాయి. ఇందులో ర్యాంకు ద్వారా ఏజీ బీఎస్సీ, బీఎస్సీ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, బీఫార్మసీ, ఫార్మ్–డి, బీటెక్ ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.
- **పరీక్ష తేదీలు:** ఈఏపీసెట్ ఏప్రిల్ 29, 30 (అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ); మే 2–5(ఇంజనీరింగ్ స్ట్రీమ్).

ఎంబీఏ, ఎంసీఏల్లో ప్రవేశానికి ఐసెట్

ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా ఐసెట్. ఇందులో సాధించిన ర్యాంకు ఆధారంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. టీజీ ఐసెట్‌ను జూన్ 8, 9 తేదీల్లో రెండు రోజుల్లో నాలుగు స్లాట్లలో నిర్వహించనున్నారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఎంసీఏ కోర్సులో చేరాలనుకునే వారు ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఐసెట్ పరీక్షను మూడు సెక్షన్లుగా.. 200 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహించనున్నారు.

న్యాయం చేసే‘లా’.. లాసెట్

- తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీ కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ‘లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (లాసెట్)’ను నిర్వహిస్తుంది. ఇందులో పొందిన ర్యాంకు ఆధారంగా.. మూడేళ్ల, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఈ ఏడాది టీజీ లాసెట్ పరీక్ష తేదీ:**2025,జూన్ 6
- మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఓసీ, బీసీ కేటగిరీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీ వర్గాల వారు 42 శాతంతో, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 45శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీ విద్యార్థులు 42 శాతంతో,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 40 శాతంతో ఉత్తీర్ణత పొందాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- టీజీ లాసెట్‌ను మొత్తం మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నలు, అప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా విభాగం నుంచి 60 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. అప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా విభాగంలోని 60 ప్రశ్నల్లో 10 ప్రశ్నలు కాంప్రహెన్షన్ విధానంలో ఉంటాయి. న్యాయ సంబంధ అంశాలతో కూడిన ప్యాసేజ్‌లు ఇచ్చి.. వాటి ఆధారంగా సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా ప్రశ్నల అడుగుతారు.
- ఎల్ఎల్‌బీ అర్హతతో పీజీ స్థాయిలో.. ఎల్ఎల్ఎం కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పీజీ లాసెట్ రెండు విభాగాలుగా 120 మార్కులకు ఉంటుంది. పార్ట్–ఎలో జ్యూరిస్ప్రుడెన్స్ నుంచి 20 ప్రశ్నలు, కాన్‌స్టిట్యూషనల్ లా నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. పార్ట్–బిలో.. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా నుంచి 16 ప్రశ్నలు, మర్కంటైల్ లా నుంచి 16 ప్రశ్నలు, లేబర్ లా నుంచి 16 ప్రశ్నలు, క్రైమ్స్ అండ్ టార్ట్స్ నుంచి 16 ప్రశ్నలు, అదర్ ‘లా’స్ నుంచి 16 ప్రశ్నలు అడుగుతారు. పీజీ లా సెట్‌కు.. ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతను అర్హతగా పేర్కొన్నారు.

టీజీ ఎడ్‌సెట్

- ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశానికి మార్గం.. బీఈడీ. ఈ కోర్సుల్లో ప్రవేశానికి టీజీ ఎడ్‌సెట్ నిర్వహిస్తారు. ఈ సెట్‌కు.. బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు మొదలు టెక్నికల్ డిగ్రీ అయిన బీటెక్ వరకూ.. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు పోటీ పడొచ్చు. అయితే వారు డిగ్రీ స్థాయిలో చదివిన సబ్జెక్ట్‌లనే ఎడ్‌సెట్‌లో మెథడాలజీ సబ్జెక్ట్‌లుగా ఎంచుకోవాల్సి ఉంటుంది. –ఎడ్‌సెట్ పరీక్షను అయిదు విభాగాల్లో 150 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఇందులో సబ్జెక్ట్/కంటెంట్ (60 ప్రశ్నలు), టీచింగ్ ఆప్టిట్యూడ్ (20 ప్రశ్నలు), జనరల్ ఇంగ్లిష్ (20 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ ఎడ్యుకేషనల్ ఇష్యూస్ (30 ప్రశ్నలు), కంప్యూటర్ అవేర్‌నెస్ (20 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. సబ్జెక్ట్/కంటెంట్ విభాగానికి సంబంధించి మ్యాథమెటిక్స్ నుంచి 20 ప్రశ్నలు, సైన్స్ నుంచి 20 ప్రశ్నలు, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.
- **ఎడ్‌సెట్ పరీక్ష తేదీ:** 2025, జూన్ 1.

పీజీఈసెట్

- రాష్ట్ర స్థాయిలో యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలు, ఇతర ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్‌లో చేరేందుకు అవకాశం కల్పించే పరీక్ష.. టీజీ పీజీఈసెట్(పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్). ఇందులో ర్యాంకు ఆధారంగా ఎంఈ, ఎంటెక్, ఎం. ఫార్మసీ,మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ఫార్మ్–డి(పోస్ట్ బాక్యులరేట్) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. బీటెక్/ బీఈ/బీఫార్మసీ/ బీఆర్క్ సంబంధిత కోర్సులను 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- పీజీ ఈసెట్ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు కేటాయిస్తారు.
- **పీజీఈసెట్ పరీక్ష తేదీ:** 2025, జూన్ 16 – 19.

ఈసెట్

- బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశించేందుకు నిర్వహించే పరీక్ష.. టీజీ ఈసెట్(ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్). పాలిటెక్నిక్, బీఎస్సీ ఉత్తీర్ణులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. పాలిటెక్నిక్ ఉత్తీర్ణతతో పరీక్షకు హాజరయ్యే వారికి 200 మార్కులకు రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్‌లో మ్యాథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. రెండో పేపర్‌లో మొత్తం 100 ప్రశ్నలు అభ్యర్థి ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచే ఉంటాయి.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మాస్యుటిక్స్, ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ, ఫార్మకోగ్నసీ, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ విభాగాల నుంచి 50 ప్రశ్నలు చొప్పున మొత్తం 200 ప్రశ్నలు ఉంటాయి.
- బీఎస్సీ ఉత్తీర్ణులకు మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ నుంచి 50 ప్రశ్నలు చొప్పున మొత్తం 200 ప్రశ్నలు అడుగుతారు.
- **ఈసెట్ పరీక్ష తేదీ:** 2025, మే 12.

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– ఇంగ్లిష్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	330	76,190
నిఫ్టీ ▽	113	23,092

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,956	▽	97
డోజోన్స్	44,383	▽	182
ఎఫ్‌టీఎస్ఈ 100	8,502	▽	63
డాక్స్	21,395	▽	17
షాంఘై	3,230	△	22
నికాయ్	39,932	▽	27

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.20	108.00
€	యూరో	ఎస్‌బీఐ	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

స్వల్పకాల పెట్టుబడికి దారేదీ?



స్వల్పకాలం అంటే..?

నిజానికి స్వల్పకాలానికి ఇతమిత్థమైన నిర్వచనం లేదు. కొన్ని రోజుల నుంచి నెలల వరకు స్వల్పకాలం కిందకే వస్తుంది. ఏడాది, రెండేళ్లు కూడా స్వల్పకాలం కిందకే వస్తుంది. 3–5 ఏళ్ల కాలాన్ని మధ్యస్థంగా, 10 ఏళ్లు మించితే దీర్ఘకాలంగా పరిగణిస్తుంటారు. ముఖ్యంగా మూడేళ్ల కాలానికి ఈక్విటీలను పరిగణనలోకి తీసుకోకపోవడమే రిస్క్ పరంగా సానుకూలం. ఈక్విటీ పెట్టుబడులకు కనీసం ఐదేళ్లు అయినా ఉండాలన్నది నిపుణుల సూచన. గతంలో మాదిరిగా కాకుండా నేడు ఆర్థిక అస్థిరతలు పెరిగిపోయాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం అధికమయ్యాయి. వీటి ప్రభావం ఈక్విటీలపై ఎక్కువగా ఉంటుంది. కనుక దీర్ఘకాలంలోనే ఈక్విటీల్లో మెరుగైన రాబడులు సాధ్యపడతాయి. మూడేళ్ల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన తర్వాత, ఒకవేళ ఈక్విటీలు బేరిష్‌లోకి వెళ్లిపోతే కోలుకునేందుకు ఎంత సమయం అయినా తీసుకోవచ్చు. అందుకుని ఇన్వెస్టర్లు ఈక్విటీలకు బదులు సంప్రదాయ డెట్ సాధనాలను స్వల్ప కాలం కోసం పరిశీలించొచ్చు.



పెట్టుబడి రక్షణతోపాటు రాబడి చూడాలి

- బ్యాంక్ ఎఫ్‌డీలు అన్నింటికంటే మెరుగు
- స్వీప్ ఇన్ ఎఫ్‌డీ మంచి మార్గం
- కాస్త అదనపు రాబడికి డెట్ ఫండ్స్

పెట్టుబడి ఉద్దేశం?

పెట్టుబడిని కాపాడుకోవం, అదే సమయంలో కొంత రాబడిని సమకూర్చుకోవడం స్వల్పకాల పెట్టుబడుల ఉద్దేశంగా ఉండాలి. స్వల్పకాల పెట్టుబడుల కోసం అధిక రాబడులను ఇచ్చే విభాగాలను అస్సలు పరిగణనలోకి తీసుకోకూడదు. అధిక రాబడుల చరిత్ర కలిగిన ఈక్విటీల్లో స్వల్పకాలంలో పెట్టుబడికి సైతం రిస్క్ ఏర్పడుతుంది. దీర్ఘకాలంలోనే అలాంటి సాధనాల్లో రిస్క్‌ను అధిగమించి రాబడులు సమకూర్చుకోగలరు.



ఎఫ్‌డీలపై టీడీఎస్..

బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే రాబడి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.40,000 మించితే (60 ఏళ్లలోపు వారికి), ఆ మొత్తంపై బ్యాంక్‌లు 10 శాతం టీడీఎస్ మినహాయిస్తాయి. 60 ఏళ్లు నిండిన వారికి రూ.50,000 మించితే అప్పుడు టీడీఎస్ అమలవుతుంది. కానీ, డెట్ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు టీడీఎస్ వర్తించదు. టీడీఎస్ వద్దనుకునే వారు ఎఫ్‌డీలకు బదులు డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బ్యాంక్ ఎఫ్‌డీల కంటే ఇతర డెట్ ఫండ్స్‌లోనే పన్ను అనంతరం రాబడి కాస్తంత అధికంగా ఉంటుంది. ముఖ్యంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్‌ను గత రాబడుల ఆధారంగా ఎంపిక చేసుకోవడం సరైన విధానం కాదు. తమ పెట్టుబడుల కాల వ్యవధికి అనుకూలంగా ఉండే ఫండ్స్‌ను, అది కూడా వాటి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో చూసిన తర్వాత ఎంపిక చేసుకోవాలి. తిరిగి ఫలానా సమయంలో పెట్టుబడిని వెనక్కి తీసుకుంటానన్న స్పష్టత ఉన్న వారికి ఎఫ్‌డీలు మెరుగైనవి. ఎంత రాబడి వస్తుందో పెట్టుబడి సమయంలోనే తెలుసుకోవచ్చు. ఒకవేళ పెట్టుబడిని ఎప్పుడు వెనక్కి తీసుకోవాలన్న విషయంలో స్పష్టత లోపించినట్టయితే, అప్పుడు ఓవర్‌నైట్ ఫండ్స్ లేదా లిక్విడ్ ఫండ్స్ లేదా బ్యాంక్ స్వీప్ ఇన్ ఎఫ్‌డీ ఎంపిక చేసుకోవచ్చు.

ప్రతి వ్యక్తికి స్వల్పకాల, మధ్య కాల, దీర్ఘకాల లక్ష్యాలనేవి ఉంటాయి. వీటి ఆధారంగానే పెట్టుబడి సాధనాలను ఎంపిక చేసుకోవాలి. అన్నింటికీ ఒకే అస్త్రం ఫలితాలనివ్వదు. ప్రతి పెట్టుబడిలోనూ రిస్క్ ఉంటుంది. ఇది తమకు ఎంత వరకు ఆమోదమో పరిశీలించిన తర్వాతే వాటిపై నిర్ణయానికి రావాలి. దీర్ఘకాలానికి ఈక్విటీలు అధిక రాబడులు ఇస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. మధ్య కాలిక లక్ష్యాలకు, ఈక్విటీ, డెట్‌తో కలయికతో ఉండే హైబ్రిడ్ ఫండ్స్ మెరుగైనవి. మరి స్వల్పకాల లక్ష్యాల మాటేమిటి? వీటి కోసం రిస్క్ తీసుకోవడం ఎంత మాత్రం సూచనీయం కాదు. స్వల్పకాలంలో రాబడి కంటే పెట్టుబడి రక్షణ కీలకం అవుతుంది. అదే సమయంలో ఎంతో కొంత రాబడి కూడా రావాలి. ఇందుకు అందుబాటులో ఉన్న మెరుగైన సాధనాలపై అవగాహన కల్పించే కథనం ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఫిక్స్‌డ్ డిపాజిట్లు...



బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీలు).. తాతల కాలం నుంచి ప్రాచుర్యంలో ఉన్న సాధనం. కానీ, నేడు అధిక రాబడుల కాంక్షతో చాలా మంది స్వల్పకాలానికీ ఈక్విటీల వైపు అడుగులు వేస్తున్నారు. దీర్ఘకాలానికి అధిక రాబడిని ఆశించడం సమంజసమే. అదే సమయంలో స్వల్ప కాల లక్ష్యాలకు తక్కువ రాబడిని ఇచ్చే రిస్క్‌లేని ఎఫ్‌డీలను విస్మరించడం సరికాదు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌తోపాటు, రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) అందరికీ అర్థమయ్యే సాధనాలు. ముఖ్యంగా ఎఫ్‌డీలపై రాబడి స్థిరంగా ఉంటుంది. అందుకని స్వల్పకాలం కోసం ఉద్దేశించిన పెట్టుబడి కోసం వీటిని నమ్ముకోవచ్చు. పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తే.. అప్పుడు ఒకటికి మించిన బ్యాంకుల్లో ఎఫ్‌డీలు వేసుకోవాలి. ఒక బ్యాంక్‌లో గరిష్ఠంగా రూ.5 లక్షలు డిపాజిట్ చేసుకోవాలి. ఎందుకంటే ఒక బ్యాంక్ సంక్షోభం పాలైతే ఒక డిపాజిట్‌దారునికి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకే బీమా కింద లభిస్తుంది.

స్వీప్ ఇన్ ఎఫ్‌డీని సైతం పరిశీలించొచ్చు. ఇది సేవింగ్స్ బ్యాంక్ ఖాతాకు అనుబంధంగా ఉంటుంది. సేవింగ్స్ ఖాతాలో కనీస బ్యాలన్స్‌ను మించి నగదు చేరిన తర్వాత నిర్ణీత మొత్తం (రూ.1,000 అంతకుమించి) స్వీప్ ఇన్ డిపాజిట్‌గా మారుతుంది. సేవింగ్స్ ఖాతాలో బ్యాలన్స్‌పై వడ్డీ రేటు 3–4 శాతం మించదు. అదే స్వీప్ ఇన్‌లో అయితే 5–6 శాతం వరకు (డిపాజిట్ ఉంచిన కాలాన్ని బట్టి) లభిస్తుంది. డిపాజిట్ రూపంలోకి మారినా కానీ, అవసరమైనప్పుడు వెంటనే ఆ మొత్తాన్ని ఏటీఎం నుంచి అయినా ఉపసంహరించుకోవచ్చు. పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్‌లను సైతం పరిశీలించొచ్చు. కార్పొరేట్ ఎఫ్‌డీలు (కంపెనీలు నిధుల కోసం జారీ చేసేవి), ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల ఎఫ్‌డీలకు దూరంగా ఉండడం మంచిది. ఎందుకంటే వీటిలో డిఫాల్ట్ రిస్క్ ఉంటుంది. అందుకే ఈ డిపాజిట్లలో రాబడి ఎక్కువగా ఉంటుంది. స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎఫ్‌డీలను సైతం పరిశీలించొచ్చు. వీటిలో రిస్క్ ఉంటుంది. అయినప్పటికీ ఆర్‌బీఐ డిపాజిట్ గ్యారంటీ పథకం పరిధిలోకి స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు కూడా వస్తాయి. కనుక రూ.5 లక్షల డిపాజిట్ వరకు ఢోకా ఉండదు. ఒక స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో రూ.5 లక్షలు మించకుండా డిపాజిట్ చేసుకోవచ్చు.

దీర్ఘకాలానికి సైతం..

డెట్ సాధనాలు కేవలం స్వల్పకాల పెట్టుబడులకే అనుకోవడం పొరపాటు. దీర్ఘకాల లక్ష్యాల విషయంలోనూ ఎవరైనా 100 శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవడం సరికాదు. కాల వ్యవధి, తమ రిస్క్ సామర్థ్యం ఆధారంగా అసెట్ అలోకేషన్ విధానాన్ని (వివిధ సాధనాల మధ్య కేటాయింపులు) రూపొందించుకోవాలన్నది నిపుణుల సూచన. 10–20 ఏళ్లకు మించిన కాలానికి ఒకరు తమ పెట్టుబడుల్లో 70 శాతం వరకు ఈక్విటీలకు కేటాయించుకోవచ్చు. మిగిలిన 30 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. బంగారానికి సైతం 5–10 శాతం మేర కేటాయింపులు చేసుకోవచ్చు. ఇన్వెస్టర్ వయసు పెరుగుతూ, లక్ష్యానికి చేరువవుతున్న క్రమంలో ఈక్విటీ పెట్టుబడులను క్రమంగా తగ్గించుకుంటూ, డెట్‌లో పెట్టుబడులు పెంచుకుంటూ వెళ్లాలి. దీని ద్వారా రిస్క్‌ను అధిగమించొచ్చు.

లాభాలపై పన్ను

డెట్ సాధనం ఏదైనా సరే పెట్టుబడిపై వచ్చే లాభం పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుంది. ఎంత కాలం పాటు ఇన్వెస్ట్ చేశారన్న అంశంతో సంబంధం లేదు. పెట్టుబడిని విక్రయించగా వచ్చిన లాభం సంబంధిత ఆర్థిక సంవత్సరంలో ఇన్వెస్టర్ ఆదాయానికి కలుస్తుంది. నిబంధనల మేరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. గతంలో మాదిరి మూడేళ్లు నిండిన పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన లాభంపై ఇండెక్సేషన్ ప్రయోజనం ఇప్పుడు లేదు.

ఓవర్‌నైట్ ఫండ్స్...

డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇవి అతి తక్కువ రిస్క్ కలిగినవి. కొన్ని రోజుల పాటు పెట్టుబడికి ఓవర్‌నైట్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. వీటిలో వార్షిక రాబడి సుమారుగా 5 శాతం ఉంటుంది. కేవలం ఒక రోజులో గడువు తీరే సెక్యూరిటీల్లో ఓవర్‌నైట్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తాయి. కేవలం ఒక రోజు వ్యవధిలోనే ఈ పెట్టుబడిని నగదుగా మార్చుకోవచ్చు. ఎక్కువ లిక్విడిటీతో ఉంటాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల సవరణల ప్రభావం వీటిపై ఉంటుంది. ఏరోజుకారోజు ఇవి గడువు తీరిపోతుంటాయి. దీంతో ఫండ్ మేనేజర్లు రోజువారీగా సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. కనుక వడ్డీ రేట్ల మార్పు ప్రభావం ఈ పెట్టుబడులపై వెంటనే అమల్లోకి వస్తుందని గుర్తు పెట్టుకోవాలి. ఆర్‌బీఐ రివర్స్ రెపో రేట్లను తగ్గించినప్పుడు వీటి రాబడులు కొంత వరకు ప్రభావితమవుతాయి.



మనీ మార్కెట్ ఫండ్స్

ఏడాది వరకు కాల వ్యవధి తీరే సెక్యూరిటీల్లో (సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్లు, కమర్షియల్ పేపర్లు, కమర్షియల్ బిల్లులు, ట్రెజరీ బిల్లులు) ఇవి పెట్టుబడులు పెడుతుంటాయి. అధిక లిక్విడిటీకి తోడు మెరుగైన రాబడిని ఇచ్చే విధంగా వీటి పనితీరు ఉంటుంది. సేవింగ్స్ బ్యాంక్ ఖాతా కంటే వీటిలో కాస్త అధిక రాబడి ఉంటుంది. గడిచిన ఏడాది కాలంలో ఇవి సగటున 7.59 శాతం రాబడిని ఇచ్చాయి.



ఆర్బిట్రేజ్ ఫండ్స్



ఏడాదికి మించి పెట్టుబడి కొనసాగించేట్టు అయితే ఆర్బిట్రేజ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఇవి ఈక్విటీ ఆర్బిట్రేజ్ అవకాశాల్లో (ధరల వ్యత్యాసం) పెట్టుబడులు పెడుతుంటాయి. గడిచిన ఏడాది కాలంలో (అక్టోబర్ నాటికి) ఆర్బిట్రేజ్ ఫండ్స్ సగటున 6.5–8 శాతం మధ్య రాబడులు ఇచ్చాయి. కానీ, మార్కెట్ అస్థిరతల్లో ఇవి తక్కువ రాబడులు, కొన్ని సందర్భాల్లో ప్రతికూల రాబడులు ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. అందుకే ఏడాదికి మించిన కాలానికే వీటిని పరిశీలించాలి.

అల్ట్రా షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్



ఈ పథకాలు 3–6 నెలల్లో గడువు తీరే సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇతర డెట్ పథకాలతో పోల్చినప్పుడు కాస్త సురక్షితమైనవి. అదే సమయంలో ఓవర్‌నైట్ ఫండ్స్, లిక్విడ్ ఫండ్స్ కంటే వీటిలో కొంచెం రిస్క్ ఉంటుంది. అంతేకాదు, ఫండ్ మేనేజర్ తక్కువ రేటింగ్ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తే, డిఫాల్ట్ రిస్క్ కూడా ఎదురుకావచ్చు. కనుక, పెట్టుబడికి ముందు వాటి పోర్ట్‌ఫోలియోలోని సెక్యూరిటీలను ఒక్కసారి పరిశీలించడం మంచిది. అధిక రేటింగ్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసిన పథకాలనే ఎంపిక చేసుకోవడం సూచనీయం. ఇవి ఏడాది కాలంలో సగటున 7.5 శాతం మేర రాబడులు ఇచ్చాయి.

లిక్విడ్ ఫండ్స్...



కొన్ని నెలల పాటు పెట్టుబడులకు లిక్విడ్ ఫండ్స్ కూడా అనుకూలమే. అధిక నాణ్యతతో కూడిన డెట్ సెక్యూరిటీల్లో లిక్విడ్ ఫండ్ మేనేజర్లు పెట్టుబడులు పెడతారు. ఒక్కో డెట్ ఇన్‌స్ట్రుమెంట్ మెచ్యూరిటీ 91 రోజులకు మించకుండా ఉంటుంది. కావాల్సినప్పుడు వేగంగా వెనక్కి తీసుకోవచ్చు. కొన్ని లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్‌స్టంట్ రిఫండ్ సదుపాయాన్ని (రూ.50 వేల వరకు) అందిస్తున్నాయి. అంటే ఆ మేరకు వెంటనే బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. లేదంటే విక్రయించిన మరుసటి రోజున బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తం అందుతుంది. వడ్డీ రేట్ల మార్పుల రిస్క్ వీటిపైనా ఉంటుంది. ఓవర్‌నైట్ ఫండ్స్‌తో పోల్చితే రిస్క్ కాస్తంత ఎక్కువ. వీటిల్లో రాబడులు పెట్టుబడి కాలాన్ని బట్టి 5–6.5 శాతం మధ్య ఉంటాయి. స్వల్పకాలానికి 5 శాతం వరకు ఆశించొచ్చు.



ఆతిథ్యానికి మౌలిక పరిశ్రమ హోదా

- బడ్జెట్‌లో సానుకూల నిర్ణయం తీసుకోవాలి
- వీసా ప్రక్రియలను సులభతరం చేయాలి
- పరిశ్రమ వర్గాల తాజా డిమాండ్లు

న్యూఢిల్లీ: ఆతిథ్య రంగం తమకు మౌలిక పరిశ్రమ హోదా కల్పించాలని దీర్ఘకాలంగా కోరుతోంది. అయినప్పటికీ ఈ దిశగా నిర్ణయం రావడం లేదు. రానున్న బడ్జెట్‌లో అయినా దీనిపై సానుకూల ప్రకటన చేయాలని ఈ రంగం కోరుతోంది. పన్నులను హేతుబద్ధీకరించాలని, వీసా జారీ ప్రక్రియలను సులభంగా మార్చాలని, పెట్టుబడులను ఇతోధికం చేసేందుకు రాష్ట్రాలు మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాలని హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ కేబీ కచ్రు డిమాండ్ చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లిన పరిశ్రమ డిమాండ్లను ఆయన మీడియాతో పంచుకున్నారు.

డిమాండ్లివీ..

- ➡ సమావేశాలు సదస్సులు, ప్రదర్శనలకు (మైస్) అనుకూలమైన కేంద్రాలను ప్రభుత్వం గుర్తించి, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి. తద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించాలి.
- ➡ ఆతిథ్య పరిశ్రమకు పన్ను పెద్ద సమస్యగా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ రకాల పన్నులు అమలవుతున్నాయి. వీటిని హేతుబద్ధీకరించాలి. సింగపూర్, శ్రీలంక, థాయ్‌లాండ్ అనుసరిస్తున్న మాదిరి అత్యుత్తమ విధానాలను అనుసరించాలి.
- ➡ దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, జపాన్ పర్యాటక రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తమ జీడీపీని వృద్ధి చేసుకున్నాయి.
- ➡ గతంలో ఒక హోటల్ తెరవాలంటే 100 రకాల అనుమతులు అవసరమయ్యేవి. అవి ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. అయినప్పటికీ అనుమతుల ప్రక్రియను మరింత సులభంగా మార్చాలి. సింగిల్ విండో విధానం తీసుకురావాలి.
- ➡ రాష్ట్రాల స్థాయిలోనూ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, అందుకు ప్రోత్సాహకాలు ప్రకటించాలి.

పెట్టుబడులు కావాలి..



ప్రభుత్వం ఒక్కటే కావాల్సినన్ని పెట్టుబడులు అందించలేదు. ప్రైవేటు రంగం ముందుకు వచ్చి ఇన్వెస్ట్ చేయాలి. పెట్టుబడులపై తగిన రాబడి వచ్చే విధంగా (ఆర్‌ఓవై) ప్రోత్సాహకం కల్పిస్తే చాలు. అప్పుడే పెట్టుబడులతో ముందుకు వస్తారు. థాయ్‌లాండ్ జీడీపీలో పర్యాటకం నుంచి 25 శాతం వాటా వస్తుంటే.. మన జీడీపీలో 6 శాతం మించడం లేదు. మౌలిక పరిశ్రమ హోదా కల్పించం వల్ల ఆకర్షణీయమైన రేట్లకే రుణాలు లభిస్తాయి.''

– కేబీ కచ్రు, హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్

జీఎస్‌టీ తగ్గించాలి..



దేశీయ పర్యాటక రంగం రెండంకెల వృద్ధిని నమోదు చేస్తోంది. పెరుగుతున్న ఆదాయాలు, ప్రయాణాలకు ప్రాధాన్యం, విస్తరిస్తున్న మధ్య తరగతికి మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు లక్ష్యిత చర్యలు అవసరం. ఇందులో పరిశ్రమ హోదా కల్పించాలి. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు, అభివృద్ధిని ప్రోత్సహించాలి. హోటల్ నిర్మాణానికి జీఎస్‌టీ క్రెడిట్‌తోపాటు, జీఎస్‌టీ రేట్లను క్రమబద్ధీకరించడం వల్ల మొత్తం నిర్మాణ వ్యయాలు తగ్గుతాయి. ఈ చర్యలు దేశీ పర్యాటకాన్ని సానుకూలంగా ప్రభావితం చేస్తాయి.

–రాజేష్ మాగోవ్, మేక్ మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు–సీఈవో

నైపుణ్య కల్పన అవసరం..



రుణాలు పరిశ్రమకు పెద్ద సవాలుగా మారాయి. ముఖ్యంగా చిన్న, మధ్య స్థాయి వ్యాపార సంస్థలపై ఎక్కువ భారం పడుతోంది. ఆతిథ్య రంగానికి రుణాల రేట్లు 10.75% నుంచి 22.50% వరకు ఉన్నాయి. ఈ రేట్లను 7–8%కి తీసుకురావాలి. దీనివల్ల భారం గణనీయంగా తగ్గుతుంది. తద్వారా వృద్ధి, స్థిరత్వం సాధ్యపడతాయి. ఈ రంగంలో నైపుణ్యాలకు కొరత నెలకొంది. నిపుణుల లేమితో 30% ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై పెట్టుబడులు అవసరం. దీనివల్ల సేవల నాణ్యత మెరుగుపడుతుంది.

– మేహుల్ శర్మ, సిగ్నమ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ వ్యవస్థాపకుడు–సీఈవో



ఎల్ఐసీ మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్

న్యూఢిల్లీ: ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ 'మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్'ను ప్రారంభించింది. ఈక్విటీ, డెట్, బంగారం సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడుల విలువను వృద్ధి చేసే విధంగా పథకం పనిచేస్తుంది. ఫిబ్రవరి 7 వరకు ఈ ఓపెన్ ఎండెడ్ పథకం చందాలకు అందుబాటులో ఉంటుంది. అంతేకాదు ఫిబ్రవరి 18 నుంచి అమ్మకాలు, కొనుగోళ్లకు అందుబాటులో ఉంటుందని సంస్థ ప్రకటించింది. ఈ పథకంలో 65 శాతం పెట్టుబడులకు నిఫ్టీ 500 టీఆర్ఐ, 25 శాతం పెట్టుబడులకు నిఫ్టీ కాంపోజిట్ డెట్ ఇండెక్స్, 10 శాతం పెట్టుబడులకు బంగారం మార్కెట్ ధరలు ప్రామాణికంగా ఉంటాయి. ఒకే పథకం ద్వారా ఒకటికి మించిన సాధనాల్లో పెట్టుబడికి ఈ పథకం వీలు కల్పిస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బడ్జెట్, ఫెడ్ వడ్డీ రేట్లపైనే దృష్టి
పన్ను ఆదాతో కూడిన రాబడి: మిరే అసెట్ ట్యాక్స్ సేవర్ ఫండ్

ఇండస్‌ఇండ్ బ్యాంక్ | బ్రోకరేజ్: ఎస్‌బీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 950 టార్గెట్: రూ. 1,800

ఎందుకంటే: ఆధునిక తరం ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించింది. 2023 సెప్టెంబర్‌కల్లా మొత్తం 2,631 బ్రాంచీలతో సేవలు అందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జులై–సెప్టెంబర్)లో పటిష్ట పనితీరు ప్రదర్శించింది. వార్షికంగా నికర లాభం 22 శాత జంప్‌చేయగా.. త్రైమాసికవారీగా(క్యూ1తో) చూస్తే 3 శాతం వృద్ధి చూపింది. రుణాల విడుదల వార్షికంగా 21 శాతం, త్రైమాసికవారీగా 5 శాతం పుంజుకోవడంతో నికర వడ్డీ ఆదాయం సైతం బలపడింది. త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు 4.3 శాతంస్థాయిలో నిలకడ చూపాయి. నిధుల సమీకరణ వ్యయాల(సీవోఎఫ్) కట్టడిపై ప్రత్యేక దృష్టిపెట్టడం ద్వారా బ్యాంక్ రానున్న కాలం(క్యూ3, క్యూ4)లోనూ 4.3 శాతంస్థాయిలో మార్జిన్లను నిలుపుకోవాలని ఆశిస్తోంది. మరోవైపు లోన్ పోర్ట్‌ఫోలియో పటిష్ట పురోగతి నేపథ్యంలో లాభదాయకత మరింత మెరుగుపడే అవకాశముంది. రుణాల నాణ్యతలోనూ నిలకడను చూపడంతో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) గత(2024) క్యూ1 స్థాయిలో 1.93 శాతానికి పరిమితమయ్యాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.57 శాతంగా నమోదయ్యాయి. పీసీఆర్ 71 శాతం వద్ద నిలకడను చూపగా.. రుణ పునర్వ్యవస్థీకరణ బుక్(2024 క్యూ1లో 0.66 శాతం) 0.54 శాతానికి తగ్గింది. ఇకపై 18–23 శాతం శ్రేణిలో బిజినెస్‌లో వృద్ధిని సాధించగలమని బ్యాంక్ అంచనా వేస్తోంది. వాణిజ్య వాహన ఫైనాన్సింగ్ బుక్, మైక్రోఫైనాన్సింగ్ పోర్ట్‌ఫోలియోలలో పటిష్ట డిమాండ్ కనిపిస్తోంది. ఎంఎస్ఎంఈ విభాగంలో భారీ అవకాశాలు బ్యాంక్ తలుపుతడుతున్నాయి



అమీ ఆర్గానిక్స్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,977 టార్గెట్: రూ. 2,500

ఎందుకంటే: ఫార్మాస్యూటికల్ రంగ కంపెనీ అమీ ఆర్గానిక్స్ అదనపు ఎంహెచ్ఎస్‌పీసీ చికిత్సలో న్యూబెక్కా వినియోగానికి అటు యూఎస్ ఎఫ్‌డీఏ, ఇటు యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ(ఈఎంఏ) నుంచి అనుమతులు కోరుతోంది. అయితే ఏడీటీ కాంబినేషన్‌లో ఇందుకు దరఖాస్తు చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 80కుపైగా దేశాలు ఈ కాంబినేషన్‌ను అనుమతించడంతో ఈ ఔషధం ద్వారా కొత్త రకం చికిత్సకు తెరలేవనుంది. వెరసి రెగ్యులేటెడ్ మార్కెట్లు.. యూఎస్, యూరప్‌ల నుంచి త్వరలో అనుమతులు పొందగలదని భావిస్తున్నాం. దీంతో ఎంఎన్‌సీ బేయర్ న్యూబెక్కా అమ్మకాలకు బూస్ట్‌నివ్వనుంది. గతంలో వేసిన అంచనాల ప్రకారం 2030కల్లా న్యూబెక్కా వార్షిక అమ్మకాలు 3 బిలియన్ యూరోలకు(సుమారు రూ. 26,770 కోట్లు) చేరనున్నాయి. త్రైమాసికవారీగా కేవలం 2.5 శాతం సగటు వృద్ధి రేటు ఇది. దీనిప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికానికల్లా(జూలై–సెప్టెంబర్) న్యూబెక్కా అమ్మకాలు 41.7 కోట్ల యూరోల(రూ. 3,740 కోట్లు)ను తాకినట్లు అంచనా. ఇక 5 శాతం వృద్ధిని అంచనా వేస్తే బేయర్ అమ్మకాలు 2027కల్లా 3 బిలియన్ యూరోలకు చేరే వీలుంది. ఈ నేపథ్యంలో న్యూబెక్కా ఔషధ ఇంటర్మీడియట్ సరఫరాలకు ఏర్పడనున్న డిమాండ్ అమీ ఆర్గానిక్స్‌కు పలు అవకాశాలను సృష్టించనుంది. దీనికితోడు ఈ ఏడాది చివరికల్లా అందుకోనున్న సీడీఎంవో కాంట్రాక్ట్ వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26) నుంచి ఆదాయాల్లో వృద్ధికి సహకరించనుంది. ఎలక్ట్రొలైట్ ఎడిటివ్స్‌కు డిమాండ్ తగ్గడం, బాబా ఫైన్ కెమ్ పనితీరు నీరసించడం వంటి ప్రతికూలతలను తద్వారా అధిగమించనుంది.

AMI ORGANICS LIMITED

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



- సాక్షి, హైదరాబాద్

అమ్మగారూ.. ఇల్లు ఊడ్చేశా.. అంట్లు తోమేశా..!

అంట్లుతోమడం మొదలు బట్టలు మడతపెట్టడం దాకా ఇల్లాలికి శ్రమలేకుండా ఇంటి పనులన్నీ చేసే రోబో ఒకటి! సరుకులు సహా మోత పనులను మీ బదులు అలవోకగా చేసిపెట్టగల మర మనిషి మరొకటి!! పనివాళ్ల కొరతను తీరుస్తూ క్లబ్ హౌస్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను శుభ్రం చేసేందుకు ఇంకో రోబో! హాల్లో మీ కదలికలకు అనుగుణంగా లైట్‌ను ప్రసరించే రోబో ఇంకొకటి!! వీకెండ్‌లో కుటుంబమంతా కలిసి సినిమా చూద్దామనుకోగానే పరుగున వచ్చి తన కళ్లనే ప్రొజెక్టర్‌గా చేసి సినిమా చూపే హైఫై రోబో మరొకటి!! స్నేహితులతో ఇంట్లో చిల్ అవుతుంటే చిటికెలో కాక్‌టెయిల్‌ను సిద్ధం చేసి అందించే ఓ బార్‌టెండర్ రోబో!! ఓ బుజ్జాయిలా ఇంటెల్లిపాదినీ వచ్చీరాని మాటలతో అలరించే ఓ చిట్టి రోబో!! బాబోయ్.. ఇల్లంతా ఏమిటీ రోబోలమయమని అవాక్కవుతున్నారా? అమెరికాలోని లాగ్ వేగాస్ వేదికగా తాజాగా జరిగిన కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా కనిపించబోయే ట్రెండ్‌ను కళ్లకు కట్టింది.

త్వరలో మార్కెట్‌లోకి ఇంటి పనులు చక్కబెట్టే రోబోలు

దైనందిన కార్యకలాపాల్లో సాయం చేయనున్న ఏఐ ఆధారిత మరమనుషులు

సొంతంగా ఆలోచించి ప్రతిస్పందించగలగడం వాటి ప్రత్యేకత

అమెరికాలో జరిగిన కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో-2025లో ఆవిష్కృతమైన భవిష్యత్ ట్రెండ్

ఇప్పటివరకు మనం హోటళ్లు, మాల్స్ వద్ద ఆతిథ్య సేవల్లో నిమగ్నమైన రోబోలను లేదా పరిశ్రమలు, వైద్య రంగంలో సేవలు అందించే రోబోలను మాత్రమే చూశాం. అయితే అవన్నీ ముందే సిద్ధం చేసిన ప్రోగ్రామ్‌లకు అనుగుణంగా మాత్రమే పనిచేస్తున్నాయి. అంటే ఒకే రకమైన పనిని మాత్రమే ఆ రోబోలు చేసిపెట్టగలవన్నమాట. కానీ త్వరలోనే మనతో మాటకలుపుతూ మన ఆదేశాలకు అనుగుణంగా పనులు చేసిపెట్టగల కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత రోబోలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా మరమనిషి అనే రూపాన్ని తుడిచేస్తూ ఎన్నో ఆకారాలు, సైజుల్లో మనల్ని కనువిందు చేయనున్నాయి. రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికత పరిజ్ఞానాన్ని మన దైనందిన కార్యకలాపాలకు ఉపయోగపడేలా టెక్నాలజీ కంపెనీలు రోబోలను తీర్చిదిద్దుతున్నాయి.

లాస్‌వెగాస్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో ఇంటి పనుల్లో సహకరించే హైటెక్ రోబోలు సందడి చేశాయి. ఇవి ఇంటిని శుభ్రం చేయడం, మొక్కలను అందంగా కత్తిరించడం, స్విమ్మింగ్ పూల్ క్లీనింగ్, హాల్లో లైట్లకు బదులు వెలుతురు ప్రసరింపజేయడం వంటి సేవలు చేసిపెట్టగలవు.

ఆడమ్ నుంచి మిరుమి దాకా...

రిచ్‌టెక్ రొబోటిక్స్ అనే సంస్థ తయారు చేసిన బార్‌టెండర్ రోబో 'ఆడమ్' సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. అలాగే శిశువు ప్రతిరూపంలోని 'మిరుమి అనే రోబో వీక్షకుల మాటలకు అనుగుణంగా ప్రతిస్పందిస్తూ అలరించింది. టాంజిబుల్ ఫ్యూచర్ సంస్థ రూపొందించిన చాట్‌జీపీటీ ఆధారిత 'లూయి', ఎన్‌చాన్టెడ్ టూల్స్ సంస్థ తయారు చేసిన 'మిరోకై' ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేకాకుండా ఓపెన్‌డ్రాయిడ్స్ హోమ్-కోర్స్ అసిస్టెంట్ 'ఆర్2డీ3', జిజాయ్ రూపొందించిన అటానమస్ లాంప్ 'మి-మో', శామ్‌సంగ్ సృష్టించిన 'బాల్లీ' అనే ప్రొజెక్టర్ రోబోలు కూడా సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ షోలో ప్రదర్శించిన రోబోలన్నీ సహజ భాషా ప్రాసెసింగ్ అల్గోరిథంతో మనకు సమానమైన వాయిస్ కమాండ్‌లకు అందించగలవు. ప్రతి ఒక్క రోబో ఆటోమేషన్‌ను మాత్రమే కాకుండా భావనలను వ్యక్తపరిచే ఇంటరాక్టివ్‌నెస్ స్థాయిని కూడా ప్రదర్శించాయి. మిరోకై రోబో యానిమేటెడ్ ముఖంతో మనిషిలానే కనిపిస్తుంది. 'ఇఫ్-దిస్-దెన్-దట్' లాజిక్ ఆధారంగా ఏదైనా 'పని'ని నేర్చుకోగలదు.



మిరోకాయ్

ఎంత ప్రియమో...

ఈ రోబోల్లో కొన్ని మార్కెట్‌లో ఇప్పటికే అందుబాటులోకి రాగా మరికొన్ని భవిష్యత్‌లో అందుబాటులోకి రానున్నాయి. మిరుమి త్వరలో 70 డాలర్ల (సుమారు రూ. 6 వేలు) రిటైల్ ధరకు అందుబాటులోకి రానుంది. లూయి ఇప్పటికే 169 డాలర్ల (సుమారు రూ. 14,500)కు అందుబాటులో ఉండగా మి-మో లాంప్ రోబో రిటైల్ ధర 3,500 డాలర్ల (సుమారు రూ. 3 లక్షలు) నుంచి ప్రారంభమవుతుంది. అయితే పూర్తి స్థాయి హ్యూమనాయిడ్ రోబోలు చాలా ఖరీదైనవి. ముఖ్యంగా మిరోకై, ఆర్2డీ3 ధరలు 40 వేల డాలర్లు, 60 వేల డాలర్లు (సుమారు 34 లక్షల నుంచి రూ. 51 లక్షలు)గా ఉంది. ఈ దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా రోబోల మార్కెట్ ఏటా దాదాపు 20% వృద్ధి చెందుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే ఐదేళ్లలో భారత మార్కెట్‌లోనూ అత్యాధునిక రోబోలు సందడి చేయవచ్చని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆయా రోబోల విక్రయాలు పెరిగేకొద్దీ వాటి ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది.

అలాంటి కాల్స్‌లో 90% మోసపూరితమే




అంతర్జాతీయ ఫ్రాడ్ కాల్స్‌పై టెలీకమ్యూనికేషన్స్ విభాగం హెచ్చరిక

- ఫేక్ కాల్స్ కట్టడికి అందుబాటులోకి సంచార్ సాథీ యాప్
- గతంలో రోజుకు 1.35 కోట్ల ఫేక్ కాల్స్
- ఆధునిక టెక్నాలజీతో వాటి సంఖ్యను 4 లక్షలకు తగ్గించిన టెలికం విభాగం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ నంబర్లతో వచ్చే ఫోన్‌కాల్స్‌లో 90 శాతం వరకు మోసపూరితమైనవేనని టెలీకమ్యూనికేషన్స్ విభాగం వెల్లడించింది. టెలీకమ్యూనికేషన్స్ విభాగం ఇటీవల అందుబాటులోకి తెచ్చిన సంచార్‌సాథీ మొబైల్‌యాప్‌తో వీటికి అడ్డుకట్ట వేయగలుగుతున్నట్టు అధికారులు తెలిపారు. సైబర్ నేరగాళ్లు విదేశాల్లో ఉంటూ చేస్తున్న ఫోన్‌కాల్స్‌ను ఆధునిక టెక్నాలజీ వాడి భారతీయ నంబర్ల మాదిరిగా కనిపించేలా చేసి కూడా మోసాలకు పాల్పడుతున్నట్టు వారు వివరించారు. వాస్తవానికి మనకు ఫోన్ కాల్ వచ్చినప్పుడు ఆ నంబర్.. భారతీయ ఫోన్ నంబర్ +91తో మొదలైనట్టుగా కనిపించినా, అవన్నీ అంతర్జాతీయ ఫోన్‌కాల్సే అని అధికారులు పేర్కొన్నారు. ఇలాంటి ఫేక్‌కాల్స్‌పై వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు ఇటీవల టెలీకమ్యూనికేషన్స్ విభాగం సంచార్‌సాథీ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫిర్యాదు మేరకు ఆయా నంబర్లను బ్లాక్ చేస్తున్నారు. ఇందుకు అన్ని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి టెలికమ్యూనికేషన్ల విభాగం ఇంటర్నేషనల్ ఇన్‌కమింగ్ స్పూఫ్డ్ కాల్స్ ప్రివెన్షన్ సిస్టం అనే సాంకేతికతను అభివృద్ధి చేసింది. గతంలో దేశవ్యాప్తంగా రోజుకు దాదాపు 1.35 కోట్ల స్పూఫ్డ్ ఫోన్‌కాల్స్ వచ్చేవని, ఇటీవల స్పూఫ్డ్ కాల్స్ ప్రివెన్షన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఆ సంఖ్య బాగా తగ్గినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం స్పూఫ్డ్ కాల్స్ రోజుకు సుమారు 4 లక్షలవరకు మాత్రమే వస్తున్నట్టు వెల్లడించారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌ను కట్టడి చేయడం సైబర్‌నేరాల నియంత్రణలో కీలకమని అధికారులు చెపుతున్నారు. కాగా, మొబైల్ వినియోగదారులు సంచార్ సా మొబైల్ యాప్ గూగుల్‌ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌ను వాడి అనుమానాస్పద నంబర్లను వెంటనే బ్లాక్ చేసే వీలుంటుందని వారు పేర్కొంటున్నారు.

పెండింగ్ కేసుల తగ్గింపునకు చర్యలు

గణతంత్ర వేడుకల్లో ఏసీజే జస్టిస్ సుజోయ్ పాల్



సాక్షి, హైదరాబాద్: పెండింగ్ కేసుల తగ్గింపునకు న్యాయవాదుల సహకారం అవసరమని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఇప్పటికే పెండింగ్ కేసుల తగ్గింపునకు తీసుకున్న చర్యలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి హైకోర్టులో 2,31,575 కేసులు పెండింగ్‌లో ఉంటే, డిసెంబర్ 31 నాటికి 2,29,221కు తగ్గాయని వెల్లడిచారు. ఈ ఏడాది 70,626 కేసులు కొత్తగా వస్తే.. మొత్తం 72,980 కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. హైకోర్టులో గణతంత్ర వేడుకల్లో ఆదివారం ఆయన పోలీసుల వందనాన్ని స్వీకరించి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ.. జ్యుడీషియరీలో ఈ ఏడాది ఉద్యోగ నియామక కేలండర్‌ను కూడా జారీ చేసినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా దేశంలోనే అత్యధికంగా కేసులు తెలంగాణలో పరిష్కారమైనట్లు గుర్తుచేశారు. హైకోర్టులో రెండు డివిజన్ బెంచ్‌లు, ఒక సింగిల్ బెంచ్ పేపర్ లెస్ కోర్టులుగా పనిచేస్తున్నాయని తెలిపారు. పది జిల్లా కోర్టుల్లో రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. కొత్త హైకోర్టు భవనాలు త్వరలోనే పూర్తవుతాయని అన్నారు. వీటికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,580 కోట్లు కేటాయించిందని చెప్పారు. మధ్యవర్తిత్వం, రాజీ విధానాల ద్వారా కేసుల పరిష్కారానికి కూడా పెద్ద పీట వేస్తున్నట్లు వెల్లడించారు. హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలంటూ 2023 డిసెంబర్‌లో సుప్రీంకోర్టుకు పంపిన నలుగురు న్యాయవాదుల జాబితాను ఆమోదించాలని న్యాయవిభాగాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు

హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, సీఎం రేవంత్‌రెడ్డి, ధ్యాన గురువు కమలేశ్ డి.పటేల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆదివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, సీఎం రేవంత్‌రెడ్డి, ధ్యాన గురువు కమలేశ్ డి.పటేల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

గవర్నర్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

గవర్నర్ ఎక్సలెన్సీ అవార్డులకు సంబంధించిన వ్యక్తుల కేటగిరీలో దుశ్చర్ల సత్యనారాయణ (పర్యావరణ పరిరక్షణ), అరికెపూడి రఘు(దివ్యాంగుల సంక్షేమం), జివాంజిదీప్తి (క్రీడలు), సాంస్కృతిక కేటగిరీలో పీబీ కృష్ణభారతి, పాండురంగారావు

- సంస్థల కేటగిరీలో ధ్రువాన్ష్ సంస్థ (పర్యావరణ పరిరక్షణ), ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్(దివ్యాంగుల సంక్షేమం), మెహతా ఫౌండేషన్(స్పోర్ట్స్ అండ్ గేమ్స్), సంస్కృతి ఫౌండేషన్ (కల్చరల్), స్పెషల్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఐఎఫ్‌ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డిలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందజేశారు. ఒక్కో అవార్డు గ్రహీతను శాలువ కప్పి సత్కరించి మెమెంటో, రూ.2 లక్షల చెక్కుఅందజేశారు. ఆ తర్వాత తేనీటి విందులో పాల్గొన్నారు.

అతిథులందరినీ పలకరిస్తూ....

విందుకు హాజరైన అతిథులందరినీ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఆయన సతీమణి సుధావర్మ పలకరించారు. అతిథులు కూర్చున్న ప్రాంతమంతా కలివిడిగా తిరిగారు. పద్మ అవార్డులకు ఎంపికైన మందకృష్ణ, నాగేశ్వర్‌రెడ్డిలతో గవర్నర్ దంపతులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



తేనీటి విందు కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, సీఎం రేవంత్‌రెడ్డి, ధ్యాన గురువు కమలేశ్ డీ పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సీఎంతో గవర్నర్ ప్రత్యేక సమావేశం

తేనీటి విందు అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను ఆయనకు వివరించినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి ప్రత్యేకంగా అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలైన రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించిన వివరాలను కూడా గవర్నర్‌కు వెల్లడించినట్టు తెలిసింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ అధ్యయనంతోపాటు కులగణనకు సంబంధించిన అంశంపై ప్రత్యేకంగా శాసనసభ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ఉన్న అంశాన్ని కూడా గవర్నర్‌కు వివరించినట్టు తెలిసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డుల జాబితాను ప్రకటించగా, అందులో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందనే విషయాన్ని కూడా సీఎం రేవంత్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం.



పోలీస్ అధికారులతో సీఎం రేవంత్, గవర్నర్ జిష్ణుదేవ్, సీఎస్ శాంతికుమారి

సీఐ సెల్ అధికారులకు స్పెషల్ ఆపరేషన్స్ మెడల్

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదానికి, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టి గణనీయమైన ఫలితాలు సాధించిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం హోంమినిస్టర్స్ స్పెషల్ ఆపరేషన్స్ మెడల్ ప్రకటిస్తుంటుంది. రాష్ట్ర నిఘా విభాగంలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ) సెల్‌కు చెందిన అధికారులు, సిబ్బందికి గత ఏడాది కేంద్రం ఈ పతకాలు ప్రకటించింది. వీటిని ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందించారు. ఈ పతకం అందుకున్న అధికారుల్లో డీఎస్పీ కైతా రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వర్, ఎస్సైలు కుకుడపు శ్రీనివాసులు, మహ్మద్ అక్తర్ పాషా, సయ్యద్ అబ్దుల్ కరీం, ఎస్.రాజవర్ధన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు మహ్మద్ తాజ్ పాషా, మహ్మద్ ఫరీదుద్దీన్, కానిస్టేబుల్ కె.కిరణ్‌కుమార్ ఉన్నారు. వీరిని సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ జితేందర్ అభినందించారు.

వెరై'ట్రీ'గా వందనం

తాటి చెట్టుపై జాతీయ పతాకావిష్కరణ



కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామంలో యువ గీత కార్మికులు ఆదివారం గణతంత్ర వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గీత కార్మికులు మోడెం రాంబాబు, మంద సంతోష్ వృత్తిలో భాగంగా కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కారు. అక్కడే కొమ్మలకు జాతీయ జెండాను కట్టి.. జాతీయ గీతం పాడి వందనం సమర్పించారు. ఉదయం ఊళ్లో జరిగిన వేడుకల్లో పాల్గొనలేకపోయిన ఆ యువకులు.. ఇలా జెండాకు గౌరవ వందనం చేయడం ఆకట్టుకుంది.

దక్షిణ మధ్య రైల్వేలో ఘనంగా గణతంత్ర వేడుకలు



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో కన్నుల పండువగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఝజాతీయ జెండాను ఆవిష్కరించి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వివిధ బృందాలు సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్పీఎస్ఎఫ్), సివిల్ డిఫెన్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొని జనరల్ మేనేజర్‌కు గ్రాండ్ సెల్యూట్‌ను సమర్పించాయి. ఈ పరేడ్‌కు మౌలాలీ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ రాకేశ్ మీనా నాయకత్వం వహించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రగతిపై జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల ఆదాయంలో రూ.14,991 కోట్ల ఆదాయం సాధించినట్లు చెప్పారు. ప్రయాణికుల నుంచి రూ. 4,268 కోట్లు, సరుకు రవాణాపైన రూ. 10,011 కోట్లు లభించిందన్నారు. 119 స్టేషన్‌లను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

జీవించే హక్కుపై దాడి

రాజ్యాంగంపై దాడిని తిప్పికొట్టాలి

- ఇక్కడ పుట్టినవారంతా భారతీయులే
- మహాత్మాగాంధీ మనుమడు రాజ్‌మోహన్‌గాంధీ
- హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో చర్చాగోష్ఠి



సాక్షి, హైదరాబాద్: దేశ ప్రజలందరికీ రాజ్యాంగం కల్పించిన సమానత్వం, జీవించేహక్కు, న్యాయం, సోదరభావంపై దాడి జరుతోందని మహాత్మాగాంధీ మనుమడు, చరిత్రకారుడు, మాజీ ఎంపీ రాజ్‌మోహన్‌గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడిని తిప్పికొట్టేందుకు ప్రజలంతా సమీకృతం కావాలని పిలుపునిచ్చారు. తమతమ సమీప బృందాలతో తరచుగా చర్చిస్తూ చీకటిని పారద్రోలేందుకు దీపాన్ని వెలిగించే ప్రయత్నం చేయాలని కోరారు. ఆదివారం సత్య నాలెడ్జ్ సిటీలో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్-2025 ముగింపు (అజయ్‌గాంధీ స్మారకంగా) సందర్భంగా 'భారత రాజ్యాంగ విలువలు'అనే అంశంపై రాజ్‌మోహన్ గాంధీ, సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ చైర్‌పర్సన్ హర్ష్ మందర్‌లతో రచయిత్రి కల్పనా కన్నబీరన్ చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌మోహన్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని 'సిటిజన్‌షిప్ ఆర్టికల్'లో ఈ దేశంలో పుట్టినవారు లేదా ఇక్కడ జీవించేవారంతా భారత పౌరులేనని పేర్కొన్నారని గుర్తుచేశారు. పదో శతాబ్దంలోని పూర్వీకుల పుట్టినతేదీ ఇప్పుడు చెప్పాలని ఎక్కడా లేదని అన్నారు. అక్బర్ విదేశీయుడు కాబట్టి ముస్లింలు అంతా విదేశీయులే అనే వాదన సరికాదని తెలిపారు. వాస్తవానికి అక్బర్ కూడా విదేశీయుడు కాదని చెప్పారు.

మత ప్రాతిపదికన దేశాన్ని విభజించలేదు..: భారతదేశ విభజన మత ప్రాతిపదికన జరగలేదని రాజ్‌మోహన్‌గాంధీ స్పష్టంచేశారు. దేశవిభజన మత ప్రాతిపదికన జరిగిందనే భావన ప్రజల్లో ఏర్పడిందని, అది సరికాదని చెప్పారు. 1947 జూలైలో బ్రిటన్ పార్లమెంటులోని హౌస్ ఆఫ్ కామన్స్ రూపొందించిన 'ఇండిపెండెన్స్ ఇన్ ఇండియా యాక్టు'ను తాను లీగల్ డాక్యుమెంట్‌గా పరిగణిస్తానని, ఇందులో తప్ప మరెక్కడా దేశవిభజనకు గురించి అధికారిక ప్రస్తావన లేదని తెలిపారు. దేశాన్ని భారత్, పాకిస్తాన్‌గా విభజించటానికి సంబంధించిన అన్ని అంశాలను గురించి ఈ చట్టంలో పొందుపరిచారని చెప్పారు. ఇందులో ఎక్కడా హిందు, ముస్లిం అనే పదాలనుగానీ, ఒక హిందు, ఒక ముస్లిం దేశం అనే ప్రస్తావన గానీ లేదని వివరించారు. రాజ్యాంగం ప్రకారం భారత్‌లో పుట్టినవారంతా భారతీయులేనని పేర్కొన్నారు. రాజ్యాంగం ఈ దేశ ప్రజలందరికీ చెందినదని స్పష్టం చేశారు.

ట్రంప్, మోదీ మధ్య సారూప్యత..: మైనారిటీలు, పౌరుల ధ్రువీకరణ, ముస్లిం గుర్తింపు, కొన్ని విచిత్ర ఆలోచనల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య సారూప్యత ఉందని హర్ష్‌మందర్ అన్నారు. వీరిలో ప్రజల పట్ల జాలి, కరుణ తక్కువగా కనిపించినా.. మిలిటరీ శక్తితోనో, మరో విధంగానో అధికారంలోకి వస్తున్నారని తెలిపారు.


ముగిసిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

మూడు రోజులపాటు ఉత్సాహంగా సాగిన సాహిత్య పండుగ

అనేక అంశాలపై ప్రముఖులతో చర్చా గోష్ఠులు

సాక్షి, హైదరాబాద్: మూడురోజులపాటు ఉత్సాహంగా సాగిన 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్-2025'(హెచ్ఎల్ఎఫ్) ఆదివారం ముగిసింది. అతిథి దేశంగా లిథువేనియా, ఇండియన్ లాంగ్వేజ్ ఇన్ ఫోకస్‌గా 'సింధీ'సాహిత్యోత్సవాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ కార్యక్రమంగా 2010లో మొదలైన ఈ ఫెస్టివల్‌లో ప్రముఖ కవులు, రచయితలు, సినీతారలు, ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారు పాల్గొంటున్నారు. సాహిత్య ఉత్సవంగా దీనిని పేర్కొంటున్నా.. వివిధ రకాల కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్ఠులు, వర్క్‌షాపులు, గ్రంథాలపై చర్చలు నిర్వహించారు. ఈసారి 15 విభాగాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. హైటెక్ సిటీ సమీపంలోని సత్య నాలెడ్జ్ సిటీలో ప్రధానంగా, పక్కనే ఉన్న టీ-హబ్‌లో మరి కొన్ని కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ప్రముఖ నటి, పద్మభూషణ్ గ్రహీత షబానా ఆజ్మీ, మరాఠీ నటుడు అమోల్ పాలేకర్, సినీనటి హ్యూమాఖురేషి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, సత్య మొహంతి, జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయ్, రామ్మోహన్‌రెడ్డి, దినేశ్ సి.శర్మ, శ్రీనివాస్ జైన్, సంధ్య గోఖలే, సినీ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ, సాజ్ అగర్వాల్, సుభద్ర ఆనంద్, రాజ్‌మోహన్ గాంధీ, హర్ష్‌మందర్‌ల, కల్పనా కన్నబీరన్ తదితర ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

'ఫెమినిస్టు' అంటే తప్పేమీ కాదు!



చిన్నారుల భద్రత అందరి బాధ్యత

భాషను కాపాడితే అది మనల్ని కాపాడుతుంది

తెలుగు నేర్చుకుని శ్రీ శ్రీ సాహిత్యం చదివాను

లిటరరీ ఫెస్టివల్‌లో హీరో సిద్ధార్థ్

సాక్షి, హైదరాబాద్: 'ఫెమినిస్టు అంటే అదోలా చూస్తున్నారు. ఫెమినిస్టు అంటే మంచి పదమే.. అదేం తప్పు కాదు'అని ప్రముఖ సినీ హీరో సిద్ధార్థ్ అన్నారు. ఆడపిల్లల విషయంలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉండాలని కోరారు. ఇందులో భాగంగానే తాను 'చిత్తా'సినిమాను (తెలుగులో 'చిన్నా') తీశానని చెప్పారు. హైదరాబాద్‌లోని సత్వ నాలెడ్జ్ సిటీ వేదికగా మూడు రోజులపాటు జరిగిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్త విద్యా రావుతో 'సినిమా- సామాజిక మార్పు'అనే అంశంపై చర్చించారు. 'సినిమాలు- సామాజిక మార్పు మాట వింటుంటే సత్యజిత్‌రే గుర్తుకు వస్తున్నారు. ప్రస్తుతం సినిమాకు కళ కన్నా వ్యాపారమే ప్రధానాంశంగా మారింది. రూ.1,000 కోట్ల కలెక్షన్లే లక్ష్యంగా ప్రతి శుక్రవారం సినిమాలు విడుదల చేస్తున్నారు. అందుకే నా సినిమాకు ఎవరి సంజాయిషీ ఉండొద్దనే నిర్మాతగా మారాను. ఇండిపెండెంట్ ఆర్టిస్టులే సామాన్యుడి కోసం సినిమాలు తీయగలుగుతారు. సినిమాల వల్ల నేను 7 భాషలు నేర్చుకోగలిగాను. భాషను మనం కాపాడితే, భాష మనల్ని కాపాడుతుంది. తెలుగు భాష అంటే నాకు సిరివెన్నెల సీతారామశాస్త్రి గుర్తొస్తారు. ఆయన వద్ద, వేటూరి వద్ద నేను తెలుగు నేర్చుకున్నాను. వీరు నాకు గురువులు, దేవుళ్లు. ఎక్కడో తమిళనాడు నుంచి వచ్చి తెలుగు నేర్చుకుని మీలో ఒకడిగా ఉండగలిగాను. ముఖ్యంగా శ్రీశ్రీ సాహిత్యం అంటే నాకు చాలా ఇష్టం. ఈ తరం తప్పకుండా చదవాల్సిన సాహిత్యం ఆయనది'అని పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం। 27-1-2025

వెయ్యి పడకలేనా!

నిలిచిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులు • ఏన్సాన్‌పల్లి శివారులో రూ.324 కోట్లతో చేపట్టిన నిర్మాణం

బడ్జెట్ కేటాయించక పూర్తికాని వసతులు • గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

అందుబాటులోకి వస్తే పేద ప్రజలకు మెరుగైన వైద్యం • ప్రస్తుతం 300 పడకలతో కొనసాగుతున్న సిద్దిపేట జీజీహెచ్

సిద్దిపేటలో చేపట్టిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో రోగులు పూర్తిస్థాయి వైద్య సేవలకు నోచుకోలేకపోతున్నారు. వెయ్యి పడకల ప్రభుత్వాసుపత్రి భవనంలో మౌలిక వసతులు కల్పించకపోవడం, అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. దీంతో పేద ప్రజలు చికిత్స నిమిత్తం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు.
– సిద్దిపేట కమాన్


సిద్దిపేట శివారులో వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం

అప్పటి సీఎం కేసీఆర్‌తో ప్రారంభం

సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్‌పల్లి గ్రామ శివారులో రూ.324 కోట్ల అంచనా వ్యయంతో వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ 2020 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేశారు. ఐదు అంతస్తులతో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు ఒకేచోట అందుబాటులోకి తెచ్చేలా భవనాన్ని నిర్మించారు. మొదట ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో డెంటల్ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మాజీ మంత్రి హరీశ్‌రావు 2023 అక్టోబర్‌లో ప్రారంభించారు.

నిధుల్లేక ముందుకు సాగని పనులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వాసుపత్రి పెండింగ్ పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా.. 300 పడకలతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కొనసాగుతోంది. వెయ్యి పడకల ప్రభుత్వాసుపత్రి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. పేద ప్రజలకు అన్ని విభాగాల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.



ప్రభుత్వ పరిధిలోది..

వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ పరిధిలోని అంశం. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్నాం. త్వరలోనే ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. – డాక్టర్ విమలాథామస్, సిద్దిపేట

త్వరలో డెంటల్ విభాగం మూసివేత?

ప్రస్తుతం వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లోని డెంటల్ విభాగంలో వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓపీడీ సాధారణ శస్త్ర చికిత్స, ఓపీడీ ఆర్థోపెడిక్, బ్లడ్ శాంపిల్స్ సేకరణ, అత్యవసర విభాగం, ఫార్మసీ విభాగాలను, మొదటి అంతస్తులో ఓపీడీ కన్ను, ఓపీడీ చెవి, ముక్కు, గొంతు, డయాలసిస్ వార్డు, క్యాథ్‌ల్యాబ్, రెండో అంతస్తులో క్షయ, ఛాతీవ్యాధి వార్డు, డీవీఎల్ వార్డు, జనరల్ వార్డులను ఏర్పాటు చేశారు. రూ.లక్షల విలువైన పరికరాలను సైతం భవనంలోని అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవడం, సిబ్బందిని నియమించకపోవడం, మెషీన్లను ఏర్పాటు చేయకపోవడంతో భవనం ప్రారంభోత్సవానికే పరిమితమైంది. డెంటల్ విభాగంలో సహాయకులుగా, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మొత్తం 20 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వాసుపత్రి ఫండ్ ద్వారా జిల్లా కలెక్టర్ ప్రతి నెల వేతనాలు చెల్లిస్తున్నారు. కాగా, బడ్జెట్ లేనందున వచ్చే నెల నుంచి వీరికి వేతనాలు చెల్లించలేమని ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు.. వేతనాలు చెల్లించలేమని.. విధులకు రావద్దని శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి సూచించినట్టు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న డెంటల్ విభాగాన్ని సైతం మూసివేసి ఫిబ్రవరి మొదటి వారంలో భవనాన్ని మూసివేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనికి ప్రధాన కారణం నిధులు, బడ్జెట్ కొరతని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ కేటాయించి వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ కలెక్టర్, డీఎంఈ, రాష్ట్ర హెల్త్ సెక్రటరీలకు ఇప్పటికే వినతి పత్రాలు అందజేసినట్టు ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో ప్రవీణ్ తెలిపారు.


వెయ్యి పడకల ప్రభుత్వాసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న పనులు

డీజీపీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

సాక్షి, హైదరాబాద్: లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడిషనల్ డీజీ స్వాతి లక్రా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐజీ రమణ కుమార్, డీజీపీ కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు పాల్గొన్నారు. ఆబ్కారీ భవన్ అవరణలో జాతీయ పతాకాన్ని తెలంగాణ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ ఎగురవేశారు. అంతకుముందు ఎక్సైజ్ పోలీసుల గౌరవ వందనాన్ని కమిషనర్, డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషీ, సురేశ్, కేఏబీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలిలో గణతంత్ర దినోత్సవం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28న యూపీఎస్ ప్రతుల దగ్ధం

నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన ఎన్ఎంవోపీఎస్



సాక్షి, హైదరాబాద్: యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూ పీఎస్) ప్రతులను దగ్ధం చేస్తూ దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 28న నిరసనలు చేపట్టాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. కేరళ వేదికగా మొదలైన నిరసన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా చేపట్టాలని, ఫిబ్రవరి ఏడో తేదీన బెంగళూరులోని ఫ్రీడం పార్కు, మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరై పాత పెన్షన్ విధానం అమలుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేయాలని కోరారు. ఆదివారం కేరళలోని కోజికోడ్ జిల్లా కేంద్రంలో స్టేట్ ఎన్‌పీఎస్ ఎంప్లాయిస్ కలెక్టివ్ ఆధ్వర్యంలో 'క్విట్ ఎన్‌పీఎస్– నో యూపీఎస్' మహా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీకి హాజరైన స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, యూనిఫైడ్ పెన్షన్ విధానం అమల్లోకి తెస్తూ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో కేరళ సీపీఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ రఫీఖ్, ప్రధాన కార్యదర్శి షాజీవ్, రాష్ట్ర నాయకులు లాజర్, తెలంగాణ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్‌లతో పాటు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశరక్షణకు దన్ను







రక్షణ రంగ ఆయుధ సంపత్తిలో మిన్న..

తెలంగాణకు తలమానికం.. ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం

కార్గిల్ యుద్ధంలో ఆయుధాల కొరతను తీర్చిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: **కార్గిల్ యుద్ధం** జరుగుతున్న రోజులవి.. **కశ్మీర్‌లోని** నియంత్రణ రేఖ వెంబ**డి ఉన్న** పాకిస్తాన్ చొరబాటు**దారు**లను తరిమికొట్టేందు**కు** 1999లో సైనికులు భీక**ర** పోరు సాగిస్తున్నారు.. రక్షణ దళాలకు అకస్మాత్తుగా ఆయుధ కొరత తలెత్తింది.. బోఫోర్స్ వంటి ఆయుధాలు అత్యవసరంగా కావలసి వచ్చింది.. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో దేశ రక్షణ దళాల**కు** ఆయుధ సంపత్తిని ఆగ**మే**ఘాల మీద అం**దించి** పాకిస్తాన్ చొరబాటు**దారులను** తరిమికొట్టడంలో తన **వంతు పాత్ర** పోషించిన ఘన చరిత్ర **ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి** ఉంది. దేశ రక్షణ రంగా**నికి వెన్నుదన్నుగా** నిలుస్తున్న సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఈ ఆయుధ కర్మాగారం ప్రస్థానంపై.. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆయుధ సంపత్తి ఇలా..

తెలంగాణకు తలమానికంగా నిలుస్తున్న **ఎద్దుమైలారం** ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో బీఎం**పీ-2 (సారథి)** వంటి ఇన్‌ఫ్యాంట్రీ కాం**బాట్** యుద్ధ ట్యాంకులను తయారు **చేస్తు**న్నారు. ఇప్పటి వరకు ఇలాం**టి** బీఎంపీ యుద్ధ ట్యాంకులను **సు**మారు మూడు వేల వరకు **ఉ**త్పత్తి చేసి దేశ రక్షణ రంగానికి **అం**దించారు. భూమిమీద, నీటిలోనూ తేలియాడేలా ప్రత్యే**క**ంగా తయారు చేస్తున్న ఈ **యుద్ధ** ట్యాంకులతో ఏటా సమీ**పం**లోని చెరువులో ట్రయల్‌రన్ **నిర్వ**హిస్తుంటారు. కేవలం ఆర్మీకే **కాదు,** నౌకా దళానికి అవసరమైన **సీఆర్ఎన్**–91 వంటి నావెల్‌గన్‌లు **కూడా ఈ** ఫ్యాక్టరీలో ఉత్పత్తి అవుతుం**టాయి. షిప్**‌లపై అమర్చే ఈ గన్‌లను **సుమారు వంద** వరకు ఉత్పత్తి చేశారు.

రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం..

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్స్ కోసం అవసరమైన దళాలను తరలించేందుకు అవసరమైన ప్రత్యేక వాహనాలు, మందు పాతర్లను తట్టుకునే సామర్థ్యం కలిగిన మైన్స్ ప్రొటెక్టెడ్ వెహికల్స్‌ను కూడా ఈ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ఆర్అండ్‌డీ విభాగం అభివృద్ధి చేసింది. సుమారు వెయ్యికి పైగా ఇలాంటి మైన్స్ ప్రొటెక్టెడ్ వెహికల్స్‌ను తయారు చేసింది.

1987 నుంచి ఉత్పత్తి

ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలోనే ఇలాంటి ఆయుధ కర్మాగారాలు పనిచేశాయి. ఆ తర్వాత దేశ రక్షణ రంగానికి అవసరమైన ఆయుధ తయారీకి ఆర్డినెన్స్ కర్మాగారాలను నెలకొల్పారు. అప్పటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ మెదక్ జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలో 1984లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1987 నుంచి ఈ కర్మాగారంలో యుద్ధట్యాంకుల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. దేశ వ్యాప్తంగా ఉన్న 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో.. ఈ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఒకటి. ఇక్కడ సుమారు మూడు వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశంలోని 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏడు డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ యూనిట్లుగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



యుద్ధట్యాంకుల ట్రయల్ రన్..

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారైన బీఎంపీ-2, బీఎంపీ-2 ఓవర్‌హాల్ట్ వంటి యుద్ధట్యాంకులకు 2024 డిసెంబర్ 13న కొండాపూర్ మండలం మల్కాపూర్ చెరువులో ట్రయల్‌రన్ నిర్వహించారు. భూమిపైనా నీటిలోనూ నడిచే యుద్ధట్యాంకర్ల నుంచి మిసైల్ లాంచర్ సదుపాయం కూడా వీటికి ఉంటుందని ఓడీఎఫ్ ఉన్నతాధికారులు తెలిపారు. స్మోక్‌గ్రనేడ్ లాంచర్, ఆర్మర్‌స్టీల్‌తో ఆల్‌రౌండ్ ఫైర్ ప్రొటెక్షన్ వంటి సదుపాయాలున్న ఈ ట్యాంకుల ట్రయల్ రన్ విజయవంతం కావడంతో.. వాటిని రక్షణ శాఖకు అప్పగిస్తారు.


ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కమిషనర్ సీహెచ్ హరికిరణ్


గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రావు, ఏ ఏజీ ఇమ్రాన్ ఖాన్ తదితరులు


గణతంత్ర వేడుకల్లో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణకు ప్రశంసపత్రాన్ని అందజేశారు. ఉత్తమ పౌర సేవలకుగాను పలువురు ప్రభుత్వ అధికారులతోపాటు మామిడి హరికృష్ణ ఈ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

క్లుప్తంగా...

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం

సాక్షి, అమరావతి: పశుసంవర్థకశాఖలో గడిచిన ఏడాదిలో ఉత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన అధికారులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆశాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు సత్కరించారు. పశుసంవర్థక శాఖ పథకాలు, కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకుగాను వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లా పశుసంవర్థక శాఖాధికారులు సి.శారదమ్మ, ఎం.ప్రభాకర్, గుణశేఖర్ పిళ్లైలతో పాటు డివిజనల్ స్థాయి ఉపసంచాలకులు ఎం.మాలకొండయ్య, ఎండి అబ్దుల్ అరీఫ్, కె.రాజగోపాలరావు, అనంతపురం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి టి.వి.సుధాకర్‌లతో పాటు శిక్షణ కేంద్రాల నుంచి చప్పిడి వెంకటరెడ్డి (ఫ్యాపలి), ఆర్ శ్రీధర్(తణుకు), ప్రాంతీయ పశువైద్యశాలల అధికారులు జె.లింగయ్య, ఎస్.సి. వెంకట సుబ్బారెడ్డి, కె.సుధీర్‌బాబు, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌లో సేవలందిస్తున్న ఎ.ప్రవీణ్‌కుమార్, కె.లావణ్య, వీబీఆర్ఐ పశువైద్యసహాయ శస్త్ర చికిత్సకులు బి.విమలాదేవి, డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తోన్న డాక్టర్ కె.హర్షవర్ధన్‌లకు గణతంత్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు.

ఆదాయ పన్ను నిబంధనలు సరళీకరించాలి

కేంద్రానికి ఏపీటీఎఫ్ అమరావతి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో పన్ను నిబంధనలను సరళీకృతం చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రూ.5 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇస్తే సామాన్యుడికి భారం తగ్గుతుందన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఐదు శాతం, రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు 10 శాతం, ఆపై ఆదాయానికి 20 శాతం పన్ను కట్టేలా సరళీకృతం చేయాలని కోరారు. సెక్షన్ 80సీ కింద పొదుపు పరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. గృహ రుణాలపై అనుమతించే వడ్డీ పరిమితిని కూడా పెంచాలని కోరారు.

మౌంట్ కోజిస్కో పర్వతాన్ని అధిరోహించిన ఉమేష్ ఆచంట



మౌంట్ కోజిస్కో పర్వతం వద్ద జాతీయ జెండాతో ఉమేష్ ఆచంట

రాజమహేంద్రవరం సిటీ: ఆస్ట్రేలియా ఖండంలో అతి పెద్దదైన మౌంట్ కోజిస్కో పర్వతాన్ని రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు, పర్వతారోహకుడు ఉమేష్ ఆచంట అధిరోహించాడు. భారతీయ కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8 గంటల సమయానికి ఉమేష్ ఆ పర్వతాన్ని అధిరోహించినట్లు ఆయన తండ్రి ఆచంట బాలాజీ రాజమహేంద్రవరంలో తెలిపారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆ పర్వతాన్ని అధిరోహించి భారత జాతీయ పతాకాన్ని ఎగురవేశాడని తెలిపారు. 2,228 మీటర్ల ఎత్తు కలిగిన మౌంట్ కోజిస్కో ప్రపంచంలోని అతి పెద్ద ఏడు పర్వతాల్లో ఒకటని చెప్పారు. ఉమేష్ 2021 మార్చిలో కిలిమాంజరో (ఆఫ్రికా ఖండంలోని అతి పెద్ద పర్వతం), 2022 ఆగస్టులో మౌంట్ ఎలబ్రస్ (యూరోప్‌లో అతి పెద్ద పర్వతం) అధిరోహించాడని తెలిపారు. ప్రపంచంలోని 7 ఖండాల్లో అతి ఎత్తయిన 7 పర్వత శిఖరాలను అధిరోహించడాన్ని ఉమేష్ తన జీవితాశయంగా పెట్టుకున్నాడని, అతడికి ప్రభుత్వం తరపున సహకారం అందించాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు.

సమాజాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలి

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో సినీ నటుడు శ్రీకాంత్

విశాఖ విద్య: సమాజాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని.. దేశభక్తిని పెంపొందించుకోవాలని సినీ నటుడు ఎం.శ్రీకాంత్ సూచించారు. విశాఖలోని ఏయూ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర మహాసభలో సినీ నటుడు శ్రీకాంత్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి.. భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. తాను చదువుకునే రోజుల్లో ఏబీవీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నానని చెప్పారు. దేశభక్తి చాటే 'ఖడ్గం' వంటి సినిమాలు నేటి రోజుల్లో మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ సమస్యలపైనే కాకుండా.. యువతను సన్మార్గంలో నడిపించడంలో కూడా ఏబీవీపీ ముందుంటుందన్నారు. అనంతరం ఒంగోలుకు చెందిన సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సయ్యద్ షహనాజ్‌కు జనమంచి గౌరీ శంకర్ యువ పురస్కార్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీ ప్రసాద్, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మురళీధరరావు, సూళ్లూరు యుచంద్ర, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర సంబరాలు



విశాఖలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 76వ గణతంత్ర దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వ్యాపారం ఓ వైపు..వాత్సల్యం మరోవైపు



నెల్లూరు సిటీ డీఎస్పీ కార్యాలయం సమీపంలో కొబ్బరి బొండాలు వ్యాపారం చేస్తూ..చెట్టుకి ఉయ్యాల కట్టి అందులో చంటి బిడ్డను నిద్రపుచ్చి దగ్గరుండి చూసుకుంటున్న చంటి బిడ్డ నాయనమ్మ

ఇదేనా దేశంపై గౌరవం?



గణతంత్ర దినోత్సవం రోజున తిరుపతిలోని లీలామహల్ సెంటర్ వద్ద చేపల మార్కెట్‌లో బహిరంగంగా చేపలను ఇలా విక్రయించారు... ప్రజలు కూడా చేపల కొనుగోలుకు భారీగా తరలివచ్చారు.

మగువల మనసు దోచే 'జమదానీ'



చేయి తిరిగిన చేనేత కార్మికులు వారు.. వస్త్ర రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. వారు తయారు చేసే వస్త్రాలు చిరకాలం గుర్తుండిపోతాయి. వివాహ, శుభకార్యాల్లో జమదానీ చీరను ధరించడానికి మగువలు విశేష ఆదరణ కనబరుస్తారు. చేనేత వస్త్రాల తయారీలో జమదానీ చీరలకు 300 ఏళ్ల చరిత్ర ఉంది. బంగ్లాదేశ్‌కు చెందిన ఈ అపురూప కళ ఈనాటిది కాదు..శతాబ్దాల నాటి చరిత్ర ఉంది. మొఘలు సామ్రాజ్య రాణులు, బ్రిటీష్ పాలకుల సతీమణులు ధరించిన చీర ఇది. 5 దశాబ్దాల క్రితమే రాష్ట్రపతి అవార్డు సొంతం చేసుకున్న చరిత్ర ఈ చీరకు ఉంది. ఈ చీరను పురాతన సాంస్కృతి సంపదగా యునెస్కో కూడా గుర్తించింది. దేశ, విదేశాల్లో కూడా జమదానీకి ఎంతో ప్రత్యేకత ఉంది. అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలో వందలాది మంది నేతన్నలు ఈ చీరలను తయారీ చేస్తున్నారు. ఈ జమదానీ చీరల తయారీలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట చేనేత కార్మికులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రత్యేకమైన ఆకర్షణలు, డిజైన్లతో మగువల మనసు దోచే జమదానీ చీరలు తయారు చేస్తుంటారు. కొత్త అందాలను తెచ్చే ఈ చీరలు వివాహాది శుభకార్యాల్లో తలుక్కుమంటుంటాయి. మన నేత కార్మికుల నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. రాష్ట్రంలో కాకినాడ జిల్లాలో పిఠాపురం, ఉప్పాడ, తూర్పుగోదావరి జిల్లాలో దొండపూడి వంటి ప్రాంతాల్లో కూడా జమదానీ చీరలు తయారు చేస్తున్నారు.

– సాక్షి, అనకాపల్లి

ఆరు మెట్రోపాలిటన్ సిటీల నుంచి ఆర్డర్లు..

ఇక్కడ తయారు చేయించిన జమదానీ చీరలను హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం, ముంబై, కోల్‌కత వంటి మహానగరాల్లో ఉన్న పెద్ద వస్త్ర దుకాణాలకు విక్రయిస్తుంటారు. ముందుగానే ఆర్డర్లు ఇచ్చి జమదానీ చీరలు తయారు చేయస్తుంటారు. ఒక జమదానీ చీర తయారీకి డిజైన్ బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల విలువ గల నూలు అవసరమవుతుంది. ఇద్దరు నేత కార్మికులు 15 రోజుల పాటు కష్టపడితే ఒక జమదాని చీర తయారవుతుంది. ఇలా నెలకు రెండు నుంచి మూడు చీరలు తయారు చేస్తారు. ఇక్కడ తయారయ్యే జమదానీ ఖరీదు కనిష్ఠంగా రూ.10 వేల నుంచి రూ. 25 వేల వరకు ఉంటుంది. ఇంటి వద్దే ఉంటూ నెలకు రెండు చీరలు తయారు చేస్తే మజూరి కింద రూ.10 వేలు చెల్లిస్తారు. జమదానీ చీరలు తయారు చేయించి విక్రయించే వ్యక్తికి నూలు, మజూరి ఖర్చు పోను చీర దగ్గర రూ.3 నుంచి రూ.5 వేలు మిగులుతుంది. ఇతని దగ్గర రూ.10వేలు పెట్టి కొనుగోలు చేసిన చీరను పెద్ద పెద్ద మాల్స్, షాపుల్లోను 504 శాతం లాభం వేసుకుని. రూ.15 వేలకు విక్రయిస్తుంటారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.



గత ఐదేళ్లలో చేనేత రంగానికి స్వర్ణయుగం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్నలకు పెట్టుబడి సాయం అందించారు. మగ్గం కలిగిన కుటుంబాలకు నెలకు రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం నేరుగా వారి ఖాతాల్లోనే వైఎస్ జగన్ ప్రభుత్వం జమ చేసింది. దీంతో కార్మికులు నేరుగా ముడిసరకు తామే కొనుగోలు చేసుకుని వస్త్రాలు తయారు చేసి లాభాలు పొందేవారు. పెట్టుబడికి అప్పు చేసే పరిస్థితి లేక పోవడంతో గత ఐదేళ్లు చేనేత రంగానికి స్వర్ణయుగంగానే గడిచినా..ఇప్పుడు గడ్డుకాలమే.

- వివాహ, శుభకార్యాల్లో ఈ చీరలు ప్రత్యేకం
- దేశ, విదేశాల్లో వీటికి విశేష ఆదరణ
- చేనేత వస్త్రాల్లో ఈ చీరకు 300 ఏళ్ల చరిత్ర
- బంగ్లాదేశ్‌కు చెందిన అపూరూప కళ
- పురాతన సాంస్కృతిక సంపదగా గుర్తించిన యునెస్కో
- 5 దశాబ్దాల క్రితమే రాష్ట్రపతి అవార్డు సొంతం చేసుకున్న కోక
- అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఈ చీరల తయారీ
- ఒక్కో చీర ఖరీదు రూ.5 నుంచి రూ.80 వేలు
- ఒక చీర తయారీకి కనీసం 15 రోజుల సమయం

వివాహ, శుభకార్యాల్లో జమదానీ కోక..

వివాహ, శుభకార్యాలకు ప్రత్యేకంగా ఆర్డర్లు పెట్టుకుంటారు. ఆర్డర్లు ఆధారంగా జమదానీ చీరలు తయారు చేస్తాం. పాయకరావుపేటలో చేయి తిరిగిన నేత కార్మికులు ఉన్నారు.పలు డిజైన్లతో పట్టు. జమదానీ చీరలు తయారీ చేయడంలో వీరు దిట్ట. ముడి సరుకు సొంతంగా కొనుగోలు చేసే స్తోమత లేకపోవడంతో మజూరు కోసం వస్త్రాలు తయారు చేస్తుంటారు. మార్కెటింగ్ సదుపాయం పెంచి..కాంట్రాక్టర్లు ఆర్డర్లు పెంచితే చీరలు తయారీ పెరుగుతుంది. హైదరాబాద్, బెంగుళూర్, ముంబై, కోల్‌కత, చైన్నై వంటి సిటీలకు ఎగుమతి చేస్తుంటాం.

– వీరనాగేశ్వరరావు, చేనేత సొసైటీ మేనేజర్



పేటకు పట్టం కట్టిన కోక..

అనకాపల్లి జిల్లాలో పాయకరావుపేటతో పాటు, కాకినాడ జిల్లా పిఠాపురం, ఉప్పాడ తదితర ప్రాంతాల్లో తయారయ్యే ఈ జమదానీ చీరలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. జమదానీ చీరల డిజైన్లతో కేంద్రం కూడా విడుదల చేసిందంటే ఈ చీరలకు ఉన్న ప్రత్యేకత ఎంతో తెలుస్తోంది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట,నక్కపల్లి మండలంలో గోడిచర్లతో పాటు జిల్లావ్యాప్తంగా 1500 మంది వరకూ ఈ చేనేత కార్మికులు ఉన్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, ఉప్పాడలో 100 కుటుంబాలు, తూర్పు గోదావరి జిల్లాల్లో ద్వారపూడి, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో 300 కుటుంబాలు నేతన్నలు ఆర్డర్లు వారీగా ఈ చీరలు నేస్తుంటారు. స్థానికంగా విక్రయించేందుకు నేత చీరలు, పంచెలు, తువాళ్లు, తక్కువ ధరలకు విక్రయించే చీరలు తయారు వేస్తూ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తుంటారు. పాయకరావుపేట, తుని పట్టణాల్లో ఉన్న వస్త్ర దుకాణాలకు తాము తయారు చేసిన వస్త్రాలను సరఫరా చేస్తుంటారు.

బెంగుళూర్‌లో నూలు కొనుగోలు..

జమదానీ చీరలు తయారు చేయడానికి ముడిసరుకు (నూలు) బెంగళూరు నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో కొంతమంది మాత్రమే ఈ చీరలను తయారు చేస్తున్నారు. పాయకరావుపేటకి చెందిన వ్యాపారి ముడిసరుకు కొనుగోలు చేసి తీసుకువచ్చి తనకు వచ్చిన ఆర్డర్ల మేరకు కొనుగోలు దారులు కోరిన, సూచించిన డిజైన్లు, మోడళ్ల ఆధారంగా ఇక్కడి కార్మికులతో జమదాని చీరలను తయారుచేయిస్తారు...

ఒక్కో చీరకు ముగ్గురు కార్మికులు

సాధారణంగా జమదానీ చీర తయారీలో ఒక్కో చీరను ముగ్గురు కార్మికుల అవసరం ఉంటుంది. చీర డిజైన్‌ను బట్టి తయారీకి అదనపు సమయం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ఒక చీర తయారీకి 15 రోజుల సమయం పడుతుంది. అదనపు డిజైన్లు కూడా యాడ్ చేయాలంటే మరో మూడు నాలుగు రోజులు అదనంగా పడుతుంది. ఉదాహరణకు పాయకరావుపేటలో ఉండే 500కు పైగా నేతన్నలు జమదానీ చీరలు నేస్తారు. ముడిసరుకు కొనుగోలు చేసే స్తోమత లేకపోవడంతో ఇక్కడి కార్మికులు కేవలం మజూరీ కోసమే పనిచేయాల్సి వస్తుంది. బెంగళూరు వెళ్లి ముడిసరుకు కొనుగోలు చేయడం, మార్కెటింగ్ చేయడం చాలా కష్టతరం కావడంతో కాంట్రాక్టరు ఇచ్చిన మజూరీ తీసుకుని తమ వస్త్ర నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. జాందాని చీరల తయారీలో పట్టును ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ రకం చీరల తయారీ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎక్కడా లూజు అనేది రాకూడదు. అడ్డు నిలువు పట్టును ఉపయోగించాలి. దీంతో ఒక్కో చీర తయారీలో ముగ్గురు కార్మికుల అవసరం కూడా ఉంటుందని నేత కార్మికులు అంటున్నారు.

సీలేరులో మరో వెలుగు

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్

నెలలో పనులు ప్రారంభం

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): తూర్పు కనుమల్లో ఆంధ్ర ఒడిశా సరిహద్దు దట్టమైన అటవీ ప్రాంతంలో ఒక్కొక్క నీటి బిందువు ప్రవాహంలా మారి ప్రవహిస్తూ పేరు గాంచిన సీలేరు నది రాష్ట్రానికి గుర్తింపు తెచ్చింది.ఈ ప్రాంతంలో సహజసిద్ధంగా ప్రవహించే నీటితో తక్కువ ఖర్చుతో రూ.కోట్లలో ఆదాయం ఇచ్చేలా మరో జల విద్యుత్ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం కానుంది. ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో ఉన్న జలవిద్యుత్ కేంద్రాలతో పాటు నూతనంగా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం) నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మరో నెలరోజుల్లో పనులూ ప్రారంభం కానున్నాయని అధికారులు వెల్లడించారు.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా

తూర్పుకనుమల్లో మాచ్‌ఖండ్ మొదలుకొని బలిమెల నుంచి సీలేరు, డొంకరాయి, మోతుగూడెం జలవిద్యుత్ కేంద్రాల్లోఉత్పత్తి అయిన నీరు శబరి నదిలో కలిసి గోదావరి మీదుగా సముద్రంలో కలుస్తుంది. ఈ నీటిని వృథా కాకుండా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ద్వారా మరింత విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చనే లక్ష్యంతో ఏపీ జెన్‌కో రూ.13 వేల కోట్లతో సీలేరు సమీప పార్వతీనగర్ వద్ద తొమ్మిది యూనిట్లు (1350 మెగావాట్లు) విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పైభాగంలో 3 కిలోమీటర్ల పొడవునా. సొరంగం తవ్వి గుంటవాడ డ్యామ్ నుంచి నీటిని తీసుకువచ్చి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు.అనంతరం విడుదలైన నీరు మరో 3 కిలోమీటర్ల పొడవైన సొరంగం ద్వారా డొంకరాయి జలాశయంలోకి మళ్లిస్తారు. అవసరమైనప్పుడు ఆదే నీటిని రివర్స్ పంపింగ్ విధానంతో ఆదే సొరంగం ద్వారా గుంటవాడ డ్యాంలోకి మళ్లించి మూడు సొరంగాల ద్వారా తొమ్మిది పైపులైన్లతో ఏర్పాటు చేయనున్నారు. అవసరమైనప్పుడు ఈ నీటిని విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా యాప్‌కో సంస్థ ద్వారా మూడేళ్లు సుదీర్ఘంగా పరిశీలన చేసింది.



రెండు కొండల మధ్య సీలేరు జలవిద్యుత్ కేంద్రం

అగ్నిప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి

- తల్లిదండ్రుల పరిస్థితి విషమం
- గుంటూరులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



విక్కీ (ఫైల్)

కైకలూరు: ఏలూరు జిల్లా మండవల్లి మండలం భైరవపట్నంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మూడేళ్ల బాలుడు మృత్యువుతో పోరాడుతూ ఆదివారం ప్రాణాలు విడిచాడు. ఈ నెల 24వ తేదీ రాత్రి భైరవపట్నంలో గ్యాస్ సిలిండర్లు పేలి తొమ్మిది గుడిసెలు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన గుడిసెలోని దుబ్బా వంశీ (25), అతని భార్య అన్ను (21), వారి కుమారుడు విక్కీ (3)తో పాటు మరో ముగ్గురు కుటుంబసభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి కైకలూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం అదే రోజు రాత్రి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రత్యేక వార్డులో వీరికి చికిత్స అందిస్తున్నారు. వారిలో మూడేళ్ల బాలుడు విక్కీ ఆదివారం ఉదయం మరణించగా, బాలుడి తల్లిదండ్రులు వంశీ, అన్ను పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. వంశీ మృతదేహాన్ని అంబులెన్సులో నందివాడ మండలం పోలుకొండలోని తాతయ్య ఇంటికి తరలించారు. క్షతగాత్రుల్లో నక్కల షారుఖాన్ (45), అతని కుమారులు చరణ్ (19), కార్తీక్ (18)లను కుటుంబ సభ్యులు గుంటూరు ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం తమిళనాడు రాష్ట్రం వెల్లూరుకు ఆదివారం రాత్రి తరలించారు. వీరిలో చరణ్, కార్తీక్ పరిస్థితి కూడా విషమంగా ఉందని సమాచారం.

ఆధ్యాత్మిక సమాచారం

గంగమ్మకు మొక్కులు సమర్పణ

చౌడేపల్లె : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శనం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో ఏకాంబరం చర్యలు తీసుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంగమ్మ తల్లి గుడికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మ తల్లిని దర్శించుకుని ధూప, దీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలి వచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మ తల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తుల్లో అనేక మంది జల్లేరు జలాశయాన్ని కూడా సందర్శించి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

కాణిపాకం కిటకిట



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, ఉచిత దర్శన క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయానికి భారీగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నమ్మించాడు.. నట్టేట ముంచాడు

రూ.4.5 కోట్లు తీసుకుని పరారీ



దొరబాబు ఇంటి వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

రాయవరం: రియల్ ఎస్టేట్ వ్యాపారినంటూ ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద డబ్బులు తీసుకున్నాడు.3 నెలలుగా డబ్బులు అడుగుతుంటే సరైన సమాధానం చెప్పడం లేదు. దీంతో బాధితులు పదే పదే అడగడం ప్రారంభించారు. చివరకు ఇల్లు విడిచి పరారవ్వడంతో బాధితులంతా రోడ్డున పడ్డారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరం మండలం మాచవరం గ్రామం పల్లపువీధిలో ఈ ఘటన జరిగింది. బాధితులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి(దొరబాబు) గ్రామంలోని పల్లపు వీధిలో నివాసం ఉంటున్నాడు. స్థిరాస్తిని కలిగి ఉండడం.. మోతుబరి కుటుంబాలతో ఇరువురు కుమార్తెలకు వియ్యం అందడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని చెప్పడంతో పలువురు అతని వద్ద డబ్బులు మదుపు చేశారు. పలువురు రూ.లక్షలను దొరబాబు వద్ద ఉంచారు. మాచవరం, సోమేశ్వరం గ్రామాలతో పాటుగా, అనపర్తి మండలం పులుగుర్త, రామకోట తదితర గ్రామాలకు చెందిన 45 మంది దొరబాబు వద్ద పొదుపు చేసిన సొమ్మును మదుపు చేశారు. ఈ విధంగా సుమారు రూ.4.5 కోట్ల వరకు మదుపు చేసినట్లు బాధితులు తెలిపారు. 3 నెలలుగా దాచుకున్న డబ్బులను తమ అవసరార్థం తిరిగి ఇవ్వాలని దొరబాబును కోరినప్పటికీ అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితులు విషయాన్ని స్థానిక గ్రామ పెద్దల వద్దకు తీసుకు వెళ్లినట్లుగా సమాచారం. బాధితుల నుంచి ఒత్తిడి పెరగడం.. దొరబాబు ఇంటి వద్ద లేకపోవడంతో బాధితులంతా దొరబాబు ఇంటి ముందు ఆదివారం ఉదయం ధర్నాకు దిగారు. తాము దాచుకున్న డబ్బులను తిరిగి చెల్లించాలంటూ బాధితులు కోరారు.

వేళ్ల వంతెన

రూట్స్ రామాయణంలో


వేళ్ల వంతెన

ఇది వేళ్లాడే వంతెన. ఉంగాట్ నది మీద ఉంది. అభివృద్ధి చెందిన నగరాలన్నీ నగరం మధ్యలో ఉన్న చెరువు మీద ఇనుప చువ్వలతో వేళ్లాడే వంతెనలను కడుతున్నాయి. కానీ ఉంగాట్ నది మీద కనిపించేవి వేళ్లతో కట్టిన వంతెనలు. అది కూడా చెట్టు నుంచి వేరు చేసిన వేళ్లు కాదు, సజీవంగా ఉన్న వేళ్ల వంతెనలు. ఈ నైపుణ్యం ప్రపంచంలో మనదేశానికే సొంతం, అది కూడా మేఘాలయ వంటి మరికొన్ని ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరించిన నైపుణ్యం. ఈ నది దాకీ పట్టణం నుంచి ప్రవహిస్తోంది. వంతెన దాకీ పట్టణంలో ఉంది. అందుకే దాకీ రూట్ బ్రిడ్జిగా వ్యవహారంలోకి వచ్చింది. ఇలాంటి వంతెనలు దాకీ పట్టణంలో మాత్రమే కాదు. మేఘాలయలో చాలా చోట్ల విస్తారంగా ఉంటాయి. కానీ మేఘాలయ పర్యటనకు వెళ్లిన వాళ్లు తప్పకుండా దాకీ పట్టణంలోని రూట్ బ్రిడ్జి మీద నడిచి మురిసిపోతారు. ఎందుకంటే ఇది దేశానికి చివరి వంతెన. దాకీ దాటితే బంగ్లాదేశ్‌లో అడుగుపెడతాం.



ఇదో జీవన నైపుణ్యం

మనిషికి జీవన నైపుణ్యాలు అవసరాన్ని బట్టి వృద్ధి చెందుతాయనడానికి నిదర్శనం ఈ వంతెనలు. ఇనుము, సిమెంటు వంటి భవన నిర్మాణ సామగ్రిని తరలించడం సాధ్యం కాని చోట్ల ప్రకృతి ఇచ్చిన మెటీరియల్‌తో జనం తమకు అవసరమైన విధంగా మలుచుకోవడం అంటే ఇదే. మేఘాలయలో నివసించే ఖాసీ, జైంతియా తెగల వాళ్లు నదికి రెండు వైపులా ఉన్న రబ్బరు చెట్ల వేళ్లను ఒకదానితో మరొక దానిని జడలాగ అల్లుతూ ఒక ఒడ్డు నుంచి మరొక ఒడ్డుతో కలుపుతారు. ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు చేరడానికి వంతెన రెడీ. సిమెంటు వంతెనలు ఎప్పుడు కూలిపోతాయో తెలియదు కానీ ఈ వేళ్ల వంతెనలను ఒకసారి అల్లితే వందేళ్లకు కూడా చెరగవు, పైగా మరింత దృఢమవుతూ ఉంటాయి. మరీ లేత వేళ్లను కాకుండా ఒక మోస్తరు ముదురు వేళ్లతో వంతెన అల్లుతారు. కాలం గడిచే కొద్దీ చెట్టు పెద్దదవుతుంది, వేళ్లు శక్తిపుంజుకుంటూ ఉంటాయి. మరో విచిత్రం ఏమిటంటే... ఈ వేళ్లు నది నీటిని అందుకోవడానికి మాన్‌గ్రోవ్‌లాగ పిల్ల వేళ్లను పెంచుకుంటాయి. కొత్త వంతెనలు మనం నడిచేటప్పుడు బరువుకు తగినట్లు ఊగుతుంటాయి. ముదురు వంతెనలు కదలవు. ఈ వంతెనల మీద నుంచి రాకపోకలు సాగించేది మనుషుల మాత్రమే కాదు, జింకలు, చిరుతపులులతోపాటు ఇతర జంతువులు కూడా ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు వంతెనల మీదనే వెళ్తాయి. ఇప్పటి వరకు వంతెన గొప్పదనాన్నే మాట్లాడుకున్నాం. కానీ ఉంగాట్ నదికి కూడా ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన విశేషణం ఉంది. మనదేశంలో అత్యంత పరిశుభ్రమైన నదుల్లో ఉంగాట్ నది ఒకటి. ఈ నదిలో పడవలో విహరిస్తుంటే నీటి కింద నేల అద్దంలో కనిపించినంత స్వచ్ఛంగా ఉంటుంది. వేళ్ల వంతెన మీద నడవడంతోపాటు పడవ ఎక్కి ఈ నదిలో విహరించడం కూడా గొప్ప అనుభూతి.


ఉంగాట్ నదిలో పడవలో విహారం...

రాముడు కూడా కట్టాడు

నది మీద చెట్ల వేళ్లతో వంతెన నిర్మించే నైపుణ్యం ఇతిహాస కాలం నాటిదని చెబుతారు. వనవాస కాలంలో సీతారామ లక్ష్మణులు అడవుల్లో నివసించినట్లు చెప్పుకుంటాం. గంగానది తీరాన నివసించిన రోజుల్లో ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు చేరడానికి రాముడు, లక్ష్మణుడు నదిలో ఈదుతూ వెళ్లేవారని, ప్రతిరోజూ నది దాటడం సీతమ్మకు కష్టం కావడంతో ఆమె కోసం వంతెన నిర్మించారని చెబుతారు. గంగానది మీద రిషికేశ్ దగ్గర రామ్‌ఝులా, లక్ష్మణ్ ఝులా ఉన్నాయి. బ్రిటిష్ పాలన కాలంలో ఈ వంతెనలను ఇనుముతో పునర్నిర్మించారు. రిషికేశ్‌లో గంగానది మీద ఇప్పుడు మనకు కనిపించేవి కొత్త నిర్మాణాలు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





క్విల్లింగ్ కళాకృతి

అత్యంత కష్టమైన నిర్ణయాలలో ఒకటి స్థిరమైన కెరీర్‌ను అభిరుచితో ఎంచుకోవడం. చాలా తక్కువ మంది అధిక జీతం వచ్చే ఉద్యోగాన్ని కూడా వదిలి తమ అభిరుచిని కొనసాగించే ధైర్యవంతమైన నిర్ణయాన్ని తీసుకుంటారు. ఈ కళ జేబులను డబ్బులతో నింపదు. కానీ, హృదయాన్ని ఆనందంతో నింపుతుంది. సేనా హుడా తన హృదయాన్ని సంతృప్తితో నింపే పనిని ఎంచుకోవాలనుకుంది. అందుకు చేస్తున్న హెచ్ ఆర్ ప్రొఫెషనల్ ఉద్యోగాన్ని వదులుకుంది. టర్కిష్ కళాకారిణి అయిన సేనా హుడా రంగు కాగితాలతో మాయాజాలాన్ని సృష్టించాలనుకుంది. ఆమె మన కళ్లకు సంపూర్ణ ఆనందాన్నిచ్చే అద్భుతమైన క్విల్లింగ్ కళాకృతులను తయారుచేస్తుంది. మనందరినీ ఆశ్చర్యపరిచే ఆ డిజైన్లలో కొన్ని....















దేవుడిల్లు

బంగారు దేవాలయం



హర్ మందిర్ సాహిబ్ అంటే దేవుడి ఇల్లు అని అర్థం. మనకు ఇంట్లో దేవుడి కోసం ఒక గది ఉంటుంది. ఆ గదిని దేవుడిల్లు అంటాం. పంజాబ్ వాళ్లు మాత్రం ఆలయాన్ని దేవుడి ఇల్లుగా భావిస్తారు. ఊరంతటికీ కలిసి ఒకటే దేవుడిల్లన్నమాట. ఈ దేవుడిల్లు దేశమంతటికీ బాగా తెలిసిందే. కానీ మరో పేరుతో పరిచితం. గోల్డెన్ టెంపుల్‌గా పిలుచుకుంటాం. అమృత్ సర్ గోల్డెన్ టెంపుల్‌గా దేశమంతటికీ సుపరిచితమైన ఆలయంతోపాటు ఆపరేషన్ బ్లూ స్టార్, ఇందిరా గాంధీ హత్య వంటి సంఘటనలు జ్ఞాపకాల దొంతరలో నుంచి బయటకు వస్తాయి. ఆ గోల్డెన్ టెంపుల్ పర్యటనకు వెళ్లడానికి ఫిబ్రవరి అనువైన సమయం. అమృత్‌సర్‌ని స్థానికులు అంబర్ సర్ అంటారు. పండుగ వాతావరణాన్ని తలపించే వీధులు, నోరూరించే రుచులతో రోడ్డు మీద వంటలు, షాపింగ్ హబ్స్‌తోపాటు చారిత్రక నిర్మాణాలు చూడవచ్చు.



ట్రావెల్ టిప్స్


ఆ వచ్చే సూట్‌కేస్ నాదే కావచ్చు!

పర్యటనల్లో లగేజ్ మారిపోవడం జరుగుతుంటుంది. బస్సు, ట్రైన్ ప్రయాణంలో ఎవరి లగేజీని వాళ్లే మోసుకుంటారు లేదా పోర్టర్ సహాయం తీసుకున్నప్పటికీ ఆ పోర్టర్‌లు ఆ లగేజ్‌ని మాత్రమే మోసుకొస్తారు. కాబట్టి మారిపోయే ప్రమాదం పెద్దగా ఉండదు. కానీ విమాన ప్రయాణాల్లో మన లగేజ్ కన్వేయర్ బెల్ట్ మీద వచ్చినప్పుడు తీసుకోవాలి. సాధారణంగా సూట్‌కేస్‌లు, డఫుల్ బ్యాగుల్లో ఎక్కువగా బ్లాక్‌వే ఉంటాయి. పదిలో ఐదు నల్లవి ఉంటే రెండు రెడ్, రెండు గ్రే, ఒకటి బ్రౌన్ కలర్‌లో ఉండే అవకాశాలే ఎక్కువ. బెల్ట్ మీద వచ్చేది మన సూట్‌కేసే అనిపిస్తూ ఉంటుంది. దగ్గరకు వచ్చే వరకు స్పష్టత రాదు. కొంతమంది తమదే అనుకుని తీసుకోవడం, పేరు చూసుకుని తిరిగి కన్వేయర్ బెల్ట్ మీద పెట్టేయడం కూడా జరుగుతుంటుంది. అందుకే మన లగేజీని దూరం నుంచి కూడా గుర్తు పట్టగలిగేటట్లు ఏదైనా మార్క్ పెట్టుకోవాలి. జిప్ రన్నర్‌కి కలర్‌ఫుల్ ట్యాగ్ ఏదైనా తగిలించవచ్చు. హ్యాండిల్‌కి కర్చీఫ్ కట్టుకోవచ్చు లేదా టేప్ అతికించవచ్చు.



నృత్యం

రెండు దేశాల వారధి
థాయ్ కళారూపం



ఇతిహాసాన్ని శక్తివంతమైన కథగా చెప్పడం, సాంస్కృతిక నేపథ్యంతో దానిని సజీవంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం కళాకారుడికి అత్యంత సాహసోపేతమైన చర్య. దీనిని థాయ్‌లాండ్ కళాకారులు మన ఇతిహాసాన్ని తమ సంప్రదాయ కళారూపంతో మన దేశ రాజధానిలో ప్రదర్శించనున్నారు.

భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి సహకారంతో రాయల్ థాయ్ ఎంబసీ ఖోన్ థాయ్ మాస్క్‌డ్ డ్యాన్స్ డ్రామాను న్యూఢిల్లీలో నిర్వహించనుంది. ఈ గ్రాండ్ ఈవెంట్ ఫిబ్రవరి 7, 2025న సాయంత్రం 6:30 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లోని భీమ్ హాల్‌లో జరుగుతుంది.

థాయిలాండ్ అత్యంత గౌరవనీయమైన కళారూపాలలో ఒకటైన ఖోన్, శాస్త్రీయ నృత్యం, లిరికల్ స్టోరీ టెల్లింగ్, ప్రత్యక్ష సాంప్రదాయ థాయ్ సంగీతాన్ని మిళితం చేస్తుంది. యునెస్కో చేత సాంస్కృతిక వారసత్వంగా గుర్తించబడింది. దుస్తులు, కొరియోగ్రఫీ, ఆధ్యాత్మిక వ్యక్తీకరణ ఈ నృత్యం ప్రత్యేకతలు.

వారియర్ హనుమాన్

ఈ ప్రదర్శనలో రామాయణం ఇతిహాసం నుండి హనుమాన్ ది మైటీ వారియర్ అనే ఎపిసోడ్ ఉంటుంది, ఇది హనుమంతుడి శౌర్యం, విధేయతను చూపే ఆకర్షణీయమైన కథ. ఈ కథ ఐదు దశలలో.. రావణుడిని ఓడించాలనే తపనతో రాముడికి సేవ చేయడానికి వాయు దేవుడు సృష్టించిన హనుమంతుడి దివ్య జననంతో ప్రారంభమవుతుంది. కథ ముందుకు సాగుతున్న కొద్దీ, హనుమంతుడి బాల్య దుశ్చర్య, రాముడి ఆశీర్వాదంతో అతని బలం తిరిగి వస్తుంది. సీతను రక్షించడానికి అతని అచంచలమైన నిబద్ధతను ఇది అన్వేషిస్తుంది. హనుమంతుడు, రాముడు వారి మిత్రులు రావణుడిపై విజయం సాధించే యుద్ధంతో కథనం ముగుస్తుంది.

చారిత్రక సంబంధాలు


ఖోన్ థాయిలాండ్ రాజ ప్రాంగణాలలో భారతీయ ఇతిహాసం రామాయణంతో గల సంబంధం భారతదేశం– థాయిలాండ్ మధ్య గల లోతైన చారిత్రక సంబంధాలను తెలియజేస్తుంది. దీంతో పాటు తమ కళ ద్వారా వ్యక్తీకరణ హావభావాలు, శక్తివంతమైన కథ చెప్పడం తరతరాలుగా అందించిన గొప్ప సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తాయి. ఇది థాయ్ వారసత్వంలో ఒక ప్రతిష్ఠాత్మక అంశంగా మారుతుంది. భారతీయ ప్రేక్షకులకు థాయిలాండ్ సాంస్కృతిక వారసత్వం గొప్పతనాన్ని చూపిస్తుంది. ఇది ఉమ్మడి వారసత్వం, కళాత్మకత, రామకీన్, రామాయణ ఇతిహాసాల ద్వారా ప్రతిధ్వనించే భక్తి, శౌర్యం, సార్వత్రిక ఇతివృత్తాల వేడుక. రాయల్ థాయ్ ఎంబసీ, ఐసీసీఆర్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రెండు దేశాల మధ్య సాంస్కృతిక వారధిగా పనిచేస్తుంది.

ఆర్ట్

చిన్నదే... ఆదరణ పెద్దది!



ఆభరణాల పెట్టెలో భారీ విశ్వం, నాలుగు అంగుళాలకు మించని మినీ బీచ్‌లో బృందాల జలకాలాటలు, అతి పెద్ద గోడపై నిలిచిన అతి చిన్ని డబుల్ థ్రెషోల్డ్... అబ్బురం అనిపించే ఈ సూక్ష్మ చిత్ర కళ ఇప్పుడు ప్రపంచంలో పెద్దగా ప్రజాదరణ పొందుతోంది. ఆర్ట్ గ్యాలరీలు, ఆర్ట్ ఫెయిర్స్‌లో ఈ కళ కొత్తగా ఆకట్టుకుంటుంది. ప్రపంచ ఆర్ట్ ప్రియులు కళ ఇలా రూపు మారడానికి కారణాలను అన్వేషిస్తున్నారు. ఆర్ట్ మార్కెట్‌ను మినియేచర్ ఆర్టిస్టులు ఏలేస్తున్నారు అని ప్రశంసిస్తున్నారు.



దేశీయ మినియేచర్

ఇటీవల కాలంలో భారతదేశంలో అనేక మినీయేచర్ పెయింటింగ్ స్కూళ్లు పుట్టుకువచ్చాయి. ప్రతి ఒక్కటి దాని సాంస్కృతిక, ప్రాంతీయ, చారిత్రక సందర్భాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వాటిలో ప్రధానంగా ఆకట్టుకుంటున్నది మొఘల్ స్కూల్ ఆఫ్ మినియేచర్. దీనిలో కిషన్‌గఢ్ శైలి, రాధా కృష్ణుల దైవిక ప్రేమలు మరింత ప్రత్యేకమైనవి. పహారీ స్కూల్ హిమాచల్ ప్రదేశ్, జమ్మూలోని కొండ ప్రాంతాలలో అభివృద్ధి చెందింది. దక్కన్ స్కూల్ పర్షియన్, టర్కిష్, భారతీయ అంశాల కలయికను ప్రదర్శిస్తుంది. సూక్ష్మ చిత్రాలలో వెలసిన పచ్చని ప్రకృతి దృశ్యాలు, అద్భుతమైన థీమ్‌లో ఇవన్నీ విభిన్నంగా ఉంటాయి.



విదేశాలలో సూక్ష్మ కళ

సంవత్సరాల క్రితం కెనడియన్ మినియేచర్ ఆర్టిస్ట్ శాంటియాగో తనదైన పనితనంతో ఇంట్లోనే చిన్న చిన్న పెయింటింగ్స్ వేస్తూ, శిల్పాలు చెక్కుతూ ఉండేవాడు. కెనడియన్ కలెక్టర్ బ్రూస్ బెయిలీ శాంటియోగోను కలిసినప్పుడు అతని కళా నైపుణ్యాన్ని చూసి కొంతకాలం 'ఓపికపట్టండి' అని చెప్పాడట. శాంటియాగో నవ్వుతూనే కాలక్రమంలో అందరూ వదిలేసిన వస్తువులను అతి చిన్న నమూనా బొమ్మలను తయారుచేశాడు. ఒక జత కఫ్‌లింగ్‌లకు సరిపోయేంత పెట్టిలో ఒక సముద్రాన్నే సృష్టించాడు. కాలక్రమంలో కళాభిరుచిగలవారు ఈ సూక్ష్మ కళ ప్రాముఖ్యతను గుర్తిస్తారని అతను నమ్మాడు. ఈ విషయాన్ని బెయిలీ ప్రస్తావిస్తూ '2018లో శాంటియాగో పని తనాన్ని చూసినప్పుడు, నాకు చాలా ప్రత్యేకంగా అనిపించింది. ఇన్నాళ్లకు నిజమయ్యింది' అంటాడు. ఇటీవల గ్యాలరీలలో అతి చిన్న కళాకృతులు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'మనుషుల ఆలోచనలు ఎలా మారతాయో చూడటం ఆసక్తికరంగా ఉంది' అంటాడు శాంటియాగో. 2010 చివర 2020ల ప్రారంభంలో సూక్ష్మ కళ అత్యున్నత శిఖరాలకు వెళ్లిన సమయంగా చెప్పుకోవచ్చు. దీనిని యువ చిత్రకారులు చాలా ముందుకు తీసుకెళ్లారు. ఈవిషయం గురించి శాంటియోగో వివరిస్తూ 'నేను ఇంతటి ఆదరణను ఊహించలేదు. ఆర్ట్‌నెట్ ప్రైస్ డేటాబేస్ ద్వారా సెకండరీ మార్కెట్‌లో ప్రదర్శించిన ఆర్ట్‌ను పరిశీలిస్తే కిందటి సంవత్సరం దాదాపు 2 మిలియన్లకు అమ్ముడైన పెయింటింగ్ ఉంది. అదేవిధంగా డిజిటల్ పెయింటింగ్‌లు, సైక్లాడిక్ మాస్క్, జపనీస్ హెల్మెట్ స్టాండ్ వంటివి ఉన్నాయి.




మెక్సికోలో సూక్ష్మ ఆర్ట్ గ్యాలరీ

మహమ్మారి సమయంలో ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే ఉన్నారు. అప్పుడు వారి చూపు తమ ఇంటీరియర్ వైపు మళ్లింది. అప్పుడే తమలోని సృజనకు పదును పెట్టిన వారు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది. షార్ప్ టైలర్ అనే కళాకారుడు మెక్సికో నగరంలో 'లులు' అనే సూక్ష్మ ఆర్ట్ గ్యాలరీని నడిపేవాడు. ఆ తరువాత లాస్ ఏంజిల్స్‌లోని పెద్ద స్టూడియోకు తన చిత్రకళను మార్చాడు. ప్రపంచంలోని చాలా దేశాల్లో తమ దేశీయ సంస్కృతికి కళాకారులు అద్దం పడుతూనే ఉన్నారు.

సోషల్ మీడియా ప్రభావం

పరిమాణంతో సంబంధం లేకుండానే సోషల్ మీడియాలో ఈ చిత్రకళా ప్రదర్శన నిత్యం జరుగుతూనే ఉంది. అతి పెద్ద గోడలపైన అతి చిన్న కళాకృతి ఆసక్తిని రేపుతుంది.' చిత్రాలలో అంతర్లీనంగా ఉన్న సున్నితత్వంతో పాటు రహస్యం దాగుంటుంది. దానిని కనుక్కోవడంలో చేసే ప్రయత్నం అత్యంత మనోహరంగా ఉంటుంది' అంటున్నారీ కళాకారులు.



వినూత్నంగా ఆలోచించే సామర్థ్యమే నాయకుడికి, అనుచరుడికి మధ్య వ్యత్యాసాన్ని నిర్దేశిస్తాయి.

- స్టీవ్ జాబ్స్, యాపిల్ సహ-వ్యవస్థాపకుడు

న్యూ ఫండ్ ఆఫర్

యాక్సిస్ నిఫ్టీ500 మొమెంటం ఫండ్

యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ తాజాగా నిఫ్టీ500 మొమెంటం 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 7 వరకు అందుబాటులో ఉంటుంది. మరింతగా పెరిగే ధోరణులు కనపరుస్తున్న స్టాక్స్‌ను గుర్తించి, వాటిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. నిఫ్టీ500 ముమెంటం 50 ఇండెక్స్‌లోని స్టాక్స్‌లో, వివిధ మార్కెట్ క్యాప్‌లవ్యాప్తంగా ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. తక్కువ వ్యయాలతో విస్తృతంగా పెట్టుబడుల డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువుగా ఉంటుందని యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ ఎండీ బి. గోపకుమార్ తెలిపారు. ఈ ఇండెక్స్ పలు సందర్భాల్లో ప్రధాన సూచీలను కూడా మించి రాబడులు అందించినట్లు సంస్థ సీఐవో ఆశీష్ గుప్తా పేర్కొన్నారు. ఇందులో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

బరోడా బీఎన్‌పీ పారిబా ఎనర్జీ ఆపర్చూనిటీస్ ఫండ్

వృద్ధికి అవకాశమున్న ఇంధన రంగ స్టాక్స్‌లో పెట్టుబడుల ప్రయోజనాలను అందించే బీఎన్‌పీ పారిబా ఎనర్జీ ఆపర్చూనిటీస్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది బరోడా బీఎన్‌పీ పారిబా అసెట్ మేనేజ్‌మెంట్ ఇండియా సంస్థ. ఈ స్కీము ఫిబ్రవరి 4 వరకు అందుబాటులో ఉంటుంది. ఏ దేశమైనా సంపన్న దేశంగా ఎదగడంలో ఇంధన వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ సీఈవో సురేశ్ సోని తెలిపారు. భారత్ కూడా సంపన్న దేశంగా ఎదుగుతున్న క్రమంలో దేశీయంగా ఇంధనానికి కూడా డిమాండ్ పెరుగుతుందని, దానికి సంబంధించిన స్టాక్స్‌లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నిఫ్టీ 500 సూచీలో దాదాపు మూడో వంతు స్టాక్స్ ఎనర్జీకి సంబంధించినవి ఉన్నాయని వివరించారు. ఇంధన అన్వేషణ, ఉత్పత్తి, రవాణా తదితర కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థల స్టాక్స్‌లో కనీసం 80 శాతం మొత్తాన్ని ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుందని సురేశ్ పేర్కొన్నారు. దీని పనితీరుకు నిఫ్టీ ఎనర్జీ టీఆర్ఐ ప్రామాణిక సూచీగా ఉంటుంది.

బడ్జెట్, ఫెడ్ రేట్లపైనే దృష్టి

క్యూ3 ఫలితాలకూ ప్రాధాన్యం

- చమురు, డాలరు కదలికలు కీలకం
- ఈ వారం ట్రేడింగ్ ఆరు రోజులు
- విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఎఫెక్ట్
- స్టాక్ మార్కెట్ ట్రెండ్‌పై అంచనాలు

దేశీ స్టాక్ మార్కెట్లకు ఈ వారం అత్యంత కీలకంగా నిలవనుంది. ఓవైపు కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక బడ్జెట్‌కు తెరతీయనుండగా.. మరోపక్క ట్రంప్ బాధ్యతలు చేపట్టాక యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై సమావేశంకానుంది. వీటికితోడు క్యూ3 ఫలితాలు, డాలరు మారకం తదితర పలు అంశాలు ట్రెండ్‌ను ప్రభావితం చేయనున్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..



న్యూఢిల్లీ: వారాంతాన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 8వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే ఆర్థిక శాఖకు పలు రంగాలు వినతులను అందించగా.. ఆదాయపన్ను సవరణలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు డొనాల్డ్ ట్రంప్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి కొత్త ఏడాదిలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పరపతి సమావేశాన్ని నిర్వహిస్తోంది. దీంతో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్ల నడకను పలు దేశ, విదేశీ అంశాలు ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

శనివారం ట్రేడింగ్

కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో శనివారం(ఫిబ్రవరి 1) స్టాక్ మార్కెట్లు పనిచేయనున్నాయి. పూర్తిస్థాయిలో ట్రేడింగ్‌ను నిర్వహించనుండటంతో ఈ వారం స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆరు రోజుల పాటు లావాదేవీలకు వేదిక కానున్నాయి. అయితే బడ్జెట్ సెంటిమెంటుపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. వెరసి మార్కెట్ల ట్రెండ్‌కు దిక్సూచిగా నిలవనున్నట్లు పేర్కొంటున్నారు. ఇన్వెస్టర్ల చూపు బడ్జెట్ ప్రతిపాదనలపై నిలవనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలియజేశారు. ప్రధానంగా నిరుత్సాహకర క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల నేపథ్యంలో బడ్జెట్‌కు ప్రాధాన్యత ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. వినియోగం, ఫైనాన్షియల్ రంగాలు పేలవ పనితీరు చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక విధానాలు, వివిధ రంగాలకు నిధుల కేటాయింపు వంటి అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు. మౌలికం, తయారీ, టెక్నాలజీలకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చే వీలున్నట్లు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

యూఎస్ జీడీపీ

యూఎస్ ఫెడ్ గురువారం(30న) పాలసీ నిర్ణయాలు ప్రకటించనుంది. అయితే ద్రవ్యోల్బణ పరిస్థితులు బలపడుతుండటంతో వడ్డీ రేట్ల తగ్గింపు బాటను వీడి కఠిన విధానాలవైపు దృష్టిపెట్టవలసి రావచ్చునని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా ట్రంప్ విధానాలు సైతం ఫెడ్ నిర్ణయాలను ప్రభావితం చేసే వీలున్నట్లు విశ్లేషకుల అంచనా. ఇక 2024 చివరి క్వార్టర్(అక్టోబర్-డిసెంబర్)కు జీడీపీ గణాంకాలు సైతం ఇదే రోజు వెలువడనున్నాయి. క్యూ3(జులై-సెప్టెంబర్)లో యూఎస్ జీడీపీ 3.1 శాతం ఎగసింది.

క్యూ3 జాబితాలో

దేశీయంగా ఈ వారం మరికొన్ని కంపెనీల అక్టోబర్-డిసెంబర్(క్యూ3) ఫలితాలు వెల్లడికానున్నాయి. జాబితాలో దిగ్గజాలు ఎన్‌టీపీసీ, ఐవోసీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, మారుతీ, బజాజ్ ఆటో, సిప్లా, ఓఎన్‌జీసీ, అంబుజా సిమెంట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, సన్ ఫార్మాస్యూటికల్, బయోకాన్, మారికో, గెయిల్ ఇండియా, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, అదానీ పవర్ చేరాయి.

ఇతర కీలక అంశాలు

ఇన్వెస్టర్ల సెంటిమెంటును ప్రభావితం చేయగల ఇతర అంశాలలో డాలరు మారకం, యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్, ముడిచమురు ధరలు సైతం ఉన్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, ప్రపంచ మార్కెట్ల పరిస్థితులకు సైతం ప్రాధాన్యత ఉన్నట్లు వెల్లడించారు. దీంతో మార్కెట్లు మరోసారి ఆటుపోట్లను చవిచూసే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. బడ్జెట్‌లో పెట్టుబడుల కేటాయింపులకు వీలున్న రైల్వే, డిఫెన్స్, క్యాపిటల్ గూడ్స్ రంగాలతోపాటు పీఎస్‌యూ షేర్లపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు వివరించారు.

గత వారమిలా..

వరుసగా మూడో వారం దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. గత వారం(20-24) సెన్సెక్స్ నికరంగా 429 పాయింట్లు(0.6%) క్షీణించి 76,190 వద్ద ముగిసింది. నిఫ్టీ 111 పాయింట్లు(0.5 శాతం) తక్కువగా 24,005 వద్ద స్థిరపడింది. అయితే చిన్న షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.4 శాతం పతనంకాగా.. స్మాల్ క్యాప్ మరింత అధికంగా 4.2 శాతం పడిపోయింది. దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెలలో నిరంతరంగా అమ్మకాలు చేపడుతున్నారు. వెరసి జనవరి 1-24 మధ్యకాలంలో నికరంగా రూ. 64,156 కోట్ల(7.44 బిలియన్ డాలర్లు) విలువైన స్టాక్స్ విక్రయించారు.

మహిళకూ ఉండాలి టర్మ్ ఇన్సూరెన్స్

భారతీయ మహిళలు నేడు ఆర్థికంగానూ స్వావలంబన సాధిస్తున్నారు. ఆర్థికాంశాల్లో నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి కూడా టర్మ్ ఇన్సూరెన్స్ ఆవశ్యకత పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ బీమా సాధనం గురించి తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



సాధారణంగా టర్మ్ ఇన్సూరెన్స్ అనేది నిర్దిష్ట ప్రీమియం చెల్లిస్తే, నిర్దిష్ట జీవిత బీమా కవరేజీని అందించే ప్యూర్ ప్రొటెక్షన్ పథకం. దురదృష్టవశాత్తు పాలసీదారు కన్నుమూసిన పక్షంలో సమ్ అష్యూర్డ్ మొత్తాన్ని వారి నామినీకి బీమా సంస్థ చెల్లిస్తుంది. మిగతా సాధనాలతో పోలిస్తే తక్కువ ప్రీమియంకే ఎక్కువ కవరేజీని అందించడం టర్మ్ ప్లాన్ల ప్రత్యేకత. ఉదాహరణకు 30 ఏళ్ల నేహా వార్షికంగా రూ. 9,646 ప్రీమియంతో 30 ఏళ్ల వ్యవధికి రూ. 1 కోటి సమ్ అష్యూర్డ్‌కి పాలసీ తీసుకున్నారనుకుందాం. ఒకవేళ దురదృష్టవశాత్తు నేహా మరణించిన పక్షంలో ఆమె నామినీకి రూ. 1 కోటి బీమా మొత్తం లభిస్తుంది. ఇలా నేహా తీసుకున్న టర్మ్ పాలసీ అనేది ఆమె కుటుంబసభ్యులకు ఆర్థికంగా తోడ్పాటునిస్తుంది. అయితే, ఈ టర్మ్ పాలసీని ఎంత ముందుగా తీసుకుంటే అంత మంచిది. ఉదాహరణకు నేహా గనుక టర్మ్ పాలసీని తీసుకోవడం ఒక పదేళ్లు వాయిదా వేశారనుకోండి .. అప్పుడు అదే లైఫ్ కవరేజీకి ఆమె ఏకంగా రూ. 15,900 వార్షిక ప్రీమియం కట్టాల్సి వస్తుంది. పైగా పాలసీ వ్యవధి కూడా 20 ఏళ్లకే పరిమితమవుతుంది. మొత్తం మీద ఆమె తక్కువ కాలవ్యవధికి వర్తించే పాలసీకి ఏటా రూ. 6,000 చొప్పున కట్టాల్సి వస్తుంది. అదే ముందుగా తీసుకుని ఉంటే, ఈ అదనపు మొత్తాన్ని మరో చోట ఇన్వెస్ట్ చేసుకోవడానికి వీలవుతుంది.

యాడ్-ఆన్‌తో అదనపు ప్రయోజనాలు ..
వ్యక్తిగత జీవిత పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా మరికాస్త ప్రీమియం చెల్లించడం ద్వారా మరిన్ని అదనపు ప్రయోజనాలను అందించేందుకు యాడ్-ఆన్ రైడర్లు ఉపయోగపడగలవు.

క్రిటికల్ ఇల్‌నెస్ బెనిఫిట్: ఇది ఇటు ఆరోగ్యం అటు జీవిత బీమా ప్రయోజనాలను కూడా అందిస్తుంది. కొన్ని జీవిత బీమా కంపెనీలు 32 తీవ్ర అనారోగ్యాలకు కూడా కవరేజీని అందిస్తున్నాయి. మహిళలకు ప్రత్యేకమైన బ్రెస్ట్, సర్వికల్, ఒవేరియన్ క్యాన్సర్లు, గుండె.. మెదడు.. కిడ్నీ సంబంధ సమస్యలు మొదలైనవి ఈ జాబితాలో ఉంటున్నాయి. 30 ఏళ్ల వయస్సు గల మహిళ, 30 ఏళ్ల కాలవ్యవధికి కేవలం నెలకు రూ. 977 చెల్లించడం ద్వారా రూ. 50 లక్షల వరకు ప్రయోజనాలను పొందేందుకు ఈ యాడ్-ఆన్‌ను తీసుకోవచ్చు. ఒకవేళ ఏదైనా అనారోగ్యం ఉన్నట్లు తేలిందంటే, చికిత్స కోసం నిధుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా, బీమా సంస్థ ఏకమొత్తంగా చెల్లిస్తుంది. ప్రస్తుతం కీమోథెరపీ వ్యయం దాదాపు రూ. 25 లక్షల వరకు ఉంటోంది. ఇలా వైద్య చికిత్స వ్యయాలు గణనీయంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ యాడ్-ఆన్ ఎంతో ఉపయోగకరంగా ఉండగలదు.

ప్రీమియం వెయివర్: ఎప్పుడేం జరుగుతుందో ఊహించలేని విధంగా జీవితం ఉంటుంది. కాబట్టి పాలసీదారు ప్రమాదవశాత్తూ శాశ్వత వైకల్యానికి గురై ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ యాడ్-ఆన్ బెనిఫిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చాలా మటుకు బీమా సంస్థలు అదనంగా తీసుకోకుండా, పాలసీ అంతర్గతంగానే ఈ ఫీచరును అందిస్తున్నాయి. ఒకవేళ మీరు తీసుకున్న పాలసీలో ఇది లేకపోతే, కొంత అదనపు ప్రీమియం చెల్లించైనా తీసుకోవడం శ్రేయస్కరం.

యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్: కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల సంస్థ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు 11.9 శాతం పెరిగాయి. ఈ నేపథ్యంలో ఈ యాడ్-ఆన్ ప్రయోజకరంగా ఉండగలదు. నెలకు కేవలం రూ. 302 మేర అదనంగా ప్రీమియం చెల్లించడం ద్వారా రూ. 50 లక్షల లైఫ్ కవరేజీకి నేహాలాంటి వారు ఈ యాడ్-ఆన్ బెనిఫిట్‌ను తీసుకోవచ్చు. ఉదాహరణకు, రూ. 1 కోటి కవరేజ్ గల బేస్ పాలసీని, రూ. 50 లక్షల యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్‌ను తీసుకుంటే, ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో మొత్తం రూ. 1.50 కోట్ల క్లెయిమ్ లభిస్తుంది.

కుటుంబానికి ఆర్థికంగా దన్నుగా నిలుస్తున్న వారికి దురదృష్టవశాత్తూ ఏదైనా జరిగి, ఆదాయానికి అంతరాయం ఏర్పడినా, కుటుంబానికి ఆర్థిక భరోసాను కల్పిస్తుంది టర్మ్ ఇన్సూరెన్స్. క్లెయిమ్‌ల విషయంలో మెరుగైన ట్రాక్ రికార్డు ఉన్న బీమా సంస్థ నుంచి దీన్ని కొనుగోలు చేయడం మంచిది. ఉదాహరణకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో మొత్తం పరిశ్రమలో అత్యుత్తమంగా 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తిని నమోదు చేసింది. అలాగే, నాన్-ఇన్వెస్టిగేటెడ్ డెత్ క్లెయిమ్‌లను సగటున 1.2 రోజుల వ్యవధిలోనే సెటిల్ చేసింది.

- ఎలిజబెత్ రాయ్,
హెడ్ (ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్), ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్

ఎన్నారైలకు దేశీ జీవిత బీమా దన్ను

బజాజ్ అలయంజ్ లైఫ్ చీఫ్ రాజేశ్ కృష్ణన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్వదేశానికి గణనీయంగా రెమిటెన్సులు పంపుతూ, ఇక్కడ ఇన్వెస్ట్ చేస్తున్న ప్రవాస భారతీయుల్లో (ఎన్నారై).. ఇప్పుడు దేశీ జీవిత బీమా సంస్థలు అందిస్తున్న పాలసీలపైనా ఆసక్తి పెరుగుతోందని బజాజ్ అలయంజ్ లైఫ్ చీఫ్ (ఆపరేషన్స్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్) రాజేశ్ కృష్ణన్ తెలిపారు. ఈ పథకాలు అందుబాటు ప్రీమియంలతో, ఎన్నారైలకు అనువుగా కస్టమైజ్ చేసిన ఫీచర్లతో లభిస్తుండటమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అలాగే ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ సైతం సులభతరంగా, పేపర్‌రహితంగా ఉంటోందని ఆయన వివరించారు. డయాగ్నోస్టిక్ భాగస్వాముల నెట్‌వర్క్ ద్వారా పాలసీదారులకు వారు నివసిస్తున్న దేశంలోనే వైద్యపరీక్షల సదుపాయాన్ని కూడా బీమా సంస్థలు కల్పిస్తున్నాయని రాజేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ఎన్నారైల అవసరాలను వివిధ టైమ్-జోన్లవ్యాప్తంగా తీర్చేందుకు ప్రత్యేకంగా ఆఫ్టర్-సేల్స్ టీమ్‌లతో సేవలు అందిస్తున్నాయని వివరించారు. బీమా సంస్థలు క్లెయిమ్ ప్రక్రియను సులభతరం చేసినట్లు పేర్కొన్నారు. టర్మ్ ప్లాన్లనేవి కుటుంబానికి ఆర్థిక భద్రతను అందించేవిగా ఉంటాయని, యులిప్‌లు జీవిత బీమా కవరేజీతో పాటు సంపద సృష్టి అవకాశాన్ని అందిస్తాయని రాజేశ్ తెలిపారు. రిటైరయ్యాక భారత్‌లోనే జీవితాన్ని గడపదల్చుకున్న వారు యాన్యుటీ ప్లాన్లను ఎంచుకోవచ్చని చెప్పారు.

ఇంటద్దె అలవెన్స్ క్లెయిమ్.. ఈ పొరపాట్లు వద్దు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

గతవారం ప్లానింగ్ ఎలా చేయాలో తెలుసుకున్నాం. సాధారణంగా ఎక్కువ మంది చేసే పొరపాట్లు .. కొన్ని కావాలని.. కొన్ని తెలియక చేసేవి చాలా ఉంటున్నాయి. ఈ విధంగా తప్పుడు క్లెయిమ్ చేసే వారికి ఆదాయపు పన్ను శాఖవారు నోటీసులు ఇస్తున్నారు. వివరాలు అడుగుతున్నారు. ''మిమ్మల్ని ఇబ్బంది పెట్టము'' అని సీబీడీటీ వారు అంటున్నప్పటికీ మీ జాగ్రత్తలు మీరు తీసుకోండి. ఈ కింద ఉదహరించిన కేసులన్నీ మీకు ఇబ్బంది కలిగించేవే. క్లెయింను రిజెక్షన్‌కు గురై పన్ను భారాన్ని పెంచేవి .. పెంచినవి వీటిలో ఉన్నాయి. కాబట్టి తగిన జాగ్రత్త వహించండి. ఈ పొరపాట్లు చేయకపోవడమే మీ ప్లానింగ్‌కి కీలకంగా ఉంటుంది.

- కామేశ్వర్రావుగారు ఠంచనుగా ప్రతి నెలా రెంట్ పే చేస్తారు. బ్యాంకు అకౌంటులో ఖర్చు కనిపిస్తుంది. అయితే, ఓనర్ గారు ఇండియాలో లేరు. అమెరికాలో స్థిరనివాసం. ఆయన గారికి ఈ ఇంటికి వచ్చి చూసేటంత టైం లేదు.. ఓపికా లేదు. ఇద్దరు మంచివారే. ''అవసరం లేదు'' అనుకున్నారు అగ్రిమెంటు గురించి. ఏతావతా ఏ కాగితాలు లేవు. అగ్రిమెంటు లేదు. సంతకాలూ లేవు. దీంతో ఇంటద్దె అలవెన్సు క్లెయిమ్ చేయడానికి వీల్లేని పరిస్థితి.
- వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో మోతుబరి రైతు వామనరావుకు హైదరాబాద్‌లో లంకంత ఇల్లు ఉంది. దాన్ని అద్దెకిచ్చాడు. కానీ అగ్రిమెంటు రాయలేదు. బ్యాంకు చెల్లింపులు తీసుకోడు. అంతా నగదే. పిల్లల చదువుకని ఆ ఇంట్లోనే ఉంటున్నాడు విద్యాధర రావు. ఆయనకీ ఇంటద్దె అలవెన్స్ క్లెయిమ్ చేయడానికి కాగితాలు లేవు.
- ముందు జాగ్రత్తగా అగ్రిమెంటు రాసుకున్నాడు వాసుదేవరావు. కానీ ఆస్తేమో ఓనరు పేరు మీద .. అగ్రిమెంటేమో భార్య వసుంధర పేరు మీద.. మ్యుటేషన్ జరగలేదు. దీంతో ఈ అగ్రిమెంటును కంపెనీవారు ఒప్పుకోలేదు.
- మావగారింట్లో బంటులా చేరి ఒంటెలా తయారయ్యాడు తాయారావు. మామగారు జరిగిపోయారు. అయినా అగ్రిమెంటు మీద తానే రెండు సంతకాలు పెట్టి, రశీదులు రాసి, పాన్ కార్డు వాడుతున్నాడు సదరు మంచి అల్లుడు.
- తప్పుడు సమాచారంతో అగ్రిమెంటు బనాయించాడు బాబూరావు. అసలు ఆ ఇల్లు లేదు. అద్దె లేదు.. ఓనరు లేడు .. వ్యవహారం లేదు. అద్దె మాత్రం ఏడాది మొత్తం మీద రూ. 1,00,000 దాటకుండా మేనేజ్ చేస్తున్నాడు.
- అద్దె ఇంటి అగ్రిమెంట్లలో తప్పులు.. సమాచారం తప్పు.. తేదీలు తప్పు.. అమౌంటు తప్పు.. రెన్యువల్ జరగదు. బ్యాంకులో జమకి, వ్యవహారంలో మొత్తానికి పొంతనే లేదు. అన్నీ తేడానే. ఏ సమాచారంలో నిజమెంతో సరిపోలదు. పేమెంట్ చేసినట్లు ప్రూఫ్‌లు చూపించడం లేదు. ఇలా చేయడమూ తప్పే.
- కొడుకు ఇల్లు కట్టుకున్నాడు. ఆ ఇంట్లో తల్లిదండ్రులు ఉంటున్నారు. తండ్రి కొడుక్కి అద్దె ఇస్తున్నట్లు కాగితాలు సృష్టించారు. నిజానికి ఏ వ్యవహారం లేదు.
- ఇలాగే విదేశాల్లోని పిల్లల పేరు మీద ఆస్తులుంటాయి. అగ్రిమెంట్లు, తల్లిదండ్రుల పేరు మీద ఎడాపెడా ఎంటర్ అవుతున్నాయి. ప్రతి నెలా నిర్దిష్ట మొత్తం వారి అకౌంట్లలో పడుతోంది. అయినా వారు అకౌంట్లలో చూపించడం లేదు .. పోనీ పిల్లల అకౌంట్లలోనూ చూపించడం లేదు. ''అక్కడ ఏమీ వద్దని'' ఆ పిల్లలు చెప్పడం .. వారి మాటను పెద్దలు జవదాటని వైనం. ఎంత రిస్కో చూడండి.



- హైదరాబాదులో సొంతిల్లు. అందులో ఉండటం.. అద్దె ఇచ్చినట్లు దొంగ రశీదులు ఇవ్వడం.. అమ్మ పేరు మీదో .. ఆలి పేరు మీదో దొంగ రశీదు.
- చిన్న చిన్న ఊళ్లలో ఎక్కువ అద్దె ఇస్తున్నట్లు దొంగ రశీదులు.
- సగం బ్యాంకు ద్వారా ఇవ్వడం, సగం నగదు ఇవ్వడం వల్ల బ్యాంకు వ్యవహారానికి మాత్రమే క్లెయిం చేసుకోగలరు.
- తనకెన్ని ఇళ్లు ఉన్నాయో తనకే తెలియదు ఒక ఓనరుకు. అంతా నగదు వసూళ్లే. ఎవరికీ రసీదు ఇవ్వరు. తన పాన్ కార్డు కాపీ ఇవ్వరు.

ఇలా ఎందరో ఎన్నో పొరపాట్లు చేస్తున్నారు. ఏ పొరపాటు చేయకపోవడమే ప్లానింగ్‌లో ముఖ్యమైనది. భయపెట్టడమని కాదు.

కానీ ఒక చేదు నిజం ఏమిటంటే దాదాపు 90,000 మంది అసెస్సీలతో వెయ్యి కోట్ల మినహాయింపును విత్‌డ్రా చేయించి మరీ వారితో పన్ను కట్టించారు. యజమానులు, అంటే సంస్థలు జాగ్రత్తగా ఉండాలని హితవు చెబుతూ అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది డిపార్టుమెంటు. మనమూ జాగ్రత్తపడదాం.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

జేకే చేతికి సయిఫ్కో సిమెంట్స్

60 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ జేకే సిమెంట్.. జమ్మకాశ్మీర్ కంపెనీ సయిఫ్కో సిమెంట్స్‌ను కొనుగోలు చేయనుంది. రూ. 174 కోట్లు వెచ్చించి 60 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు జేకే సిమెంట్ వెల్లడించింది. శ్రీనగర్‌లోని ఖున్‌మోలో సయిఫ్కోకు సమీకృత సిమెంట్ ప్లాంటు ఉంది. 54 ఎకరాలలో విస్తరించిన ఈ ప్లాంటు వార్షికంగా 0.26 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) క్లింకర్, 0.42 ఎంటీపీఏ గ్రైండింగ్ సామర్థ్యాలను కలిగి ఉంది. అంతేకాకుండా సొంత వినియోగానికి 144.25 హెక్టార్లలో విస్తరించిన 129 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ రిజర్వులు సైతం సంస్థ సొంతం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-1-2025	
విశాఖ	485-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	465-00
వరంగల్	467-00
రిటైల్ ధర	5.25

పన్ను ఆదాతో కూడిన రాబడి

మిరే అసెట్ ట్యాక్స్ సేవర్ ఫండ్

ఆదాయపన్ను పాత విధానంలో సెక్షన్ 80సీ కింద వివిధ రకాల సాధనాలల్లో రూ.1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆ మేరకు ఆదాయంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) మ్యూచువల్ ఫండ్స్ కూడా ఈ విభాగం కిందకే వస్తాయి. ఒకవైపు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా గణనీయమైన రాబడుల ప్రయోజాన్ని పొందుతూనే, మరో వైపు ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల ఆదాయంపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని సైతం పొందొచ్చు. ఈ రెండు రకాల ప్రయోజనాలతో కూడిన ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ దీర్ఘకాల లక్ష్యాలకు అనుకూలంగా ఉంటాయి. ఈ విభాగంలో మెరుగైన పనితీరు చూపిస్తున్న పథకాల్లో మిరే అస్సెట్ ట్యాక్స్ సేవర్ ఫండ్ ఒకటి.



రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాది కాలంలో పెట్టుబడులపై 11 శాతం రాబడిని ఇన్వెస్టర్లకు అందించింది. ఇదే కాలంలో బీఎస్ఈ 500 టీఆర్ఐ రాబడి 10.20 శాతంగా ఉంది. మూడేళ్ల పనితీరు గమనిస్తే పెట్టుబడులపై వార్షిక రాబడి 13 శాతం వరకు ఉంది. కానీ ఇదే కాలంలో బీఎస్ఈ 500 టీఆర్ఐ వృద్ధి 14 శాతంగా ఉండడం గమనించొచ్చు. ఇక ఐదేళ్ల కాలంలో ఈ పథకం 17.73 శాతం చొప్పున వార్షిక రాబడిని తెచ్చిపెట్టింది. ఇదే కాలంలో బీఎస్ఈ 500 టీఆర్ఐ రాబడి 17.39 శాతంగా ఉంది. ఏడేళ్లలో మిరే అస్సెట్ ట్యాక్స్ సేవర్ ఫండ్ 14 శాతం రాబడులను అందించింది. ఈ కాలంలో బీఎస్ఐ 500 టీఆర్ఐ సూచీ వృద్ధి 12.96 శాతంగా ఉంది. మూడేళ్ల కాలం మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ సూచీల కంటే ఈ పథకం మెరుగైన పనితీరు నమోదు చేసింది. దీర్ఘకాలంలో మార్కెట్లకు అనుగుణమైన రాబడి, అంతకంటే మెరుగైన వృద్ధిని ఈ పథకం నుంచి ఆశించొచ్చు.

పెట్టుబడుల విధానం

ఏదో ఒక విభాగంలో కాకుండా, స్మాల్, మిడ్, లార్జ్‌క్యాప్ విభాగాల్లో ఎక్కడ మెరుగైన అవకాశాలున్నా పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఈ పథకానికి ఉంది. బలమైన వ్యాపార వృద్ధిని చూపిస్తున్న కంపెనీలు, భవిష్యత్తులో మెరుగైన వృద్ధికి అవకాశమున్న కంపెనీల్లో, అది కూడా షేర్ల ధరలు సహేతుక విలువల వద్ద ఉన్నప్పుడే పెట్టుబడులు పెడుతుంది. బోటమ్ అప్ విధానాన్ని అనుసరిస్తుంది. వృద్ధి కంపెనీలను, వ్యాల్యూ దృష్టితో ఎంపిక చేస్తుంది. కనీసం 80 శాతం తక్కువ కాకుండా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మిగిలిన మేర డెట్ సాధనాలకు కేటాయిస్తుంటుంది. ఈక్విటీల్లో ఆకర్షణీయ అవకాశాలున్నప్పుడు 100 శాతం పెట్టుబడులను కేటాయిస్తుంటుంది. ఈ పథకంలో రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే పెట్టుబడి పెట్టిన నాటి నుంచి మూడేళ్లు నిండే వరకు లాకిన్ ఉంటుంది. అంటే ఆ కాలంలో పెట్టుబడులను వెనక్కి తీసుకోలేరు. పన్ను ఆదా ప్రయోజనం కల్పించినందున ఈ నిబంధన అమలవుతుంది.



పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 25,021 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99.25 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన 0.75 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీల్లోనూ 73 శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. దీంతో రిస్క్ మధ్యస్థంగా ఉంటుందని అర్థం చేసుకోవచ్చు. మరో 21 శాతం పెట్టుబడులు మిడ్ క్యాప్‌లో, 5.65 శాతం పెట్టుబడులు స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఉన్నాయి. పెట్టుబడుల్లో 33 శాతం వరకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లోనే ఉన్నాయి. టెక్నాలజీ కంపెనీలకు 13.6 శాతం, ఇండస్ట్రియల్స్‌కు 13.27 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 12.15 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 9.53 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.37
యాక్సిస్ బ్యాంక్	4.72
ఎస్‌బీఐ	4.40
ఇన్ఫోసిస్	4.29
ఐసీఐసీఐ బ్యాంక్	4.22
ఎల్‌అండ్‌టీ	3.07
టీసీఎస్	3.07
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.58
కోటక్ బ్యాంక్	2.18
వన్97 కమ్యూనికేషన్స్	1.95

చాంపియన్ ఒడిశా వారియర్స్

ముగిసిన మహిళల హాకీ ఇండియా లీగ్ ● రన్నరప్‌గా నిలిచిన సూర్మా హాకీ క్లబ్



రాంచీ: మహిళా క్రీడాకారిణుల కోసం తొలిసారి నిర్వహించిన మహిళల హాకీ ఇండియా లీగ్ (డబ్ల్యూహెచ్‌ఐఎల్) టోర్నమెంట్‌లో ఒడిశా వారియర్స్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో నేహా గోయల్ సారథ్యంలోని ఒడిశా వారియర్స్ 2–1 గోల్స్ తేడాతో జేఎస్‌డబ్ల్యూ సూర్మా హాకీ క్లబ్ జట్టును ఓడించింది. రుతుజా దాదాసో పిసాల్ (20వ, 56వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేసి ఒడిశా వారియర్స్ విజయంలో కీలకపాత్ర పోషించింది. సలీమా టెటె కెప్టెన్సీలో ఆడిన సూర్మా క్లబ్ జట్టుకు పెన్నీ స్క్విబ్ (28వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. విజేతగా నిలిచిన ఒడిశా వారియర్స్ జట్టుకు రూ. 1 కోటి 50 లక్షల ప్రైజ్‌మనీ లభించింది. రన్నరప్ సూర్మా క్లబ్ జట్టుకు రూ. 1 కోటి ప్రైజ్‌మనీ దక్కింది. మూడో స్థానంలో నిలిచిన ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు రూ. 50 లక్షల ప్రైజ్‌మనీ సొంతం చేసుకుంది. 'బెస్ట్ గోల్‌కీపర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు సవితా పూనియా (సూర్మా హాకీ క్లబ్)... 'అప్‌కమింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' పురస్కారం సోనమ్ (సూర్మా హాకీ క్లబ్)... 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు జ్యోతి (సూర్మా హాకీ క్లబ్) గెల్చుకున్నారు. ఐదు గోల్స్ చొప్పున సాధించిన యిబ్బీ జాన్సెన్ (ఒడిశా వారియర్స్), చార్లొటె ఎంగ్లెబెర్ట్ (సూర్మా హాకీ క్లబ్) 'టోర్నీ టాప్ స్కోరర్స్'గా నిలిచారు.

'టాప్'లో హైదరాబాద్ తూఫాన్స్

పురుషుల హాకీ ఇండియా లీగ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు 17 పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. యూపీ రుద్రాస్ జట్టుతో రూర్కెలాలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ 3–1తో నెగ్గింది. తూఫాన్స్ జట్టు తరఫున అర్ష్‌దీప్ సింగ్ రెండు గోల్స్... పిలాట్ ఒక గోల్ చేశారు.

- **4** పాల్గొన్న జట్లు
- **13** మొత్తం జరిగిన మ్యాచ్‌లు
- **41** నమోదైన మొత్తం గోల్స్
- **27** ఫీల్డ్ గోల్స్
- **11** పెనాల్టీ కార్నర్ గోల్స్
- **3** పెనాల్టీ స్ట్రోక్ గోల్స్
- **22** క్రీడాకారిణులకు లభించిన గ్రీన్ కార్డులు
- **6** క్రీడాకారిణులకు లభించిన ఎల్లో కార్డులు


'బెస్ట్ గోల్‌కీపర్ ఆఫ్ ద టోర్నీ' సవితా పూనియా


'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' జ్యోతి



'టోర్నీ టాప్ స్కోరర్స్' యిబ్బీ జాన్సెన్, చార్లొటె



రన్నరప్ చెక్‌తో సూర్మా క్లబ్ కెప్టెన్ సలీమా టెటె

తనయ్, అనికేత్ మాయాజాలం

హిమాచల్ ప్రదేశ్‌పై ఇన్నింగ్స్ 43 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: ఇప్పటికే నాకౌట్ దశకు అర్హత సాధించే అవకాశం కోల్పోయిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో రెండో విజయాన్ని అందుకుంది. హిమాచల్ ప్రదేశ్ జట్టుతో ఆదివారం ఉప్పల్ స్టేడియంలో ముగిసిన గ్రూప్ 'బి' ఆరో రౌండ్ లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 43 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి 7 పాయింట్లు సంపాదించింది. చామా మిలింద్ సారథ్యంలో ఈ మ్యాచ్ ఆడిన హైదరాబాద్ జట్టుకు ఇద్దరు స్పిన్నర్లు తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి తమ ప్రదర్శనతో విజయాన్ని కట్టబెట్టారు. ఫాలో ఆన్ ఆడుతూ ఆఖరి రోజు ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హిమాచల్ జట్టు వన్డే తరహాలో ఆడి 45.4 ఓవర్లలో 247 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. హైదరాబాద్ ఎడంచేతి వాటం స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 118 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టగా... నిజామాబాద్ జిల్లాకు చెందిన మరో ఎడంచేతి వాటం స్పిన్నర్ గంగం అనికేత్ రెడ్డి 46 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. హిమాచల్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో శుభం అరోరా (72 బంతుల్లో 66; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... అంకిత్ కాల్సి (39 బంతుల్లో 44; 6 ఫోర్లు), వైభవ్ అరోరా



(22 బంతుల్లో 32; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. మ్యాచ్ మొత్తంలో తొమ్మిది వికెట్లు తీసిన అనికేత్ రెడ్డికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో హైదరాబాద్ ఆరు మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. రెండు మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్ విజయాలు సాధించి... రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి 16 పాయింట్లతో ఐదో



స్థానంలో ఉంది. నాగ్‌పూర్‌లో ఈనెల 30 నుంచి జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో విదర్భ జట్టుతో హైదరాబాద్ ఆడుతుంది.

రన్నరప్ ఆకుల శ్రీజ

సూరత్: జాతీయ సీనియర్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి, మాజీ విజేత ఆకుల శ్రీజ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తరఫున బరిలోకి దిగిన శ్రీజ మహిళల సింగిల్స్ ఫైనల్లో 12–10, 11–8, 11–13, 10–12, 8–11, 11–9, 9–11తో దియా చిటాలె (ఆర్‌బీఐ) చేతిలో ఓడిపోయింది. 26 ఏళ్ల శ్రీజ ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 28వ స్థానంలో ఉంది. భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా కొనసాగుతున్న శ్రీజ గత ఏడాది ఆసియా చాంపియన్‌షిప్ టీమ్ విభాగంలో భారత జట్టు కాంస్య పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది.




సంయుక్త ఆధిక్యంలో గుకేశ్

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో ఎనిమిదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 5.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్త ఆధిక్యంలో ఉన్నాడు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందతో ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను గుకేశ్ 33 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. నొదిక్‌బెక్ (ఉజ్బెకిస్తాన్), ప్రజ్ఞానంద కూడా 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. పెంటేల హరికృష్ణ (భారత్)–అనీశ్ గిరి (నెదర్లాండ్స్) మధ్య గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా' అయింది. అలెక్సీ సరానా (సెర్బియా), ఇరిగేశి అర్జున్ (భారత్) మధ్య గేమ్ 23 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. మొత్తం 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.



పాక్ విజయలక్ష్యం 254

- ప్రస్తుతం 76/4
- వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 ఆలౌట్
- నోమన్ అలీకి 4 వికెట్లు



ముల్తాన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్తాన్ జట్టు ఎదురీదుతోంది. వెస్టిండీస్ నిర్దేశించిన 254 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాకిస్తాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులు సాధించింది. పాక్ విజయం సాధించాలంటే మరో 178 పరుగులు చేయాలి. చేతిలో 6 వికెట్లు ఉన్నాయి. కెప్టెన్ షాన్ మసూద్ (2), హురైరా (2), బాబర్ ఆజమ్ (31; 2 ఫోర్లు), కమ్రాన్ గులామ్ (19; 2 ఫోర్లు) అవుటయ్యారు. సాద్ షకీల్ (13 బ్యాటింగ్), కాషిఫ్ అలీ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మరో మూడు రోజుల ఆట మిగిలి ఉన్న నేపథ్యంలో మూడో రోజే ఈ మ్యాచ్‌లో ఫలితం రావడం ఖాయం. తొలి రోజే రెండు జట్లు ఆలౌటయ్యాయి. తొమ్మిది పరుగుల స్వల్ప ఆధిక్యం సంపాదించిన వెస్టిండీస్ రెండో రోజు రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. 66.1 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్, ఓపెనర్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (74 బంతుల్లో 52; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. అమీర్ జంగూ (52 బంతుల్లో 30; 3 ఫోర్లు), టెవిన్ ఇమ్లాచ్ (57 బంతుల్లో 35; 1 ఫోర్), కెవిన్ సింక్లెయిర్ (51 బంతుల్లో 28; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. పాక్ బౌలర్లలో స్పిన్నర్ నోమన్ అలీ 80 పరుగులిచ్చి 4 వికెట్లు, మరో స్పిన్నర్ సాజిద్ ఖాన్ 76 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. చీలమండ గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో... పాకిస్తాన్ వన్డే జట్టు స్టార్ ఓపెనర్ సయీమ్ అయూబ్ చాంపియన్స్ ట్రోఫీ టోర్నీకి దూరం కావడం ఖాయమైంది. ప్రస్తుతం లండన్‌లో చికిత్స తీసుకుంటున్న సయీమ్ పూర్తిగా కోలుకోవడానికి మరింత సమయం పడుతుందని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోహసిన్ నక్వీ తెలిపారు. చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి పాకిస్తాన్, యూఏఈలలో జరగనుంది.



కరణ్ సెంచరీ

- 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శశికాంత్
- పుదుచ్చేరితో ఆంధ్ర మ్యాచ్ 'డ్రా'

పుదుచ్చేరి: రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసింది. పుదుచ్చేరి జట్టుతో ఆదివారం ముగిసిన ఎలైట్ గ్రూప్ 'బి' ఆరో రౌండ్ లీగ్ మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించినందుకు ఆంధ్ర జట్టుకు మూడు పాయింట్లు లభించాయి. ఓవర్‌నైట్ స్కోరు 248/5తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 82.4 ఓవర్లలో 6 వికెట్లకు 319 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 86 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన కరణ్ షిండే (171 బంతుల్లో 119 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శశికాంత్ (39; 4 ఫోర్లు) తన ఓవర్‌నైట్ స్కోరు వద్దే అవుటయ్యాడు. ఆ తర్వాత త్రిపురాణ విజయ్ (15; 2 ఫోర్లు), పృథ్వీరాజ్ (14 బంతుల్లో 12 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) సహకారంతో కరణ్ శతకం సాధించాడు. ఆంధ్ర నిర్దేశించిన 363 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పుదుచ్చేరి 46 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 152 పరుగులు చేసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో రెండు జట్లు ఆటను ముగించాయి. పుదుచ్చేరి ఓపెనర్లు గంగా శ్రీధర్ రాజు (148 బంతుల్లో 75 నాటౌట్; 9 ఫోర్లు), జై పాండే (131 బంతుల్లో 59 నాటౌట్; 5 ఫోర్లు) అజేయ అర్ధసెంచరీలు చేశారు. 8 జట్లున్న గ్రూప్ 'బి'లో ఆంధ్ర జట్టు 6 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయి, 3 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. 7 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. ఈనెల 30 నుంచి విజయనగరంలో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్తాన్‌తో ఆంధ్ర తలపడుతుంది.

టౌన్‌సెండ్–సినియకోవా జోడీకి డబుల్స్ టైటిల్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో గతంలో ఒక్కసారి కూడా మూడో రౌండ్ దాటి ముందుకెళ్లలేకపోయిన అమెరికా క్రీడాకారిణి టేలర్ టౌన్‌సెండ్ ఈసారి మాత్రం డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. కాటరీనా సినియకోవా (చెక్ రిపబ్లిక్)తో జత కట్టి తన కెరీర్‌లో రెండోసారి గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్‌ను దక్కించుకుంది. గత ఏడాది వింబుల్డన్ టోర్నీలో సినియకోవాతో కలిసి మహిళల డబుల్స్ టైటిల్ నెగ్గిన టౌన్‌సెండ్ ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. ఆదివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ టౌన్‌సెండ్–సినియకోవా ద్వయం 6–2, 6–7 (4/7), 6–3తో సె సు వె



(చైనీస్ తైపీ)–ఎలెనా ఒస్టాపెంకో (లాత్వియా) జోడీపై గెలిచింది. టౌన్‌సెండ్–సినియకోవాలకు 8,10,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 4 కోట్ల 41 లక్షలు)... సె సు వె–ఒస్టాపెంకోలకు 4,40,000 డాలర్లు (రూ. 2 కోట్ల 39 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. సినియకోవా కెరీర్‌లో ఇది 10వ గ్రాండ్‌స్లామ్ మహిళల డబుల్స్ టైటిల్ కావడం విశేషం. గతంలో ఆమె బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)తో కలిసి 2022, 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో... 2018, 2021 ఫ్రెంచ్ ఓపెన్‌లో... 2018, 2022 వింబుల్డన్ టోర్నీలో... 2022 యూఎస్ ఓపెన్‌లో... కోకో గాఫ్ (అమెరికా)తో కలిసి 2024 ఫ్రెంచ్ ఓపెన్‌లో... టౌన్‌సెండ్‌తో కలిసి 2024 వింబుల్డన్ టోర్నీలో మహిళల డబుల్స్ టైటిల్‌ను సాధించింది.



భళా బెర్నెట్...

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ జూనియర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బాలుర సింగిల్స్ టైటిల్ నెగ్గిన తొలి స్విట్జర్లాండ్ ప్లేయర్‌గా హెన్రీ బెర్నెట్ గుర్తింపు పొందాడు. జూనియర్ బాలుర సింగిల్స్ ఫైనల్లో 18 ఏళ్ల బెర్నెట్ 6–3, 6–4తో బెంజమిన్ విలెవెర్త్ (అమెరికా)పై విజయం సాధించాడు. గతంలో స్విట్జర్లాండ్ తరఫున జూనియర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో హెయింజ్ గుంతార్ట్ (1976 ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్), రోజర్ ఫెడరర్ (1998 వింబుల్డన్), రోమన్ వాలెంట్ (2001 వింబుల్డన్), స్టానిస్లాస్ వావ్రింకా (2003 ఫ్రెంచ్ ఓపెన్), డొమినిక్ స్ట్రయికర్ (2020 ఫ్రెంచ్ ఓపెన్) విజేతలుగా నిలిచారు.



రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఎట్-హోమ్ విందుకు హాజరైన రాష్ట్రపతి ముర్ము, ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో, ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి కోవింద్ దంపతులు



భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రూపొందించిన శకటమిది. కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో చూపరులను అలరించింది



ప్రయాగ్‌రాజ్‌లోని సంగంలో మహా కుంభ్ మేళా ప్రాంతంలో ఆదివారం 76వ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న సాధువులు

శ్రీలంక నేవీ అదుపులో 34 మంది భారతీయ జాలర్లు

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించి అక్రమంగా చేపలు పడుతున్నారంటూ శ్రీలంక నేవీ ఈ నెల 25, 26వ తేదీల్లో 34 మంది భారతీయ జాలర్లను అదుపులోకి తీసుకుంది. మూడు ట్రాలర్లను స్వాధీనం చేసుకుంది. ఇదే కారణంతో అరెస్ట్ చేసిన 41 మంది భారతీయ మత్స్యకారులను శ్రీలంక నేవీ వారం క్రితం విడిచిపెట్టినట్లు భారత హైకమిషన్ తెలిపింది. జనవరి 12వ తేదీన కూడా 8 మంది భారతీయ మత్స్యకారులను, రెండు ట్రాలర్లను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. శ్రీలంక, తమిళనాడును విడదీసే సన్నని పాక్ జలసంధి వద్దే తరచూ వివాదం తలెత్తుతోంది. 2024లో శ్రీలంక నేవీ అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారనే ఆరోపణలపై ఏకంగా 529 మంది భారతీయ జాలర్లను అదుపులోకి తీసుకుని, జైళ్లకు తరలించింది.

ముంబై పోలీసులు నా జీవితం నాశనం చేశారు

సైఫ్‌పై దాడి కేసులో అరెస్టయిన ఆకాశ్ వ్యథ

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి కేసులో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో అరెస్టయిన అనుమానితుడు ఆకాశ్ కనోజియా(31) ముంబై పోలీసుల వల్లే తన జీవితం నాశనమైందంటూ గొల్లుమంటున్నాడు. తన డ్రైవర్ ఉద్యోగం పోయిందని, త్వరలో జరగాల్సిన పెళ్లి రద్దయిందని, తన కుటుంబం అవమానాలకు గురవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అతడు ఆదివారం మీడియాతో మాట్లాడాడు. ముంబై పోలీసులు తనపై దాడి కూడా చేశారన్నాడు. ముంబైలోని సైఫ్ అలీఖాన్ ఇంట్లో దొంగతనానికి వచ్చిన దుండగుడు నటుడిపై కత్తితో దాడి చేయడం, సీసీ ఫుటేజీలో నమోదైన చిత్రం ఆధారంగా ముంబై పోలీసులిచ్చిన సమాచారంతో రైలులో వెళ్తున్న ఆకాశ్‌ను రైల్వే పోలీసులు 18న అదుపులోకి తీసుకున్నారు. 19న అసలు నిందితుడిని పట్టుకోవడంతో ఆకాశ్‌ను విడుదల చేశారు. సైఫ్‌పై దాడికి పాల్పడినట్లు తన ఫొటో మీడియాలో రావడంతో జీవితం తలకిందులైందని ఆకాశ్ వాపోతున్నాడు. సైఫ్‌పై దాడి వల్లే ఇదంతా జరిగినందున, ఆయన ఇంటి వద్ద నిలబడి ఉద్యోగం ఇప్పించమని కోరుతానన్నాడు. ఒకవేళ అసలు నిందితుడు షరీఫుల్ వెంటనే పట్టుబడకుంటే తాను బలైపోయి ఉండేవాడినన్నాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

ట్రంప్ పనామా జపం వెనక..



నౌకల రాకపోకల ఆదాయంపై కన్ను!

- తమ నౌకలపై అధిక చార్జీలని ఆరోపణ
- చైనా అజమాయిషీలోకి వెళ్లిందని అక్కసు
- తమ దేశం తవ్వినందున తమదేననే వాదన

పనామా కాలువ. వందేళ్ల క్రితం నిర్మించిన ఇంజనీరింగ్ అద్భుతం. చిన్నపాటి భూభాగం కారణంగా కలవకుండా ఉండిపోయిన అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను వందల కోట్లు వెచ్చించి అక్కడి వారి కలను సాకారం చేసింది అగ్రరాజ్యం. పాతికేళ్ల తర్వాత దానిపై అజమాయిషీ కోసం పట్టుబడుతుండటం విచిత్రం. ఆ కాల్వపై అజమాయిషీని నాటి అమెరికా అధ్యక్షుడు స్థానిక దేశానికి ధారాదత్తం చేస్తే కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం అదేమీ చెల్లవంటూ కొత్త రాగం ఆలపిస్తున్నారు. ట్రంప్ బెదిరింపులకు బెదిరేదిలేదని పనామా ప్రభుత్వం చెబుతుండటంతో ఏమౌతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. అవసరమైతే సైనిక శక్తితో బెదిరించో, బలవంతపు దౌత్యంతోనో మాట నెగ్గించుకోవడం దశాబ్దాలుగా అమెరికాకు అలవాటు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టి వారమైనా తిరక్కుండానే ఏకంగా వందకు పైగా కార్యనిర్వాహక ఉత్తర్వులిచ్చిన తెంపరి ట్రంప్ పనామాపై ఎలాంటి దూకుడు నిర్ణయాలు తీసుకుంటారోనని ప్రపంచ దేశాలన్నీ ఉత్కంఠగా వేచిచూస్తున్నాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్



భారీ రాకపోకలు, అనూహ్య రాబడి

అమెరికా నౌకలు ఆసియా ఖండానికి వెళ్లాలంటే గతంలో దక్షిణ అమెరికా ఖండం చుట్టూతా వేల మైళ్ల సముద్రయానం చేయాల్సి వచ్చేది. ప్రయాణఖర్చులు విపరీతంగా ఉండేవి. వీటిని చాలా వరకు తగ్గించేందుకు, ప్రత్నామ్నాయ సముద్రమార్గంగా పనామా కాలువను తెరమీదకు తెచ్చారు. అనుకున్నదే తడవుగా వందల కోట్లు ఖర్చుపెట్టి కాలువను తవ్వి 1914 ఆగస్ట్ 15న కాలువను వినియోగంలోకి తెచ్చారు. కొత్తలో ఈ మార్గం గుండా రోజుకు మూడు నాలుగు నౌకలే రాకపోకలు సాగించేవి. అయితే అత్యంత దగ్గరి దారికావడంతో రానురాను దీని గుండా అంతర్జాతీయ సరకు రవాణా నౌకల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఇప్పుడు ఏటా లక్షలాది నౌకలు వెళ్తున్నాయి. దీంతో కాల్వపై యాజమాన్య హక్కులున్న పనామా దేశానికి ఏటా నికర లాభం ఏకంగా రూ.43,000 కోట్లకు పెరిగిందని ఒక అంచనా. ఏటా ఇంతటి లాభాల పంట పండించే బంగారు కోడిని నాటి అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అప్పనంగా పనామాకు అప్పజెప్పారని నేటి అధ్యక్షుడు ట్రంప్ తెగ బాధపడిపోతున్నారు. పనామా దేశ వార్షిక ఆదాయంలో 23.6 శాతం ఒక్క ఈ కాలువ నుంచే వస్తుండటం గమనార్హం.

పనామా వాదనేంటి?

నాటి కాలువకు నేటి కాలువకు ఎంతో తేడా ఉంది. బాధ్యతలు తమ చేతుల్లోకి వచ్చాక పనామా దేశం ఈ కాలువను మరింతగా తవ్వి పెద్దగా విస్తరించింది. ఏకంగా 5 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టింది. సామర్థ్యాన్ని రెట్టింపు చేసింది. దీంతో 2016 ఏడాది తర్వాత భారీ నౌకలు సైతం సులభంగా వెళ్లడం మొదలవడంతో యాజమాన్యం అధిక లాభాలను కళ్లజూస్తోంది. '' మేం సొంతంగా ఎంతో ఖర్చు పెట్టాం. గతంలో పోలిస్తే ఆదాయం 55 శాతం పెరగడానికి గతంలో మేం పెట్టిన పెట్టుబడులే కారణం'' అని కాలువ మాజీ అడ్మినిస్ట్రేటర్ జార్జ్ లూయిస్ క్విజానో తేల్చిచెప్పారు. '' కాలువ మా దేశంలో, దేశభక్తిలో అంతర్భాగం. దీనిపై యాజమాన్య హక్కులు మాకే దక్కుతాయి'' అని పనామా దేశస్తులు తెగేసి చెబుతున్నారు. అధ్యక్ష ఎన్నికలప్పుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ఆగ్రహించిన స్థానికులు పనామా సిటీలోని అమెరికా రాయబార కార్యాలయం వద్ద పెద్ద ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో అమెరికా ఈ కాలువను దక్కించుకోవాలంటే పెద్ద ఘర్షణ చెలరేగి అది అంతర్జాతీయ నౌకాయానంపైనా పెను ప్రభావం పడే ప్రమాదముంది.

అమెరికా నౌకలపై అధిక చార్జీలు

ఈ కాలువను వాణిజ్య అవసరాలకు అత్యధికంగా వాడుతున్న దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంది. తర్వాత చైనా, చిలీ, జపాన్, దక్షిణకొరియాలు అతిగా వాడుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా సరకు రవాణా నౌకలతోపాటు చాలా ప్రపంచదేశాలపై నిఘా కోసం, తమ మిత్రదేశాల్లో తమ స్థావరాలకు సైన్యాన్ని తరలించేందుకు యుద్ధనౌకలనూ ఇదే మార్గం గుండా పంపుతోంది. వినియోగం ఎక్కువగా ఉండటంతో అమెరికాకు రాకపోకలు చార్జీలు ఎక్కువ అవుతున్నాయి. అయితే మాపైనే అధిక చార్జీలు మోపుతున్నారని ట్రంప్ వాదిస్తున్నారు. అయితే తన వాదనలకు బలం చేకూర్చే ఆధారాలను ఆయన బయటపెట్టలేదు. పైగా చైనా రహస్యంగా ఈ కాలువ నిర్వాహణ యాజమాన్య హక్కులు పొందిందని ట్రంప్ ప్రధాన ఆరోపణ. కాలువను పనామా దేశం శాశ్వతంగా సొంతంగా మాత్రమే నిర్వహించుకోవాలన్న ' టోరిజోస్-కార్టర్' ఒడంబడికను పనామా కాలదన్నిందని, తటస్థ వైఖరికి తిలోదకాలు ఇచ్చిందని అమెరికా ఆరోపిస్తోంది. కష్టపడి తవ్విన తమకే అధిక చార్జీల వాత పెడుతూ, శత్రుదేశం చైనాకు నిర్వహణ హక్కులు కట్టబెట్టారని ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. అందుకే ఎలాగైనా సరే పనామా కాలువపై యాజమాన్య హక్కులను తిరిగి సంపాదిస్తామని ప్రమాణస్వీకారం రోజే ట్రంప్ ప్రకటించారు. 13 ఏళ్ల పాటు సుదీర్ఘ చర్చల తర్వాత 1977లో నాటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్, పనామా పాలకుడు ఒమర్ టోరిజోస్‌కు పనామాకాలువ బాధ్యతలు అప్పగించారు.

అతిత్వరలోనే పుతిన్‌తో మాట్లాడుతా: ట్రంప్

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అతి త్వరలోనే సంభాషించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లో యుద్ధం వివాద పరిష్కారానికి అవసరమైన సాయం అందజేస్తానన్నారు. విస్తృతమైన అంశాలపై అమెరికాతో చర్చలకు సిద్ధమంటూ పుతిన్ చేసిన ప్రకటనపై ఆయన ఈ మేరకు స్పందించారు. 'ఆయన మాట్లాడాలనుకుంటున్నారు. త్వరలోనే ఆయనతో మాట్లాడుతా. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో ఇప్పటికే పలుమార్లు మాట్లాడా. ఆయన శాంతిని కాంక్షిస్తున్నారు. యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారు. పుతిన్ కూడా త్వరలోనే యుద్ధం ముగియాలనుకుంటున్నారనుకుంటున్నా'అని శనివారం మీడియాతో వ్యాఖ్యానించారు. 'అది జరగకూడని యుద్ధం. దీనిని ఆపే విషయంలో సాయం చేయాలనుకుంటున్నా'అన్నారు. అదేవిధంగా, మొట్టమొదటి విదేశీ పర్యటన సౌదీ అరేబియాలోనా లేక యూకేలోనా అన్న ప్రశ్నకు ఆయన.. ఈ రెండింట్లో ఏదైనా కావచ్చు. ఆనవాయితీ ప్రకారం చూస్తే మటుకు యూకేనే. గతంలో మొట్టమొదటగా సౌదీలోనే పర్యటన జరిపా. అప్పట్లో వాళ్లు భారీగా ఆయుధాలు తదితరాలు కొనుగోలు చేసినందున అక్కడికే వెళ్లా. ఈసారీ వాళ్లు కొంటే మళ్లీ అక్కడికే మొదటగా వెళ్తా'అని చెప్పారు. వచ్చే 24 గంటల్లోనే బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్‌తో మాట్లాడుతానన్నారు.

8 ఏళ్లలో మొదటిసారిగా అఫ్గాన్-ఇరాన్ చర్చలు

కాబూల్: ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ఆదివారం అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ అధికారులతో చర్చలు జరిపారు. రెండు దేశాల సరిహద్దు వివాదం, ఇరాన్‌లోని అఫ్గాన్ శరణార్థులను వెనక్కి పంపించడం హెల్మాండ్ నదీ జలాల ఒప్పందం అమలుపై తాత్కాలిక ప్రధానమంత్రి హస్సన్ అఖుండ్‌తో మాట్లాడారు. తమదేశంలో ఉన్న సుమారు 35 లక్షల మంది అఫ్గాన్ శరణార్థులను వెనక్కి పంపిస్తామని, అఫ్గాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తమకే మాత్రం లేదని అబ్బాస్ చెప్పినట్లు అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రాట్ చెప్పారు. అయితే, స్వల్ప సమయంలో వారంతా తిరిగొస్తే సదుపాయాలు కల్పించే స్తోమత లేదని అఖుండ్ చెప్పారని అన్నారు.

ప్రపంచ పర్యాటకం కళకళ

గత ఏడాది పర్యటనల్లో బిజీగా 140 కోట్ల మంది
నివేదించిన ఐరాస ప్రపంచ పర్యాటక సంస్థ

2024 సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా జనం పర్యాటనల్లో మునిగిపోయారని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ పర్యాటక సంస్థ(యూఎన్‌డబ్ల్యూటీఓ) ప్రకటించింది. గత ఏడాది ఏకంగా 140 కోట్ల మంది జనం పర్యటనల్లో బిజీగా మారారని యూఎన్‌డబ్ల్యూటీఓ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2019 డిసెంబర్‌లో మొదలైన కోవిడ్ సంక్షోభం దెబ్బకు కుదేలైన ప్రపంచ పర్యాటకం మళ్లీ నాలుగేళ్ల తర్వాత 99 శాతం పుంజుకోవడం విశేషం. 2014 ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు ఏకంగా రూ.172 లక్షల కోట్లు ఖర్చుచేశారని తేలింది. ప్రపంచవ్యాప్తంగా సగటున ఒక్కో పర్యాటకుడు గత ఏడాది మొత్తంలో పర్యాటకం కోసం దాదాపు రూ.86,000 ఖర్చుచేశాసినట్లు స్పష్టమైంది.

ఎక్కువ ఎక్కడికి వెళ్లారు?

గణాంకాల ప్రకారంచూస్తే అత్యధికంగా 74.7 కోట్ల మంది జనం యూరప్ దేశాల్లో పర్యటించారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ జెండా ఎగరేసి యుద్ధంలో మునిగిపోవడంతో పర్యాటకులు ఉక్రెయిన్, రష్యా వాటి సమీప దేశాల రీజియన్‌లో సందర్శనలపై ఆసక్తి కనబరచలేదు. దేశాలవారీగా చూస్తే ఫ్రాన్స్‌కు అత్యధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. ఫ్రాన్స్ పర్యాటక బోర్డ్ తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది ఆ దేశానికి 10 కోట్ల మంది పర్యాటకులు వచ్చారు. ఆ తర్వాత స్పెయిన్‌లో 9.8 కోట్ల మంది పర్యాటకులు వచ్చారు. ''అత్యధిక సందర్శకులతో ఫ్రాన్స్ చరిత్ర సృష్టించింది. 2024 సమ్మర్ ఒలింపిక్స్, పారిస్‌లో ప్రఖ్యాత నోట్రే డేమ్ క్యాథడ్రల్ చర్చి పునఃప్రారంభం, రెండో ప్రపంచయుద్ధంలో నార్మాండీపై దాడుల ఘటనకు 80 ఏళ్లు పూర్తవడంతో జరిగిన కార్యక్రమాలను చూసేందుకు ఏడాది పొడవునా భారీగా జనం తరలివచ్చారు''అని ఫ్రాన్స్ అభిప్రాయపడింది. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో 31.6 కోట్ల మంది పర్యటించారు.

స్పెయిన్‌లో విభిన్న పరిస్థితి

''మా ప్రాంతానికి రండిబాబు. పర్యటించి ఇక్కడి వ్యాపారాన్ని పెంచండి''అనే రాష్ట్రాలు, దేశాలనే మనం చూశాం. అందుకు భిన్నంగా స్పెయిన్ వ్యవహరించినా మళ్లీ అదే దేశానికి జనం వరసకట్టడం గమనార్హం. సెవిల్లే సిటీలోని ప్లాజా డీ ఎస్పానా వంటి ప్రాంతాలు పర్యాటకులతో కిక్కిరిసి పోవడంతో అక్కడి స్థానిక యంత్రాంగం అక్కడ ఎవరు పర్యటించినా చార్జీలు వసూలుచేస్తామని హెచ్చరించింది. 1929 నిర్మించిన అక్కడి ప్రాంతంలో జనం, వ్యాపారాలు పెరిగిపోయి వీధివ్యాపారుల ఆక్రమణలు అధికమై, పాత కట్టడాలు దెబ్బతింటున్నాయని నగర మేయర్ జోస్ లూయిజ్ శాంజ్ చెప్పారు. ఇటలీలో వెనీస్, ఫ్లోరెన్స్ నగరాల్లో బృంద పర్యాటకాలపై నిషేధం, రాత్రిళ్లు బీచ్‌లలో ఈతకొట్టడంపై నిషేధాజ్ఞలున్నాసరే ఆ దేశంలో పర్యాటకం గతంతో పోలిస్తే 23 శాతం పెరిగింది.



ఆశ్చర్యపరిచిన చిన్న దేశాలు

భారత్‌తో పోలిస్తే అధిక మండే ఎండలుంటే ఖతార్‌లో అత్యధిక మంది సందర్శకులు వచ్చారు. అక్కడ గతంతో పోలిస్తే పర్యాటకుల సంఖ్య 137 శాతం పెరగడం విశేషం. గత ఏడాది అత్యుత్తమ ఎయిర్‌లైన్స్‌గా ఖతార్ ఎయిర్‌లైన్స్ నిలిచింది. దోహాలోని హమాద్ విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్ట్ కిరీటాన్ని సాధించింది. ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అత్యంత చిన్న దేశం అండోర్రాలోనూ పర్యాటకుల రద్దీ పెరిగింది. డొమెనికన్ రిపబ్లిక్, కువైట్, అల్బేనియా, ఎల్ సాల్వడార్ వంటి చిన్న దేశాలకూ పెద్ద సంఖ్యలో సందర్శకులు క్యూ కట్టడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్



1950లో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న సుకర్ణో

తొలి గణతంత్ర వేడుక... ఆంఫీ థియేటర్‌లో

నాడూ ఇండొనేసియా అధ్యక్షుడే ముఖ్య అతిథి

న్యూఢిల్లీ: కర్తవ్యపథ్‌గా మారిన ఒకప్పటి రాజ్‌పథ్‌లో చాన్నాళ్లుగా గణతంత్ర వేడుకలను అంగరంగవైభవంగా జరుపుకుంటున్నాం. అయితే తొలి గణతంత్ర వేడుకలు మాత్రం రాజ్‌పథ్‌లో జరగలేదు. ప్రఖ్యాత ఇర్విన్ ఆంఫీ థియేటర్ వాటికి వేదికవడం విశేషం. ఇప్పుడు ఉదయాన్నే పరేడ్ మొదలవుతోంది గానీ నాటి వేడుకలను మధ్యాహ్నం వేళ నిర్వహించారు. వాటికి ఇండొనేసియా తొలి అధ్యక్షుడు సుకర్ణో విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈసారి కూడా ఆ దేశాధినేత ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరవడం విశేషం. తొలి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనాడు జనవరి 26 రాత్రి ఢిల్లీలోని ప్రముఖ ప్రాంతాలు, కట్టడాలు, భవంతులు, కూడళ్ల వద్ద రంగురంగుల విద్యుత్‌దీపాలను వెలిగించి ప్రజలు సంబరాలు చేసుకున్నారు. నాటి వేడుకలను నాడు ఫౌజీ అఖ్బర్‌గా వెలువడిన నేటి సైనిక్ సమాచార ఫిబ్రవరి నాలుగున ఒక ఆర్టికల్‌లో విపులీకరించింది. '' ఇప్పుడు రాష్ట్రపతిభవన్‌గా పిల్చుకుంటున్న ఒకప్పటి గవర్నమెంట్ హౌజ్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 1950 జనవరి 26 ఉదయం సరిగ్గా 10 గంటల 18 నిమిషాలకు గణతంత్ర దేశంగా భారత్ అవతరించింది. సరిగ్గా ఆరు నిమిషాల తర్వాత డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తొలి భారత రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు. భారత్ గణతంత్ర దేశంగా పురుడుపోసుకుని, తొలి రాష్ట్రపతిని కొలువుతీర్చుకున్నందుకు గుర్తుగా ఉదయం 10.30 గంటలకు 31 తుపాకులతో గన్‌సెల్యూట్ చేశారు. ఆద్యంతం అద్భుతంగా సాగిన ఈ కార్యక్రమంలో నాటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి పదవి నుంచి దిగిపోతూ '' ఇండియా అంటే భారత్.. ఇప్పుడు గణతంత్ర దేశంగా అవతరించింది'' అని తొలిసారిగా సభాముఖంగా ప్రకటించారు. తర్వాత రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ తొలుత హిందీలో ఆ తర్వాత ఇంగ్లిష్‌లో తొలి ప్రసంగం చేశారు. '' అత్యంత సుదీర్ఘమైన మన ప్రస్థానంలో ఈరోజు తొలిసారిగా కశ్మీర్ నుంచి దక్షిణాన కేప్ కొమోరన్ దాకా, పశ్చిమాన కథియావాడ్, కఛ్ నుంచి కామ్‌రూప్ దాకా భారతావని భూభాగం మొత్తం ఒకే రాజ్యాంగ నీడన చేరాయి'' అని ఆయన వ్యాఖ్యానించారు. మధ్యాహ్నం వేళ పరేడ్ చూసేందుకు గవర్నమెంట్ హౌజ్ నుంచి రాష్ట్రపతి సరిగ్గా 2.30 గంటలకు ఆరు ఆస్ట్రేలియా గుర్రాలు లాగుతున్న 35 ఏళ్ల పాత బగ్గీలో ఆంఫీథియేటర్‌కు అత్యంత ఠీవీగా వచ్చారని నాటి ఫౌజీ అఖ్బర్ మేగజీన్ రాసింది.

కొరియా క్షిపణి ప్రయోగం

సియోల్: క్రూయిజ్ క్షిపణి వ్యవస్థను పరీక్షించినట్లు ఆదివారం ఉత్తర కొరియా ప్రకటించింది. తమ దేశం లక్ష్యంగా అమెరికా-దక్షిణ కొరియా చేపట్టిన సైనిక విన్యాసాలకు దీటుగా బదులిచ్చినట్లు తెలిపింది. ఉత్తర కొరియా నేత కిమ్‌తో సమావేశమవ్వాలనుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో ఈ పరిణామం సంభవించడం గమనార్హం. సముద్రం నుంచి భూమిపైకి చేపట్టిన ఈ గైడెడ్ క్షిపణి 1,500 కిలోమీటర్లు ప్రయాణించి లక్ష్యాలను ఛేదించిందని అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ తెలిపింది. ప్రయోగాన్ని అధ్యక్షుడు కిమ్ తిలకించారని పేర్కొంది.

భిన్నత్వాన్ని గౌరవించండి: భాగవత్

ముంబై: భిన్నత్వాన్ని గౌరవించాలని,సామరస్య జీవనానికి ఐక్యత కీలకం కావాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని భివాండీ పట్టణంలోని ఓ కళాశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల జెండా ఎగురవేసిన అనంతరం భాగవత్ మాట్లాడారు. ఇది కేవలం రిపబ్లిక్ డే కాదు, దేశం పట్ల మన బాధ్యతలను గుర్తు చేసే సందర్భం కూడా అని అన్నారు. వైవిధ్యం కారణంగా మన దేశం వెలుపల ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. కానీ, మనం వైవిధ్యాన్ని మన జీవితంలో ఒక భాగంగా మార్చుకున్నాం. మనలో ఎవరికి వారికి కొన్ని ప్రత్యేకతలు ఉండొచ్చు గాక, అదేసమయంలో మనం మంచిగా మెలగాలి. మనం జీవించాలనుకుంటే సామరస్యంతోనే ఉండాలి 'అని భాగవత్ అన్నారు.

పద్ధతిగా వస్తేనే ప్రయాణం



- లేదంటే విమానం ఎక్కనివ్వం
- స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కఠిన నిబంధనలు

వాషింగ్టన్: అర్థంపర్థం లేని టాటూలు, అసభ్యకర దుస్తులతో విమానంలో ప్రయాణిస్తామంటూ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ విమానాల్లో ఇకపై కుదరదు. ఆ మేరకు తాజాగా సంస్థ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. వివాదాస్పద కొటేషన్లున్న టీ షర్టులు ధరించినా ఒప్పుకోబోమని వెల్లడించింది. ఒక పద్ధతి ప్రకారం, హుందాతనం ఉట్టిపడేలా దుస్తులు ధరించాలని తేల్చిచెప్పింది. తోటి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా వస్త్రధారణ ఉండాలని సూచించింది. '' ఇష్టమొచ్చిన దుస్తుల్లో ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి మా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కుతామంటే కుదరదు. పద్ధతిగా బట్టలుండాలి. అందాల ఆరబోతకు అవకాశం ఇవ్వబోము. నిండుగా దుస్తులు ధరిస్తే మరీ మంచిది. చెప్పులు, షూ లేకుండా ఎలాంటి పాదరక్షలు ధరించకుండా వస్తామంటూ ఊరుకోం. ముఖ్యంగా అమ్మాయిల దుస్తులు మరీ పల్చగా, లోదుస్తులు కనిపించేంత పారదర్శకమైన డ్రెస్సింగ్‌లో వస్తే అస్సలు ఒప్పుకోం'' అని స్పిరిట్ ఎయిర్‌లైన్స్ పలు నియమనిబంధనలను ప్రకటించింది. '' పిచ్చిపిచ్చి టాటూలు, రాతలు, కొటేషన్లు, వివాదాస్పద వస్తువులు ధరించి వచ్చినా విమానం లోపలికి అనుమతించబోం. కనీసం బోర్డింగ్ పాస్ ఇవ్వం. ఇలా వచ్చినవారిని కుదిరితే ఎయిర్‌పోర్ట్ నుంచి కూడా వెనక్కి పంపేస్తాం'' అని యాజమాన్యం స్పష్టంచేసింది. ఆధునికత పేరిట మరీ పొట్టిపొట్టి దుస్తులు ధరిస్తూ అమ్మాయిలు తోటి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్న ఘటనలు తరచూ అమెరికా విమానాశ్రయాల్లో సంభవిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకే ఇలాంటి నియామవళిని ఈ సంస్థ అమల్లోకి తెచ్చింది. గత అక్టోబర్‌లో తారా కెహిదీ అనే అమ్మాయి మరీ పొట్టిగా ఉన్న క్రాప్ టాప్ ధరించి రావడంతో అందరూ ఆ అమ్మాయి వంకే చూడటం మొదలెట్టారు. ఇది గమనించిన ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఆమెను అడ్డుకోవడం, తదనంతరం నానా హంగామా జరగడం తెల్సిందే. 2019లో అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కిన లాటిసా తిషా రోవే అనే అమ్మాయి అందాల ఆరబోత అతిగా ఉన్న స్ట్రాప్‌లెస్ రోంపర్ ధరించి ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. దీంతో అక్కడ ఉన్న ఇతర ప్రయాణికులు ఆమెను దూషించడం, కొందరు యువకులు ఆమెను ఎగతాళిచేయడం తెల్సిందే. ఈ ఉదంతంలో చివరకు ఎయిర్‌లైన్స్ సంస్థే ఆ అమ్మాయికి క్షమాపణ చెప్పింది. అమ్మాయి వస్త్రధారణకు చివరకు ఎయిర్‌లైన్స్ క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఇలాంటి పరిస్థితులు రాకూడదన్న ముందు జాగ్రత్తతో స్పిరిట్ ఎయిర్‌లైన్స్ ఇలా కఠిన నియమాలను అమల్లోకి తెచ్చింది.

సాక్షి ప్లస్
సోమవారం : 27-1-2025

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అనాదిగా మానవుడికి ప్రకృతితో విడదీయలేని బంధం ఉంది. అతడు పర్యావరణంతో మమేకమై జీవిస్తాడు. పర్యావరణమే జీవరాశికి ప్రాణాధారం. అనేక అవసరాలు తీర్చడానికి, మానసిక వికాసానికి ప్రకృతి ఒక వరం లాంటిది. మానవ మనుగడకు మూలాధారం ప్రకృతే అనే మౌలిక వాస్తవాన్ని విస్మరించి ఆధునిక మానవుడు పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నాడు. తాను కూర్చున్న కొమ్మను తానే నరికేస్తున్నాడు. పర్యావరణ వినాశనం వల్ల మానవుడి మనుగడ అసాధ్యం. కాబట్టి పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యం. ఇది ఏ ఒక్క వ్యక్తికో, దేశానికో సంబంధించిన సమస్య కాదు. దీని కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాల్సి ఉంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
సోషియాలజీ

పర్యావరణ ఉద్యమాలు

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను దశాబ్దాల కిందటే గుర్తించినా ఇప్పటివరకూ ఈ దిశగా సరైన చర్యలు తీసుకోలేదు. దీని కోసం అనేక మంది ఉద్యమాలు చేస్తున్నారు. 1945 నుంచే భూ గోళం పర్యావరణ సంక్షోభంలోకి ప్రవేశించింది. ప్రజలు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రకృతిపై అన్ని వైపుల నుంచి దాడి ప్రారంభించారు. ప్రారంభంలో పరిశ్రమల స్థాపన, తర్వాత శాస్త్ర సాంకేతిక విప్లవం, ఇటీవల ప్రపంచీకరణ పర్యావరణ పతనానికి దారితీశాయి. అడవులను నరికి విస్తారమైన వ్యవసాయ క్షేత్రాలను ఏర్పరచడం కూడా పర్యావరణ సమతౌల్యం దెబ్బతినడానికి కారణమైంది. నూతన పారిశ్రామికాభివృద్ధి, శాస్త్ర విజ్ఞానం ఫలితంగా సింథటిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగింది. ఈ సింథటిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుంది. ఇలాంటి ఉత్పత్తులన్నీ ప్రకృతికి విఘాతం కలిగిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ విస్తరించేకొద్దీ మానవుల కార్యకలాపాలు ప్రకృతికి విరుద్ధంగా పరిణమిస్తున్నాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం నాశనం అవుతోంది.

పూర్వకాలంలో మానవుల అవసరాలు పరిమితంగా ఉండేవి. వారు ప్రకృతి వనరులను తక్కువగా వినియోగించేవారు. అందువల్ల పర్యావరణ సమతౌల్యం మెరుగ్గా ఉండేది. ప్రస్తుతం విలాసవంతమైన జీవితం, సంపద కోసం ప్రకృతి వనరులపై ఒత్తిడి పెరిగింది. అవసరానికి మించి ప్రకృతి వనరులను వినియోగించడం వల్ల భావి తరాల జీవితం ప్రశ్నార్థకమయ్యే దుస్థితి తలెత్తింది. అమెరికా పర్యావరణ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ గోల్డ్ స్మిత్ పేర్కొన్నట్లు అనేక అవసరాల కోసం తాను ఆధారపడే ప్రకృతిని ఆధునిక మానవుడు వేగంగా నాశనం చేస్తున్నాడు. అడవుల్లో బంజరు భూములను దుర్వినియోగం చేస్తున్నారు. పగడాల దీవులను విచక్షణా రహితంగా తవ్వేస్తున్నారు. పంట పొలాలు నాశనమై చౌడు భూములుగా, ఎడారులుగా మారుతున్నాయి. కాలుష్య సమస్య తీవ్రమైంది. ప్రస్తుతం ప్రతి జీవి శరీరంలోనూ పారిశ్రామిక, వ్యవసాయ రసాయనాలు కేన్సర్ కారకాలుగా పరిణమిస్తున్న అంశాన్ని గమనిస్తే.. దీని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యావరణం అంటే..?

ఒక జీవి లేదా జీవరాశుల చుట్టూ ఉన్న పరిసరాలు (గాలి, నేల, నీరు, జీవ సమూహాలు), వాటి స్థితిగతుల మొత్తాన్ని కలిపి 'పర్యావరణం' అంటారు. ఆంగ్లంలో దీన్ని 'ఎన్విరాన్‌మెంట్' అంటారు. ఇది ఫ్రెంచి భాషా పదమైన 'ఎన్విరాన్' నుంచి ఆవిర్భవించింది. ఫ్రెంచిలో 'ఎన్విరాన్' అంటే 'ఆవరణం – చుట్టూ ఉన్న ప్రదేశం' అని అర్థం.

పర్యావరణం - మూలకాల సంఘటనం

ప్రకృతిలోని పంచభూతాలు మానవుడికి పంచ ప్రాణాల లాంటివి. గాలిలో, నీటిలో, భూమిపై ఉండాల్సిన మూలకాలు తగిన నిష్పత్తిలో లేకపోతే మానవుడికి ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. అలాంటి వాటి గురించి తెలుసుకుందాం..

కార్బన్ డై ఆక్సైడ్

వాతావరణంలో మానవుడికి పెద్దగా అవసరం లేని కార్బన్ డై ఆక్సైడ్ అధికంగా ఉండగా, అత్యవసరమైన ప్రాణవాయువు (ఆక్సిజన్) తక్కువ పరిమాణంలో ఉంది. దీంతో పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటోంది. ఇది మానవులకు హానికరంగా తయారైంది. సూర్యుడి నుంచి వచ్చే కాంతి, అందులో ఉండే అతినీల లోహిత రేడియో ధార్మికత భూ వాతావరణం ద్వారా నేలను చేరి, దాన్ని వేడెక్కిస్తాయి. ఈ వేడిమి శక్తి తిరిగి పరారుణ రేడియో ధార్మికత రూపంలోకి పరావర్తనం చెందుతుంది. అయితే వాతావరణంలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి, మరికొన్ని వాయువులు దీన్ని కొంత మేర గ్రహించి భూ ఉపరితలం వేడిగా ఉండేట్లు చేస్తాయి. ఇది కొంతమేర ఉండటం మేలు చేస్తుంది. కానీ వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయికి మించితే భూతాపం పెరుగుతుంది. దీన్నే 'గ్రీన్ హౌస్ ప్రభావం' అంటారు. నిత్యం బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువులను మండించడం వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి, సల్ఫర్ డై ఆక్సైడ్ (SO_2) లాంటి వాయువుల స్థాయి పెరిగిపోతోంది. పారిశ్రామిక విప్లవానికి ముందు 260 PPMV(పార్ట్స్ పర్ మిలియన్ బై వాల్యూం) మేర ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ప్రస్తుతం 370 PPMVకి చేరింది. ఈ శతాబ్దాంతానికి దీని స్థాయి 500 PPMVకి చేరొచ్చునని ఆందోళన చెందుతున్నారు. అడవుల నరికివేత వల్ల కూడా ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. భారతదేశ విస్తీర్ణంలో భౌగోళికంగా 33 శాతం అడవులు ఉండాలి. ప్రస్తుతం వీటి విస్తీర్ణం 23 శాతంగా ఉంది.

మిథేన్

మిథేన్‌కు పరారుణ కాంతిని గ్రహించే సామర్థ్యం చాలా ఎక్కువ. వాతావరణంలో ఇది స్వల్పంగానే ఉన్నా దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పారిశ్రామిక విప్లవానికి ముందు వాతావరణంలో ఇది 600 PPBV మేర ఉండేది. ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ 1950 నాటికి 1300 PPBVకి, 1990 నాటికి 1700 PPBVకి పెరిగింది.

నీరు నిల్వ ఉండే సాగు విధానం, ఈ వాయువును విడుదల చేసే పేడ లాంటి పదార్థాలు పెరగడం, శిలాజ ఇంధనాల వాడకం ఈ వాయువు అధికమవడానికి కారణాలు. మిథేన్ వాతావరణంలోకి ఒకసారి చేరితే గరిష్ఠంగా పదేళ్లు ఉంటుంది.

క్లోరో ఫ్లోరో కార్బన్లు (CFC)

వాతావరణంలో వీటి ఉనికి ఇటీవల విపరీతంగా పెరిగింది. ఫ్రిజ్‌లు, బెడ్‌ల కోసం ఉపయోగించే ఫోమ్, అగ్నిమాపక రసాయనాల లాంటి వాటి వాడకం పెరగడమే దీనికి కారణం. 1950లో 'సున్నా'గా ఉన్న CFC–11 లేదా R-11 (chloro fluoro methane) 1984 నాటికి 3 లక్షల టన్నులకు చేరింది. 1984 నుంచి CFC–11 క్రమంగా పెరుగుతూ వస్తోంది. 1940లో సున్నాగా ఉన్న CFC–12 లేదా R-12 లేదా freon-12 (DiChloro fluoro methane) పరిమాణం 1984 నాటికి నాలుగు టన్నులకు చేరింది.

నైట్రస్ ఆక్సైడ్

దీన్ని 'లాఫింగ్ గ్యాస్' అంటారు. శిలాజ ఇంధనాలను మండించడం, అమ్మోనియా ఎరువుల వినియోగం, అడవుల నరికివేత లాంటి కారణాల వల్ల వాతావరణంలో నైట్రస్ ఆక్సైడ్ పరిమాణం పెరుగుతోంది. పారిశ్రామికీకరణకు ముందు 275 PPBVగా ఉన్న నైట్రస్ ఆక్సైడ్ 1992 నాటికి 311 PPBVకి పెరిగింది.

ఏరోసాల్స్ (Aerosols)

వాతావరణంలో ఉండే చిన్నపాటి ఘన, ద్రవ రేణువులనే ఏరోసాల్స్ అంటారు. వీటి పరిమాణం పెరిగితే భూమి నుంచి విశ్వంలోకి వెళ్లే రేడియో ధార్మికతను ఇవి అడ్డుకుంటాయి. తద్వారా భూతాపం పెరుగుతుంది. ఈ ఏరోసాల్స్ వల్ల ఓజోన్ పొర క్షీణిస్తుంది. శిలాజ ఇంధనాలను మండించడం, పారిశ్రామిక ఉద్గారాల వల్ల పొగ, ధూళి రేణువులు పెరిగి వాతావరణంలో ఏరోసాల్స్ పరిమాణం అధికం అవుతోంది. ఈ విధంగా వాతావరణంలో వివిధ వాయువుల పరిమాణం అధికమవడం వల్ల 'గ్లోబల్ వార్మింగ్' పెరుగుతోంది. భూగోళంపై ఉష్ణోగ్రత పెరగడం వల్ల గాలి, నీరు, నేల సమతౌల్యం కోల్పోతున్నాయి. దీంతో జీవరాశులన్నింటి మనుగడ దుర్భరమవుతోంది. కాలుష్యాల సాంద్రత, కాలుష్యీకరణ తీవ్రత ఇలాగే కొనసాగితే ప్రపంచ భౌగోళిక ప్రవృత్తుల్లో తీవ్రమైన అనుత్క్రమణీయ (Irreversible) మార్పులు సంభవిస్తాయి. మనల్ని మనం కాపాడుకోవాలంటే పర్యావరణ పరిరక్షణ చేపట్టాల్సిందే.

ప్రముఖుల నిర్వచనాలు

జీవులు, పరిసరాలకు మధ్య ఒక నిర్దిష్ట సమన్వయ సహకారం ఉంటుంది. ఈ జీవ, నిర్జీవ అంశాల సమన్వయ సహకార సంక్లిష్టతనే 'పర్యావరణం'గా పేర్కొనవచ్చు.- **టాలెమీ**

'మన చుట్టూ ఆవరించి ఉన్న భౌతిక రసాయనిక, జీవ రసాయనిక అంశాల మధ్య ఉన్న సమన్వయ సహకార సమ్మేళన వ్యవస్థీకృత స్వరూపాన్ని 'పర్యావరణం' అంటారు. - **ఓడమ్**

పర్యావరణ వాదం

పర్యావరణాన్ని సంరక్షించడం, పునరుద్ధరించడం లేదా మెరుగుపర్చడంపై శ్రద్ధ కలిగి ఉండటాన్ని 'పర్యావరణ వాదం' అంటారు. పర్యావరణ ప్రాముఖ్యాన్ని గుర్తించి వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. పర్యావరణాన్ని రక్షించడానికి కృషి చేయడాన్నే 'పర్యావరణ వాదం'గా పేర్కొంటారు. యూరప్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, తీవ్రమవుతున్న కాలుష్యానికి ప్రతిచర్యగా దీన్ని ప్రారంభించారు.


1949లో 'ఆల్డో లియోపాల్డ్' అనే అమెరికన్ పర్యావరణవేత్త "A Sand County Almanac" అనే పుస్తకంలో పర్యావరణ కాలుష్యం వల్ల మానవ సమాజం ఎదుర్కొనే సమస్యలను ఎత్తి చూపారు. ఈ గ్రంథం 20వ శతాబ్దంలో పర్యావరణ వాదాన్ని విశేషంగా ప్రభావితం చేసింది. అమెరికాకు చెందిన జీవ శాస్త్రవేత్త 'రేచల్ కార్సన్' 1962లో 'సైలెంట్ స్ప్రింగ్' అనే పుస్తకం రాశారు. ఇందులో డి.డి.టి.(dichloro diphenyl trichloroethane), ఇతర పురుగు మందుల వాడకం కేన్సర్‌ను కలిగిస్తుందని, వ్యవసాయంలో వీటిని వినియోగించడం వల్ల వన్యప్రాణులకు.. ముఖ్యంగా పక్షులకు ప్రమాదం ఏర్పడుతోందని ఆమె పేర్కొన్నారు. దీని ప్రభావంతో 1970లో 'యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ'ని స్థాపించారు. ఇది 1972లో అమెరికాలో డి.డి.టి.ని నిషేధించడంలో ప్రధాన పాత్ర పోషించింది. ఈ పుస్తకం వల్ల పర్యావరణ అంశాలపై శ్రద్ధ పెరిగి 'గ్రీన్ పీస్', 'ఫ్రెండ్స్ ఆఫ్ ద ఎర్త్' లాంటి స్వచ్ఛంద సంస్థలు ఆవిర్భవించడానికి నాంది పడింది.

1973లో Endangered Species Act, 1975లో Convention on International Trade in Endangered Species (CITES) ఏర్పడటంతో పర్యావరణ వాదం మరింత ప్రభావవంతమైంది. 1972లో యూఎన్‌వో ఆధ్వర్యంలో 'స్టాక్ హోం'లో జరిగిన 'మానవుడు – పర్యావరణం' అనే అంశంపై నిర్వహించిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో 114 దేశాలు పాల్గొన్నాయి. ఈ సమావేశం ఫలితంగా 'యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్' ప్రారంభమైంది. పర్యావరణ పరిరక్షణ కోసం 'నేషనల్ వైల్డ్ లైఫ్ ఫెడరేషన్', 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' (డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్.) లాంటి సంస్థలు ప్రారంభమయ్యాయి. జూన్-5ను 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'గా యావత్ ప్రపంచం పాటించాలని 1972లో యూఎన్‌వో ప్రతిపాదించింది.

'యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్' (యూఎన్ఈపీ) ఆధ్వర్యంలో గ్రీన్ హౌస్ వాయువుల నియంత్రణ కోసం 1982లో 'ధరిత్రీ సదస్సు' నిర్వహించారు. 1997లో క్యోటో ప్రోటోకాల్ వెలువడింది. 2007లో బాలిలో నిర్వహించిన సదస్సు, 2009లో జరిగిన కొపెన్‌హెగన్ సదస్సులో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.2015 డిసెంబర్‌లో పారిస్‌లో నిర్వహించిన కాప్-11 సదస్సులో 2100 నాటికి భూతాపాన్ని రెండు డిగ్రీల కంటే తక్కువకు తగ్గించడానికి 195 దేశాలు అంగీకారం కుదుర్చుకున్నాయి.

వర్థమాన దేశాలకు 2020 నుంచి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు ఏటా వంద బిలియన్ డాలర్ల మేర సమకూర్చడానికి కూడా ఒప్పందం కుదిరింది.

ఖండాల భూపటలాన్ని ఏమని పిలుస్తారు?



భూపటలం - శిలలు

సగటున సుమారు 30 కిలోమీటర్ల మందం కలిగిన భూగోళం బాహ్య పొరను 'పటలం' అంటారు. పటలం వివిధ రకాల శిలలతో కూడిన దృఢమైన పొర. ఈ శిలలు అనేక ఖనిజాలతో ఇమిడి ఉంటాయి. పటలంలో ప్రధానంగా తేలికైన సిలికాన్, అల్యూమినియం మూలకాలు కేంద్రీకృతమై ఉంటాయి. అందువల్ల పటలాన్ని 'సియాలిక్' పొరగా కూడా పిలుస్తారు. పటలం సాంద్రత సుమారుగా 2.7. ఇది భూగోళ సగటు సాంద్రత (5.5) కంటే చాలా తక్కువ. పటలం దృఢంగా ఉన్నప్పటికీ.. అవిచ్ఛిన్న పొర మాత్రం కాదు. పటలం అనేక చిన్నా పెద్ద ముక్కలుగా విభజించి ఉంటుంది. ఈ ముక్కలను అస్మావరణ పలకలుగా వ్యవహరిస్తారు.అస్మావరణ పలకలు ఖండాలు, సముద్రాలను కలిగి ఉన్నాయి. పటలానికి చెందిన ఈ అస్మావరణ పలకలు కింద ఉన్న ఆస్థినో ఆవరణ పాక్షిక శిలా ద్రవంలో తేలియాడుతూ వివిధ దశల్లో చలిస్తున్నాయి. అంటే..ఖండాలు,సముద్రాలు వివిధ దశల్లో చలిస్తున్నాయన్నమాట! ఈ పలకల చలనం వల్ల పలకల మధ్య అపసరణ, అభిసరణ లేదా సమాంతర సరిహద్దులు ఏర్పడతాయి. ఈ పలకల సరిహద్దు మండలాల వద్దనే పర్వతోద్భవనం,అగ్నిపర్వత ప్రక్రియ, భూకంప ప్రక్రియ కేంద్రీకృతమై ఉంటుంది.

పటల శిలలు మూడు రకాలు

పటల శిలలను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి.. 1. అగ్ని శిలలు 2. రూపాంతర శిలలు 3. అవక్షేప శిలలు

పర్వతోద్భవనం, అగ్నిపర్వత, క్రమక్షయ ప్రక్రియల కారణంగా శిలల స్వభావం మారిపోయి కొత్త శిలలు ఏర్పడుతుంటాయి. శిలా చక్రంలో భాగంగా ఒక తరగతికి చెందిన శిలలు క్రమేపీ మరో రకానికి చెందిన శిలలుగా మార్పు చెందే అవకాశం ఉంది.

పటలంలో మొట్టమొదటగా ఏర్పడే అగ్ని శిలలను 'ప్రాథమిక శిలలు'గా పిలుస్తారు. పటల అంతర్భాగాల్లో అధిక ఉష్ణోగ్రత, పీడనాల వల్ల శిలలు పాక్షిక ద్రవ రూపంలో ఉంటాయి. ఈ పాక్షిక శిలా ద్రవాన్ని 'మాగ్మా' అంటాం. భూ ఉపరితలం పైకి ఉబికి వచ్చిన తర్వాత మాగ్మాను 'లావా'గా పిలుస్తారు. మాగ్మా లేదా లావా చల్లబడి క్రమంగా ఘనీభవించి అగ్ని శిలలు ఏర్పడతాయి. పటలం అంతర్భాగంలో అధిక లోతుల్లో మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే అగ్ని శిలలను 'ప్లుటానిక్ అగ్ని శిలలు'గా వ్యవహరిస్తారు. ఉపరితలానికి చేరే క్రమంలో మార్గ మధ్యంలోనే మాగ్మా ఘనీభవం చెందగా ఏర్పడే శిలలను 'హైప ర్ బేసల్ అగ్ని శిలలు'గా పిలుస్తారు. భూ ఉపరితలం పైకి లావా ఉద్భేదించిన తర్వాత ఘనీభవించగా ఏర్పడే శిలలను 'లావా శిలలు'గా అభివర్ణిస్తారు. గ్రానైట్, బసాల్ట్, గాబ్రో, డయరైట్, ఆండెసైట్ మొదలైనవి ప్రధాన అగ్ని శిలలు. అగ్నిశిలలు కఠినం గా, దృఢంగా ఉంటాయి. సచ్ఛిద్రంగా ఉండవు. వీటిలో శిలాజాలు ఏర్పడవు. అగ్ని శిలల్లో ప్రధానంగా ఫెర్రస్ జాతికి చెందిన లోహ ఖనిజాలు కేంద్రీకృతమై ఉంటాయి. పటల అంత ర్భాగంలోని శిలలు ప్రధానంగా అగ్ని శిలల తరగతికి చెందుతాయి.

భూ ఉపరితలం పైన పని చేసే బాహ్య బలాలు కఠిన పటల శిలలను శిథిలం చేస్తాయి. ఈ ప్రక్రియనే శిలా శైథిల్యం/ క్రమక్ష యంగా పిలుస్తారు. ప్రవహించే నదులు, హిమానీనదాలు, పవనాలు, సముద్ర వేలాతరంగాలు, భూగర్భ జల ప్రవాహాలు ప్రధానమైన బాహ్య బలాలు లేదా క్రమక్షయ కారకాలు. శిథిల శిలా పదార్థాలు నదీ హరివాణాలు, లోయలు, మైదానాలు, సముద్ర భూతలంపై నిక్షేపమై కాలక్రమేణ శిలలుగా రూపొందుతాయి. పై పొరల సంపీడనం వల్ల కింది పొరల్లోని శిలా శిథిలాలు క్రమంగా సంఘటితమై ఏర్పడే ఈ శిలలను అవక్షేప శిలలుగా పరిగణిస్తారు. ఇసుకరాయి, షేల్, సున్నపురాయి, కాంగ్లో మేరేట్ ప్రధాన అవక్షేప శిలల రకాలు. అవక్షేప శిలలు స్తరిత శిలల తరగతికి చెందుతాయి. ఇవి సచ్ఛిద్ర శిలలు. అవక్షేప శిలల్లో శిలాజాలు ఏర్పడతాయి. శిలాజాల వల్ల పురాభౌమ్య యుగంలో శీతోష్ణ స్థితి, సహజ ఉద్భిజ సంపద, జీవజాతుల సమాచారం లభ్యమవుతుంది. అవక్షేప శిలలు కఠినంగా కానీ లేక మృదువుగా కానీ ఉండవచ్చు. అవక్షేప శిలల్లో సాధారణంగానే అనేక పగుళ్లు ఉంటాయి. వివిధ తరగతులకు చెందిన శిలలు అధిక ఉష్ణోగ్రతలు, అధిక పీడనాలు లేదా రెండిటికీ లోనైనప్పుడు వాటి భౌతిక, రసాయనిక ధర్మాలు పూర్తిగా మార్పు చెంది ఏర్పడే సరికొత్త శిలలనే రూపాంతర శిలలుగా పిలుస్తారు. రూపాంతర శిలల మాతృక శిలలు అవక్షేప లేదా అగ్ని లేదా రూపాంతర శిలలుగా ఉండవచ్చు. అగ్ని పర్వత ప్రక్రియ లేదా పర్వతోద్భవన ప్రక్రియ సందర్భంగా ప్రధానంగా రూపాంతర శిలలు ఏర్పడతాయి. పటలంలో మాగ్మా ప్రవహిస్తున్నప్పుడు సమీపంలో శిలలు రూపాంతరం చెందుతాయి. పర్వతోద్భవన మండలంలో అధిక ఉష్ణోగ్రతలు, పీడనం కారణంగా రూపాంతర ప్రక్రియ సంభవిస్తుంది. అందువల్లే పలకల సరిహద్దుల వద్ద రూపాంతర ప్రక్రియ సర్వ సాధారణం. అవక్షేప శిలలైన షేల్, ఇసుకరాయి, సున్నపురాయి రూపాంతరం చెందడం వల్ల వరుసగా స్లేట్, క్వార్ట్జైట్, పాలరాయి వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. గ్రానైట్, గాబ్రొ వంటి అగ్ని శిలల రూపాంతరం వల్ల వరుసగా నీస్, ఫిల్లైట్ వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. స్లేట్, క్వార్ట్జైట్‌లు మర లా రూపాంతర ప్రక్రియకు లోనవడం వల్ల సిస్ట్, ఫిల్లైట్ వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. అవక్షేప శిలల్లో శిలాజ ఇంధన వనరులైన బొగ్గు, చమురు, సహజవాయువులు విస్తారంగా లభిస్తాయి. రూపాంతర శిలల్లో నాన్ ఫెర్రస్ జాతికి చెంది లోహ ఖనిజాలు, అలోహ ఖనిజాల వనరులు ఉంటాయి. రూపాంతర శిలలు కఠినంగా, దృఢంగా ఉండటం వల్ల భవన నిర్మాణ రంగంలో విశేషంగా ఉపకరిస్తాయి. భూ ఉపరితలం మీద ఉన్న శిలలు ప్రధానంగా అవక్షేప శిలల తరగతికి చెందుతాయి.

జనరల్ నాలెడ్జ్ ఫ్లాష్ గ్రాఫ్స్: విశ్వానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు

- చరిత్రకు అందినంత వరకు విశ్వం గురించి తొలిసారిగా పరిశోధనలు చేసిన వ్యక్తి 'టాలమీ'. విశ్వానికి కేంద్రం భూమి అని, సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు సమస్త విశ్వ పదార్థాలు భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాయని ఈయన క్రీ.శ. 130-140 మధ్యకాలంలో ప్రతిపాదించాడు.
- 16వ శతాబ్దంలో పోలండ్ ఖగోళ శాస్త్రవేత్త నికోలస్ కోపర్నికస్ 'టాలమీ' భూకేంద్ర సిద్ధాంతాన్ని తోసిపుచ్చాడు. విశ్వానికి కేంద్రం సూర్యుడు అని ప్రతిపాదించాడు.
- 1609లో జర్మనీ శాస్త్రవేత్త కెప్లర్ సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్థిస్తూనే 'సూర్యుడు విశ్వానికి కేంద్రం కాదని, సౌర వ్యవస్థకు మాత్రమే కేంద్రం' అని వివరించాడు. గ్రహాల వృత్తాకార కక్ష్యను కూడా నిర్ణయించాడు.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో క్రమక్షయం వల్ల ఏర్పడే శిల ఏది?
   ఎ) పాలరాయి బి) సున్నపురాయి
   సి) గ్రానైట్ డి) పలకరాయి
2. పాలరాయి ఏ మాతృక శిల రూపాంతరం వల్ల ఏర్పడుతుంది?
   ఎ) సున్నపురాయి బి) ఇసుకరాయి
   సి) షేల్ డి) బసాల్ట్
3. మహారాష్ట్రలోని దక్కన్ నాపల ప్రాంతం ఏ రకమైన శిలలతో కూడి ఉంది?
   ఎ) నీస్ బి) చార్నోకైట్
   సి) గ్రానైట్ డి) బసాల్ట్
4. భారతదేశంలోని కింది తరగతికి చెందిన శిలల్లో చమురు సహజవాయువు నిక్షేపాలు కేంద్రీకృతమై ఉన్నాయి?
   ఎ) కర్నూలు–కడప శ్రేణి శిలలు
   బి) టైపామ్ శ్రేణి ఇసుకరాయి
   సి) ధార్వారియన్ శిలలు
   డి) చార్నోకైట్‌లు
5. కింది సూచించిన ఏ తరగతికి చెందిన శిలల్లో భూగర్భ జలవనరులు సమృద్ధిగా ఉంటాయి?
   ఎ) అవక్షేప శిలలు
   బి) రూపాంతర శిలలు
   సి) అగ్ని శిలలు డి) పైవన్నీ
6. ఏ మూలకాలు కేంద్రీకృతమవడం వల్ల పటలం అల్ప సాంద్రతను కలిగి ఉంటుంది?
   ఎ) ఇనుము, నికెల్
   బి) ఇనుము, సిలికాన్
   సి) సిలికాన్, మెగ్నీషియం
   డి) సిలికాన్, అల్యూమినియం
7. భారతదేశంలో చార్నోకైట్, కోండలైట్ శిలలు ఏ ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) దక్షిణ పీఠభూమి
   సి) తూర్పు కనుమలు
   డి) హిమాలయాలు
8. హిమాలయాల్లోని శివాలిక్ కొండలు ప్రధానంగా కింది శిలలతో నిర్మితమై ఉన్నాయి?
   ఎ) అవక్షేప శిలలు
   బి) రూపాంతర శిలలు
   సి) అగ్ని శిలలు డి) పైవేవీ కావు
9. కింది వాటిలో అగ్ని శిల కానిదేది?
   ఎ) గ్రానైట్ బి) గాబ్రో
   సి) కాంగ్లోమెరేట్ డి) బసాల్ట్
10. మోహోలిక్ తలం వేటిని వేరు చేస్తుంది?
    ఎ) ప్రావారం–కేంద్రకం
    బి) పటలం–ప్రావారం
    సి) సముద్రాలు–ఖండాలు
    డి) బాహ్య కేంద్రకం–అంతర్ కేంద్రకం
11. భూమికి సంబంధించిన కింది పొరను 'శిలావరణం'గా వ్యవహరిస్తారు?
    ఎ) భూపటలం బి) ప్రావారం
    సి) కేంద్రకం డి) పైవేవీ కావు
12. భూకంపాలు భూమికి సంబంధించిన ఏ భాగంలో ఉద్భవిస్తాయి?
    ఎ) భూపటలం బి) ప్రావారం
    సి) కేంద్రకం డి) పైవేవీ కావు
13. భూఉపరితలం నుంచి అంతర్భాగానికి వెళ్లేకొద్దీ?
    ఎ) సాంద్రత తగ్గుతుంది
    బి) సాంద్రత పెరుగుతుంది
    సి) సాంద్రత తగ్గి, పెరుగుతుంది
    డి) సాంద్రత పెరిగి, తగ్గుతుంది
14. మోహోవిక్ తలం భూమిలో సగటున సుమారుగా ఎంత లోతులో ఉంటుంది?
    ఎ) 5 కి.మీ. బి) 10 కి.మీ.
    సి) 30 కి.మీ. డి) 50 కి.మీ.
15. ఖండాల భూపటలాన్ని ఏమని పిలుస్తారు?
    ఎ) సియాలో పొర బి) సీమా పొర
    సి) నైఫ్ పొర డి) పైవేవీ కావు
16. భూ అంతర్భాగానికి చెందిన కింది పొరను 'పెరిడోటైట్' కర్పరంగా పిలుస్తారు?
    ఎ) భూపటంల బి) ప్రావారం
    సి) కేంద్రకం డి) పైవేవీ కావు
17. 'బాథోలిథ్' భూస్వరూపం ఏ రకమైన శిలలతో నిర్మించబడుతుంది?
    ఎ) అవక్షేప శిలలు
    బి) రూపాంతర శిలలు
    సి) అగ్ని శిలలు డి) పైవన్నీ
18. గ్యుటిన్‌బర్గ్ తలం భూ అంతర్భాగంలో సుమారు ఎంత లోతులో ఉంటుంది?
    ఎ) 2000 కి.మీ. బి) 2200 కి.మీ.
    సి) 2500 కి.మీ. డి) 2900 కి.మీ.
19. రూపాంతర శిలలు ఏర్పడటానికి ఏ అంశాలు దోహదపడతాయి?
    1) అధిక పీడం
    2) అధిక ఉష్ణోగ్రత
    3) అధిక వర్షపాతం
    ఎ) 1, 2 బి) 2, 3
    సి) 3, 1 డి) పైవన్నీ
20. భూపటలంలో శిలలు ప్రధానంగా ఏ మూలకాలని కలిగి ఉంటాయి?
    ఎ) మెగ్నీషియం బి) ఇసుక
    సి) ఇనుము డి) సిలికాన్

సమాధానాలు

1) బి 2) ఎ 3) డి 4) బి 5) ఎ
6) డి 7) సి 8) ఎ 9) సి 10) బి
11) ఎ 12) ఎ 13) బి 14) సి 15) ఎ
16) బి 17) సి 18) డి 19) ఎ 20) డి

విద్య, ఉద్యోగ సమాచారం

ఐవోసీఎల్‌లో 200 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్).. సదరన్ రీజియన్‌లో 2024–26 విద్యా సంవత్సరానికి సంబంధించి టెక్నీషియన్, ట్రేడ్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేట్)ల శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళలో పనిచేయాల్సి ఉంటుంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 200.
- » **శిక్షణా వ్యవధి:** ఏడాది.
- » **విభాగాలు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ తదితరాలు.
- » **అర్హత:** పదో తరగతి, ఐటీఐ, విభాగాన్ని అనుసరించి డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** మెరిట్ లిస్ట్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.02.2025.
- » **శిక్షణా కేంద్రాలు:** తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.
- » **వెబ్‌సైట్:** https://iocl.com/apprenticeships

నిట్ కురుక్షేత్రలో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
- » **అర్హత:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీటెక్/బీఈ, ఎంటెక్/ఎంఈ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. నెట్/గేట్ స్కోరుతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.35,000.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఈమెయిల్:** mdave@nitkkr.ac.in
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2025.
- » **వెబ్‌సైట్:** https://nitkkr.ac.in

మహమ్మద్ కులీ కుతుబ్‌షా కవితల సంకలనం దివాన్

కుతుబ్‌షాహీల యుగ విశేషాలు

భాషా సాహిత్యాలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

మహమ్మద్ కులీ కుతుబ్‌షా

ఇబ్రహీం కుతుబ్‌షా తర్వాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడి తల్లి భగీరథి. మహమ్మద్ కులీ తన ప్రేయసి అయిన భాగమతి పేరుమీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. చార్మినార్ లాంటి అనేక కట్టడాలను నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమీన్, ముల్లా మూమిన్, మిసాక్ సుబాజ్ వలి అనే పార్సీ కవులను ఆదరించాడు. వజాహి, గవాస్సీ అనే ప్రముఖ ఉర్దూ కవులకు ఆశ్రయమిచ్చాడు. మహమ్మద్ కులీ స్వయంగా కవి, గ్రంథకర్త. ఫారసీ కవితా సంకలన కర్తయిన అలామ మీర్ మోమిన్ ఇతడి కాలంలో పీష్వా పదవిని అలంకరించాడు. పటమట సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సారంగు తమ్మయ్య, కామారెడ్డిలను కులీ సన్మానించాడు. ఇతడి ఆస్థానంలో గణేశ పండితుడు కూడా ఉండేవాడు.

ఉర్దూ కవుల్లో కులీ ప్రథముడు కాకపోయినా ఆ భాషలోని రచనలు ఒక సంపుటంగా పుస్తక రూపంలో వెలువడటం ఈయనతోనే మొదలైంది. మహమ్మద్ కులీ తొలి ఉర్దూ రాజ కవి. ఇతడు పార్సీ, తెలుగు భాషల్లోనూ కవిత్వం రాశాడని భావిస్తారు. కానీ అవి అలభ్యం. మహమ్మద్ కులీ కవితల సంకలనాన్ని అతడి అల్లుడైన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా 'దివాన్' పేరుతో వెలువరించాడు. ఇతడి కవిత్వం పర్షియన్, భారతీయ సంస్కృతుల సమ్మేళనం. కులీ కవితల్లో తెలుగు పదాలు, ఆచార వ్యవహారాలు, హోళీ, బతుకమ్మ పండుగల ప్రస్తావన ఉంది. అప్పటి వరకూ మత సంబంధంగా ఉన్న ఉర్దూ కవిత్వంలో లౌకిక భావనను ప్రవేశపెట్టిన కవుల్లో కులీ ప్రథముడు. నాటి తెలుగు, ఉర్దూ కవిత్వాల తరహాలోనే ఇతడిది ప్రధానంగా శృంగార కవిత్వం.

సారంగు తమ్మయ్య

తమ్మయ కులీ కుతుబ్‌షాకు ఆప్తుడు. గోల్కొండకు కరణీకం చేసేవాడు. అనేక కావ్యాలను రచించాడు. హరిభక్తి సుధోదయం అనే గ్రంథానికి తమ్మయ్య రాసిన వ్యాఖ్యానంలో భగీరథ పట్టణ ప్రస్తావన ఉంది. ఈ పట్టణమే భాగ్యనగరం (హైదరాబాద్). తమ్మయ్య ముఖ్య రచన 'వైజయంతీ విలాసం'. తెలుగులో వెలువడిన గొప్ప శృంగార కావ్యాల్లో ఇదొకటి. ఇందులో భక్తిని, శృంగారాన్ని మేళవించారు.

నేబతి కృష్ణమంత్రి మహమ్మద్ కులీ ఆస్థాన కవి. కులీకి మంచి స్నేహితుడైన ఇతడు మంత్రిగానూ వ్యవహరించాడు. ఇతడు రాజనీతి రత్నాకరం అనే గ్రంథాన్ని రాశాడు. నాటి రాజకీయ పరిస్థితులు, సాహిత్యం తదితర విషయాల గురించి ఈ గ్రంథం తెలియజేస్తోంది.

దోమకొండ సంస్థానం

దోమకొండ (బిక్కనవోలు, నిజామాబాద్ జిల్లా) సంస్థానాన్ని తెలంగాణలో తొలి సంస్థానంగా భావించవచ్చు. ఈ సంస్థాన మూల పురుషుడు కాచారెడ్డి (1415–35). ఇతడి మునిమనవడైన ఒకటో ఎల్లారెడ్డి (1500–25) కాలం నుంచి ఈ సంస్థానం సాహిత్యాన్ని పోషించింది. బాలభారతం, కిరాతార్జునీయం అనే గ్రంథాలను ఎల్లారెడ్డి అంకితం తీసుకున్నాడు. అనేక మంది కవిపండితుల్ని పోషించాడు. ప్రస్తుతం వారి కావ్యాలేవి లభించడం లేదు. జంగమరెడ్డి, రెండో కామిరెడ్డి, రెండో ఎల్లారెడ్డి, రెండో మల్లారెడ్డి అనే నలుగురు ఇతడి మనవళ్లు. చివరి ముగ్గురు కృతిభర్తలు, కృతికర్తలు. ఈ ముగ్గురూ 16 శతాబ్దం ఉత్తరార్ధానికి చెందిన వారు.

కామిరెడ్డి(1530–1600) తన సహాధ్యాయి అయిన పటమట సోమనాథ సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సోమయాజి 'సూత సంహిత'ను అనువదించి కామిరెడ్డికి అంకితమిచ్చాడు. బ్రహ్మోత్తర ఖండాన్ని కామిరెడ్డి సోదరుడైన రెండో ఎల్లారెడ్డికి అంకితమిచ్చాడు. సోమయాజి గ్రంథాల ద్వారా దోమకొండ సంస్థాన విషయాలు తెలుస్తున్నాయి. రెండో ఎల్లారెడ్డి కృతికర్త కూడా. అయన వాసిష్ఠం, లింగపురాణం రచించాడు. కానీ అవి అలభ్యం. కామిరెడ్డి చివరి తమ్ముడైన రెండో మల్లారెడ్డి రాజకవి మల్లారెడ్డిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు ఎన్నో గ్రంథాలు రచించాడు. కానీ ఆయన రాసిన షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే గ్రంథాలు మాత్రమే లభిస్తున్నాయి.

ఉర్దూ భాషకు స్వర్ణయుగం..

పైడిమర్రి వెంకటపతి (1570–1640) అనే కవి కులీకుతుబ్‌షా కాలానికి చెందినవాడు. ఇతడు హైదరాబాద్, బీదర్ పరిసర ప్రాంతాల్లో నివసించాడు. బ్రౌన్, బహుజనపల్లి లాంటి వాళ్లు ఈ కవిని ప్రామాణికుడిగా భావించారు. స్కంధపురాణంలోని 11 శ్లోకాల కథను తనదైన శైలిలో వర్ణించాడు. దీన్ని 'చంద్రాంగద చరిత్ర' అనే రసవత్ప్రబంధంగా మలిచాడు. తన పూర్వీకుల మాదిరిగానే మహమ్మద్ కులీ కుతుబ్‌షా కూడా కవి పండితులను పోషించాడు. ఇతడి ఆస్థాన కవి మీర్ మోమెన్, సయ్యద్ మీర్ కుతుబుద్దీన్, సయ్యద్ కమాలుద్దీన్, మాజ్ సదరానీ తదితర పండితులు ఇతడి ఆస్థానంలో ఉండేవారు.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తర్వాత సుల్తాన్ అబ్దుల్లా కులీ కుతుబ్‌షా రాజయ్యాడు. ఇతడు సంస్కృత 'శుకసప్తతి'ని తోతినామా పేరుతో పార్సీ భాషలోకి అనువాదం చేయించాడు. దాన్నే 'సబ్‌రస్' (కామరూప కళాకథలు) పేరుతో ఉర్దూలోకి అనువదింపజేశాడు. ఇతడు ఉర్దూ భాషకు చాలా సేవ చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగం. ఇతడు కవిపండిత పోషకుడే కాకుండా స్వయంగా కవి. అబ్దుల్లా పేరుతో కవితలు వెలువరించాడు. ఇతడి ఆస్థానంలో అలామీ మీర్ మజీదుద్దీన్, మౌలానా రౌనఖీ మొదలైన ఎనిమిది మంది కవి పండితులుండేవారు. గవాసీ ఇబిన్ నిషాత్ లాంటి గొప్పకవులను ఇతడు ఆదరించాడు. గవాసి 'తోతినామా' అనే కథలు రాశాడు. తబీయ అనే కవి బహరావగుల్ అనే మనోరంజకమైన కథను రాశాడు. అబ్దుల్లా కులీ కుతుబ్‌షా ఆస్థానంలో తులసీమూర్తి లాంటి తెలుగు కవులు కూడా ఉండేవారు. క్షేత్రయ్య ఈ రాజును దర్శించాడు. అబ్దుల్లా పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు.

హరివాసర మహాత్మ్యం రాసిన మరింగంటి వెంకట (ప్రథమ) నరసింహాచార్యులు, శశిబిందు చరిత్రం రచయిత చరిగొండ నరసింహకవి, కూర్మ పురాణాన్ని రచించిన రాజలింగ కవి ఈ కాలానికి చెందినవారే. బమ్మెర కేసకవి – మల్లకవి, వజ్రాభ్యుదయాన్ని రాసిన కోననారాయణ, రాజేశ్వర విలాసం రచయిత పిల్లలమర్రి వెంకటపతి, చెన్నబసవ పురాణాన్ని రచించిన గోపతి లింగకవి తదితరులు కూడా ఈ కాలానికి చెందినవారే. ఓరుగల్లుకు చెందిన కాసెసర్వప్ప (1600) ఏకామ్రనాథుడి 'ప్రతాపరుద్ర చరిత్ర'ను అనుసరించి ద్విపదలో 'సిద్దేశ్వర చరిత్ర' రాశాడు. ఈ గ్రంథాన్ని వ్యవహారిక భాషలో రచించాడు.

ఎలకూచి బాలసరస్వతి

తెలంగాణ కుతుబ్‌షాహీల పాలనలో ఉన్నప్పటికీ సరిహద్దు ప్రాంతాలు ఇతర రాజుల చేతులు మారుతూ వచ్చాయి. సురభి మాధవరాయలు విజయనగర అళియరాయల నుంచి జటప్రోలును(కొల్లాపూర్) కానుకగా పొందాడు. తర్వాత అతడి కుమారులు అబ్దుల్లా కుతుబ్‌షా నుంచి సనదు రూపంలో జటప్రోలు సంస్థానాన్ని పొందారు. రేచర్ల పద్మనాయకులైన వీరికి సురభి వంశనామమైంది. ఈ వంశానికి చెందిన సురభి మాధవరాయలు(1620–70) చంద్రికా పరిణయమనే ప్రౌఢ కావ్యాన్ని రచించాడు. సురభి మాధవరాయల ఆస్థానకవి ఎలకూచి బాలసరస్వతి (1570–1650). ఆంధ్రశబ్ద చింతామణి ద్వారా ఇతడి పేరు చర్చనీయాంశమైంది. సంస్కృతంలో రాసిన ఈ తొలి తెలుగు వ్యాకరణ గ్రంథం నన్నయ రచనా? కాదా? బాలసరస్వతే రాసి నన్నయ పేరు పెట్టాడా? అనే విషయాలు చర్చనీయమయ్యాయి. మాధవరాయలతోపాటు ఇతడు కూడా 'చంద్రికా పరిణయం' రాశాడు. కానీ ఈ రెండింటిలో వేర్వేరు కథలున్నాయి. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువదించాడు. మాధవరాయల తండ్రయిన మల్లభూపాలుడికి సుభాషిత రత్నావళిని అంకితం చేశాడు. ఇది తొలి అనువాదం. 'యాదవ రాఘవ పాండవీయం' అనే త్ర్యర్థి కావ్యంతో పాటు మొత్తం పది గ్రంథాలను ఇతడు రచించాడు. ఇతడి గ్రంథాల వల్ల జటప్రోలు, పర్తియాల (జూపల్లి వారు) సంస్థానాల విశేషాలు తెలుస్తున్నాయి.

బాలసరస్వతి ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్య రాసిన కొద్ది కాలానికే కాకునూరి అప్పకవి అదే గ్రంథానికి భాష్యం లాంటి ప్రసిద్ధమైన అప్పకవీయం రాశాడు. అప్పకవి తెలంగాణ వాడేనని బూర్గుల రామకృష్ణారావు నిరూపించారు. అప్పకవీయం లక్షణ గ్రంథమైనా, సందర్భాన్ని బట్టి 'నిజదేశంబుల వేషభాషలపయిన్ని త్యాభిమానస్థులై ప్రజమెచ్చన్' అని ప్రాంతాభిమానాన్ని చాటాడు. సాధ్వీజనధర్మం (ద్విపదకావ్యం), అనంత వ్రతకల్పం(కావ్యం), శ్రీశైలమల్లికార్జునుడి మీద శతకం, అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) మొదలైన ఇతర గ్రంథాలు కూడా అప్పకవి రచించాడు. కానీ ఇవి లభ్యం కావడం లేదు.దేవరకొండ పాలకుడైన పానుగోటి జగన్నాథరాయలు 'కుముదవల్లీ విలాసం' రచించాడు. ఇందులోని ఇతివృత్తం భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉంటుంది. కుతుబ్‌షాహి వంశంలో చివరి రాజులైన అబ్దుల్లా కుతుబ్‌షా (1626–72), అబ్దుల్ హసన్ తానీషా (1672–87) వద్ద అక్కన్న, మాదన్న అధికారులుగా పనిచేశారు. వారి మేనల్లుడైన కంచర్ల గోపన్న (భక్త రామదాసు) భద్రాచలం తహశీల్దార్ అయ్యాడు. తొలి సంకీర్తనాచార్యుల్లో ఒకడిగా రామదాసు ప్రసిద్ధి చెందాడు. ఇతడి జీవితం గురించి యక్షగానం వచ్చింది. దీన్ని బట్టి రామదాసు ఎంత గొప్పవాడో అర్థమవుతుంది. ఇతడి కీర్తనల్లో పాండిత్య ప్రకర్ష ఉండదు. అవి ఆర్తితో, సహజభక్తి భావావేశంతో అప్రయత్నంగా వచ్చాయి. దేశీయ గేయ రీతులను పుణికి పుచ్చుకున్నాయి. ఇతడు రాసిన 'దాశరథి శతకం' కూడా ప్రసిద్ధి చెందింది. భక్తరామదాసు పేరు వినగానే అబుల్ హసన్ తానీషా పేరు స్ఫురిస్తుంది. రామదాసును జైల్లో పెట్టిన నిర్దయుడిగానే ఇతడి గురించి తెలుసు. కానీ ఇతడు రసహృదయం ఉన్న కవి. ఇతడు పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు. తానీషా ఆస్థానంలో లతీఫ్, షాహినూరి, మీర్జా గులాం అలీ లాంటి ప్రసిద్ధ కవులుండేవారు. ఇతడి కాలంలో వజ్జీ, గవాసీ తదితర ఉర్దూ కవులు తమ కవిత్వం ద్వారా ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పడ్డారు. ఉర్దూ రాజభాషగా పరిణతి చెందింది. అక్కన్న, మాదన్న, లింగన్నలకు ముఖ్య పదవులిచ్చాడు. పరమత సహనం చూపి ఉదార స్వభావిగా పేరొందాడు.అష్టదిగ్గజాల్లో ఒకడైన తెనాలి రామలింగడు (కృష్ణుడు) కాకుండా మరో తెనాలి రామలింగకవి (1666–86) ఉన్నాడు. విశ్వ బ్రాహ్మణుడైన ఇతడు అక్కన్న, మాదన్నల వద్ద ఆశ్రయం పొందాడు. ఇతడు ధీరజనమనో విరాజితం (పరిమళ చోళచరిత్ర) అనే కావ్యాన్ని రాశాడు. విశ్వ బ్రాహ్మణులకు జరిగిన అన్యాయాలే ఈ ప్రబంధంలోని కథావస్తువు.



రచయితలు	రచనలు
సారంగు తమ్మయ్య	- వైజయంతీ విలాసం
నేబతి కృష్ణమంత్రి	- రాజనీతి రత్నాకరం
మరింగంటి వెంకట	
నరసింహాచార్యులు (ప్రథమ)	- హరివాసర మహాత్మ్యం
కాసెసర్వప్ప	- సిద్దేశ్వర చరిత్ర
సురభి మాధవరాయలు	- చంద్రికా పరిణయం (కావ్యం)
ఎలకూచి బాలసరస్వతి	- యాదవ రాఘవ పాండవీయం
పానుగోటి జగన్నాథరాయలు	- కుముదవల్లీ విలాసం
గవాసి	- తోతినామా (అనువాద కథలు)

ఇతర కవులు..

పెన్గలూరి వెంకటాద్రి రామోదాహరణం, భువన మోహినీ విలాసం అనే గ్రంథాలను రచించాడు. పదిహేడో శతాబ్దికి చెందిన విశ్వనాథయ్య సిద్దేశ్వర పురాణం అనే ద్విపద రాశాడు. అన్నంభట్టు తర్క సంగ్రహాన్ని, కర్పూరం కృష్ణమాచార్యులు భగవద్గీత ద్విపదను రచించారు. అత్తాను రామానుజాచార్యుడు శ్రీ రుక్మిణీకురవంజి అనే గ్రంథాన్ని రాయగా, పూడూరి కృష్ణయామాత్యుడు భగవద్గీత యథాశ్లోకానువాదం చేశాడు. శ్రీనాథుని వెంకటరామయ్య అశ్వరాయ చరిత్ర రాశాడు. అన్నమయ్య తర్వాత ఎక్కువ కీర్తనలు (3476) రాసిన ముప్పిపల్లి వేంకటభూపాలుడు ఈ కాలానికి చెందినవాడే. లక్ష్మీ శకవి, కాంద్రవేటి రామానుజాచార్యులు, ఎడపాటి ఎర్రన, సింహాద్రి వెంకటాచార్యులు, మరింగంటి వేంకట (ద్వితీయ) నరసింహాచార్యులు (1650–1720), సురభి నర్సింగరావు, బోరవెల్లి కృష్ణప్ప కూడా ఈ కాలానికి చెందిన కవులే. వీరే కాకుండా కుతుబ్‌షాహీల కాలానికి చెందిన ఎంతో మంది కవులు తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు

The seriousness of the situation is..

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements:
Climate change may force the shifting of locations of the existing crops due to
a) Melting of glaciers
b) Water availability and temperature suitability at other locations
c) Poor productivity of crops
d) Wider adaptability of crop plants
Which of the statements given above are correct?
1) a, b, & c 2) b & c only
3) a & d only 4) a & c
5) a, b, c, & d

2. To promote agricultural research in India is important because:
1) To predict variations in monsoon patterns and to manage water resources.
2) To make long term investment decisions for economic growth.
3) To facilitate wider adaptability of crops.
4) To predict drought conditions and to recharge aquifers.
5) Changed weather patterns in future.

3. The spillover from the Himalayas is due to
1) large-scale shifts in agro-ecological conditions.
2) changed weather patterns in future
3) productivity of crops
4) melting of glaciers
5) adaptability of crop plants

4. The antonym of **Critical** is
1) waver 2) steady 3) unsure
4) insecure 5) fasten

5. The synonym of **promote** is
1) encompass 2) encourage
3) entangle 4) entrust 5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
1) vary 2) variety 3) similar
4) reported 5) yawning

7. She ____ to escape from her office job.
1) earned 2) yelled 3) yearned
4) yielded 5) learn

8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
1) easy; complete
2) different; wholesome
3) difficult; totality
4) hard; completeness
5) tough; compliment

9. The new policy was adopted in the ____ of fierce ____.
1) wake; opponent
2) show; postponement
3) teeth; criticism
4) course; outcome
5) reality; injustice

10. The computer is now an ____ tool for the family doctor.
1) value 2) valid
3) price 4) worth
5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued year two times.
1) year twice 2) twice yearly
3) yearly two 4) two yearly
5) no correction required

12. She yelled at the child to getting down from the wall.
1) got down 2) get down
3) getting away 4) get upon
5) no correction required

13. All her yesterday's has vanished without a trace.
1) Have 2) had
3) has been 4) have being
5) no correction required

14. My son's 13 but he's younger for his age.
1) Youngest 2) youth
3) older 4) young
5) no correction required

15. When the needle enters the red zone the engine is indicator hot.
1) Too 2) much
3) becomes 4) left
5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)

17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)

18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)

19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)

20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)

21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)

22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)

23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)

24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)

25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred** in recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.

27. **A** (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)

28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)

29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)

30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.

B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfeild's "English Grammar".

C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.

D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.

E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.

F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
3) extraneous 4) bucollic
5) conundrum

37. 1) powwow 2) malignant
3) untenable 4) capricious
5) dissipete

38. 1) railery 2) splenetic
3) palaver 4) lachrymose
5) tenacity

39. 1) exiguity 2) pillary
3) concomitant 4) surfeit
5) adjudicate

40. 1) promulgate 2) cataclysm
3) deluge 4) simulacrom
5) mural

Answers

1) 1;	2) 4;	3) 4;	4) 2;	5) 2;
6) 5;	7) 3;	8) 3;	9) 3;	10) 5;
11) 2;	12) 2;	13) 2;	14) 4;	15) 1;
16) 3;	17) 5;	18) 3;	19) 4;	20) 2;
21) 1;	22) 4;	23) 1;	24) 3;	25) 3;
26) 3;	27) 1;	28) 3;	29) 2;	30) 2;
31) 1;	32) 4;	33) 2;	34) 1;	35) 3;
36) 4;	37) 5;	38) 1;	39) 2;	40) 4.